# బహురూపి
# గాంధీ

అను బందోపాధ్యాయ



# బహురూపి
# గాంధీ

అను బందోపాధ్యాయ

అనువాదం : నండూరి వెంకట సుబ్బారావు

మంచి పుస్తకం

**BAHUROOPE GANDHI**
by ***Anu Bandyopadhyaya*** - *Telugu Translation*

# బహురూపి గాంధీ


| | | |
|---|---|---|
| రచయిత | : | అను బందోపాధ్యాయ |
| అనువాదం | : | నండూరి వెంకట సుబ్బారావు |
| బొమ్మలు | : | ఆర్.కె. లక్ష్మణ్, నికీ థామస్ |
| మొదటి ముద్రణ | : | డిసెంబరు, 2014 |
| ప్రతుల సంఖ్య | : | 1000 |

వెల : రూ. 70/-

ISBN No. 978-93-83936-11-3

ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1,

తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

ఫోను: 94907 46614

email: info@manchipustakam.in
website: www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్,

అజామాబాద్, హైదరాబాద్-20.

ఫోన్: 040-2767 8411

# ముందుమాట

ప్రధానమంత్రి గృహం
న్యూఢిల్లీ

ఇది పిల్లల కోసం రాసిన పుస్తకం. అయినా చాలామంది పెద్దలు కూడా దీన్ని చదివి ఆనందాన్ని, ప్రయోజనాన్ని కూడా పొందగలరని నా విశ్వాసం. గాంధీజీ ఇప్పటికే ఒక మహానాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయనను చూడనివారు, ముఖ్యంగా నేటి బాలబాలికలు ఆయనను ఒక అసాధారణమైన వ్యక్తిగా, గొప్ప ఘనకార్యాలు చేసిన సూపర్‌మాన్‌గా భావించవచ్చు. కాబట్టి గాంధీజీ జీవితంలోని సాధారణ పార్శ్వాలను ఈ పుస్తకంలో చెప్పినట్లుగా భావితరాల ముందుకు తీసుకు రావడం ఎంతైనా వాంఛనీయం.

ఆయన అనేక అంశాలపై శ్రద్ధ చూపిన విధం ఎంతో ఆసక్తి గొలిపే విషయం. ఆయనది పైపైన ఆసక్తి కాదు. ఆయన ఒకసారి ఒక అంశంపై ఆసక్తి చూపడం ఆరంభిస్తే, ఆ అంశాన్ని ఎంతో లోతుగా అధ్యయనం చేసేవాడు. జీవితంలో చిన్న చిన్న అంశాలు అని మనం భావించే వాటిపై ఆయన చూపిన అపరిమితమైన శ్రద్ధే ఆయన మానవతావాదంలో విశిష్టత కావచ్చు. అది ఆయన వ్యక్తిత్వానికి మూలం.

రాజకీయాల్లోనూ, బహిరంగ జీవితంలోనూ కాక అనేక ఇతర అంశాలలో గాంధీజీ ఎలా వ్యవహరించాడనేదాన్ని వివరిస్తూ ఈ పుస్తకం వెలువడుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. ఆయన అంతరంగాన్ని మెరుగ్గా అర్థం చేసుకొనేందుకు ఇది ఉపకరిస్తుందని నేను భావిస్తున్నాను.

**– జవహర్‌లాల్ నెహ్రూ**

న్యూఢిల్లీ
10, మార్చి, 1964.

# పరిచయం

ఈ పుస్తకం రాతప్రతి 1949 నుంచీ నా దగ్గర ఉంది. నేను 1948లో డి. జి. టెండూల్కర్* రాసిన 'మహాత్మ'** రాత ప్రతిని చదివాను. అంతకు కొద్ది కాలం ముందే నేను బెంగాల్‌లోని కస్తూర్బా శిక్షణా శిబిరంలో పని మానేశాను. ఆ శిబిరంలో ఉన్న కాలంలో నేను ఒక గ్రామంలో పని చేశాను. నా చుట్టుపక్కల గ్రామస్థులకు గానీ, శిక్షణార్థులైన బాలికలకు గానీ గాంధీ గురించి దాదాపుగా ఏమీ తెలియదని నేను గమనించాను. వాళ్ళు రోజూ నూలు వడికేవాళ్ళు, ప్రార్థన చేసేవాళ్ళు, గాంధీ జయంతిని జరుపుకొనేవారు. వారిలో కొందరు జాతీయోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్లారు కూడా. కానీ గాంధీజీ నిజంగా ఈ దేశానికిచ్చింది ఏమిటో వారికి తెలియదు. నేను పొరపాటుపడి ఉండవచ్చు, కానీ నాకలా అనిపించింది.

నా నిత్య జీవితంలో రోజూ నాకెదురయ్యే చాలామంది విద్యావంతులను, ముఖ్యంగా శారీరక శ్రమని అసహ్యించుకునే వారినీ చూసినప్పుడు నాకిప్పటికీ అలాగే అనిపిస్తుంది. 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' మీద నాకంతగా నమ్మకం లేదు కానీ శారీరక శ్రమలో ఉన్న కష్టం నాకు తెలుసు. అందుకే నేను రోజూ సేవకుల శారీరక శ్రమలో కొంత భాగం పంచుకొనేందుకు ప్రయత్నిస్తాను. ఆ విధంగా నేను ఇతరులతో పని చేయించుకొనే హక్కును కొంతవరకైనా పొందుతున్నానని అనుకుంటున్నాను.

చాలామంది పనిమీద ప్రేమతో గాక కేవలం జీవనోపాధి కోసం ఆయా పనులు చేస్తారు. అలా ఇతరులు చేసే అనేక పనులలో గాంధీజీ ఇష్టపూర్వకంగా పాలుపంచుకొనేవాడు. అలాంటి వ్యక్తిగా ఆయన్ని మీకు పరిచయం చేయడం నా ఉద్దేశం. అందుకే ఈ పుస్తకంలో కొన్ని సంఘటనలు పునరుక్తమయ్యాయి. గాంధీని

---

* దీనానాథ్ గోపాల్ టెండుల్కర్ (1909–1971) రచయిత, డాక్యుమెంటరీ సినిమాల రూపకర్త.

** ఇది ఎనిమిది సంపుటాలలో 1951లో ప్రచురితమైన గాంధీ జీవిత చరిత్ర.

గుడ్డిగా అనుసరించే భక్తుల మందకు మరికొంత మందిని చేర్చడం నాకిష్టం లేదు. గాంధీజీ కేవలం జాతిపిత, భారత స్వాతంత్ర్య నిర్మాత మాత్రమే కాదని నేటి బాలబాలికలు తెలుసుకోవాలనీ, ఆపైన ఆయనను విమర్శించాలనీ నా ఉద్దేశం.

ఈ పుస్తకం రాయాలనే ఆలోచన నాది. నేను దీన్ని కౌమారదశలోని బాలబాలికల కోసం రాశాను. దీనిలోని సమాచారమంతా దాదాపుగా డి. జి. టెండూల్కర్ రాసిన 'మహాత్మా' గ్రంథం లోనిదే. ఈ చిన్న ప్రచురణ పరంగా నేను ఆయనకు ఎంతగా రుణపడి ఉన్నానో మాటల్లో చెప్పలేను. శ్రీ ఎన్. జి. జోగ్ రాతప్రతిని చదివి సరిచూసి పెట్టారు. దీనిలోని 20 కథనాలను 'నేషనల్ హెరాల్డ్' పత్రికలో ఒక సిరీస్‌గా ప్రచురితమయ్యే అవకాశం నాకు శ్రీ ఎం. చలపతిరావు* కల్పించారు.

ఈ పుస్తకానికి అవసరమైన చిత్రాలను గీసి ఇచ్చిన ఆర్. కె. లక్ష్మణ్**కు నేను రుణపడి ఉన్నాను. ముందుమాట రాసిచ్చిన జవహర్‌లాల్‌కు నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ పుస్తకం చదివిన వేయిమంది బాలబాలికలలో ఒక్కరైనా గాంధీజీ చేసిన పనులలో కొన్నైనా చేస్తే నాకంతే చాలు.

**– అను బందోపాధ్యాయ**

---

* ఎం. చలపతిరావు (1910–1983) ప్రఖ్యాత పత్రకారుడు, ది నేషనల్ హెరాల్డ్‌కి 30 సంవత్సరాలకు పైగా సంపాదకుడిగా పని చేశాడు.

** ఆర్. కె. లక్ష్మణ్ (1921– ) ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్టు.

# విషయ సూచిక

| | |
|---|---|
| శ్రమజీవి | 9 |
| బారిష్టరు | 12 |
| బట్టలు కుట్టేవాడు | 19 |
| బట్టలు ఉతికేవాడు | 22 |
| క్షవరం చేసేవాడు | 24 |
| శుభ్రం చేసేవాడు | 28 |
| చెప్పులు కుట్టేవాడు | 34 |
| సేవకుడు | 40 |
| వంటవాడు | 45 |
| వైద్యుడు | 49 |
| నర్సు | 54 |
| ఉపాధ్యాయుడు | 58 |
| నేత పనివాడు | 64 |
| నూలు వడికేవాడు | 67 |
| వ్యాపారి | 72 |

| | |
|---|---|
| రైతు | 79 |
| వేలం పాటగాడు | 85 |
| యాచకుడు | 87 |
| బందిపోటు | 93 |
| జైలుపక్షి | 99 |
| సైన్యాధ్యక్షుడు | 106 |
| గ్రంథ రచయిత | 112 |
| పాత్రికేయుడు | 118 |
| ముద్రాపకుడు – ప్రచురణకర్త | 125 |
| ఫాషన్ స్థాపకుడు | 128 |
| పాములవాడు | 135 |
| పురోహితుడు | 139 |
| గాంధీ జీవిత సంఘటనల క్రమం | 147 |

# శ్రమజీవి

అనవసర న్యాయ వ్యాజ్యాల ద్వారా ధనమూ, సమయమూ వృధా చేసుకొని, తమ జీవితాలు పాడు చేసుకోవద్దనీ, తమ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలనీ తన కక్షిదార్లకు న్యాయస్థానంలో తీరిక లేకుండా ఉండే ఒక బారిష్టరు సలహా ఇచ్చేవాడు. తన తీరిక సమయాల్లో ఆయన హిందూ, ముస్లిం, క్రైస్తవ, పార్శీ బౌద్ధ మతాలకు చెందిన గ్రంధాలు చదివేవాడు. ఇంకా మేధావులు రాసిన అనేక పుస్తకాలను కూడా ఆయన చదివేవాడు. ఆ పుస్తకాల అధ్యయనం, అంతశ్శోధనల ఫలితంగా వ్యక్తులు కేవలం మేధస్సుతో పని చేస్తే చాలదనీ, ప్రతి మనిషీ ప్రతిరోజూ కొంతైనా శారీరక శ్రమ చేయాలనే విశ్వాసం ఆయనకు కలిగింది. అక్షరాస్యుడూ, నిరక్షరాస్యుడూ, వైద్యుడూ, న్యాయవాదీ, క్షవరం చేసేవాళ్లు, శుభ్రం చేసే వాళ్లు – అందరికీ వారి పనులకు సమాన వేతనం లభించాలి. ఈ విశ్వాసానికి అనుగుణంగా ఆయన నిదానంగా తన జీవన విధానాన్ని మార్చుకున్నాడు. తన కళ్ళెదురుగా ఉన్న పనుల్లో పాలుపంచుకోవడం ప్రారంభించాడు. కొన్నాళ్ళకు తన కుటుంబంతోనూ, స్నేహితులతోనూ కలసి ఒక ఆశ్రమంలో నిరాడంబర సామాజిక జీవనాన్ని గడపాలని నిర్ణయించుకున్నాడు. ఆయన యూరోపియన్ మిత్రులు కొందరు ఆ ఆశ్రమ జీవితంలో భాగం పంచుకోవాలనుకున్నారు.

ఎవరిమీదా ఆధారపడకుండా కష్టించి పని చేసే రైతుల్లా వాళ్ళంతా నేలను దున్ని, తోటలను పెంచుతూ జీవించడం ప్రారంభించారు. అక్కడ జీతానికి పని చేసే పనివాళ్ళెవ్వరూ ఉండేవారు కాదు. హిందువులు, ముస్లిములూ, క్రైస్తవులు, పార్శీలు, బ్రాహ్మణులు, శూద్రులు, కార్మికులు, బారిష్టర్లు, నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు అంతా అక్కడ ఒకే పెద్ద కుటుంబంలో సభ్యుల్లా జీవించేవారు. అందరూ సమష్ఠి వంటశాలలో తయారైన భోజనాన్ని సమష్ఠి భోజనశాలలో తినేవారు. వారి ఆహారం సామాన్యంగానూ, వారి దుస్తులు ముతకగానూ ఉండేవి. ప్రతి సభ్యునికీ అతని నెలవారీ ఖర్చులకు 40

రూపాయలు లభించేవి. అప్పటికి నెలకు 4000 రూపాయలు సంపాదిస్తున్నప్పటికీ ఆ బారిష్టరు కూడా ఆ నెలవారీ భత్యంతోనే జీవించేవాడు. కఠిన శ్రమతో నిండిన తన దైనందిన కార్యకలాపాలను గడియారమంత ఖచ్చితంగా పూర్తిచేసి, ఆయన రోజుకు ఆరు గంటలు విశ్రాంతి తీసుకొనేవాడు.

పొలంలో ఒక గుడిసె నిర్మాణం ప్రారంభించినప్పుడు ఆయనే అందరికంటే ముందు దాని పైకి ఎక్కాడు. చిన్నా పెద్దా మేకులు, మరమేకులతో నిండిన అనేక జేబులున్న నీలంరంగు ముతక బట్టలను ఆయన తొడుక్కున్నాడు. ఒక జేబులోంచి ఒక సుత్తి తొంగి చూస్తోంది. ఒక చిన్న రంపం, బరమా అతని నడుం దగ్గర బెల్టుకు వేలాడుతున్నాయి. అలా ఆయన మండుటెండలో గుడిసె పని పూర్తయ్యేంతవరకూ రోజుల తరబడి పని చేశాడు. ఒక రోజు భోజనం చేసిన తర్వాత ఆయనొక పుస్తకాల అలమరా చేయడానికి కూర్చున్నాడు. దాదాపు ఏడు గంటలపాటు నిర్విరామంగా పనిచేసి పైకప్పును తాకేంత పెద్ద పుస్తకాల అలమరా తయారు చేశాడు. ఒకసారి ఆశ్రమ దారిలో కంకర పరచాల్సిన అవసరం వచ్చింది. కానీ వారి వద్ద కంకర కొనటానికి సొమ్ము లేదు. అప్పుడు ఆయన రోజూ వివిధ పనుల కోసం ఆశ్రమం నుంచి బయటకు వెళ్ళివచ్చేటప్పుడు దారిలో కనపడిన గులకరాళ్ళనీ, కంకరరాళ్ళనీ పోగుచేసి తనతోపాటు తెచ్చి ఆశ్రమంలో గుట్టపోయడం మొదలుపెట్టాడు. మిగిలిన ఆశ్రమవాసులు కూడా ఆయన ఉదాహరణను నిదానంగా అనుసరించడం ప్రారంభించారు. త్వరలోనే రోడ్డంతటినీ బాగుచేసేందుకు సరిపడా కంకర రాళ్ళగుట్ట ఆశ్రమంలో పోగయ్యింది. అలా స్వయంగా చేసి చూపించడం ద్వారా ఆయన ఇతరులతో పనిచేయించేవాడు. తోటపని, వంటపని, ఊడ్వడం, వడ్రంగిపని, తోళ్ళపని, ముద్రణలాంటి పనుల్లో ఆశ్రమంలోని పిల్లలు కూడా పాలుపంచుకొనేవారు.

మనం తాపీపనివారినీ, చెప్పులు కుట్టేవారినీ, వడ్రంగం పనివారినీ, కమ్మరం పనివారినీ, క్షవరం చేసే వారినీ తక్కువగా చూస్తూ వచ్చాం. మనం వారినుంచీ నేర్చుకోవడం మానేశాం. వారిపట్ల కనీస సంస్కారం చూపడం మరిచిపోయాం. వారికి గౌరవ మర్యాదలు లేకుండా చేశాం. నైపుణ్యం గల వృత్తిపనులను హీనంగా చూస్తూ గుమస్తా పనిని గొప్పగా చూడటం ద్వారా మనం బానిసత్వాన్ని కొని తెచ్చుకున్నాం.

ఆ బారిష్టరు ఉదయాన్నే చేతిమరలో గోధుమలను పిండి పట్టేవాడు. ఆ తర్వాత విధి నిర్వహణకు సిద్ధమై ఐదు మైళ్ళ దూరంలో ఉన్న తన కార్యాలయానికి నడిచి వెళ్ళేవాడు. ఆయన తన జుట్టును తానే క్షవరం చేసుకొనేవాడు, తన దుస్తులను తానే



ఉతికి, ఇస్త్రీ చేసుకొనేవాడు. ప్లేగు వ్యాధితో బాధపడుతున్న గని కార్మికులకు వైద్య సేవలందించేందుకు రాత్రంతా మెలకువగా ఉండేవాడు. కుష్ఠ రోగి పుళ్లను శుభ్రం చేసేవాడు. మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు సిగ్గుపడేవాడు కాదు. ఆయనకు బద్ధకం, భయం, అసహ్యం వంటివి తెలియవు.

ఆయన తన పత్రికకు వ్యాసాలు రాసేవాడు, వాటిని స్వయంగా టైపు చేసేవాడు. తన లెటర్ ప్రెస్‌లో తానే అక్షరాలు కూర్చేవాడు. అవసరమైతే చేత్తో నడిచే ముద్రణా యంత్రాన్ని కూడా నడిపేవాడు. ఆయనకు పుస్తకాలు బైండింగ్ చేయడం బాగా వచ్చు. స్ఫూర్తిదాయకమైన లేఖలు, సంపాదకీయాలు రాయడం ఆయన సృజనాత్మకమైన చేతికి వచ్చు. చరఖాపై నూలు వడకడం వచ్చు, మగ్గంపై నేయడం వచ్చు. కొత్తకొత్త వంటలు చేయడం వచ్చు. సూది, దారంతో చక్కగా కుట్టుపని చేయడం వచ్చు. పళ్ళ చెట్లనీ, పూల మొక్కలనీ సాకడం వచ్చు. అలాగే గునపంతో నేలను తవ్వడం, నూతి నుంచి నీళ్లు తోడటం వచ్చు. బండి నుంచి బరువైన సరుకులు దింపడం కూడా వచ్చు.

ఆయన జైలులో ఉన్నప్పుడు రోజుకు తొమ్మిది గంటలపాటు తవ్వగాలతో గట్టినేలను తవ్వేవాడు, లేదా చిరిగిన దుప్పటి ముక్కలను కుట్టేవాడు. బాగా అలసిపోయినప్పుడు శక్తికోసం దేవుడిని ప్రార్థించేవాడు. తనకు అప్పగించిన పనిని పూర్తిచేయలేకపోవడం అనే ఆలోచనే ఆయన భరించలేక పోయేవాడు.

వయసులో ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న పట్టణం నుంచి సరుకులు తెచ్చుకొనేందుకు ఆయన రోజుకు 40 మైళ్ల వరకూ నడిచేవాడు. ఒకసారి ఆయన ఒక రోజులో 55 మైళ్లు నడిచాడు. గాయపడిన సైనికులను వాలంటీరుగా స్ట్రెచర్ మీద మోసేటప్పుడు ఒక్కోసారి ఆయన ఏకబిగిన 30–40 మైళ్లు స్ట్రెచర్ మోసేవాడు. 78 యేళ్ల వయసులో కూడా ఆయన వారాల తరబడి రోజుకు 18 గంటలు పని చేశాడు. రోజుకు 21 గంటలు కూడా పనిచేసిన సందర్భాలున్నాయి. ఆ వయసులో ఆయనకు నూలు వడకడం తప్ప మరో శారీరక శ్రమ చేసే శక్తి ఉండేది కాదు. అయినా ప్రతిరోజూ శీతాకాలపు ఉదయపు మంచుతో తడిసిన పల్లెబాటల్లో మూడు నుంచి అయిదు మైళ్లు చెప్పుల్లేకుండా నడిచి వెళ్లగలిగేంత ఆరోగ్యంగా ఉండేవాడు. పనిపట్ల ఆయనకున్న అంకితభావం, పనిలో ఆయన చూపించే సామర్థ్యం కారణంగా అతడి దక్షిణాఫ్రికా స్నేహితులు ఆయనకు 'కర్మవీరుడు' అని బిరుదు ఇచ్చారు. కర్మవీరుడైన మోహనదాస్ కరంచంద్ గాంధీ 1869, అక్టోబరు 2వ తేదీన జన్మించాడు.

# బారిష్టరు

గాంధీ 18 ఏళ్ళ వయసులో మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. ఆ తర్వాత వెంటనే న్యాయశాస్త్రం అభ్యసించడానికి లండన్ వెళ్ళాడు. మోధ్–బనియా (వైశ్య) సామాజిక వర్గంలో విదేశాలకు వెళ్ళిన మొట్టమొదటి వ్యక్తి ఆయనే. ఇన్నర్‌టెంపుల్ (ఇంగ్లండు లోని న్యాయవాద వృత్తి నియంత్రణా సంఘం)లో చేరిన తర్వాత పరీక్షలు పాసవడం తేలికేనని గాంధీకి అర్థమయ్యింది. ప్రధానాంశాలతో రాసుకున్న నోట్సును రెండునెలల పాటు శ్రద్ధగా చదివి చాలామంది పరీక్షల్లో పాసైపోతున్నారు. నోట్సులు చదివే తేలిక పద్ధతి గాంధీకి నచ్చలేదు. మోసాన్ని అసహ్యించుకొనే స్వభావంగల ఆయన అసలైన పాఠ్యగ్రంథాలనే చదవాలని నిర్ణయించుకొని వాటి కొనుగోలుకు చాలా సొమ్ము వెచ్చించాడు. తన నిర్ణయాన్ని పాటించడం కోసం కామన్ లా (ఇంగ్లండ్ న్యాయ శాస్త్రాని)కి సంబంధించిన లావుపాటి గ్రంథాలను ఆయన తొమ్మిది నెలలపాటు కష్టపడి అధ్యయనం చేయవలసి వచ్చింది. రోమన్ న్యాయశాస్త్ర మూలగ్రంథాలను చదవడం కోసం ఆయన లాటిన్ నేర్చుకున్నాడు. అప్పట్లో బారిష్టర్లను 'డిన్నర్ బారిష్టర్లు' అనేవారు. ఎందుకంటే వాళ్ళు న్యాయశాస్త్రం చదివిన మూడేళ్ళూ కనీసం 72 డిన్నర్లకు హాజరవ్వాలి. ఈ ఖరీదైన విందు భోజనాల ఖర్చును విద్యార్థులే భరించాలి.

గాంధీకి అలా సామూహిక సమావేశాల్లో పాల్గొనడం అలవాటు లేదు. మద్యం తాగడం, విందు భోజనాలు చేయడం మంచి న్యాయవాది కావడానికి ఎలా ఉపయోగపడుతుందో ఆయనకు అర్థం కాలేదు. అయినా ఈ విందులకు హాజరు కావడం తప్పనిసరి. ఆయన శాకాహారి, మద్యాన్ని ముట్టడు. విందులో చాలా వంటకాలను తినడు, మద్యం తాగనే తాగడు. దాంతో చాలామంది న్యాయశాస్త్ర విద్యార్థులు ఆయనతో వెళ్లటానికి ఆసక్తి చూపేవారు.

పాఠ్యగ్రంథాల అధ్యయనంకానీ, విందులలో పాల్గొనడంకానీ గాంధీ బిడియాన్నీ, కంగారునూ తగ్గించలేకపోయాయి. తాను కేసులు వాదించేటప్పుడు పుస్తక జ్ఞానాన్ని ఉపయోగించుకోవటం ఎలా అని ఆయన ఆలోచించేవాడు. ఒక ఆంగ్ల న్యాయవాది ఆయనను ప్రోత్సహించి మంచి న్యాయవాదిగా, ఒక మోస్తరు ఆదాయం సంపాదించేందుకు నిజాయితీ, కృషి సరిపోతాయని గాంధీకి చెప్పాడు. "చట్టంలో నాలుగింట మూడొంతులు వాస్తవాలే ఉంటాయి. కేసుకు సంబంధించిన వాస్తవాలను జాగ్రత్తగా చూసుకుంటే, కేసును గెలిపించే సంగతి చట్టమే చూసుకుంటుంది," అని ఆయన వివరించాడు. చరిత్ర, జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలు చదవమని గాంధీకి సూచించాడు. గాంధీ ఆయన సలహాను పాటించాడు.

ఇంగ్లాండులో ఉండగా కొద్దికాలంపాటు గాంధీ ఒక చక్కటి ఇంగ్లీషు పెద్దమనిషిలా ఉండేందుకు ప్రయత్నించాడు. ఆయన సరైన ఉచ్చారణను, ఉపన్యాసాలు ఇవ్వడాన్ని, నాట్యం చేయడాన్ని, వయొలిన్ వాయించడాన్ని, సరైన విధంగా ముస్తాబు కావడాన్నీ నేర్చుకొనేందుకు ప్రయత్నించాడు. ఆయన లండన్‌లో అత్యంత షోకైన దుకాణం నుంచి ఖరీదైన సూట్ కొన్నాడు, జంట బంగారు గొలుసున్న వాచీ పెట్టుకున్నాడు. ఖరీదైన టైలు, టోపీలు ధరించాడు. యువతులతో స్నేహం చేశాడు. ఆయన సుఖమయమూ, సౌకర్యవంతమైన జీవితం వైపుకి మళ్ళిపోతున్నాడు. కొన్ని నెలల తర్వాత ఆయనకు తానెంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడో అర్థమైంది. ఖరీదైన అలవాట్లకోసం తన పెద్దన్నయ్య మీద వత్తిడి పెంచుతున్నాడు. తానిక్కడ చదువుకునేందుకు వచ్చాడు కానీ ఆంగ్లేయుల పద్ధతులు అనుకరించేందుకు కాదు. తక్షణమే తన జీవన విధానం మార్చుకోవాలని ఆయన నిర్ణయించుకున్నాడు. తక్కువ అద్దె ఉన్న గదిలోకి మారి, ఒక స్టవ్ కొనుక్కొని తన అల్పాహారం, భోజనం తానే వండుకోసాగాడు. చౌకైన శాకాహార భోజనశాలల్లో తినడం ప్రారంభించాడు. తన సుఖాల మీద డబ్బు ఖర్చుపెట్టడం ఆపేశాడు. రోజూ ఎనిమిది నుంచి పది మైళ్ళు నడవడం మొదలుపెట్టాడు.

అలా 32 నెలలు ఇంగ్లాండులో ఉన్న తర్వాత బారిష్టరుగా నమోదయ్యాడు. రెండు రోజుల తర్వాత ఓడలో భారతదేశానికి తిరిగి వచ్చాడు. భారతదేశం చేరిన తర్వాత ఆయన ముంబయిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, ఒక వంటవాడిని నియమించుకున్నాడు. ముంబయి హైకోర్టుకు క్రమం తప్పకుండా వెళుతూ అక్కడి కేసులు ఎలా నడుస్తున్నాయో చూసేవాడు. బార్ (న్యాయవాద సంస్థ) గ్రంథాలయంలో గంటల తరబడి గడుపుతూ కేసుల గురించి అధ్యయనం చేసేవాడు. ముఖ్యంగా భారతీయ న్యాయశాస్త్ర గ్రంథాలను చదివేవాడు.

ఆయన మొదటి కేసు సామాన్యమైనదే. దాన్ని వాదించేందుకు ఆయనకు ఇస్తానన్న ఫీజు 30 రూపాయలు. కానీ ఏమాత్రం అనుభవంలేని 22 సంవత్సరాల యువ న్యాయవాది వాదించడానికి లేచి నిలబడి ధైర్యం కోల్పోయాడు. అతనికి తల తిరుగుతున్నట్లుగా అనిపించింది. నాలుక నోటికి అతుక్కున్నట్లుగా అనిపించి మాటలు పెగల్లేదు. సిగ్గుతో కోర్టునుంచి బయటకు వచ్చేశాడు. ఆ తర్వాత ఆయన ఆ కోర్టులో మరొక కేసు వాదించలేదు.

ఆయన ఖర్చులు రోజురోజుకూ పెరుగుతూ పోయాయి. ఆదాయం దాదాపు శూన్యంగా ఉంది. స్మారక వ్యాసాలు రాయడంలో ఆయన మంచి నేర్పు చూపించాడు. అయితే అది బారిష్టరు చేసేపనీ కాదు, దానివల్ల వచ్చే ఆదాయమూ చెప్పుకోదగినది కాదు. ఆరునెలలు ఇలా ప్రయత్నాలు చేసిన తర్వాత ఆయన రాజ్‌కోట్‌లోని తన అన్నయ్య దగ్గరకు తిరిగి వెళ్ళిపోయాడు. ఇంగ్లాండులో చదివి వచ్చిన బారిష్టరుగా గొప్ప విజయాలు సాధిస్తాడని తమ్ముడి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నయ్య తీవ్ర నిరాశకు లోనయ్యాడు. గాంధీకి కూడా చాలా బాధ కలిగింది. రాజ్‌కోట్‌లో ఇంకో సమస్య తలెత్తింది. ఆయన వద్దకు కేసులు తెచ్చిన వకీళ్ళకు ఫీజులో కమీషన్ చెల్లించడం అక్కడొక నియమంగా ఉంది. అలా కమీషన్ ఇవ్వడం అనైతికమని భావించిన గాంధీ దానికి నిరాకరించాడు. అయితే అన్నయ్య బతిమాలిన తర్వాత ఆ విషయంలో రాజీ పడ్డాడు. అప్పుడు గాంధీ నెలకు 300 రూపాయల వరకు సంపాదించేవాడు. తన చుట్టూ అసత్యాలతో నిండి ఉన్న వాతావరణమూ, ఆ ఉద్యోగమూ గాంధీకి సంతోషం లేకుండా చేశాయి.

అదృష్టవశాత్తూ దక్షిణాఫ్రికాలో ఉండే ఒక మహమ్మదీయ వర్తకుడు ఆయన వద్దకు ఒక కేసు తెచ్చాడు. దాన్ని అంగీకరిస్తే ఆయనకు రానూపోనూ ఫస్టుక్లాసు ప్రయాణ ఖర్చులతో పాటు 1575 రూపాయల ఫీజు లభిస్తుంది. ఆయన ఆ కేసును వాదించడానికి అంగీకరించి దూరంగా ఉన్న ఆ ఖండానికి ప్రయాణమయ్యాడు.

దక్షిణాఫ్రికాలో ఉన్న జీవన పరిస్థితుల గురించి ఆయనకేమీ తెలియదు. జాంజిబార్ పట్టణంలో ఓడకు లంగరు వేయగానే అక్కడ కోర్టు ఎలా పని చేస్తుందో చూడటానికి ఆయన వెళ్ళాడు. అక్కడ పద్దు పుస్తకాల నిర్వహణకు సంబంధించిన అనేక అంశాలు ఆయనకు అర్థం కాలేదు. ఆయన దక్షిణాఫ్రికాలో వాదించడానికి బయలుదేరిన కేసు ప్రధానంగా పద్దులకు (అకౌంట్లకు) సంబంధించిందే. వెంటనే గాంధీ ఈ పద్దుల నిర్వహణకు సంబంధించిన గ్రంధాన్ని కొని, దాన్ని శ్రద్ధగా అధ్యయనం చేశాడు.

డర్బన్ చేరిన మూడో రోజున గాంధీ కోర్టుకు వెళ్ళాడు. మేజిస్ట్రేట్ ఆయనను తలపాగా తీసివేయమని ఆజ్ఞాపించాడు. ఆయన ఆదేశాలను పాటించడానికి నిరాకరించిన గాంధీ కోర్టునుండి బయటకు వచ్చేశాడు. దక్షిణాఫ్రికాలో అడుగు పెట్టిన క్షణం నుంచీ అక్కడ భారతీయులను తెల్లవారు ఎలా అవమానిస్తున్నారో, చిన్న చూపు చూస్తున్నారో గాంధీ గమనించాడు. గాంధీని కూడా వాళ్ళు ఆహ్వానం లేని అతిధిగానూ, “కూలీ బారిష్టర్” గానూ చూశారు. అయితే ఈ అవమానాల వల్ల ఆయన రాటుదేలాడు. తన కక్షిదారు దాదా అబ్దుల్లా నుంచి ఆయన న్యాయ వివాదంలోని అంశాలను తెలుసుకొని, కేసును లోతుగా అధ్యయనం చేశాడు. ఎక్కువ కాలంపాటు కేసును కోర్టులో కొనసాగిస్తే న్యాయవాదులను పోషిస్తూ వాది, ప్రతివాదులిద్దరూ ఆర్థికంగా బాగా నష్టపోతారని ఆయన భావించాడు. తన కక్షిదారుకు భారం కలిగిస్తూ డబ్బునూ, ప్రతిష్ఠనీ సంపాదించడానికి ఆయన ఇష్టపడలేదు. రెండు పక్షాలనూ ఏకం చేయడం న్యాయవాదిగా తన బాధ్యత అని ఆయన భావించాడు. అవతలి పక్షాన్ని కలుసుకొని కోర్టు బయట వివాదం పరిష్కరించుకొనేందుకు ప్రయత్నిద్దామని ఆయన పట్టుబట్టాడు. దీనికి దాదా అబ్దుల్లా సంకోచిస్తే “మనిద్దరి మధ్యా రహస్యాలుగా ఉన్న అంశాలేవీ ఇతరులకు తెలియనివ్వనని నేను హామీ ఇస్తున్నాను. రాజీ చేసుకుంటే మంచిదని మాత్రమే నేను ప్రతిపాదిస్తాను,” అని గాంధీ ఆయనకు నచ్చచెప్పాడు. గాంధీ మధ్యవర్తిత్వం చేసినా ఆ కేసు ఒక సంవత్సరం పాటు కొనసాగింది. ఒక సంక్లిష్ఠమైన కేసు విషయంలో న్యాయవాదులు ఎలా పని చేస్తారో అధ్యయనం చేసే మంచి అవకాశం గాంధీకి లభించింది. చివరికి కేసు ఇరువర్గాలకూ సంతృప్తికరంగా పరిష్కారమయ్యింది. కానీ న్యాయశాస్త్రంలోని అంశాలను ఇరువర్గాలకు అనుకూలంగా చూపిస్తూ కోర్టు ఖర్చులను కొండంత భారం చేసే వృత్తి గాంధీకి ఏవగింపు కలిగించింది.

గాంధీ డర్బన్‌లో న్యాయవాదవృత్తి ప్రారంభించిన కొద్దిరోజులకే ఒక ఒప్పంద కార్మికుడు అతని కార్యాలయానికి వచ్చాడు. అతడి పేరు బాలసుందరం. అతడి

ముందు రెండు పళ్లు విరిగి, బట్టలు చిరిగి ఉన్నాయి. అతడిని అతని తెల్ల యజమాని బాగా కొట్టాడు. గాంధీ అతడిని ఓదార్చి ఒక తెల్లవైద్యుని వద్ద దెబ్బలకు చికిత్స చేయించాడు. దెబ్బల తీవ్రతను ధృవీకరిస్తూ వైద్యుని వద్ద సర్టిఫికెట్ తీసుకున్నాడు. తర్వాత బాలసుందరం తరఫున కోర్టులో కేసు వేసి అతడిని క్రూరమైన యజమాని చెరనుండి విడిపించి మెరుగైన కొత్త యజమాని వద్ద చేరే అవకాశం కల్పించాడు. ఈ సంఘటనతో పేద భారతీయ కార్మికులలో గాంధీ చాలా ప్రసిద్ధుడయ్యాడు. నిస్సహాయులకు రక్షకుడిగా ఆయన ఖ్యాతి భారతదేశం వరకు చేరింది. అప్పటి నుంచీ స్నేహితులు లేనివారికి అతడు స్నేహితుడుగా మారిపోయాడు.

ఒక సంవత్సరం అనుభవంతో గాంధీకి ఆత్మవిశ్వాసం వచ్చింది. కొన్ని వాదవివాదాల తర్వాత ఈ కూలీ బారిష్టరుకు నాటల్ సుప్రీం కోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకొనేందుకు అనుమతి లభించింది. తెల్ల న్యాయవాదులు అతనికి కేసులు రానిచ్చేవారు కాదు. పైగా ఆయనే స్వయంగా తన వృత్తికి అడ్డంకులను సృష్టించుకొనేవాడు. న్యాయవాదవృత్తి అంటే అబద్ధాలకోరు వృత్తి కాదని నిరూపించాలని ఆయన కంకణం కట్టుకొన్నాడు. ఆయనెప్పుడూ అసత్యాలాడేవాడు కాదు. కేసులు గెలవడం కోసం సాక్షులను తప్పుడు సాక్ష్యం చెప్పమని అనేవాడు కాదు. తన కక్షిదారు ఓడినా, గెలిచినా తనకు న్యాయంగా రావలసిన ఫీజు తప్ప ఒక్క పైసా కూడా ఎక్కువ తీసుకొనేవాడు కాదు. తనకు ఫీజులు బాకీపడ్డ కక్షిదారులకు ఆయన ఒక్కసారి కూడా నోటీసులు పంపలేదు. వ్యక్తిగతంగా తనను కష్టపెట్టిన వాళ్ల మీద కేసులు వేయలేదు. దక్షిణాఫ్రికాలో ఆయన మీద నాలుగుసార్లు దాడి జరిగినా దుండగులను కోర్టుకీడ్చి శిక్ష వేయించడంపై ఆసక్తి చూపించలేదు. న్యాయవాదిగా తన ఇరవైయేళ్ల వృత్తిజీవితంలో వందలాది కేసులు న్యాయస్థానం బయటే పరిష్కారమయ్యేందుకు సహాయం చేశాడు.

ఒకసారి ఒక కేసు వాదిస్తూండగా తన కక్షిదారే అన్యాయంగా ప్రవర్తించాడని ఆయనకు అర్థమయ్యింది. అతన్ని గెలిపించేందుకు వాదించడం మాని, కేసును కొట్టివేయమని మేజిస్ట్రేటును కోరాడు. తప్పుడు కేసు తెచ్చినందుకు కక్షిదారును స్వయంగా మందలించాడు. "నేను న్యాయవాద వృత్తిని ఒక రెండవ శ్రేణి న్యాయవాదిగా ప్రారంభించాను. నా న్యాయవాద నైపుణ్యాలు నా కక్షిదార్లను పెద్దగా ఆకట్టుకొనేవి కావు. కానీ నేను ఎట్టి పరిస్థితులలోనూ సత్యానికే కట్టుబడి ఉంటాను అనే విశ్వాసం వారికి కలిగాక నన్ను వదిలిపెట్టేవారు కాదు," అని గాంధీ ఒకసారి స్వయంగా చెప్పుకున్నాడు. ఆయన కక్షిదార్లు క్రమంగా ఆయన స్నేహితులుగా, సహచరులుగా

మారిపోయేవారు. ఆయన నిజాయితీకి ఎంత విలువ ఉండేదంటే ఒక సందర్భంలో ఒక కక్షిదారుడిని జైలుకి వెళ్లకుండా అది కాపాడింది. గాంధీ పాత కక్షిదారు ఒకరు దిగుమతి సుంకం చెల్లించకుండా కొన్ని వస్తువులను దిగుమతి చేసుకున్నాడు. అయితే తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగే పరిస్థితులు తలెత్తేసరికి ఆయన గాంధీ వద్దకు వచ్చి నిజం చెప్పేశాడు. తన తప్పు ఒప్పుకొని అపరాధ రుసుము చెల్లించాలని గాంధీ ఆయనకు సూచించాడు. తానే స్వయంగా ప్రభుత్వ న్యాయవాదిని (అటార్నీ జనరల్‌ను) కలిసి ఉన్న విషయం ఉన్నట్లు చెప్పాడు. వారు గాంధీ వాంగ్మూలాన్ని ఎలాంటి ప్రశ్నలూ లేకుండా స్వీకరించి, తప్పు చేసిన వ్యక్తిని కేవలం అపరాధ రుసుముతో వదిలేశారు. దీనికి కృతజ్ఞతగా ఆ కక్షిదారు మొత్తం సంఘటనను ముద్రించి, పటం కట్టించి తన కార్యాలయంలో తగిలించాడు.

మరొక సందర్భంలో కక్షిదారు పద్దులలో చిన్న తప్పు దొర్లింది. గాంధీ ఆ తప్పును ప్రతిపక్షానికి చూపించి పొరపాటైందని అంగీకరించాడు. దానికి అనుగుణంగానే తన వాదన కొనసాగించాడు. ఆ కేసు పర్యవేక్షిస్తున్న న్యాయమూర్తి మరీ అంత కఠినంగా వృత్తిని నిర్వహించడం మంచిది కాదని గాంధీని మందలించాడు, కానీ చివరకు గాంధీ కక్షిదారునికి అనుకూలంగా తీర్పు ఇచ్చాడు. “గాంధీ స్వయంగా వారి పద్దులో తప్పును చూపించకపోతే ఏమయ్యేదో ఒక్కసారి ఆలోచించు,” అని ఆయన ఎదుటి పక్షానికి సర్దిచెప్పాడు. సాక్షుల వాంగ్మూలాలను పరీక్షించి నిగ్గుతేల్చడంలో గాంధీ గొప్ప ప్రతిభ చూపేవాడు. ఆయనను న్యాయమూర్తులు, తోటి న్యాయవాదులు చాలా గౌరవించేవారు. ఆయనకు చాలామంది తెల్లజాతి కక్షిదార్లు ఉండేవారు. భారతదేశంలోగానీ, దక్షిణాఫ్రికాలోగానీ తెల్లవారికి ఎదురుగా నల్లవారు జరిపే న్యాయ పోరాటాల్లో నూటికి 99 తెల్లవారికి అనుకూలంగా ముగుస్తూండటం గాంధీ గమనించాడు. అందుకే “భారతదేశంలో చేస్తున్న క్రూర హత్యలకు కనీసం ఒక తెల్లవ్యక్తినైనా న్యాయస్థానం కఠినంగా శిక్షించిందా? ఏ తప్పూ చేయని నీగ్రోలను ఉద్దేశపూర్వకంగా హింసించిన తెల్ల అధికారికి కోర్టు విధించిన హాస్యాస్పద శిక్షను గమనించారా?” అని ఒక సందర్భంలో వ్యాఖ్యానించాడు.

కఠిన నియమాలు పాటిస్తున్నా, న్యాయ వ్యవస్థ గురించి ప్రతికూల వ్యాఖ్యలు చేస్తున్నా గాంధీ న్యాయవృత్తిలో బాగా వృద్ధి చెందాడు. భారతదేశంలో ఆయన న్యాయవాదవృత్తి కొద్దికాలంలోనే ముగిసిపోయినప్పటికీ, దక్షిణాఫ్రికాలో మాత్రం అది 20 సంవత్సరాలపాటు విజయవంతంగా కొనసాగింది.

మొదట్లో ఆయన ఒక మంచి ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని, బారిష్టరు హోదాకు తగినట్లుగా సాధన సామగ్రితో, యూరోపియన్ శైలిలో దాన్ని అలంకరించాడు. ఆదివారాల్లోనూ, శలవు రోజుల్లోనూ పార్టీలు ఇచ్చేవాడు. తన ఇంటిని అందరికీ అందుబాటులో ఉంచుతూ స్నేహితులనూ, తన కింది ఉద్యోగులనూ తనతో కలిసి ఉండమని కోరేవాడు. ఇంటికి ఆరు మైళ్ళ దూరంలో ఆయన కార్యాలయం ఉండేది. అక్కడకు వెళ్ళడానికి ఆయన కొంతకాలం సైకిలును ఉపయోగించాడు. ఆ తర్వాత నడిచి వెళ్ళేవాడు. దక్షిణాఫ్రికాలో అమలులో ఉన్న చట్టాల ప్రకారం భారతీయులు ట్రాము కారు ముందు సీటులో కూర్చుని ప్రయాణించడానికి వీలులేదు. తాను ప్రత్యేక అనుమతి పొందేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆయన ట్రాము కారు ఎక్కేవాడు కాదు. క్రమ క్రమంగా పేద భారత కార్మికుల ప్రతినిధిగా తనను భావించుకోవడం మొదలు పెట్టాడు. నిరాడంబరంగా జీవించడం అలవాటు చేసుకున్నాడు. 40 సంవత్సరాల వయసులో, సగటున నెలకు 4000/- రూపాయలు సంపాదిస్తున్న స్థితిలో ఆయన తన లాయర్ వృత్తిని వదలి ప్రజాజీవితంలోకి ప్రవేశించాడు. అప్పటికి సంపాదించిన ఆస్తులన్నీ సమాజానికి ఇచ్చి, రెక్కల కష్టాన్ని నమ్ముకొని పొలాల్లో జీవించడం మొదలుపెట్టాడు.

చాలా సంవత్సరాల తర్వాత భారతదేశంలో న్యాయస్థానాలను నడిపే ఖరీదైన పద్ధతినీ, న్యాయవాదులు, బారిష్టర్లు పెద్దమొత్తాలలో ఫీజులు తీసుకోవడాన్నీ ఆయన విమర్శించాడు. ఇక్కడి ప్రజలు అనుభవిస్తున్న దారిద్ర్యానికీ, న్యాయవాదుల ఫీజులకీ సంబంధమే ఉండేదికాదు. ఒక్కో న్యాయవాదికీ నెలకు 50 వేల నుంచి లక్ష రూపాయలు సంపాదించే అవకాశం ఉండేది. "న్యాయవాద వృత్తి జూదం కాదు. న్యాయవాదులూ, న్యాయస్థానాల మాయలో పడకుండా ఉంటే ఇంతకంటే సంతోషకరమైన జీవితం గడుపుతూ ఉండేవారం. న్యాయవాద వృత్తి అనైతికతను నేర్పుతుంది. రెండు పక్షాల తరఫునా సొమ్ములకోసం ఆత్మలను అమ్ముకునే దొంగసాక్షులు ఉంటూనే ఉంటారు," అని గాంధీ చెప్పేవాడు. న్యాయాన్ని పరిశుద్ధ మైందిగా, చౌకైనదిగా చేసేందుకు న్యాయవాద వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు రావాలని ఆయన భావించేవాడు. ఆయన పేదల కేసులను ఫీజు లేకుండానే స్వయంగా వాదించేవాడు. సామాజిక అంశాలకు సంబంధించిన కేసుల్లో న్యాయస్థానానికి చెల్లించాల్సిన రుసుముల కంటే పైసా కూడా ఎక్కువ పుచ్చుకొనేవాడు కాదు. పేదలైన భారత వలస కార్మికుల నివాసాలను కూలీలకు కేటాయించిన స్థలాలనుంచి అక్కడి పురపాలక సంస్థ బలవంతంగా ఖాళీ చేయిస్తుంటే గాంధీ ఆ కార్మికుల తరఫున వాదించాడు. ఆయన

అన్ని కేసులలోనూ చాలా కష్టపడ్డాడు. కానీ ఒక్కొక్క కేసుకూ కేవలం 170 రూపాయలు మాత్రమే తీసుకున్నాడు. మొత్తం 70 కేసులకు 69 కేసులు గెలిచాడు. తనకు వచ్చిన ఫీజులో సగం ఒక ధార్మికసంస్థ నిర్మాణానికి వినియోగించాడు.

మానవ హక్కుల సాధన కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణ చేయమని తన దేశస్తులకు గాంధీ బోధించాడు. ఆయనను అరెస్టు చేసి భారతదేశంలోని న్యాయస్థానాలలోనూ, దక్షిణాఫ్రికాలోని న్యాయస్థానాలలోనూ విచారించారు. చాలాసార్లు జైలు శిక్ష విధించారు. దక్షిణాఫ్రికాలో ఏ న్యాయస్థానంలో ఆయన బారిష్టరుగా పదేళ్ళు చేశాడో అదే న్యాయస్థాన బోనులో చేతికి సంకెళ్ళతో నిలబడ్డాడు. భారతదేశంలో మొదటిసారి శిక్ష పడగానే ఆయన పేరును బారిష్టర్ల జాబితాలోంచి తొలగించారు.

బ్రిటిష్ రాజ్యంలోని కోర్టుల పట్ల గాంధీజీ సహాయనిరాకరణ ప్రకటించాడు. పంచాయితీ వ్యవస్థను పునరుజ్జీవింప చేయాలని కోరాడు. ఈ చట్ట విధ్వంసకుని ఆహ్వానం మేరకు భారతదేశంలోని ఎంతోమంది ప్రముఖ న్యాయవాదులు తమ వృత్తిని వదలి స్వాతంత్ర్యోద్యమంలో చేరారు.

ఒక న్యాయవాద సంఘం సమావేశంలో మాట్లాడుతూ తనను తన స్వంత న్యాయవాద సంఘమే బహిష్కరించిందనీ, తనకు చట్టం తెలియదని గాంధీ చెప్పుకున్నాడు. ఆయన జీవితంలో అధిక భాగం చట్టాలకు వ్యాఖ్యలు చేసేవాడుగా కాక, చట్టాలను ధ్వంసం చేసేవాడుగా గడిపాడు.

## బట్టలు కుట్టేవాడు

దక్షిణాఫ్రికాలో ఉండగా గాంధీకి రెండుసార్లు 'కఠిన శారీరక శ్రమ'ను శిక్షగా విధించారు. కొన్ని వారాలపాటు రోజుకు తొమ్మిది గంటలసేపు చిరిగిపోయిన దుప్పట్లను కుట్టడం, మందమైన గుడ్డను చిన్న చిన్న చొక్కా జేబులుగా కత్తిరించడం ఆయన పని. తనకు అప్పగించిన గుడ్డముక్కలను సమయానికంటే ముందే కుట్టి, ఇంకా కావాలని అడిగేవాడు. ఒక భారతీయ కారాగారంలో కొద్ది రోజులపాటు ఆయన 'సింగర్' కుట్టుమిషను మీద పని చేశాడు. కారాగారంలో తనకు అప్పగించిన పనంతా స్వచ్ఛందంగా చేసేవాడు. కుట్టుమిషను ఉపయోగించడంలో మరింత నైపుణ్యం సంపాదించాలని గాంధీ భావించాడు. నైపుణ్యంగల చేతులకు బదులుగా పని చేయగల

పెద్ద ఆటోమేటిక్ యంత్రాల వాడకాన్ని, పెట్టుబడిదారుల యాజమాన్యంలోని యంత్రాలకు మనిషి బానిసగా మారడాన్ని ఆయన వ్యతిరేకించాడు. మనుషులకు అవసరమైన శారీరకశ్రమను తగ్గించే స్థాయిలో యంత్రాల వాడకాన్ని అనుమతించ కూడదని ఆయన విశ్వసించాడు. ఆయన ఉద్దేశంలో "భారతదేశంలో ఉన్న సమస్య కొన్ని లక్షలాది మంది శారీరక శ్రమను ఎలా అంతం చేయడం అన్నది కాదు, వారి ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేయడం." యంత్రాల వాడకంలో ఆయనకున్న అభ్యంతరాలను కుట్టుమిషను విషయంలో మాత్రం పక్కనపెట్టాడు. ఎందుకంటే ఆయన దృష్టిలో "భూమిమీద కనిపెట్టిన కొద్దిపాటి ఉపయోగపడే వస్తువులలో కుట్టుమిషను కూడా ఒకటి. బట్టలు కుట్టడానికి తన భార్య ఒట్టిచేతులతో పడుతున్న శ్రమను చూసి తట్టుకోలేక ఆమె పనిభారం తగ్గించేందుకు సింగర్* కుట్టుమిషను కనిపెట్టాడు. అంటే కుట్టుమిషను మూలాల్లో ప్రేమ ఉంది."

"నీ సల్వారు కమీజు కుట్టుకోవడం గురించి ఆందోళన చెందకు. నీకు ఏది అవసరమో అది నేను తయారుచెయ్యగలను. మనం తేలిగ్గా ఒక సింగర్ కుట్టుమిషను సంపాదించగలం. కొద్ది గంటల శ్రమతో మనకు కావలసిన దుస్తులను కుట్టుకోవచ్చు," అని ఆయన ఒకానొక సందర్భంలో ఒక మహిళా ఆశ్రమవాసికి లేఖ రాశాడు. ఆయన తన కుట్టుపని నైపుణ్యాలగురించి గర్వించేందుకు తగిన కారణం ఉంది. ఆయన తన భార్య రవికలు కత్తిరించి కుట్టగలిగేవాడు. ఆయన చరఖా మీద నూలు వడికి, తానే చేతి మగ్గంమీద స్వయంగా గుడ్డ నేసి ఆ బట్టతో తన చొక్కా తానే కుట్టుకునేవాడు. నిపుణులైన బట్టలు కుట్టేవాళ్లు, చెప్పులు కుట్టేవాళ్లు ఆయా పనుల్లో ఆశ్రమవాసులకు ఉచితంగా శిక్షణనిచ్చేవారు. నీలి మందు రైతుల దుస్థితికి వ్యతిరేకంగా గాంధీ చంపారన్ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న రోజుల్లో "రైతుల హృదయాలను గెలుచుకొనేందుకు గాంధీ తాత్కాలికంగా, ప్రత్యేకంగా దేశవాళీ దుస్తులు ధరిస్తున్నాడని," ఒక బ్రిటిష్ విలేఖరి ఎద్దేవా చేశాడు. అతనికి బదులిస్తూ గాంధీ "స్వదేశీ ప్రమాణం చేసిన తర్వాత నేను పూర్తిగా స్వయంగా నా చేతులతోగానీ, నా సహచరుల చేతులతోగానీ నూలు వడికి, నేసి, కుట్టిన దుస్తులనే ధరిస్తున్నాను," అని రాశాడు. ఆ తర్వాత కాలంలో గాంధీ చొక్కా తొడగడం మానేసి ఒక అంగవస్త్రం, కండువా మాత్రమే ధరించసాగాడు. అప్పుడు కూడా ఆయన అప్పుడప్పుడూ తన అంగవస్త్రం, చేతిగుడ్డల అంచులను

---

* ఐ.ఎం. సింగర్ (1811–1875) అనే అమెరికన్ అప్పటి కుట్టు మిషన్లకు మెరుగులు దిద్ది తేలికగా వాడుకునేలా రూపొందించాడు.



కుట్టుకుంటూ ఉండేవాడు. తాను కుట్టుపనిలో తీరికలేకుండా ఉన్నప్పుడు కార్యదర్శికి లేఖలు చెబుతుండేవాడు. ఆయన ఆగాఖాన్ పాలెస్*లో బందీగా ఉన్నప్పుడు అక్కడి జైలు సూపరింటెంట్‌కు ఖాదీ జేబురుమాళ్ళు బహుమతిగా ఇచ్చాడు. ఆ జేబు రుమాళ్ళన్నిటి మీద సూపరింటెంట్ పేరుని పొడి అక్షరాలలో గాంధీ స్వయంగా చేత్తో కుట్టాడు. అప్పుడు గాంధీ వయస్సు 74 సంవత్సరాలు.

గాంధీకి ఇష్టమైన ఒక శాలవలో చిరుగులను ఖాదీ ముక్కలతో అతడి పర్యవేక్షణలో ఒక మహిళ కుట్టింది. భారతదేశ పేదప్రజల ప్రతినిధిగా ఆయన అదే శాలువా కప్పుకొని రౌండ్‌టేబుల్ సమావేశంలో బ్రిటిష్ ప్రధాని పక్కన కూర్చున్నాడు. అదే శాలువా కప్పుకొని బ్రిటిష్ రాణి నివాసమైన బకింగ్‌హామ్ పాలెస్‌లో తేనీటివిందుకు హాజరయ్యాడు. ఆయనకు ఆడంబరమంటే ఎప్పుడూ ఇష్టం ఉండేదికాదు. కానీ చిరుగులు పడిన, మాసిన దుస్తులని ఎప్పుడూ ధరించేవాడు కాదు. ఒక సమావేశంలో తన సహచరుడు ధరించిన ఖద్దరు దుస్తులకు చిల్లుండటం ఆయన గమనించాడు. తక్షణమే ఆయనకొక సూచన పంపాడు: "చిరుగులు పడిన దుస్తులు ధరించడం

* పూనాలో ఆగాఖాన్ పాలెస్‌ని 1892లో సుల్తాన్ మహ్మద్ షా ఆగాఖాన్ నిర్మించాడు. దీనిని 2003లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన భవనంగా గుర్తించారు.

బద్ధకానికి గుర్తు కాబట్టి సిగ్గుపడాల్సిన విషయం. కానీ అతుకులు వేసిన దుస్తులు పేదరికాన్నీ, నిరాడంబరత్వాన్నీ, కష్టపడే గుణాన్నీ సూచిస్తాయి. నేను నీ దుస్తులలో చిల్లులు మెచ్చుకోలేను, అది పేదరికానికిగానీ, నిరాడంబరత్వానికిగానీ గుర్తుకాదు. అది భార్య లేకపోవడాన్ని లేదా బద్ధకస్తురాలైన భార్యను లేదా బద్ధకాన్ని సూచిస్తుంది.”

## బట్టలు ఉతికేవాడు

బారిష్టరు గాంధీ చక్కటి ఆంగ్లేయ దుస్తులు ధరించి కోర్టుకు వెళ్ళేవాడు. ఆయన తెల్లచొక్కాకు సరిపోయే విధంగా ప్రతిరోజూ ఒక తాజా పరిశుభ్రమైన కాలర్ కావాల్సివచ్చేది. ఆయన రెండు రోజులకు ఒకసారి చొక్కా మార్చేవాడు. ఆయన చాకలి బిల్లు భారీగా వచ్చేది. తగినన్ని దుస్తులు అందుబాటులో ఉంచుకొనేందుకు ఆయన చాలా దుస్తులు కొనాల్సి వచ్చేది. చాకలి ఇష్టాయిష్టాలను తట్టుకొనేందుకు మూడు డజన్ల చొక్కాలు, కాలర్లు కూడా సరిపోయేవి కావు. గాంధీ తన ఖర్చులను తగ్గించుకోవాలని అనుకున్నాడు. ఒక రోజు ఆయన ఇంటికి వచ్చేటప్పుడు బట్టలు ఉతకటానికి కావలసిన సాధనాలన్నీ తెచ్చుకున్నాడు. బట్టలు ఉతకడానికి సంబంధించిన పుస్తకం ఒకటి కొని దాన్ని బాగా అధ్యయనం చేశాడు. బాగా బట్టలు ఉతికేందుకు కావలసిన సూచనలన్నీ ఆకళింపు చేసుకున్నాడు. సాధన చేయడం మొదలుపెట్టాడు. పాపం కస్తూర్బా ఈ మొత్తం వ్యవహారంలో ప్రేక్షకురాలిగా ఉండిపోవడానికి వీలులేకపోయింది. బట్టలు ఉతకడం అనే కళను గాంధీ ఆమెకు నేర్పాడు. ఈ కొత్త వ్యాపకం గాంధీ రోజువారీ కార్యక్రమాలకు మరింత పనిని జత చేసింది. ఐతే ఆయన ఓటమి ఒప్పుకొనే తరహా మనిషి కాదు. బట్టలు ఉతికే వ్యక్తి నిరంకుశ అధికార పరిధిలోంచి బయటపడి స్వాతంత్ర్యం పొందాలని ఆయన ఆకాంక్షించాడు. ఒక రోజు ఆయన ఒక కాలర్‌ను ఉతికి గంజిపెట్టాడు. ఆ పని అలవాటు లేకపోవడంవల్ల, తక్కువ వేడి ఉన్న ఇస్త్రీ పెట్టెతో పైపైన ఇస్త్రీ చేశాడు. వేడి ఎక్కువైతే బట్ట కాలిపోతుందేమో అని ఆయన భయం. అదే కాలర్ వేసుకొని ఆయన కోర్టుకు వెళ్ళాడు. గంజి ఎక్కువ పెట్టడం వల్ల అది కొయ్యలా బిగుసుకు పోయింది. ఆయన అవతారం చూసి స్నేహితులు నవ్వారు. ఆయన దాన్నసలు లెక్క చెయ్యలేదు. “అవును, బట్టలు ఉతకటంలో ఇది నా మొదటి ప్రయత్నం. అందుకే గంజి కొంచెం ఎక్కువయ్యింది. కానీ అదేమంత పెద్ద విషయం కాదు. కనీసం అది మిమ్మల్ని నవ్వించడానికైనా పనికొచ్చింది కదా,” అన్నాడు గాంధీ.



"కానీ మనకు బట్టలు ఉతికే వాళ్ల కొరతేమీ లేదుకదా!"

"లేదు, బట్టలు ఉతికే బిల్లు మాత్రం చాలా ఎక్కువగా ఉంది. ఒక కాలర్ ఉతకడానికి అయ్యే ఖర్చు దాదాపు దాని ఖరీదుతో సమానంగా ఉంది. ఒకవేళ అంత ఖర్చుకు సిద్ధపడినా చివరకు బట్టలు ఉతికే వ్యక్తి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడక తప్పడంలేదు. అందుకే నా దుస్తులు నేనే ఉతుక్కోవడం చాలా మెరుగనుకుంటున్నాను," బదులిచ్చాడు గాంధీ. కొద్ది రోజులకే ఆయన బట్టలు ఉతికే పనిలో కూడా నైపుణ్యం సంపాదించాడు.

తన గురువుగా గౌరవించే గోఖలే ఒకసారి గాంధీవద్ద ఉండటానికి వచ్చాడు. గోఖలే ఒక పెద్దవిందుకు హాజరు కావలసి ఉంది. ఆయన కండువా నలిగిపోయింది. కానీ బయటకు వెళ్ళి ఉతికించుకుని వచ్చేంత సమయం లేదు. "నేను దాన్ని చక్కగా ఇస్త్రీ చేయనా?" గాంధీ ఆయనను అడిగాడు. "ఒక న్యాయవాదిగా నీ నైపుణ్యాల మీద నాకు విశ్వాసం ఉంది, కానీ బట్టలు ఉతకటంలో నీ నైపుణ్యాల మీద లేదు. ఒకవేళ నువ్వు నా బట్టను పాడుచేస్తే?" అన్నాడు గోఖలే. కానీ గాంధీ పట్టుబట్టి ఆ ఇస్త్రీ పని పూర్తి చేశాడు. గాంధీ పనితనం గోఖలేకు నచ్చింది. దానికి గాంధీ ఎంతగా సంతోషించాడంటే "ఇంక ప్రపంచంలో నాకెవ్వరూ సర్టిఫికెట్ ఇవ్వకపోయినా పర్లేదు," అనుకున్నాడు.

దక్షిణాఫ్రికాలోని ఆశ్రమాలలో నీటికొరత ఉండేది. బట్టలు ఉతకడానికి మహిళలు దూరంగా ఉన్న సెలయేటివద్దకు వెళ్ళాల్సి వచ్చేది. గాంధీ వారికి సహాయం చేసేవాడు. ఖద్దరు ఉత్పత్తి తొలిరోజుల్లో చేతిమగ్గాలమీద చాలా మందమైన, బరువైన చీరలు

తయారయ్యేవి. ఆశ్రమంలోని మహిళలు వాటిని ధరించేందుకు ఒప్పుకున్నారు కానీ వాటిని ఉతకాల్సి వచ్చినప్పుడు విసుక్కునేవారు. అలాంటప్పుడు గాంధీ వారికి ఆ పనిలో సహాయపడటానికి ముందుకొచ్చాడు. ఆయన ఇతరుల దుస్తులు ఉతకడానికి సిగ్గుపడేవాడు కాదు. ఒకసారి ఆయన ఒక సంపన్నుడికి అతిథిగా వున్నాడు. గాంధీ స్నానాలగదిలోకి వెళ్ళేసరికి అక్కడ తలుపుమీద ఒక శుభ్రమైన తెల్లని తుండువేసి ఉంది. ఆయన స్నానం పూర్తిచేసి తన దుస్తులతోపాటు ఆ తుండును కూడా ఉతికి బయట ఎండలో ఆరేయడానికి తీసుకెళ్ళాడు. తెల్లని గుడ్డలను ఎండలో ఆరేయడంపట్ల గాంధీ శ్రద్ధ చూపేవాడు. ఎందుకంటే అలా ఎండలో ఆరేస్తే అవి తెల్లగా మెరవడమేగాక వాటిలో ఉన్న సూక్ష్మజీవులు కూడా నశిస్తాయి. ఆ సంపన్నుడు అడ్డుకుంటూ "గాంధీజీ మీరేంచేస్తున్నారు?" అన్నాడు. "ఇందులో తప్పేముంది? అక్కడే వదిలేస్తే ఆ తెల్లతుండు మురికి పట్టేది. అందుకే ఉతికేశాను. అయినా వస్తువులను శుభ్రంగా ఉంచడానికి కొద్దిపాటి చేతిసాయం చెయ్యడానికి నేనేమీ సిగ్గుపడను," అని గాంధీ జవాబిచ్చాడు. గాంధీ సిగ్గుపడలేదుగానీ ఆయనతో పని చేయించుకున్నందుకు ఆ సంపన్నుడు సిగ్గుపడ్డాడు.

ముసలివయసులో కారాగారంలో ఉన్నప్పుడు కూడా గాంధీ తన అంగవస్త్రాన్ని, తుండుగుడ్డను, జేబురుమాలును తానే ఉతుక్కుని తనతోపాటు జైలులో ఉన్నవాళ్ళు అదనపు పనిచేయాల్సిన అవసరం లేకుండా చేసేవాడు. కస్తూర్బా ఆఖరి దశలో జబ్బుగా ఉన్నప్పుడు ఆగాఖాన్ పాలెస్‌లో ఆమె వాడిన జేబురుమాళ్ళను గాంధీ ఉతికేవాడు. ఆయన జీవితమంతా తన దుస్తులపట్ల ప్రత్యేక శ్రద్ధతో ఉండేవాడు. చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు మిల్లులో తయారైన తన సన్నని ధోవతిని మిగిలిన పిల్లలకన్నా తెల్లగా ఉతుక్కునేందుకు పోటీపడేవాడు. నూతిలోంచి నీరుతోడుకొని దాన్ని ఉతికేవాడు. గాంధీ నిరాడంబరంగా ఉండటాన్ని ఇష్టపడేవాడు. కానీ మాసిపోయిన, నలిగిపోయిన దుస్తులను అసహ్యించుకొనేవాడు. ఆయన తన అంగవస్త్రం, కండువా, తుండుగుడ్డలను చిన్న మరక కూడా లేకుండా శుభ్రంగా, ఒక్క అనవసరమైన మడత కూడా లేకుండా ఉంచుకునేవాడు. పరిశుభ్రతకు ఆయన ప్రతిరూపం.

# క్షవరం చేసేవాడు

దక్షిణాఫ్రికాకు వచ్చిన ఒక వారం తర్వాత తన న్యాయవాద పనికోసం ఆయన ఒక పట్టణంలో ఒక రాత్రి గడపాల్సి వచ్చింది. ఆయన ఒక గుర్రపుబండి కట్టించుకొని



పట్టణంలోకెల్లా పెద్ద హొటలుకు వెళ్ళాడు. గది కావాలని అడిగాడు. అక్కడి తెల్ల మేనేజరు గాంధీని కిందనుండి పైదాకా పట్టిపట్టి చూసి "సారీ, అన్ని గదులూ నిండిపోయాయి. ఖాళీల్లేవు," అన్నాడు. గాంధీ ఆ రాత్రి ఒక భారతీయ స్నేహితుని దుకాణంలో గడిపాడు. హొటలు సంఘటనని స్నేహితునికి చెబితే అతడు ఆశ్చర్యపడి "నీకు హొటల్లో గది ఇస్తారని ఎలా అనుకున్నావు?" అని అడిగాడు. దక్షిణాఫ్రికాలో భారతీయులు ఎదుర్కొంటున్న అవమానాల గురించి అప్పుడు గాంధీకి తెలిసింది. భారతీయుడిగా పుట్టినందుకు ఆయన చెంపదెబ్బలు, పిడిగుద్దులు, తన్నులు తిన్నాడు. గుర్రపుబగ్గీలోంచి, రైల్లోంచి, ప్లాట్‌ఫాంమీంచి నెట్టివేయబడ్డాడు. అయినా నల్లవాళ్ళను తెల్లవాళ్ళు ఎందుకు అసహ్యించుకుంటున్నారో ఆయనకు అర్థం కాలేదు. మనుషులందరూ ఒకే దేవుని బిడ్డలు కాదా? క్రైస్తవమతం ప్రేమను బోధించడం లేదా?

ఒక రోజు గాంధీ తన జుట్టును కత్తిరించుకోవడానికి క్షౌరశాలకు వెళ్ళాడు. అక్కడున్న తెల్ల క్షురకుడు "నీకు ఏంకావాలి?" అని అడిగాడు. "నేను క్షవరం చేయించుకుందామని అనుకుంటున్నాను," అని గాంధీ చెప్పాడు. "సారీ, నేను మీకు క్షవరం చెయ్యలేను. నల్లవాళ్ళకి క్షవరం చేస్తే నేను నా తెల్ల ఖాతాదారులను పోగొట్టుకోవాల్సి ఉంటుంది," అన్నాడు. ఈ అవమానం గాంధీ మనసులో బాగా నాటుకుంది.

బాధతో విలవిలలాడటంకానీ, వార్తాపత్రికలలో విజ్ఞప్తులు చేయడంగానీ దీనికి పరిష్కారం కాదని ఆయన భావించాడు. తాను మరొకరిమీద ఆధారపడకుండా తన పనులు తానే చేసుకొనే స్థితికి ఎదగాలి. ఒక కత్తెర, కత్తి కొనుక్కొని ఇంటికి వెళ్ళాడు. అద్దంలో చూసుకుంటూ తన జుట్టు తనే కత్తిరించుకోవడం ప్రారంభించాడు. గడ్డం చేసుకోవడం కుదిరింది కానీ ఎవరి జుట్టు వాళ్ళే కత్తిరించుకోవడం అంత సులువైన పనికాదు. అది ఖచ్చితంగా ఒక బారిష్టరు పని కూడా కాదు. ఎలాగో ఒకలా పని పూర్తిచేశాడు కానీ తలవెనుక జుట్టంతా పాడైపోయింది. తన సహజమైన నిబ్బరంతో మర్నాడు కోర్టుకు వెళ్ళాడు. బఫూనులాగా ఉన్న తలకట్టు చూసి ఆయన స్నేహితులు పగలబడి నవ్వారు. ఒకతను వ్యంగ్యంగా అడిగాడు “గాంధీ నీ జుట్టు ఏమైంది? రాత్రి ఎలుకలుగానీ కొట్టేశాయా ఏమిటి?” “లేదు, తెల్ల క్షురకుడు ఈ నల్లవాడి జుట్టును కత్తిరించేందుకు నిరాకరించాడు. అందుకని నా జుట్టును నేనే కత్తిరించు కోవాలని నిర్ణయించుకున్నాను. అది సరిగా రాకపోయినా సరే,” అని గాంధీ బదులు ఇచ్చాడు.

28 ఏళ్ళ వయసులో గాంధీ తొలిసారి జుట్టు కత్తిరించుకున్నప్పటి సంగతి అది. ఆ తర్వాత ఆయన తరచుగా కత్తెరను ఉపయోగించడం ప్రారంభించాడు. ఆయన స్థాపించిన ఆశ్రమాలలో డబ్బు చెల్లించి క్షవరం చేయించుకోవడం నిషిద్ధం. ఆశ్రమవాసులు వంతులవారీగా ఒకరి జుట్టు మరొకరు కత్తిరించేవారు. తన ఆశ్రమంలో విద్యార్థులు నిరాడంబర సాధుజీవనం గడపాలని గాంధీ కోరుకొనేవాడు. ఫ్యాషన్లకూ, అందమైన దుస్తులకూ, రుచికరమైన ఆహారానికీ అక్కడ చోటులేదు. ఆదివారం అబ్బాయిలు స్నానానికి వెళ్ళేముందు గాంధీ వారిని పిలిచి ఒకరి తర్వాత ఒకరికి క్రాఫ్ చేసేవాడు. జుట్టును అంటకత్తిరేస్తున్నందుకు వాళ్ళు చాలా బాధ పడేవారు. ఒక సందర్భంలో ఇద్దరు ఆశ్రమం అమ్మాయిల పొడవాటి జుట్టును కూడా గాంధీ కత్తిరించేశాడు. దక్షిణాఫ్రికా జైళ్ళలో ఖైదీలకి దువ్వెనలు ఇచ్చేవారుకాదు. రెండు నెలలు లేదా అంతకంటే ఎక్కువగా జైలుశిక్ష పడినవాళ్ళందరికీ జుట్టును అంటకత్తెర వేసి, మీసం తీసేసేవారు. గాంధీకి, ఆయన బృందానికీ ఈ పనినుంచి మినహాయింపు లభించింది. కానీ జైల్లో ఉండటమంటూ జరిగాక అక్కడి పద్ధతులన్నీ యధావిధిగా పాటించాల్సిందేనని గాంధీ భావించాడు. తన జుట్టు కూడా కత్తిరించడమే తనకి ఇష్టమని గాంధీ రాసి ఇచ్చిన తర్వాత జైలువార్డెన్ ఆయనకు కత్తెర, వగైరా సాధనాలు ఇచ్చాడు. గాంధీ ఇంకా ఒకరిద్దరు ఖైదీలు రోజుకు రెండు గంటలపాటు జుట్టు కత్తిరించే పని చేసేవారు.

ఆయనను ఆగాఖాన్ ప్యాలెస్‌లో బంధించినప్పుడు ఆయనతోపాటు ఒక ఆశ్రమవాసి ఉండేది. ఆమె చుండ్రుతో బాధపడుతూ ఉండేది. ఒక రోజు యథాలాపంగా మాట్లాడుతూ "బాపూ, నేను నా జుట్టు కత్తిరించుకొని చుండ్రును వదిలించుకొనేందుకు మందు రాసుకోనా?" అని అడిగింది. వెంటనే గాంధీ, "మంచిది, ఇప్పుడే కానివ్వు. ఏదీ కత్తెర పట్టుకురా," అన్నాడు. కత్తెర తేవడం, ఆమె జుట్టు నేలకు రాలడం నిముషాల్లో జరిగిపోయాయి. అప్పుడు మాహాత్మా వయస్సు 75 సంవత్సరాలు. స్వదేశీ ఉద్యమంలో ఉండగా, గాంధీ విదేశీ రేజర్లను వదలి, స్వదేశంలో తయారైనవాటిని వాడటం మొదలు పెట్టాడు. నిదానంగా ఆయన అద్దం, సబ్బు, బ్రష్షు లేకుండానే గడ్డం చేసుకోగలిగేవాడు. ఇది గడ్డం చేసుకొనే కళలో గొప్ప అభివృద్ధి అని ఆయన ఉద్దేశం. ఆయన ఒక క్షురకుడికి ఇలాంటి సర్టిఫికెట్ ఇచ్చాడు: "మున్నీలాల్ నాకు చాలా బాగా గడ్డం చేశాడు. అతడు దేశవాళీ కత్తులనే వాడతాడు, సబ్బు లేకుండానే గడ్డం చేస్తాడు." ఆయన సహచరుల్లో కొంతమందికి ఈ పద్ధతి అలవాటయ్యింది. దీనివల్ల ఎవరి గడ్డం వారు చేసుకోవడం క్రమంగా ఆమోదయోగ్యంగా మారడం వారు గమనించారు.

గ్రామాల్లో క్షౌరవృత్తి చేసేవాళ్లు శస్త్రచికిత్సకులుగా పనిచేస్తారని, ముల్లును బయటికి తీయడంలోగాని, కురుపులను కోయడంలోగాని మంచినైపుణ్యం ప్రదర్శిస్తారని గాంధీకి తెలుసు. కానీ ఆ పనులను వారు మురికి గుడ్డలతో, అపరిశుభ్రమైన పరికరాలతో చేయడమే ఆయన భరించలేకపోయాడు. సేవాగ్రామ్‌లో ఒకసారి ఒక హరిజన* సహాయకుడు "నేను వార్ధా వెళ్ళాలి," అని అడిగాడు.

"ఎందుకు?" అంటే, "గడ్డం చేయించుకోవడానికి," అన్నాడు.

"ఈ ఊళ్ళో గడ్డం చేయించుకోవడం కుదరదా?"

"ఇక్కడి పై కులం క్షురకులు నాకు గడ్డం చేయరు. ఈ ఉళ్ళో హరిజన క్షురకుడు లేడు."

"అలా అయితే నేనిక ఆ క్షురకుడితో గడ్డం ఎలా చేయించుకుంటాను?" అని గాంధీ అప్పటి నుండీ ఆ ఊళ్ళో క్షురకునితో వద్ద పని చేయించుకోవడం మానేశాడు. ఆయన ప్రతి రోజూ గ్రామగ్రామానికీ తిరిగే రోజుల్లో స్వయంగా గడ్డం చేసుకొనేందుకు సమయం సరిపోక అప్పుడప్పుడూ క్షురకుని వద్ద గడ్డం చేయించుకుంటూ ఉండేవాడు.

---

* భారతదేశంలోని అంటరాని కులాలకు గాంధీ 'హరిజనులు' అని పేరు పెట్టాడు. ఇప్పుడు వీళ్లని దళితులు అంటున్నారు.

ఖాదీ యాత్రలో ఉండగా ఆయన ఖాదీ ధరించిన క్షురకునివద్దే పనిచేయించుకొనేవాడు. అలాంటి క్షురకులను వెదకలేక వాలంటీర్లు నానా అవస్థలు పడేవారు. "మనం మన ఉద్యమంలో బట్టలు ఉతికేవాళ్లను, క్షవరం చేసేవాళ్లను భాగస్వాములుగా చేసుకు తీరాలి. ఊసులాడడంలో క్షురకులు మంచినేర్పరులు. వాళ్ళు మన స్వదేశీ సందేశాన్ని బాగా ప్రచారం చెయ్యగలరు," అని గాంధీ వాలంటీర్లకు బోధించాడు. ఇంకో సందర్భంలో గాంధీ ఒడిశాలో పర్యటిస్తూ క్షురకుని కోసం ఎదురుచూస్తున్నాడు. ఒక మహిళ క్షురకుని పొది పట్టుకొని వచ్చింది. ఆమె బరువైన చెవిదుద్దులు, ముక్కుపుడక, కంఠహారం, కడియాలు, లక్క గాజులు ధరించి ఉంది. "అయితే నాకు గడ్డం చేసేది నువ్వేనా?" గాంధీ అడిగాడు. ఆమె నవ్వుతూ తలూపి కత్తికి పదును పెట్టడం ప్రారంభించింది. "ఈ నగలన్నీ ఎందుకు పెట్టుకొచ్చావు? వాటిని పెట్టుకోవడం వల్ల నువ్వేమీ అందంగా కనపడటంలేదు. అవన్నీ మురికి పట్టి అసహ్యంగా ఉన్నాయి," అన్నాడు గాంధీ. నీళ్ళు నిండిన కళ్ళతో ఆమె "ఈ ప్రత్యేక సందర్భం కోసం నేను వీటన్నిటినీ అరువు తెచ్చుకున్నాను. నీలాంటి గొప్పవాడికి గడ్డం చేసేందుకు వచ్చేటప్పుడు మంచి ఆభరణాలు లేకుండా ఎలా రాగలను?" అంది. గాంధీకి క్షవరం చేశాక ఆయన ఇచ్చిన డబ్బులు ఆయన కాళ్ళ దగ్గరే ఉంచి, నమస్కారం పెట్టి ఆమె వెళ్ళిపోయింది.

## శుభ్రం చేసేవాడు

రాజ్‌కోట్‌లోని గాంధీ తండ్రిగారింట్లో 'ఉకా' అనే పనివాడు మరుగుదొడ్లు శుభ్రం చేసేవాడు. గాంధీ ఎప్పుడైనా 'ఉకా'ను ముట్టుకుంటే పుతలీబాయి అతడిని వెంటనే స్నానం చేయమనేది. మామూలుగా చాలా నిదానంగా, విధేయుడుగా ఉండే గాంధీ ఆ మాటకు మాత్రం ఒప్పుకొనేవాడు కాదు. ఆ పన్నెండేళ్ళ కొడుకు "మన మలాన్ని శుభ్రం చేయడంద్వారా ఉకా మనకెంతో సేవచేస్తున్నాడు. అలాంటివాడిని ముట్టుకుంటే నేను అపవిత్రం ఐపోవడం ఏమిటి? నేను నీమాట కాదనాలని కాదుగానీ రామాయణంలో రాముడు ఛండాలుడైన గుహుడిని కౌగలించుకోలేదా?" అని తల్లితో వాదించేవాడు. ఈ వాదనకు పుతలీబాయి వద్ద సమాధానం ఉండేదికాదు.

గాంధీ మరుగుదొడ్లు శుభ్రం చేసే పనిని దక్షిణాఫ్రికాలో నేర్చుకున్నాడు. అక్కడ స్నేహితులు ఆయనను 'గొప్ప పాకీవాడు' అనేవారు. అక్కడ మూడేళ్ళున్న తర్వాత తన భార్యాపిల్లలను దక్షిణాఫ్రికా తీసుకెళ్ళేందుకు ఆయన భారతదేశానికి వచ్చాడు.



ఆ సమయంలో ముంబయి ప్రెసిడెన్సీలో ప్లేగువ్యాధి వ్యాపించి ఉంది. అది రాజ్‌కోట్‌కు కూడా వ్యాపించే అవకాశం ఉంది. వెంటనే గాంధీ రాజ్‌కోట్‌లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం కోసం సేవలందించేందుకు సిద్ధపడ్డాడు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్ళి మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని గురించి బోధించాడు. చీకటిగా, మురికితో కంపుకొట్టే మరుగుదొడ్లు చూసి ఆయన కంపించిపోయాడు. కొన్ని సంపన్న కుటుంబాలలో గోతులనే మరుగుదొడ్లుగా వాడేవారు. ఆ కంపు దుర్భరంగా ఉండేది. కానీ వాటిని మార్చుకొనేందుకు వారు ఆసక్తి చూపలేదు. పేదవారైన అంటరానివారే శుభ్రమైన ఇళ్ళల్లో ఉండేవారు. వారు గాంధీ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించేవారు. మూత్రానికి, మలానికి వేర్వేరు బకెట్లు వాడాలని గాంధి సూచించాడు. దానివల్ల పరిస్థితులు మెరుగుపడ్డాయి.

గాంధీజీ కుటుంబానికి రాజ్‌కోట్‌లో మంచి పేరు ప్రఖ్యాతులు ఉండేవి. గాంధీ తండ్రి, తాతలు చాలాకాలం రాజ్‌కోట్ సంస్థానంలోనూ, ఇతర సంస్థానాల్లోనూ దివాన్లుగా పనిచేశారు. ఒక ప్రధానమంత్రి కొడుకు, బారిష్టరు అయిన వ్యక్తి ఇంటింటికీ వెళ్ళి మరుగుదొడ్లు పరిశీలించడమంటే అప్పటి కాలానికి అదెంతో గొప్పసాహసం. అవసరమైన సమయాల్లో నైతికమైన ధైర్యం ప్రదర్శించడంలో గాంధీ ఎప్పుడూ విఫలంకాలేదు. ఆయన అనేక పాశ్చాత్య పోకడలను విమర్శించేవాడు, కానీ

పారిశుద్ధ్యాన్ని పాశ్చాత్యుల వద్ద నేర్చుకున్నానని అనేకసార్లు చెప్పేవాడు. అదేరకమైన పరిశుభ్రతను భారతదేశానికి పరిచయం చేయాలని ఆయన భావించేవాడు.

దక్షిణాఫ్రికానుండి భారతదేశానికి రెండోసారి వచ్చిన ఆయన కోల్‌కతాలో జరుగుతున్న కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యాడు. దక్షిణాఫ్రికాలో భారతీయులు పడుతున్న అవమానాలగురించి వివరించడానికి ఆయన వచ్చాడు. కాంగ్రెస్ శిబిరంలో పారిశుధ్య పరిస్థితి దారుణంగా ఉంది. కొంతమంది సభ్యులు వారి గదులముందున్న వరండాలనే మరుగుదొడ్లుగా వాడేస్తున్నారు. ఇతరులెవరూ దానికి అభ్యంతరం చెప్పటం లేదు. కానీ గాంధీ వెంటనే ప్రతిస్పందించాడు. వాలంటీర్లతో సంప్రదించగా "అది పారిశుద్ధ్య పనివాళ్ళ పని, మాది కాదు," అని సమాధానం ఇచ్చారు. గాంధీ ఒక చీపురు అడిగి తీసుకొని ఆక్కడున్న కాలుష్యాన్నంతా శుభ్రం చేయడం ప్రారంభించాడు. అప్పుడు ఆయన సూటు ధరించి ఉన్నాడు. వాలంటీర్లు ఆయన పనికి ఆశ్చర్యపోయారు కానీ ఎవ్వరూ సహాయం చెయ్యడానికి రాలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత గాంధీ భారత జాతీయ కాంగ్రెస్‌కు మార్గదర్శకుడిగా మారినప్పుడు వాలంటీర్లు 'పారిశుద్ధ్య దళం'గా ఏర్పడి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఒక సందర్భంలో ఐతే కేవలం బ్రాహ్మణులే 'పారిశుద్ధ్య దళం'లో పనిచేశారు. హరిపుర కాంగ్రెస్ మహాసభలలో పారిశుద్ధ్య పని చేయడానికి వేయిమంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. సమాజంలో ప్రత్యేకంగా కొద్దిమందిని పారిశుధ్య పనివారుగా, అంటరానివారుగా ముద్రవేయడం గాంధీకి నచ్చేదికాదు. ఆయన భారతదేశం నుంచి అంటరానితనాన్ని పారద్రోలాలనుకునేవాడు. దక్షిణాఫ్రికాలో భారతీయుల మురికి అలవాట్లు చూసి అక్కడి తెల్లవారు వారిని అసహ్యించుకొనేవారు. గాంధీ వారి నివాసాలకు వెళ్ళి ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోమని విజ్ఞప్తి చేశాడు. ఈ అంశంపై ఆయన బహిరంగ సమావేశాల్లో మాట్లాడాడు, పత్రికల్లో వ్యాసాలు రాశాడు. డర్బన్‌లో గాంధీ ఉండే ఇల్లు పాశ్చాత్య పద్ధతిలో నిర్మించబడింది. స్నానాల గదిలో నీళ్ళు బయటికి పోయే మార్గం ఉండేది కాదు. మల విసర్జనకు కమోడ్లు, కుండలు వాడేవారు. తనతోపాటు నివశించే గుమస్తాల మరుగును కూడా కొన్నిసార్లు గాంధీనే శుభ్రం చేసేవాడు. కస్తూర్బాతోనూ ఆ పని చేయించేవాడు. చిన్నవారైన తన పిల్లలకు కూడా ఆ పని నేర్పాడు. ఒకసారి తక్కువ కులానికి చెందిన గుమస్తా వాడిన మరుగుదొడ్డిని శుభ్రం చేయడానికి కస్తూర్బా తటపటాయించింది. అది చూసి గాంధీ ఆమెపై కోపగించుకున్నాడు. కులభేదాలు పాటించేటట్లైతే ఇంట్లోంచి వెళ్ళిపోవాలని సూచించాడు. ఒక సందర్భంలో సబర్మతీ ఆశ్రమంలోకి అంటరాని కులానికి చెందిన

దంపతులను అనుమతించినందుకు సన్నిహితులే ఆయనను సాంఘికంగా బహిష్కరించారు కూడా.

ఒక దక్షిణాఫ్రికా జైలులో మరుగుదొడ్లు, స్నానాలదొడ్లు కడిగేందుకు గాంధీ ముందుకొచ్చాడు. తర్వాత నుంచి జైలు అధికారులు ఆయనకు శుభ్రం చేసే పనినే అప్పగించేవారు.

1915లో 20 ఏళ్ళు దక్షిణాఫ్రికాలో నివశించాక 46 సంవత్సరాల వయసులో గాంధీ భారతదేశానికి కుటుంబంతో సహా తిరిగొచ్చాడు. అదే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళాకు వెళ్ళినప్పుడు అతడు, అతడి 'ఫీనిక్స్ బాయ్స్' అక్కడ పారిశుద్ధ్య పని చేశారు. అదే ఏడాది గాంధీ పూనాలోని సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ* క్వార్టర్లను సందర్శించాడు. ఒక రోజు ఉదయం గాంధీ అక్కడ మరుగుదొడ్లను శుభ్రం చేయడాన్ని ఆ కాలనీవాసులు చూశారు. వారికి అది నచ్చలేదు. కానీ ఇలాంటి పనులతోనే స్వాతంత్ర్యం సంపాదించవచ్చని గాంధీ విశ్వసించాడు. ఆయన అనేకసార్లు భారతదేశ యాత్రలు చేశాడు. ఎక్కడికి వెళ్ళినా పారిశుద్ధ్యలేమి ఆయనకు ఏదో ఒక రూపంలో ఎదురుపడేది. సత్రాలలోనూ, రైల్వేస్టేషన్లలోనూ మరుగుదొడ్లు, మూత్రశాలల కంపు దుర్భరంగా ఉండేది. పేదలైన గ్రామీణులు ఉపయోగించే రోడ్లు, వారి ఎడ్లు ఎప్పుడూ సక్రమ నిర్వహణలో ఉండేవి కావు. పవిత్రజలాశయాల్లో నీరు, పరిసరాలు ఎంత మురికిగా వున్నాయో పట్టించుకోకుండానే ప్రజలు వాటిల్లో మునకలు వేయడం ఆయన గమనించాడు. వారే నదుల గట్లను మురికి చేస్తుండేవారు. వారే ఆ నదిలో స్నానం చేస్తుండేవారు. పవిత్ర కాశీవిశ్వనాధ దేవాలయంలోని పాలరాతి నేల అక్కడ చెల్లాచెదురుగా పారవేసిన మురికిపట్టిన వెండి చిల్లర నాణాలతో నిండి ఉండటం చూసి ఆయన ఎంతో బాధపడ్డాడు. దేశంలో అనేక పవిత్ర దైవస్థలాల ప్రధాన మార్గాలు ఇరుగ్గా, మురిగ్గా, జారుడుగా ఎందుకున్నాయా అని ఆయన ఆశ్చర్య పోయాడు. రైళ్ళల్లో ప్రయాణీకులు రైలుపెట్టెలను భయంకరంగా మురికి చేయడాన్ని ఆయన గట్టిగా ఖండించాడు. భారతదేశంలో బూట్లు, చెప్పులు ధరించగల స్థోమత కొద్దిమందికే ఉన్నా, చెప్పుల్లేకుండా బజార్లో నడవలేనంత అపరిశుభ్రంగా వీధులను ఎందుకు ఉంచుతారోనని ఆయన ఆశ్చర్యపోయాడు. ముంబయిలాంటి నగరాలలో కూడా వీధుల్లో నడుస్తుంటే పక్కనే ఉన్న ఇళ్ళల్లోంచి ఎవరైనా మీదకు ఉమ్మివేస్తారేమోనని ప్రజలు భయపడటం ఆయన గమనించాడు.

---

* ఈ సంస్థను గోఖలే 1905లో పూనాలో స్థాపించాడు. మానవ, సామాజిక ప్రగతితో పాటు స్వాతంత్రం సాధించటం దీని ఉద్దేశం.

పురపాలక సంఘాల సమావేశాల్లో ఆయన తరచుగా "మీ విశాలమైన రోడ్లు, అద్భుతమైన దీపాలవ్యవస్థ, అందమైన పార్కులకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. అయితే ఆదర్శవంతమైన మరుగుదొడ్లు, 24 గంటలూ పరిశుభ్రంగా ఉండే రోడ్లూ లేకుండా అది పట్టణం అనిపించుకోదు. అనేక పురపాలక సంఘాలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య పారిశుద్ధ్యం. మీ పారిశుద్ధ్య పనివారు ఎలాంటి పరిస్థితులలో జీవిస్తున్నారో మీరెప్పుడైనా గమనించారా?" అని ప్రసంగించేవాడు.

ప్రజలతో "మీ చేతుల్లోకి చీపురు, బక్కెట్టు తీసుకోందే మీ పట్టణాలను, నగరాలను, శుభ్రం చేయలేరు," అని చెప్పేవాడు. ఆయన ఒక ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసినప్పుడు "మీరు మీ విద్యాసంస్థను ఆదర్శవంతం చెయ్యాలంటే మీ విద్యార్థులకు పుస్తకాలలో ఉన్న చదువు చెప్పడంతోపాటు వారిని మంచి వంట వాళ్ళుగా, పారిశుద్ధ్య పనివారుగా తయారుచెయ్యాలి," అని ఉపాధ్యాయులకు చెప్పాడు. విద్యార్థులకు ఆయన సలహా ఏమిటంటే "మీరు మీ సొంత పారిశుద్ధ్య పనివారైనప్పుడే మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. యుద్ధంలో వీరుడిగా పతకం పొందటానికి ఎంత ధైర్యం కావాలో పారిశుద్ధ్య పనిచేయడానికీ అంతే ధైర్యం కావాలి.

ఆయన ఆశ్రమానికి దగ్గరలో ఉన్న గ్రామస్థులు మలాన్ని మట్టితో కప్పేందుకు నిరాకరించారు. "ఇది తప్పకుండా పాకీపనే. మలంవంక చూడటమే పాపం, దాన్ని మట్టితో కప్పిపెట్టడం అంతకంటే ఎక్కువ పాపం," గ్రామస్తులు అనేవాళ్లు. అనేక గ్రామాల్లో పారిశుద్ధ్య పనిని తానే స్వయంగా పర్యవేక్షించేవాడు గాంధి. వారికి ఉదాహరణగా నిలవడంకోసం కొన్ని నెలలపాటు స్వయంగా బకెట్టు, చీపురు తీసుకొని గ్రామాలకు వెళ్ళేవాడు. స్నేహితులు, అతిథులు ఆయనతోపాటు వెళ్ళేవారు. వారంతా బకెట్లనిండా మలాన్ని తెచ్చి గోతుల్లో నింపి వాటిని మట్టితో పూడ్చేవారు. వ్యర్థాలను సరైన పద్ధతిలో నాశనం చేయడం కూడా ఒక శాస్త్రం అని గాంధీ భావించేవారు.

ఆశ్రమాలలో పారిశుద్ధ్య పనంతా ఆశ్రమవాసులే చేసేవారు. గాంధీ వారికి మార్గదర్శనం చేసేవాడు. వివిధ జాతులు, మతాలు, రంగుల ప్రజలు ఆశ్రమాలలో ఉండేవారు. కానీ ఆశ్రమంలో ఎక్కడ చూసినా కొంచెం ధూళి కూడా కనిపించేది కాదు. కూరగాయల తొక్కలు, ఆహార వ్యర్థాలు, ఒక ఎరువుల గుంటలో వేసేవారు. సాధారణ చెత్తనంతా గోతుల్లో కప్పేవారు. మలాన్నికూడా గోతుల్లో పాతి తర్వాతి కాలంలో ఎరువుగా వాడేవారు. స్నానశాలలూ, ఇతర చోట్లనుండీ వచ్చే మురికి నీటిని మొక్కల పెంపకానికి వాడేవారు. పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేని ఆశ్రమంలో కూడా ఎక్కడా ఈగలూ, దోమలు, మురుగువాసనా కనపడేవి కావు. గాంధీ, ఆయన

సహచరులూ పారిశుద్ధ్య పనిని వంతులవారీగా నిర్వహించేవారు. ఆయన బకెట్ మరుగుదొడ్లను, రెండు గుంతల మరుగుదొడ్లను పరిచయంచేశాడు. సందర్శకులందరికీ తన ఆవిష్కారాన్ని గర్వంగా ప్రదర్శించేవాడు. ధనికులు, పేదలు, నాయకులు, అనుచరులు, భారతీయులు, విదేశీయులు, అందరూ ఇవే మరుగుదొడ్లు వాడాల్సిందే. ఈ ప్రయోగం వల్ల ఆశ్రమంలో నివశిస్తున్న సాంప్రదాయ కుటుంబాల పురుషులు, మహిళలకు పారిశుద్ధ్య పనిమీదున్న ఏహ్యాభావం తొలగిపోయింది. కొద్దిపాటి పారిశుద్ధ్య పనైనా తనకు చేసే అవకాశం లభిస్తే గాంధీ సంతోషించేవాడు. వ్యక్తుల పరిశుభ్రతను వారి మరుగుదొడ్ల పరిశుభ్రతను బట్టి అంచనా వేయవచ్చని ఆయన భావించేవాడు. 76 సంవత్సరాల వయసులో కూడా ఆయన “నేను వాడుతున్న మరుగుదొడ్డి కొంచెం కూడా మురికి లేకుండా వాసన లేకుండా తళతళలాడుతుంది. నేనే దాన్ని స్వయంగా శుభ్రం చేసుకుంటాను,” అని గర్వంగా చెప్పేవాడు. చాలా సందర్భాలలో ఆయన తనను తాను పారిశుద్ధ్య పనివాడుగా చెప్పుకొనేవాడు. పారిశుద్ధ్య కార్మికుడుగా మరణించడం తనకు అపరిమితమైన తృప్తినిస్తుందని కూడా చెప్పేవాడు. కుదిరితే తనను కూడా అంటరానివారితోపాటు సాంఘిక బహిష్కరణకు గురిచేయమని సాంప్రదాయవాదులను సవాలు చేశాడు.

ఆయన పారిశుద్ధ్య పనివారి నివాసాలకు వెళ్ళేవాడు. వారు తమ కష్టాలను ఆయనతో నిర్భయంగా చెప్పుకొనేవారు. వారు చేసేది ఏమాత్రం సిగ్గుపడాల్సింది కాదని ఆయన వారికి భరోసా ఇచ్చేవాడు. తాగుడుని, చనిపోయిన జంతువుల మాంసం తినే అలవాటునీ మానమని సలహా ఇచ్చేవాడు. ఆయన పారిశుద్ధ్య పనివారి సమ్మెను ఎప్పుడూ బలపరచలేదు. పారిశుద్ధ్య పనివాడు ఒక్క రోజు కూడా తనపని మానకూడదని ఆయన భావించేవాడు.

‘హరిజన్’ పత్రికలో ఆయన ఆదర్శవంతుడైన పారిశుద్ధ్య పనివాడెలా ఉండాలో ఇలా నిర్వచించాడు, “సరైన తరహా మరుగుదొడ్డిని ఎలా నిర్మించాలో, దాన్ని ఎలా శుభ్రం చేయాలో అతనికి తెలిసి ఉండాలి. అతనికి మలం యొక్క దుర్వాసన ఎలా పోగొట్టాలో, వివిధ రకాల సూక్ష్మక్రిములను ఎలా క్రియారహితం చేయాలో తెలిసి ఉండాలి. అలాగే మలాన్ని, మూత్రాన్ని ఎలా ఎరువుగా మార్చాలో కూడా అతనికి తెలిసి ఉండాలి.” పాకీపనిని ఒక గతిలేక చేసే ఉద్యోగం స్థాయి నుంచీ ఒక అనివార్యమైన సామాజిక కార్యక్రమం స్థాయికి పెంచాలని ఆయన ఆశించాడు.

ఖాదీ యాత్రలో భాగంగా ఒకసారి గాంధీ మాట్లాడే బహిరంగ సభకు హాజరయ్యేందుకు పారిశుద్ధ్య పనివారిని అనుమతించలేదని ఆయనకు తెలిసింది.

వెంటనే ఆయన "మీ డబ్బును, ఉపన్యాసాలను మీ దగ్గరే ఉంచుకోండి. నేను అంటరాని వారితోనే సమావేశం నిర్వహించేందుకు వెళుతున్నాను. ఇష్టమైనవారు ఎవరైనా అక్కడకు రావచ్చు," అని నిర్వాహకులతో చెప్పాడు.

తన మరణానికి రెండేళ్ళ ముందు కూడా ఆయన బొంబాయి, ఢిల్లీ నగరాల్లోని పారిశుద్ధ్య పనివారి ఇళ్లల్లో కొంతకాలం ఉన్నాడు. వారితోపాటే నివశించి వారు తినే తిండే తినాలనుకున్నాడు. కానీ వయోభారం వల్ల అది సాధ్యం కాలేదు. పైగా మహాత్ముని మీద కొన్ని ప్రత్యేక సౌకర్యాలు రుద్దారు.

గాంధీ ఒకసారి వైస్రాయిని కలిసేందుకు సిమ్లా వెళ్ళాడు. అక్కడి పారిశుద్ధ్య పనివారి నివాసాలను పరిశీలించేందుకు తన సహచరుడిని పంపించాడు. అవి జంతువులు ఉండటానికి కూడా పనికిరానంత దుస్థితిలో ఉన్నాయని తెలిసి బాధపడ్డాడు. "నేడు మనం పారిశుద్ధ్య పనివారిని జంతువుల స్థాయికి దిగజార్చాం. వారు తమ మానవ హెూదాని పణంగాపెట్టి కొద్దిపైసలు సంపాదిస్తున్నారు. మరుగుదొడ్డి గోడనీడ కింద తచ్చట్లాడుతూ, మురుగు మధ్య భోజనం చేస్తున్న వారిని చూస్తే ఎవరి గుండె ఐనా బద్దలైపోతుంది." మలంతో నిండిన తట్టను నెత్తిన పెట్టుకుని మోస్తున్న పారిశుద్ధ్య పనివారిని చూస్తే అయన చాలా ఇబ్బంది పడేవారు. సరైన పరికరాలు వాడటం ద్వారా తన శరీరం మైలపడకుండానే పారిశుద్ధ్య పనిని ఎలా నిర్వహించవచ్చో ఆయన వారికి చెప్పేవాడు. అదొక కళ. తాను మైలపడకుండా ఆయన ఆ పని చేసి చూపించాడు. ఒకసారి ఒక విదేశీయుడు గాంధీని అడిగాడు: "మిమ్మల్ని ఒక రోజుపాటు భారత దేశానికి వైస్రాయిని చేస్తే ఏంచేస్తారు?"

"వైస్రాయి భవనంలో ఎన్నో ఏళ్ళుగా నిర్లక్ష్యానికి గురౌతూ అపరిశుభ్రంగా వున్న పారిశుద్ధ్య పనివారి నివాసాలను శుభ్రం చేస్తాను."

"మీ పదవీ కాలాన్ని మరో రోజు పొడిగిస్తే?"

"మర్నాడు కూడా నేను అదే పని చేస్తాను."

# చెప్పులు కుట్టేవాడు

63 సంవత్సరాల వయసులో గాంధీని వల్లభభాయి పటేల్‌తో కలిపి ఎరవాడ జైలులో పెట్టారు. వల్లభభాయికి ఒక జత చెప్పులు అవసరమైనాయి. కానీ జైలులో చెప్పులు కుట్టేవాళ్లు అందుబాటులో లేరు. అప్పుడు గాంధీ "మంచి తోలు దొరికితే



మీకు చెప్పులు తయారుచేస్తాను. నేను చాలా రోజుల క్రితం నేర్చుకున్న చెప్పులు కుట్టే విద్య సరిగా గుర్తుందో లేదో ఇప్పుడు పరీక్షించుకోవాలి. ఒకప్పుడు నేను చెప్పులు బాగా కుట్టేవాడిని. నా పనితనానికి నమూనా సోదెపూర్‌లోని ఖాదీ ప్రతిష్ఠాన్ మ్యూజియంలో చూడొచ్చు. నేను ఆ చెప్పులని ఒకరి కోసం పంపాను. కానీ ఆయన వాటిని ఉపయోగించకుండా భద్రపరిచాడు. నేను టాల్‌స్టాయ్ క్షేత్రంలో* ఉండగా అలాంటి జతలు చాలా తయారుచేశాను," అన్నాడు.

ఆ సమయంలో, అంటే 1911లో గాంధీ తన మేనల్లుడికి రాసిన లేఖలో "నేను ప్రస్తుతం చెప్పులు కుట్టడంలో తీరిక లేకుండా ఉన్నాను. ఇప్పటికి 15 జతలు తయారు చేశాను. నీకు కొత్త జత కావాలంటే సైజు పంపించు," అని రాశాడు. ఆయన చెప్పులు కుట్టేకళను దక్షిణాఫ్రికాలో కాలెన్‌బాక్** అనే అంకితభావంగల జర్మన్ స్నేహితుని నుండి నేర్చుకున్నాడు. ఆ తర్వాత గాంధీ చెప్పులు కుట్టడంలో ఇతరులకు కూడా శిక్షణనిచ్చాడు. ఆయన ఆ నైపుణ్యంలో గురువునే మించిపోయాడు కూడా. గాంధీ తయారు చేసిన చెప్పులు, బూట్లు ఆశ్రమం బయట అమ్మేవారు. ఆ

---

* గాంధీ, కాలెన్‌బాక్‌లు దక్షిణాఫ్రికాలో 1910లో దీనిని స్థాపించారు. ఇది 1913 వరకు నడిచింది. అనేక విద్య, జీవన సంబంధ ప్రయోగాలు ఇక్కడ జరిగాయి.

** హెర్మన్ కాలెన్‌బాక్ (1871–1945) జర్మన్ యూదుడు, దక్షిణాఫ్రికాలో భవన నిర్మాణ శిల్పి.

సమయంలో ప్యాంటు మీద శాండల్ బూట్లు ధరించడాన్ని గాంధీ ఫాషన్‌గా మార్చాడు. వాటికి పైభాగం సాధారణ బూట్లలా మూసి ఉండదు కాబట్టి ఉష్ణదేశాల్లో వేసవిలో ధరించేందుకు సుఖంగా ఉంటాయి. శీతాకాలంలో మేజోళ్ళతో కలిపి ధరిస్తే చలి నుంచి రక్షణ పొందవచ్చు.

సర్దార్ పటేల్, జవహర్‌లాల్ ఒకసారి గాంధీ సలహాకోసం సేవాగ్రామ్‌కు వెళ్ళారు. ఆక్కడ ఆయన వాళ్ళకి ఒక ఆశ్రమవాసుల సమూహానికి శిక్షణ ఇస్తూ కనపడ్డాడు. "పట్టీలు ఇక్కడుండాలి. కుట్లు ఇక్కడ, ఇదుగో ఇలా వెయ్యాలి, మడమల వద్ద వత్తిడి చాలా ఎక్కువ ఉంటుంది కాబట్టి తోలుని అడ్డముక్కలుగా వేయాలి," అంటూ వాళ్ళు చేసిన పొరపాట్లని సరిచేస్తున్నాడు. నాయకులలో ఒకరు "వాళ్ళు మా సమయాన్ని దోచుకుంటున్నారు," అని ఫిర్యాదు చేశారు. "పాఠాలన్నీ వాళ్ళే నేర్చుకుంటున్నారని అసూయ వద్దు. కావాలంటే మంచి చెప్పుల జత ఎలా తయారు చేస్తారో మీరు కూడా చూడొచ్చు కదా," అని గాంధీ బదులిచ్చాడు.

ఇంకో రోజు గాంధీ, కొంత మంది సహచరులు కలసి ఒక చచ్చిన ఎద్దు చర్మాన్ని గ్రామీణ చర్మకారులు ఎలా వలుస్తారో పరిశీలించాడు. వాళ్ళు సాధారణ దేశవాళీ కత్తితో కొంచెంకూడా పాడవకుండా తోలు ఒలవడం గాంధీని ఆకట్టుకుంది. ఆ పనిని గ్రామీణ చర్మకారులకంటే బాగా చేయడం పేరుపొందిన శస్త్రచికిత్స నిపుణులకు కూడా సాధ్యం కాదని ఆయన కితాబిచ్చాడు. మానవ శరీరాలని కోసి, చర్మాన్ని తీసే వైద్య విద్యార్థులు కూడా ఆయన దృష్టిలో చర్మకారులే. ఒకపక్క వైద్యవృత్తిని గౌరవిస్తూనే మరొక పక్క పారిశుద్ధ్య పనివారి వృత్తిని, చర్మకారుల వృత్తిని అసహ్యించుకుంటున్నాం. వాళ్లను హిందువులు అంటరానివాళ్ళుగా చూస్తున్నారు.

గాంధీ బూట్లు కుట్టడం నేర్చుకోవడంతో ఆగిపోలేదు. ఆయన తోలు తయారీలో కూడా నిపుణుడు కావాలనుకున్నాడు. ఎందుకంటే ప్రపంచంలో చాలామంది తోలు చెప్పులు ధరిస్తున్నారు కానీ ఆ తోలు మాత్రం ఆరోగ్యంగా ఉన్న ఆవులను, గేదెలను, మేకలను, గొర్రెలను చంపడం ద్వారా సేకరిస్తున్నారు. గాంధీ అహింస మీద విశ్వాసం ఉన్నవాడు. మృత్యు ముఖంలో ఉన్న భార్యకు నయం చేయడానికి కూడా మాంసాహార టీ ఇవ్వని, అనారోగ్యంతో ఉన్న కుమారుని వైద్యానికి కూడా గుడ్లు తినడానికి అంగీకరించని వ్యక్తి. అటువంటిది చెప్పుల తయారీకి జంతువులను చంపడానికి ఎలా ఒప్పుకుంటాడు? కానీ ఆయనకు తోలు కావాలి.

సహజ మరణం పొందిన పశువుల చర్మం మాత్రమే ఉపయోగించాలని ఆయన నిర్ణయించాడు. అలాంటి తోలుతో చేసిన చెప్పులు, బూట్లను 'అహింసా పాదరక్షలు'

అనేవారు. మృతకళేబరాల చర్మాన్ని పదును పెట్టడం (చెప్పులు కుట్టేందుకు వీలుగా తయారుచెయ్యడం) కంటే, వధించిన జంతువుల చర్మాలకు పదునుపెట్టడం సులభం. అందుకే తోళ్ళ పరిశ్రమల వాళ్ళు 'అహింసా తోలు' సరఫరా చేసేవారు కాదు. అందువల్ల గాంధీ తోలుకు పదునుపెట్టే పని నేర్చుకోక తప్పలేదు.

ప్రతి యేటా 9 కోట్ల రూపాయల విలువైన ముడి తోళ్ళను భారతదేశం నుంచి ఎగుమతి చేస్తున్నారని గాంధీకి తెలిసింది. విదేశాలలో ఆ తోలుకు శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేశాక కోట్లాది రూపాయల తోళ్ళ వస్తువులను భారతదేశానికి దిగుమతి చేసుకుంటున్నారు. దీనివల్ల కేవలం డబ్బు నష్టమేకాకుండా తోళ్ళను శుద్ధి చెయ్యడంలోనూ, మంచి తోలు వస్తువులు తయారు చెయ్యడంలోనూ మనకున్న నైపుణ్యాలకూ, తెలివితేటలకూ విలువ లేకుండా పోతోంది. నూలు వడికేవారు, నేతపని వారిలాగే, అనేక మంది తోళ్ళను శుభ్రం చెయ్యడం, తోలు వస్తువులు తయారుచేసేవారు వారి జీవనోపాధి కోల్పోయారు. తోళ్ళను శుభ్రం చెయ్యడం అనేది నీచమైనపని ఎప్పటి నుంచి అయ్యిందా అని గాంధీ ఆశ్చర్యపోయాడు. ప్రాచీనకాలంలో అది నీచమైన పని అయ్యుండే అవకాశం లేదు. కానీ ఇప్పుడు దాదాపు పది లక్షలమంది తోలును శుభ్రం చేసే పనిచేస్తూ, అంటరాని వారుగా పరిగణింపబడుతూ ఉన్నారు. ఉన్నత వర్గాలవారు వీరిని హీనంగా చూస్తారు. చదువు, కళ, పరిశుభ్రత, గౌరవాలకు దూరంగా వీళ్లు బతుకులు ఈడుస్తున్నారు. తోలు పనివారు, చెప్పులు కుట్టేవారు, పారిశుద్ధ్య పనివారు ఉపయోగకరమైన పనులు చేస్తూ సమాజానికి సేవ చేస్తున్నారు. కానీ కులాల పట్టింపుగల జాతిలో కొంతమంది దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. ఇతర దేశాల్లో ఏ మనిషీ తోలుపని, చెప్పులు కుట్టేపని ఎంచుకోవడంవల్ల పేదవాడు, నిరక్షరాస్యుడు, అంటరానివాడు కాడు.

ఈ గ్రామీణ పరిశ్రమను పునరుజ్జీవింపజేసేందుకు గాంధీ అనేక బహిరంగ విజ్ఞప్తులు చేశాడు. వేగంగా అంతరించి పోతున్న గ్రామీణ తోళ్ళ పరిశ్రమకు జీవం పోయడానికి ఆయన రసాయన శాస్త్రవేత్తల సలహాలు కూడా తీసుకున్నాడు. తోళ్ళ పరిశ్రమను సంస్కరించడం ద్వారా చనిపోయిన పశువుల మాంసం తినే అలవాటును రూపుమాపవచ్చని గాంధీ భావించాడు. చనిపోయిన పశువును చర్మకారుల ఇంటికి తెచ్చినప్పుడు అక్కడ పండగ వాతావరణం ఉండేది. ఆ మాంసంతో ఒకరోజు విందు చేసుకోవచ్చని అంతా సంతోషించేవారు. కళేబరాన్ని కత్తులతో చీలుస్తున్నప్పుడు పిల్లలు చుట్టూ మూగి గెంతులు వేసేవారు. ఎముకలను, మాంసం ముక్కలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ అల్లరి చేసేవారు. ఆ దృశ్యం గాంధీకి ఏవగింపు కలిగించేది.

"చచ్చిన గొడ్డుమాంసం తినడం మీరెందుకు మానరు? మీరు ఆ అలవాటు మానకపోతే నేను మిమ్మల్ని తాకుతాను గాని సాంప్రదాయవాదులంతా మీ సాన్నిహిత్యాన్ని బహిష్కరిస్తారు," అని ఆయన హరిజన చర్మకారులతో వాదించేవాడు. "మేము చచ్చిన గొడ్లను తొలగించాలన్నా, వాటి చర్మాలను ఒలవాలన్నా వాటి మాంసం తినే అలవాటును మానుకోవడం సాధ్యం కాదు," అని వారు జవాబిచ్చేవారు. "ఎందుకు సాధ్యంకాదు? తోళ్ళ పరిశ్రమ పెట్టినంత మాత్రాన చచ్చిన గొడ్డుమాంసం తినాల్సిన అవసరం ఏమీ లేదు. పారిశుద్ధ్య పనినీ, తోళ్ళ పనినీ కూడా ఆరోగ్యకరంగా, పరిశుభ్రంగా నిర్వహించవచ్చని నేను అనుభవపూర్వకంగా చెప్పగలను," అని గాంధీ వాదించేవాడు.

సబర్మతీ, వార్ధా ఆశ్రమాలలో గాంధీ తోళ్ళ విభాగాలను ప్రారంభించాడు. ఇవి మొదట్లో చిన్న స్థాయిలో ప్రారంభమయినా, తర్వాత తోళ్ళను నిల్వ ఉంచేందుకు పక్కా భవనాలు కావాల్సిన స్థాయికి పెరిగాయి. ఆశ్రమంలోని యువకులు నిపుణులైన చర్మకారుల పర్యవేక్షణలో తోళ్ళ పని నిర్వహించేందుకు తగిన భవనాలను నిర్మించేందుకు గాంధీ 50 వేల రూపాయలు పోగుచేశాడు. అక్కడ తయారుచేసిన తోలు ఉత్పత్తులను బహిరంగ మార్కెట్‌లో అమ్మేవారు. మొత్తం పనంతా సహజంగా మరణించిన పశువుల నుంచి సేకరించిన తోళ్ళతోనే జరిగేది.

కోల్‌కతాలోని జాతీయ తోళ్ళ తయారీ కేంద్రాన్ని గాంధీ సందర్శించి ఎర్ర తోలును ఎలా తయారుచేస్తారో ఆసక్తిగా గమనించాడు. ఉప్పులో ఊరబెట్టిన ఆవు చర్మాలకు సున్నం పూసి వెంట్రుకలను తొలగించడం, రంగువేయడం నేర్చుకున్నాడు. గ్రామీణ తోళ్ళపరిశ్రమను అభివృద్ధి చేయడానికి ఠాగూర్ శాంతినికేతన్‌లో చేస్తున్న పరిశోధనలను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవాడు. తోళ్ళను శుభ్రం చేయడంలో ప్రాచీనమైన గ్రామీణపద్ధతిని పూర్తిగా మార్చేయడం గాంధీకి ఇష్టం లేదు. తోళ్ళపరిశ్రమను గానీ, మరే ఇతర గ్రామీణ పరిశ్రమనుగానీ పట్టణాలకు తరలించడమూ ఆయనకు ఇష్టం లేదు. అలా తరలించడంవల్ల గ్రామీణులకు నష్టం జరుగుతుందని ఆయన నమ్మకం. తమ మెదళ్ళను, చేతులను నైపుణ్యంగా ఉపయోగించే కొద్దిపాటి అవకాశం వారికి లేకుండాపోతుంది. చచ్చిన పశువులను గ్రామంలో ఒకచోటి నుంచి మరొకచోటికి తరలించేందుకు ఒక గౌరవనీయమైన పద్ధతి కనిపెట్టాలని గాంధీ భావించాడు. గ్రామీణ చర్మకారులు పశువును నేల మీద ఈడ్చుకుంటూ పోతారు. దానివల్ల కళేబరానికి గాయాలు అవుతాయి, తోలు విలువ తగ్గిపోతుంది. ఎముకలను ఎలా సద్వినియోగం చేయాలో కూడా గ్రామీణ చర్మకారులకు తెలియదు. వారు వాటిని కుక్కలకు ఆహారంగా వేసి నష్టపోయేవారు. ఎముకలతో చేసిన హ్యాండిల్సు,

గుండీలు విదేశాల నుంచీ మన దేశానికి దిగుమతి అవుతాయి. ఎముకల పొడి పొలాలకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది కూడా.

గాంధీ చర్మకారుల గుడిసెలకు వెళ్ళి వాళ్ళతో కలిసిపోయేవాడు. వాళ్ళు కూడా ఆయనమీద చాలా విశ్వాసముంచేవారు. వారి జీవితాలను బాగుచేయడానికి వచ్చిన స్నేహితునిలా భావించి ఆయన మార్గదర్శనం కోసం చూసేవారు. ఆయన వాళ్ళ వాడలకు వెళ్ళినప్పుడు మంచినీటి సౌకర్యం లేకపోవడం గురించి ఫిర్యాదు చేసే వాళ్ళు. ఊరిబావి నుంచి వారిని నీరు తోడుకోనివ్వక పోవడం గురించి, దేవాలయాల్లోకి రానివ్వక పోవడం గురించి, వారిని దూరంగా ఊరి చివర ఉంచడం గురించి వాళ్ళు ఆయనకు చెప్పేవారు. గాంధీకి చాలా బాధ, సిగ్గు కలిగేవి. వాళ్ళకు విరాళాలు ఇవ్వడం మీద ఆయనకు నమ్మకం లేదు. వాళ్ళ కాళ్ళ మీద వారు నిలబడాలని ఆయన కోరిక. శారీరక శ్రమను తక్కువగా చూడటం ప్రారంభించిన రోజునుంచే భారతదేశానికి చెడ్డరోజులు ప్రారంభమయ్యాయనీ, తమ సోదరుల మానవ హక్కులను కాలరాచినవారు తమ అన్యాయాలకూ, క్రూరత్వానికీ జవాబు చెప్పుకోవలసిన రోజు వస్తుందనీ ఆయన ఠాగూర్‌తో కలిసి జోస్యం చెప్పాడు. చర్మకారులకు సరైన వేతనం, నిజమైన విద్య, వైద్య సహాయం అందేలా చూసేందుకు అంకితభావం గల సేవకుల దళం కావాలని గాంధీ భావించాడు. ఈ సహాయకులు రాత్రిబడులు నడుపుతారు. హరిజన బాలలని విహారయాత్రలకు తీసుకు వెళతారు. చర్మకారుల నివాసాలలో గాంధీ స్వయంగా రాత్రిబడులు నెలకొల్పి, హరిజన సేవ చేయడం మీద దృష్టి కేంద్రీకరించాడు. అందుకు చర్మకారులు సానుకూలంగా స్పందించడం ప్రారంభించారు. కొంతమంది కేవలం సహజ మరణం పొందిన పశువుల చర్మాలనే వినియోగిస్తామని ప్రమాణం చేశారు. మరికొందరు తాగుడు మానివేస్తామని, చచ్చిన గొడ్డుమాంసం తినడం మానేస్తామని ప్రమాణం చేశారు. గాంధీ ఒకసారి చర్మకారుల సమావేశానికి అరిగి, చిరిగిపోయిన చెప్పులతో వెళ్ళాడు. అప్పుడు ఆయన పర్యటనలో ఉన్నాడు. ఆయనవద్ద ఇంకొక చెప్పుల జత లేదు. చర్మకారులు ఆ విషయం గమనించారు. వారిలో ఇద్దరు ఆయనకు అహింసాత్మక చెప్పులజతను తయారు చేసి బహూకరించారు.

గాంధీ ఒక సందర్భంలో తనను దక్షిణాఫ్రికా జైలులో ఉంచిన "జనరల్ స్మట్స్" కోసం స్వయంగా తయారుచేసిన చెప్పుల జత ఒకటి బహుమతిగా ఇచ్చాడు. గాంధీగారి 70వ పుట్టినరోజున జనరల్ స్మట్స్ ఉత్తరం రాస్తూ "జైలులో ఆయన నా కోసం ఒక చెప్పుల జత తయారుచేశాడు. ఆ గొప్ప మనిషి తయారుచేసిన చెప్పులు ధరించే యోగ్యత నాకు లేదని నేను భావిస్తున్నప్పటికీ చాలా వేసవి కాలాలు నేను వాటిని ధరించాను," అని రాశాడు.

# సేవకుడు

ఆశ్రమంలో సాధారణంగా పనిమనుషులు చేసే వివిధరకాల పనులు చేసేందుకు గాంధీ ఆసక్తి చూపేవాడు. అంతకు ముందు న్యాయవాదిగా వేలాది రూపాయలు సంపాదిస్తున్నప్పుడు కూడా రోజూ ఉదయమే గోధుమలను విసిరేవాడు. తిరగలితో గోధుమలను పిండి చేసే ఈ కార్యక్రమంలో కస్తూర్బా, అతని కుమారులు కూడా పాలుపంచుకొనేవారు. అలా సిద్ధం చేసిన పిండి వారు ఇంటివద్దే హోల్‌మీల్ బ్రెడ్ తయారు చేసుకునేందుకు సరిపోయేది. గాంధీ ఈ అలవాటును సబర్మతీ ఆశ్రమంలోనూ కొనసాగించాడు. తిరగలిని బాగుచేయడానికి ఆయన చాలా గంటలు వెచ్చించేవాడు. ఒకసారి ఒక పనివాడు ఆశ్రమంలో పిండి నిల్వ తక్కువగా ఉందని ఫిర్యాదు చేశాడు. గాంధీ తక్షణమే లేచి వారికి పిండి విసరడంలో సహాయపడేందుకు సిద్ధపడ్డాడు. విసిరేముందు గోధుమలను శుభ్రం చేయడంలో గాంధీ చాలా శ్రద్ధ చూపేవాడు. గోచీగుడ్డతో గోధుమలను శుభ్రం చేస్తున్న గాంధీని సందర్శకులు తరచు చూస్తుండేవాళ్లు. బయటవాళ్ళ ముందు శారీరక శ్రమ చేయడానికి ఆయన సిగ్గుపడేవాడు కాదు. ఒకసారి తన ఆంగ్ల పాండిత్యానికి గర్వపడే ఒక కళాశాల విద్యార్థి గాంధీజీని కలిసేందుకు వచ్చాడు. ముఖాముఖీ పూర్తయిన తర్వాత “బాపూ నేను మీకు ఏవిధంగానైనా సహాయపడగలనా? ఏదైనా పనుంటే చెప్పండి,” అని ఆ విద్యార్థి అడిగాడు. ఏదో రాతపని చెబుతాడని అతని ఉద్దేశం. దాన్ని గ్రహించిన గాంధీ “సరే మీకు ఖాళీ ఉంటే కాస్త ఈ చాటలోని గోధుమలను బాగుచేసి పెట్టు,” అన్నాడు. మాటిచ్చి దొరికి పోవడంతో ఆ యువకుడు తప్పనిసరిగా పని మొదలుపెట్టాడు. ఒక గంట తర్వాత గోధుమలు చెరిగే పనిలో అలసిపోయిన అతను నీరసమైన కంఠంతో గాంధీకి వీడ్కోలు చెప్పి వెళ్ళాడు.

కొన్ని సంవత్సరాలపాటు గాంధీ ఆశ్రమంలో సహాయ స్టోర్‌కీపర్‌గా పని చేశాడు. ఉదయపు ప్రార్థనల తర్వాత ఆయన వంటింట్లో కూరగాయలు తరిగేవాడు. వంటింట్లోగానీ, సరుకుల గదిలోగానీ, ఏ మూలైనా చిన్న సాలీడు గూడు కనిపించినా తోటి పనివారిని మందలించేవాడు. ఆయనకు కూరగాయలు, పళ్ళు, ధాన్యాలలోని పోషక విలువల గురించి బాగా తెలుసు. ఒకసారి ఒక ఆశ్రమవాసి బంగాళాదుంపలను కడగకుండానే తరిగాడు. బంగాళాదుంపలను, కూరగాయలను కొయ్యకముందు ఎందుకు కడగాలో అతనికి గాంధీ వివరించాడు. ఒకసారి ఒక ఆశ్రమవాసి అరటిపళ్ళ



మీద నల్లటి మచ్చలుండటం చూసి వాటిని తినడానికి నిరాకరించాడు. అప్పుడు గాంధీ అలా ఉన్న అరటిపళ్ళు అతని జీర్ణవ్యవస్థకు అనువైనవి కాబట్టే ఇచ్చానని వివరించాడు. గాంధీజీ చాలాసార్లు తానే స్వయంగా వడ్డించేవాడు. దానితో వాళ్ళకు ఆహారపదార్థాలు రుచిగా లేవని ఫిర్యాదు చేసేందుకు అవకాశం  ఉండేది కాదు. దక్షిణాఫ్రికాలో జైల్లో ఉండగా ఆయన రోజుకు రెండుసార్లు వందలాది మంది తోటి ఖైదీలకు వడ్డన చేసేవాడు.

ఎవరి కంచాలూ, గిన్నెలూ వాళ్ళే కడుక్కోవాలనేది ఆశ్రమవాస నియమాల్లో ఒకటి. వంటపాత్రలను కొన్ని బృందాలు వంతులవారీగా కడిగేవి. ఒక రోజు గాంధీ మసితో నిండిన బరువైన మూకుళ్ళను కడిగేందుకు సిద్ధమయ్యాడు. చేతులనిండా

బూడిద తీసుకొని ఒక పెనాన్ని రుద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. అక్కడ అకస్మాత్తుగా కస్తూర్బా ప్రత్యక్షమైంది. “ఇది మీ పని కాదు. ఈ పని చేసేందుకు వేరేవాళ్ళు ఉన్నారు,” అని పెనం లాక్కుంది. ఆ పని ఆమెకు వదలడమే మంచిదనుకున్న గాంధీ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. వంటపాత్రలు శుభ్రంగా తళతళ మెరవకపోతే గాంధీ ఊరుకొనేవాడు కాదు. ఒకసారి జైల్లో తోటి సహాయకుని పనితీరు నచ్చక ఇనప పాత్రలను కూడా వెండిపాత్రల్లా మెరిసేలా ఎలా తోమవచ్చో అతనికి చూపించాడు. ఆశ్రమం నిర్మాణంలో ఉన్నప్పుడు కొంతమంది అతిథులు గుడారాల్లో పడుకోవలసి వచ్చేది. కొత్తగా వచ్చిన ఒకతను తన పక్కబట్టలు మడిచి వాటిని ఎక్కడ పెట్టాలో అడగడానికి వెళ్ళాడు. అతను తిరిగి వచ్చేసరికి గాంధీ ఆ పక్కబట్టల మూటను తన భుజాల మీద మోస్తూ ఎదురొచ్చాడు.

ఆశ్రమ సరిహద్దులకు బయటున్న నూతిలోంచి నీరు తోడుకు రావటం రోజువారీ పనుల్లో ఒకటి. ఒక రోజు గాంధీకి కొంచెం నలతగా ఉంది. ఐనా పిండి విసరడంలో పాలుపంచుకున్నాడు. గాంధీని మరింత శారీరకశ్రమ నుంచి రక్షించాలనుకున్న ఒక సహచరుడు ఇతర ఆశ్రమవాసుల సహాయంతో ఆశ్రమంలో ఉన్న చిన్నా పెద్దా పాత్రలన్నింటినీ నీటితో నింపేశాడు. గాంధీకి ఈ ఆలోచన నచ్చలేదు. ఆయనకు బాధ కలిగింది. ఒక చిన్నపిల్లాడి స్నానపు తొట్టిని తీసుకెళ్ళి దాన్ని నీటితో నింపి తలమీద పెట్టుకొని మోసుకొచ్చాడు. తన పొరపాటుకు సహచరుడు పశ్చాత్తాపపడ్డాడు. ఏదైనా పని చేయడం శారీరకంగా అసాధ్యమైతే తప్ప, తాను పెద్దవాడిననో, మహాత్ముడిననో రోజువారీ పనుల నుంచి దూరంగా ఉంచడం గాంధీకి అసలు నచ్చేదికాదు. ఏ పని చేయడానికైనా ఆయనకు అసాధారణమైన శక్తి, పట్టుదల ఉండేవి. ఆయనకు విసుగు తెలియదు. బోయర్ యుద్ధంలో* స్ట్రెచర్ మోసేవాడిగా ఆయన రోజుకు 25 మైళ్ళ వరకు నడిచేవాడు. ఆయన గొప్ప పాదచారి. టాల్‌స్టాయ్ ఫార్మ్ నుంచి తరచు రోజుకు 42 మైళ్ళు నడిచేవాడు. ఇంటి వద్ద చేసిన తినుబండారాలు తిని మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరితే, కొనుగోళ్ళు ముగించుకొని రాత్రికి తిరిగి వచ్చేవాడు. ఇతర స్నేహితులు, చిన్నవారైన సహచరులు ఆయన ఉదాహరణను ఉత్సాహంగా అనుసరించేవారు.

---

* రెండవ బోయర్ యుద్ధం 1899లో మొదలయ్యి 1902 వరకు సాగింది. ఆరెంజ్ స్టేట్, సౌత్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లపై యునైటెడ్ కింగ్‌డం జరిపిన ఈ యద్ధంలో బ్రిటిష్ సామ్రాజ్యపు సైన్యాలు మద్దతు ఇచ్చాయి. ఈ యుద్ధంలో బ్రిటన్ గెలిచి ఆ రెండు దేశాలను తన సామ్రాజ్యంలో కలుపుకుంది.

ఒకసారి ఒక చెరువును కొంతమంది పనివారు తవ్వుతున్నారు. ఒక రోజు పని తర్వాత వాళ్ళు తవ్వగాల, పార, తట్టలతో తిరిగి వచ్చేసరికి వారికోసం చాలా పళ్ళాల నిండా ఫలహారం సిద్ధంగా ఉండటం చూశారు. వాళ్ళల్లో ఒకరు "ఎందుకు మీరింత శ్రమ తీసుకున్నారు? మేము మీతో ఇలా పని చేయించుకోవచ్చా?" అని అడిగారు. "దానిదేముంది. పని నుంచి తిరిగి వచ్చేసరికి మీరు అలసిపోయి ఉంటారని నాకు తెలుసు. నేను ఖాళీగా ఉన్నాను కాబట్టి మీకు ఫలహారం సిద్ధం చేశాను," అని గాంధీ చెప్పాడు.

దక్షిణాఫ్రికాలోని భారతీయులకు నాయకుడిగా ప్రసిద్ధి చెందిన గాంధీ అక్కడ స్థిరపడిన భారతీయుల గురించి వాదించేందుకు ఒకసారి లండన్ వెళ్ళాడు. ఆయన్ను అక్కడున్న భారతీయ విద్యార్థులు శాకాహార విందుకు ఆహ్వానించారు. ఆ విందుకు కావలసిన వంటలు వాళ్ళు స్వయంగా చేద్దామనుకున్నారు. మధ్యాహ్నం రెండుగంటల సమయంలో ఒక బక్కపలుచటి వ్యక్తి వారితోకలసి గిన్నెలు కడగడం, కూరగాయలు కోయడం లాంటి పనులు చేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత అక్కడకు వచ్చిన విద్యార్థి నాయకునికి ఆ వ్యక్తి ఎవరో కాదు వారిచ్చే విందులో ముఖ్య అతిథి అయిన మహాత్మాగాంధీనే అని తెలిసింది. పనులు చేయడం విషయంలో కఠినంగా ఉండే గాంధీ తనకోసం ఎవరైనా పనిచేయడం సహించేవాడు కాదు. ఒక రాజకీయ సమావేశం తర్వాత రాత్రి 10 గంటల సమయంలో పడుకొనే ముందు ఆయన తన గది ఊడ్చుకుంటూ కనిపించాడు. ఆయన గ్రామాల్లో యాత్రలో ఉన్నప్పుడు లాంతరులో నూనె అయిపోయి ఆరిపోతే అలసి నిద్రపోతున్న తన సహచరులను నిద్రలేపడం ఇష్టంలేక, వెన్నెల్లో కూర్చుని ఉత్తరాలు రాసుకొనేవాడు. నోవాఖలి యాత్ర సమయంలో తన శిబిరంలో కేవలం ఇద్దరు సహచరులను మాత్రమే ఉండనిచ్చాడు. వారికి ఖాక్రా* తయారుచేయడం ఎలాగో తెలియదు. గాంధీ వంటింట్లోకి వచ్చి, ఒక నిపుణుడిలా కూర్చుని వాటిని ఎలా చెయ్యాలో వారికి చేసి చూపించాడు. అప్పుడు ఆయన వయస్సు 78 సంవత్సరాలు.

ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం. రెండు నెలల వయసు తర్వాత ఆయన కొడుకులని ఎప్పుడూ నర్సు సంరక్షణలో గానీ, పనివారి సంరక్షణలో గానీ ఉంచలేదు. ఒక శిశువు అభివృద్ధికి తల్లిదండ్రుల ప్రేమ, అభిమానం అత్యవసరమని ఆయన నమ్మకం. ఆయన శిశువును తల్లిలా లాలించి, నవ్వించి, ఆహారం పెట్టగలిగి ఉండేవాడు. ఒకసారి జైలునుంచి తిరిగి వచ్చేసరికి ఇంటివద్ద ఆయన స్నేహితుడు

* గోధుమ పిండిని గుండ్రటి ముద్దలుగా చేసి నిప్పులో కాల్చి తయారు చేసిన దానిని ఖాక్రా అంటారు.

పొలాక్ భార్య చాలా బలహీనంగా చిక్కిపోయి కనిపించింది. ఆమె శిశువుకు తల్లిపాలు మానిపించాలని ప్రయత్నిస్తోంది. ఆ పిల్ల ఎప్పుడూ ఏడుస్తూ తల్లికి నిద్ర, విశ్రాంతి లేకుండా చేస్తోంది. ఆ రోజు రాత్రే గాంధీ శిశువు బాధ్యతను తీసుకున్నాడు. రోజంతా నాలుగు మైళ్ళు నడచి, బహిరంగ సభలలో ప్రసంగించి కష్టపడి దాదాపు రాత్రి ఒంటిగంటకు ఇంటికి చేరిన తర్వాత కూడా ఆ శిశువును తల్లి వద్ద నుండి తీసుకుని తనవద్ద పడుకోబెట్టుకునేవాడు. శిశువు దాహం తీర్చడానికి ఒక జగ్గుతో నీళ్ళు పక్కన పెట్టుకొని పడుకొనేవాడు. కానీ నీళ్ళకోసం కూడా లేవకుండా శిశువు ఆయన పక్కన హాయిగా నిద్రపోయేది. దాదాపు ఒక పక్షం రోజుల తర్వాత ఆ బిడ్డకు తల్లిపాలు విజయవంతంగా మానిపించగలిగాడు.

పెద్దలపట్ల గాంధీకి ఉన్న గౌరవం అపారమైనది. గాంధీవద్ద గోఖలే ఉన్నప్పుడు గాంధీ ఆయన కండువా ఇస్త్రీ చేశాడు, ఆయనకు పక్క వేశాడు, ఆయనకు ఆహారం వడ్డించేవాడు, పాదాలు వత్తేందుకు కూడా సిద్ధంగా ఉండేవాడు. గోఖలే అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకొనేవాడు కాదు. మహాత్ముడు కాక ముందు గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చినపుడు కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యాడు. అక్కడ మరుగుదొడ్లు శుభ్రం చేశాడు. ఆ తర్వాత ఒక వృద్ధ కాంగ్రెస్ నాయకుడిని "నేను మీకేమైనా సహాయం చేయగలనా?" అని అడిగాడు. "సమాధానం రాయాల్సిన ఉత్తరాలు గుట్టలు గుట్టలు పడి ఉన్నాయి. ఆ పని చేసేందుకు నాకు గుమస్తాలు లేరు. నువ్వేమైనా ఆ పని చేయగలవా?" అని ఆ నాయకుడు అన్నాడు. "తప్పకుండా, నాకు చేతనైన పనేదైనా చేయడానికి నేను సిద్ధమే," అంటూ గాంధీ ఆ పనిలోకి దిగి త్వరలోనే ఆ పని పూర్తి చేశాడు. తర్వాత ఆ నాయకునికి సహాయకునిగా వ్యవహరిస్తూ ఆయన కోటు బొత్తాలు పెట్టాడు, ఇతర చిన్న చిన్న పనులలో సహాయం చేశాడు.

ఆశ్రమంలో అనుభవం గల సహాయకుడి అవసరం ఎప్పుడు కలిగినా ఆ పనికి హరిజన సేవకుడిని వినియోగించేందుకే గాంధి ఆసక్తి చూపేవాడు. తద్వారా అంటరానితనమనే అడ్డంకిని నిర్మూలించాలని ఆయన ఉద్దేశం. "మనం సేవకులను జీతాలు తీసుకునే కార్మికుల్లా కాకుండా సహోదరుల్లా చూసుకోవాలి. దానివల్ల కొన్ని ఇబ్బందులు, దొంగతనాలు, కొంచెం ఎక్కువ ఖర్చు ఉండొచ్చు. కానీ దాని మంచి ఫలితం తప్పకుండా కనపడుతుంది," అనేవాడాయన.

ఆయనకు ఎవరినైనా సేవకులుగా ఎలా ఉంచుకోవాలో తెలియదు. కానీ భారతీయ జైలులో ఉండగా ఒక సందర్భంలో ఆయన సహఖైదీల సేవలు పొందాడు. ఒకరు ఆయన తినే ఫలాలు కడిగి పెట్టారు. మరొకరు మేకలకు పాలు తీసి పెట్టారు. ఇంకొకరు

ఆయనకు వ్యక్తిగత సహాయకునిగా పని చేశారు. ఒక బ్రాహ్మణుడు ఆయన కంచాలు కడిగాడు. ఇద్దరు యూరోపియన్లు ఆయన మంచం మోసుకొచ్చి పక్క వేశారు.

ఇంగ్లాండులోని ధనవంతుల కుటుంబాల్లో ఇంటి పనిమనుషులకు, యజమానులకు మధ్య కుటుంబతరహా సంబంధాలుండటం గాంధీకి సంతోషం కలిగించింది. అతిథులకు సేవకులను పరిచయం చేసేటప్పుడు వారు తమ కుటుంబ సభ్యులుగా యజమాని పరిచయం చేయడాన్ని ఆయనెంతో మెచ్చుకొనేవాడు.

ఒకసారి ఒకరింట్లో చాలాకాలం అతిథిగా ఉండి వచ్చేస్తున్న సందర్భంలో ఆ ఇంటి సేవకులకు వీడ్కోలు చెబుతూ "నేను మీకెంత కృతజ్ఞుడినో చెప్పలేను. నా జీవితంలో ఎవరినీ సహోదరులుగా తప్ప సేవకులుగా భావించలేదు. ఇక నుంచీ మీరు కూడా నా సహోదరులే. మీ సేవలకు బదులు చెల్లించడం నా పరిధిలో ఉన్నది కాదు. కానీ భగవంతుడు మీకు తప్పక ప్రతిఫలం చెల్లిస్తాడు," అన్నాడు గాంధీ.

# వంటవాడు

గాంధీగారిని మహదేవదేశాయి ఒకసారి అడిగాడు, "బాపూజీ, ఫీనిక్స్ సెటిల్‌మెంటులో* చేరకముందు మీకు వంటవాడు ఉండేవాడా?" "లేదు. నేను అంతకన్నా ముందే వంటవాడిని వదిలించుకున్నాను. మాకు మొదట్లో మంచి వంటవాడు ఉండేవాడు. ఐతే సుగంధద్రవ్యాలు, మసాలా లేకుండా వంట చెయ్యలేనన్నాడు. దానితో అతనికి వీడ్కోలు చెప్పేశాను. ఆ తర్వాత ఇంకో వంటవాడిని పెట్టుకోలేదు." అలా అతనికి వీడ్కోలు చెప్పినప్పుడు గాంధీ వయస్సు షుమారు 35 సంవత్సరాలు.

18 సంవత్సరాల వయసులో ఇంగ్లాండులో ఉండగా ఆయన మొదటిసారిగా వంటచేసుకొనే ప్రయత్నం చేశాడు. ఆయన పూర్తి శాకాహారి. ఇంగ్లండులో శాకాహారం కొత్తగా గుర్తింపబడుతున్న అలవాటు. సాధారణంగా ఆయనకు బ్రెడ్, వెన్న, జామ్, ఉడికించిన కూరగాయలు (తాలింపు లేకుండా) వడ్డించేవారు. ఉప్పూకారాలతో నిండిన అమ్మచేతివంట తినడానికి అలవాటు పడి ఉన్న గాంధీకి ఇవన్నీ చప్పగా, రుచీ పచీ లేకుండా ఉన్నట్లు అనిపించేవి.

* దక్షిణాఫ్రికాలోని జాతి వివక్షతకు వ్యతిరేకంగా అహింసాయుత నిరసన (పాసివ్ రెసిస్టెన్స్)ను ఆచరించడానికి వీలుగా డర్బన్ సమీపంలో 1904లో గాంధీ స్థాపించిన ఆశ్రమం.

కొన్ని నెలలపాటు రెస్టారెంట్లలో శాకాహార భోజనం తిన్న తర్వాత ఆయన పొదుపుగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఒక గది అద్దెకు తీసుకొని, ఒక పొయ్యి పెట్టి తన అల్పాహారం, భోజనం వండుకోవటం ప్రారంభించాడు. వంట సిద్ధం చేయడానికి ఆయనకు 20 నిముషాల కంటే ఎక్కువ సమయం పట్టేది కాదు. రోజూ 12 అణాల కంటే ఎక్కువ ఖర్చు అయ్యేది కాదు. సాల్ట్ రాసిన "శాకాహారం కోసం అభ్యర్థన"* చదివి, లండన్ శాకాహార సంఘంతో పరిచయం కలిగిన తర్వాత గాంధీ తన ఆహారంలో చాలా మార్పులు చేసుకున్నాడు.

బారిష్టరుగా నమోదు చేసుకొని భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ముంబయిలో చిన్నగది అద్దెకు తీసుకొని, ఒక బ్రాహ్మణ వంటవాడిని గాంధీ కుదుర్చుకున్నాడు. అయినా సగం వంట తనే చేసుకొనేవాడు. ఆ వంటవాడికి ఇంగ్లీషు శాకాహార వంటలు కూడా గాంధీ నేర్పాడు. అన్ని విషయాలలో ముఖ్యంగా వంటగది సక్రమంగా, పరిశుభ్రంగా ఉండాలనే విషయంలో గాంధీ చాలా పట్టుదలగా ఉండే వాడు. ప్రతిరోజూ తప్పకుండా స్నానం చేయడం, బట్టలు ఉతుక్కోవడం వంటవాడికి నేర్పాడు. దక్షిణాఫ్రికాలోగానీ, భారతదేశంలో గానీ గాంధీగారి ఆశ్రమాలలో జీతానికి పెట్టుకున్న వంటవాళ్ళు ఉండేవారు కాదు. భోజనంలోకి రకరకాల కూరలు, వంటకాలు వండడం పూర్తిగా డబ్బు దండగ, పని దండగ అని గాంధీ ఉద్దేశం. ఆశ్రమంలో ఉండే వివిధ రకాల వ్యక్తులకు వేర్వేరు రుచులన్నిటినీ ఇచ్చి తృప్తి పరిచే ఉద్దేశం ఆయనకేమాత్రం లేదు. అందరికీ ఒకేరకమైన సాధారణ వంటకాలను ఆయన సూచించేవాడు. భోజనాలను సామూహిక వంటశాలలో వండేవారు.

ఎంతో సంక్లిష్టం, కఠినం అయిన వంటకళను ఆయన సరళీకరించాడు. జావతో కూడిన అన్నం (బ్రెడ్, పచ్చిపులుసు, సలాడ్), ఉప్పూకారాలు లేకుండా ఉడికించిన కూరగాయలు, పళ్ళు, పాలు లేదా పెరుగు – ఇవి ఆశ్రమ భోజనంలో వంటకాలు. తీపి పదార్థాలు, పాలపదార్థాలకు బదులు తాజా బెల్లం, తేనె వాడేవారు. జస్ట్ రాసిన 'రిటర్న్ టు నేచర్'** చదివిన తర్వాత ఆరోగ్యంగా ఉండేందుకు తినాలి గానీ నాలుకను తృప్తి పరచేందుకు తినకూడదని గాంధీ నమ్మాడు. అప్పటి నుంచి ఆహారంతో ప్రయోగాలు చెయ్యడం గాంధీ ప్రారంభించాడు. అది ఆయన జీవితకాల వ్యాపకం అయ్యింది. కొన్ని ప్రయోగాలకి వంటతో పని లేదు. కొన్ని మాత్రం ఆయన్ని

* హెన్రీ స్టీఫెన్స్ సాల్ట్ (1851–1939) అన్న ఆంగ్ల సంస్కరణవాది 1886లో ఈ పుస్తకం రాశాడు.

** డాల్ఫ్ జస్ట్ (1859–1936) అన్న జర్మన్ ప్రకృతి వైద్యుడు ఈ పుస్తకాన్ని రాశాడు.



సమస్యలలోకి నెట్టాయి. ఐదేళ్ళపాటు కేవలం పళ్ళు మాత్రం తింటూ గాంధీ గడిపాడు. ఒకసారి నాలుగు నెలల పాటు మొలకెత్తిన విత్తనాలు, అపక్వాహారం మాత్రమే తింటూ గడిపి విరోచనాల పాలయ్యాడు.

ఫీనిక్స్ సెటిల్మెంట్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగాను, ఆశ్రమానికి ప్రధాన వంటవాడు గానూ గాంధీ వ్యవహరించాడు. ఐరోపావారికి దక్షిణాఫ్రికావారు ఇచ్చిన విందులో గాంధీ వంటలోనూ, వడ్డనలోనూ పాలుపంచుకున్నాడు.

ఫీనిక్స్ సెటిల్మెంట్ నుండి మొదటి ఆశ్రమవాసుల బృందం బయటికి వెళుతున్న సందర్భంలో ఆయన వారికి బ్రహ్మాండమైన విందు ఏర్పాటు చేశాడు. పెద్ద చపాతీల గుట్ట, టొమాటొ పచ్చడి, కూర, ఖర్జూరాలతో చేసిన తీపి వంటకం సిద్ధం చేశాడు. చేతులతో తీరిక లేకుండా పని చేస్తూనే ఆయన నోటితో వారికి సత్యాగ్రహం పాటించాల్సిన విధానం గురించి, జైల్లో పద్ధతుల గురించి బాగా వివరించాడు. సత్యాగ్రహులు 2500లకు చేరుకోగానే గాంధీజీ యాత్రికులకు నాయకత్వం వహిస్తూ వారికి వంటవాడుగా పని చేశాడు. ఒకరోజు పప్పు నీళ్ళుగా ఉంటే, మరొక రోజు అన్నం ఉడికీ ఉడకనట్లుండేది. ఐనా వారంతా గాంధీని ఎంతగా ప్రేమించే వారంటే కనీసం గొణుక్కోకుండా వాటిని తినేసేవారు. దక్షిణాఫ్రికా జైలులో ఉన్నప్పుడు తోటి ఖైదీలకు గాంధీ వంటలో సహాయం చేశాడు. చదువులో వంట తప్పనిసరి భాగంగా గాంధీ భావించాడు. టాల్‌స్టాయ్ క్షేత్రంలో, ఆశ్రమంలో పిల్లలందరికీ వంట వచ్చుని

గర్వంగా చెప్పేవాడు. దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చిన కొత్తలో గాంధీ తన వంటపిచ్చిని శాంతినికేతన్ విద్యార్థులకు కూడా అంటించాడు. సామూహిక వంటశాలను నిర్వహిస్తూ వంతులవారీగా తామే వంట చేసుకోవడం అనే ఆలోచన శాంతినికేతన్ విద్యార్థులకు బాగా నచ్చింది. టాగూర్‌కు ఈ పథకంలోని ఆచరణీయతపై సందేహాలున్నప్పటికీ తన ఆమోదం తెలిపాడు.

మద్రాసులోని ఒక విద్యార్థి వసతిగృహంలో వేర్వేరు కులాలవారికి వేర్వేరు వంటశాలలు, వారి రుచులను సంతృప్తి పరిచేందుకు రకరకాల మసాలాలు ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. ఒక బెంగాలీ ఇంట్లో భోజనానికి వెళ్ళినప్పుడు విందులో లెక్కలేనన్ని వంటకాలు వడ్డించడం చూసి కూడా అలాగే బాధపడ్డాడు. అప్పటినుంచి ఆయన రోజుకి ఐదురకాల ఆహారపదార్థాల కన్నా ఎక్కువ తినకూడదని నిర్ణయించుకున్నాడు. బీహార్లో ఏళ్ళతరబడి కొనసాగుతున్న అంటరానితనాన్ని కూడా ఆయన అతిక్రమించాడు. చంపారన్ కేసులో తనకు సహాయపడుతున్న న్యాయవాదులు అందరితో కలసి సహపంక్తి భోజనం చేశాడు. నోటిరుచి కోసం ఆహారపదార్థాలకు మసాలాలు, తాలింపులు వెయ్యడం కన్నా పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా వంట చేయడానికే అధిక ప్రాధాన్యతను ఇచ్చేవాడు.

లేతవేపాకుల పచ్చడి, పెరుగు – తెలగచెక్కల మిశ్రమం, చింతపండు – బెల్లాలతో చేసిన షర్బత్ గాంధీ వంటకాలలో ఉండేవి. ఉడికించి తాలింపు పెట్టిన సోయా చిక్కుడు గింజలు, తాజా ఆకుకూరలతో సాలాడ్, చపాతీలను పిండిగాచేసి తయారుచేసిన ఒకరకమైన వంటకం, గోధుమ బరక నూకలజావ, వేయించిన గోధుమపిండితో తయారుచేసిన గోధుమకాఫీ వంటి వంటకాలు గాంధీ ప్రత్యేకం.

ఇంగ్లండు వెళ్ళే ఓడమీద ఉండగా గాంధి తన మేనల్లుడికి “రెండొంతుల అరటిపిండితో ఒకవంతు గోధుమపిండి కలిపి మేము బిస్కెట్లు, రొట్టెలు తయారుచేసుకున్నాం,” అని రాశాడు. ఒకసారి కేక్ తయారీ విధానం గురించి “పిండిని చన్నీళ్ళతో కలిపి మూడు గంటలపాటు ఉంచాలి. పిండిలో నీళ్ళు పోసేముందే నెయ్యి వేసి బాగా కలపాలి,” అని రాశాడు.

ఆయనకు కేకు, అన్నం, పప్పు, కూరగాయల పులుసు, పచ్చిపులుసు, నారింజలతోనూ, నారింజ తొక్కలతోనూ చేసే ఊరగాయ, బేకింగ్ పౌడరు, ఈస్టు లేకుండా చేసే బ్రెడ్లు, చపాతీలు, ఖాక్రాలు వండటం వచ్చు. బిస్కట్ల తయారీ, లోఫ్ తయారీలను ఆయన ఆశ్రమం వంటశాలకు నేర్పాడు. వందలాది మందికి అన్నం వండేందుకు, బ్రెడ్ తయారీ, కూరగాయలను ఉడికించడాన్ని చౌకగా చేసేందుకు

సేవాగ్రామ్‌లో ఒక ప్రత్యేకమైన (ఒవెన్) కొలిమిని వాడేవారు. ఒకసారి గాంధీ సహాయకులలో ఒకరు ఇలా అన్నారు, "ఈమధ్యనే పచ్చిగడ్డిలో చాలా విటమిన్లున్నాయని కనుక్కొన్నారు. అదృష్టవశాత్తూ ఇది గాంధీ ఆశ్రమంలో లేనప్పుడు జరిగింది. లేకపోతే ఆయన ఆశ్రమంలో పొయ్యి వెలిగించడం మాని అందరినీ పెరట్లో గడ్డి తినమనేవాడే." ఒకసారి గాంధీ ఒక ఆదర్శ గురుకుల పాఠశాలకు వెళ్ళాడు. అక్కడ వంటశాలలో ఏర్పాట్లు, పద్ధతులు ఆయనకు నచ్చలేదు. "పిల్లలకు పుస్తకాలలో ఉన్న చదువు చెప్పడంతోపాటు వారిని మంచి వంటవారిగా, పారిశుద్ధ్య పనివారుగా చేసినపుడే మీరు వారికి ఆదర్శవంతమైన విద్యను అందించినట్లవుతుంది," అని ఆయన ఉపాధ్యాయులతో చెప్పాడు.

# వైద్యుడు

రాజ్‌కోట్‌లోని ఆల్ఫ్రెడ్ హైస్కూల్ నుంచి గాంధీ మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. వెంటనే ఆయన సంరక్షకులు ఆయనను ఇంగ్లండు పంపి బారిస్టర్ చదివించాలని నిర్ణయించారు. "నేను వైద్యవిద్య చదవటానికి ఇంగ్లండు వెళ్ళకూడదా?" అని గాంధీ ప్రశ్నించాడు. "మృతదేహాలను కోయడంలాంటి పనులు వైష్ణవులు చేయకూడదు," అని ఆయన పెద్దన్న దానికి అభ్యంతరం చెప్పాడు. గాంధీ తండ్రి కరంచంద్‌కు (ఆపాటికే అతడు చనిపోయాడు) అది అస్సలు ఇష్టం లేదు.

39 సంవత్సరాల వయసులో వైద్యుడు కావాలనే కోరికతో గాంధీ మరోసారి దక్షిణాఫ్రికానుండి ఇంగ్లాండు వెళ్ళాడు. కానీ జంతువులను కోయడం మళ్ళీ అడ్డంకిగా నిలిచింది. బతికి ఉన్న జంతువులను కోయడం, బతికి ఉన్న జీవులమీద ప్రయోగాలు చేయడం (సీరం, ఇంజెక్షన్ల తయారీకి) గాంధీ సహించలేనివి. ఏ మతమూ బతికి ఉన్న జంతువులను కోయడాన్ని సమర్థించదు. అన్ని మతాలూ మన శరీరాన్ని రక్షించుకొనేందుకు జీవులను చంపాల్సిన పనిలేదనే చెబుతాయి. అల్లోపతీ వైద్యులు దయ్యాలను ఉపాసించేవారుగానూ, క్షుద్రవిద్యల సారమే అల్లోపతి వైద్యంగానూ గాంధీ భావించేవాడు. ఆయుర్వేద వైద్యులు కొత్త కొత్త ప్రయోగాలు చెయ్యకపోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించాడు. హోమియోపతి కూడా ఆయనను ఆకర్షించలేకపోయింది. ప్రకృతి చికిత్సలో తగినంత ప్రావీణ్యత లభించేదాకా బాధితులైన రోగులను రక్షించడంపై ఆయనకున్న శ్రద్ధ ఆయన్ను కుదురుగా ఉండనివ్వలేదు.

జబ్బులను తగ్గించేందుకు నీటిని వాడటంపై కుహ్నే* రాసిన గ్రంథాన్ని గాంధీ చదివి చాలా ప్రభావితుడయ్యాడు. నిదానంగా తనమీదా, భార్యా, పిల్లల మీదా ప్రయోగాలు చేసిన తర్వాత మన చుట్టూ ఉన్న ప్రకృతి ధాతువులతో – అంటే నీరూ, మట్టీ, తాజా గాలీ, సూర్యరశ్మిల సహాయంతో చికిత్స చేసే విధానం కనిపెట్టాడు. ఆయన ఎప్పుడూ శరీరాన్ని మందు బిళ్ళలు, పొడుల పేరుతో విషపూరితం చేయలేదు. ఉపవాసం చేయడం, ఆహారంలో మార్పు, మూలికల వాడకం మీదే ఎక్కువగా దృష్టి పెట్టేవాడు.

రోగులను పరిశీలించి రోగలక్షణాలను అధ్యయనం చేయడంలో ఆయనకున్న అసాధారణ శక్తి విజయవంతంగా చికిత్స చేయడంలో సహాయపడేది. దక్షిణాఫ్రికాలో ఆయనే మొదటి 'కూలీల బారిష్టరు', ఆయనే మొదటి 'కూలీల వైద్యుడు'. చాలామంది యూరోపియన్లు, భారతీయులు ఆయన వైద్యసలహాలు తీసుకొనేవారు. ఆయన చికిత్సా పద్ధతి అప్పటికి అమలులో ఉన్న వైద్యశాస్త్ర నియమాలకు వ్యతిరేకమైనది. తర్వాతి కాలంలో వైద్యులు కొంతవరకూ వీటిని సూచించడం ప్రారంభించారు.

గాంధీ కొడుకు టైఫాయిడ్‌తో బాధపడుతున్నప్పుడు వైద్యులు కోడిగుడ్లు, కోడిమాంసం పులుసు పత్యంగా చెప్పారు. కానీ ఎలాంటి మాంసాహారం ఇచ్చేందుకు గాంధీ అంగీకరించలేదు. ఆయనే స్వయంగా వైద్యం చేయడానికి పూనుకొని కొడుకుకి నీరు, బత్తాయిరసం ఆహారంగా ఇచ్చి, తడి గుడ్డలతో చుట్టి ఉంచాడు. బాలుడి ఆరోగ్యం క్షీణించినప్పుడు గాంధీ కొంచెం ఆందోళన చెందాడు. కానీ తన ప్రకృతివైద్య పద్ధతులకు కట్టుబడే ఉన్నాడు. చివరికి కొడుకుకి టైఫాయిడ్ తగ్గించగలిగాడు. తర్వాత చాలా టైఫాయిడ్ కేసుల్ని ఇంజక్షన్‌లు వాడకుండానే తగ్గించగలిగాడు.

వైద్యుల నిర్ణయాన్ని ఆయన చాలాసార్లు ధిక్కరించాడు. ఒకసారి కస్తూర్బా తీవ్రమైన రక్తహీనతతో మంచాన పడింది. వైద్యులు ఆమెను మాంసం సూప్ తాగమన్నారు. గాంధీ, కస్తూర్బా ఇద్దరూ దానిని వ్యతిరేకించారు. చాలారోజుల పాటు నిమ్మరసంతో ఉపవాసముంచి గాంధీ ఆమెకు జబ్బు తగ్గించాడు. పప్పు, ఉప్పు తినొద్దని ఆమెకు సలహా ఇచ్చాడు. గాంధీ పట్టుదలను మరిచిపోయిన కస్తూర్బా "చెప్పడం తేలికే. పప్పూ, ఉప్పూ మాని మీరుండగలరా?" అనేసింది. "తప్పకుండా. వైద్యులు నన్నే మానమంటే ఖచ్చితంగా మానతాను," అనే సమాధానం గోడకు కొట్టిన బంతిలా దూసుకొచ్చింది. "కానీ ఏ వైద్యుడూ చెప్పకుండానే నేను ఏడాదిపాటు పప్పూ, ఉప్పూ

* లూయిస్ కుహ్నే (1835–1901) జర్మనీకి చెందిన ప్రకృతి వైద్యుడు. గాంధీ, చదివింది ఇతడు రాసిన 'ది న్యూ సైన్స్ ఆఫ్ హీలింగ్' అన్న పుస్తకం.



మానేస్తాను," అంటూ గాంధీ శపథం చేశాడు. కస్తూర్బా కన్నీళ్ళూ, వేడికోళ్ళూ ఆయన్ని శపథం నుంచి వెనక్కు మళ్ళించలేకపోయాయి. వైద్యుడు, రోగి ఇద్దరూ పప్పూ, ఉప్పూ మానేశారు.

మరొకసారి కస్తూర్బా వారం రోజులపాటు వేపరసం తాగుతూ, ఉపవాసం ఉండాల్సి వచ్చింది. జీర్ణ వ్యవస్థనూ, పెద్ద పేగులనూ శుభ్రంగా ఉంచుకోవడం మీద గాంధీ శ్రద్ధ చూపేవాడు. పేగులలో పేరుకొన్న విషాలను నాశనం చేయడానికి ఆయన లంఖణాలు, ఉపవాసాలు, ఎనిమా సూచించేవాడు. తలనొప్పులు, అజీర్ణం, విరోచనాలు, మలబద్ధకం అనేవి తిండి ఎక్కువ అవడం వల్ల, క్రమబద్ధమైన వ్యాయామం లేకపోవడం వల్ల వస్తున్నాయని ఆయన విశ్వసించేవాడు.

సుదీర్ఘమైన, వేగమైన నడక ఆయన దృష్టిలో తిరుగులేని వ్యాయామం. జైలులో కూడా అతడికి కేటాయించిన ప్రదేశంలోనే ఆయన ఉదయం, సాయంత్రం నడక కొనసాగించేవాడు. ఆయన ప్రాణాయామాన్ని కూడా బోధించేవాడు. మానసిక అనారోగ్యం కూడా శారీరక దృఢత్వం మీద ప్రభావం చూపుతుందని ఆయన విశ్వసించేవాడు. ఆయనదృష్టిలో భగవంతుని మీద పూర్తి విశ్వాసముంచి బాధలన్నిటినీ మరిచిపోవడం అన్ని జబ్బులకీ మందు.

దక్షిణాఫ్రికాలో గాంధీ మీద ఒక పఠాన్ దాడి చేసినప్పుడు గాయపడిన మూతి, నుదురు, పక్కటెముకలకు మట్టి పట్టీలు వేసుకున్నాడు. వాపు త్వరలోనే తగ్గిపోయింది.

ప్లేగు, మలేరియా, విషజ్వరం, డిస్పెప్సియా, కామెర్లు, రక్తపోటు, తీవ్రమైన కాలిన గాయాలు, మశూచి, విరిగిన ఎముకలు – వీటన్నిటికీ ఆయన మట్టిపూత

చికిత్సను వాడేవాడు. గాంధీ కొడుకు ఒక ప్రయాణంలో చేతి ఎముకను విరగ్గొట్టు కున్నాడు. గాంధీ దానికి మట్టికట్టు కట్టి తగ్గించాడు. ఆయన చాలా వ్యాధులను తన చికిత్సా పద్ధతిలో నయం చేసినప్పటికీ, తన పద్ధతులను వేదవాక్యంగా తీసుకోవద్దని హెచ్చరించేవాడు. అలాంటి సాంప్రదాయ వ్యతిరేక చికిత్సా ప్రయోగాలలో ప్రమాదం పొంచి ఉంటుందని ఆయనకు తెలుసు. తాను రాసిన 'ఎ గైడ్ టు హెల్త్'* అన్న పుస్తకంలో శారీరక దృఢత్వాన్ని కాపాడుకొనేందుకు సాహసోపేతమైన పద్ధతులు ఉన్నాయని ఆయన అంగీకరించేవాడు. ప్రసూతి కేంద్రాలు, వైద్యశాలలు, చికిత్సా కేంద్రాలు తెరవడం మీద ఆయనకు ఆసక్తి లేదు. ప్రజలకు పారిశుద్ధ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానాలు నేర్పాలనేది ఆయన ఉద్దేశం. చికిత్సా పద్ధతులకన్నా నివారణా విధానాలు ఎక్కువగా అమలు చేయాలనేది ఆయన భావన.

అల్లోపతి ఔషధాల వాడకంపై నిషేధమేమీ లేదు. సేవాగ్రామ్‌లో కలరా మహమ్మారి విజృంభించినప్పుడు గ్రామీణులు, ఆశ్రమవాసులు టీకాలు వేయించు కునేందుకు ఆయన అంగీకరించాడు. జైలులో ఉండగా ఆయనకు అపెండిసైటిస్ శస్త్రచికిత్స చేశారు. దానిమీద ఆయనను విమర్శిస్తూ అనేక ఉత్తరాలు వచ్చాయి. తనవల్ల పొరపాటు జరిగిందని ఆయన అంగీకరించాడు కూడా.

ప్రకృతి చికిత్సకు ఉన్న పరిమితులు గాంధీకి తెలిసినా అనేక కారణాల వల్ల దాన్నే ఎక్కువగా సూచించేవాడు. అది భారతదేశంలోని అసంఖ్యాకమైన పేదప్రజలకు అందుబాటులో ఉంటుంది. అది నూటికి నూరుశాతం స్వదేశీ పద్ధతి. 77 సంవత్సరాల వయసులో ఆయన రెట్టించిన ఉత్సాహంతో ప్రకృతి చికిత్స చేపట్టి ఉరులికాంచన్ గ్రామంలో ప్రకృతి చికిత్సా కేంద్రాన్ని ప్రారంభించాడు. అక్కడ ఖరీదైన యంత్ర పరికరాలేం లేవు. ఆదర్శవంతమైన వైద్యునికి ఔషధాలకు సంబంధించి లోతైన పరిజ్ఞానం ఉండటమేగాక, ఆయన ఆ పరిజ్ఞానాన్ని ప్రజలతో ఉచితంగా పంచుకొనేందుకు సిద్ధపడాలి. రోగులు ధనవంతులైనా, పేదలైనా వైద్యులు ఒకేలా వైద్యం అందించేందుకు వీలుగా వారికి వార్షిక పారితోషికం ఇవ్వాలని గాంధీ భావించేవాడు. కొన్ని రోజులు ఆయన రోగులను పరిశీలించి మందులు రాసేవాడు:

> రోగి పేరు: రాజు: 1. సూర్య స్నానం 2. కటిస్నానం 3. ఘర్షణ స్నానం 4. పళ్ళరసం 5. మజ్జిగ 6. పాలు తాగకూడదు. (మజ్జిగ జీర్ణం కాకపోతే పళ్ళరసం, వేడినీళ్ళు తాగాలి. )

---

* ఈ పుస్తకాన్ని గాంధీ ఆగాఖాన్ పాలెస్‌లో ఖైదుగా ఉన్నప్పుడు 1942–44 మధ్య గుజరాతీలో రాశాడు.

రోగి పేరు: పార్వతి: 1. పుచ్చకాయరసం, 2. కటి స్నానం, 3. ఘర్షణ స్నానం, 4. పొత్తికడుపు మీద మట్టిపట్టీ, 5. సూర్యస్నానం. ఇవి పాటిస్తే ఆమెకు తప్పక తగ్గుతుంది. ఆమెకు రామనామ మహత్యాన్ని వివరించండి.

"నీకు దగ్గరగా గాంధీ ఉండాలంటే రోగం తెచ్చుకో," అనేది ఆశ్రమంలో ప్రచారంలో ఉన్న చెణుకు. ఆశ్రమంలో ఉన్న రోగులందరి చిన్న చిన్న వివరాలు ఆయనకు తెలుసు.

రోజువారీ నడక నుండి తిరిగి వచ్చేటప్పుడు ఆయన ప్రతి రోగినీ తప్పక కలిసేవాడు. వాళ్ళకు ఆహారం ఎలా తయారు చెయ్యాలో, వాళ్ళ శరీరాలను తడి గుడ్డలతో ఎలా శుభ్రం చేయాలో, మర్దన ఎలా చేయాలో, ఎనిమాలో ఎంత లవణం వేయాలో అన్నీ వివరంగా చెప్పేవాడు. సేవాగ్రామ్‌లోని రోగులకు రోజూ ఒక గంట కేటాయించాలని ఆయన నిర్ణయించుకున్నప్పుడు ఇరుగు పొరుగు గ్రామాల నుంచి గ్రామస్థులు ప్రవాహంలా వచ్చేవారు. "కూరగాయలు తిను, మజ్జిగ తాగు, మట్టిపట్టీ వేసుకో" అనేది ఆయన సాధారణ వైద్య సలహా. కొన్నిసార్లు స్వయంగా రోగుల మలాన్ని పరిశీలించేవాడు. రోగి మరీ బలహీనంగా లేకపోతే అతన్ని ఆరుబయట ఉంచేవాడు. రోగలక్షణాన్ని బాగా పరిశీలించిన తర్వాతే ఆయన చికిత్స సూచించేవాడు. మానసిక ఒత్తిడి కారణంగా ఒక సహచరుడు అధిక రక్తపోటుతో బాధ పడుతున్నాడు. దానికి గల కారణాన్ని కనుగొనేందుకు ఆయన ప్రతి ముఖ్యమైన సంభాషణ ముందు, తర్వాత ఆయన రక్తపోటు తనిఖీ చేయించాడు. మరుసటి రోజు ఒక చెక్కమీద తిన్నగా గీసిన లైను మీద రంపంతో రోగి కోసేముందు, తర్వాత, రక్తపోటు కొలిపించాడు. ఆ తర్వాత రోజు ఆశ్రమంలో ఒక ఫర్లాంగు దూరం పరిగెత్తే ముందూ, తర్వాత రక్తపోటు కొలిపించాడు. ఆఖరిరోజు ఆయన రక్తపోటు తగ్గింది. అంతకు ముందు రెండురోజుల పని తర్వాత రక్తపోటు పెరిగింది. "నీకు రక్తపోటు పెరిగినప్పుడల్లా కొంతదూరం నడవాలి," అనేది గాంధీ ఆయనకు సూచించిన చికిత్స. గాంధీ ఎంత ముఖ్యమైన సమావేశంలో ఉన్నా ఆహారం గురించీ, స్నానం గురించీ, రోగుల చికిత్స గురించీ సలహా కోసమైతే అంతరాయం కలిగించవచ్చు. అనేక మంది సుప్రసిద్ధ నాయకుల చికిత్సను ఆయనే స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండేవాడు. ఇతరుల సూచనలైతే వారు లెక్కచేయకపోయే ప్రమాదం ఉండటమే దీనికి కారణం. జైలులో కూడా తన తోటి ఖైదీలకు వైద్యసహాయం చేయడానికి అనుమతి పొందేవాడు.

ఒకసారి ఆస్తమాతో బాధపడుతున్న గాంధీ సహచరుడు వైద్యసహాయం కోరాడు. పొగతాగడం తక్షణం మానేయమని గాంధీ అతనికి సలహా ఇచ్చాడు. అతడు అంగీకరించాడు. మూడు రోజుల తర్వాత కూడా ఆరోగ్యం ఏమీ మెరుగుపడలేదు. అతను రహస్యంగా రోజుకు ఒకటి రెండు సిగరెట్లు కాల్చకుండా ఉండలేకపోవడటమే దీనికి కారణం. ఒక రోజు రాత్రి చీకటిలో అతడు సిగరెట్ అంటించేందుకు అగ్గిపుల్ల వెలిగించాడు. వెంటనే అతని మొహం మీద ఒక టార్చిలైట్ కాంతి పడింది. తలెత్తి చూస్తే ఆయన ముందు గాంధీ నిలబడి ఉన్నాడు. అతడు వెంటనే గాంధీకి క్షమాపణలు చెప్పుకున్నాడు. అప్పటి నుంచీ పొగతాగడం పూర్తిగా మానేశాడు. అతని ఆస్తమా కూడా కొద్ది రోజుల్లోనే మాయమయ్యింది. బాద్‌షాఖాన్‌కు ఒకసారి ఒక చర్మవ్యాధి వచ్చింది. దానికి చికిత్సగా గాంధీ చెప్పిన వైద్యసలహా ఆ పొడవాటి పఠాన్ నాయకుడిని రోగం కన్నా ఎక్కువ ఇబ్బంది పెట్టింది. ఒకసారి వల్లభభాయ్ కాలుకి ముల్లు గుచ్చుకుంది. దాని చికిత్సలో అయోడిన్‌కు బదులుగా కాల్చిన జీడిపిక్కను గాంధీ వినియోగించాడు. "ఈ వైద్యం కన్నా ముల్లు బాధే తక్కువగా ఉంది," అన్నాడు వల్లభభాయ్.

# నర్సు

కొందరు కాంగ్రెస్ నాయకులు గాంధీ సలహాకోసం ఒకసారి సేవాగ్రామ్‌కి వెళ్లారు. అక్కడ ఆయన జబ్బుతో బాధపడుతున్న ఇద్దరు ఆశ్రమవాసులకు తడిగుడ్డ పట్టీలు వేయడంలో, కటి స్నానాలు చేయించడంలో తీరికలేకుండా ఉన్నాడు. "ఈ పనులన్నీ మీరు చేయాల్సిందేనా?" ఆ నాయకులలో ఒకరు గాంధీని అడిగారు. "మరి ఎవరు చేస్తారు? మీరొకసారి ఊళ్లోకి వెళితే అక్కడున్న 600 మందిలో 300 మంది జబ్బుపడి కనిపిస్తారు," అని గాంధీ సమాధానం చెప్పాడు. రోగులకు వైద్య సేవలందించడం మీద బాల్యం నుంచే గాంధీకి చాలా ఆసక్తి ఉండేది. బడి గంట కొట్టగానే జబ్బుతో ఉన్న తండ్రికి వైద్యసేవలందించేందుకు పరుగెత్తేవాడు. ఆయనకు మందులిచ్చేవాడు, గాయానికి కట్టుకట్టేవాడు, వైద్యుల సూచనల ప్రకారం మందులు సిద్ధం చేసేవాడు. పెద్దవుతున్న కొద్దీ ఆయనలో రోగులకు సేవ చేయాలనే కాంక్ష వృద్ధి చెందింది. దక్షిణాఫ్రికాలో ఆయన రోజుకు రెండు గంటలపాటు ఒక ధర్మాసుపత్రిలో నర్సుగా సేవలందించేవాడు. మందుల చీటీని అర్థం చేసుకొని వాటి ప్రకారం మందులు వేయడం ఆయన అక్కడే నేర్చుకున్నాడు. న్యాయవాదిగా తన

వద్దకు వచ్చిన కేసులన్నిటినీ ఒప్పుకుంటే నర్సు పని చేయడానికి సమయం దొరకదని, తన కేసులు కొన్నింటిని స్నేహితుడైన ముస్లిం న్యాయవాదికి అప్పగించేవాడు.

1896లో గాంధీ కొద్దిరోజులపాటు భారతదేశానికి వచ్చినప్పుడు జాతి వివక్ష కారణంగా దక్షిణాఫ్రికాలో స్థిరపడిన భారతీయులు పడుతున్న కష్టాలను ఇక్కడి నాయకులకు వివరించడంలో క్షణం తీరికలేకుండా గడిపాడు. స్థిరపడిన ఆ వివరాలతో కూర్చిన హరిత కరపత్రం (గ్రీన్ ఫాంప్లెట్*) పంచిపెట్టడానికే ఆయన సమయమంతా సరిపోయేది. అయినా తన బావగారికి తీవ్రమైన జబ్బు చేసిందని, నర్సును పెట్టుకొనే ఆర్థిక స్థోమత చెల్లెలకు లేదని ఆయనకు తెలిసిన మరుక్షణం రోగిని తన ఇంటికి తెచ్చుకొని, తన గదిలో పెట్టుకొని, అతనికి రాత్రింబవళ్లు సేవలు చేశాడు.

తన ఎనిమిదేళ్ల కొడుకుకి చేయి విరిగినప్పుడు దాదాపు నెలరోజులపాటు అతని గాయానికి కట్టు మారుస్తూండేవాడు. డాక్టరు కట్టిన బ్యాండేజిని విప్పి, గాయాన్ని కడిగి, శుభ్రమైన మట్టిపట్టీ వేసి మళ్లీ కట్టు కట్టేవాడు. ఇలా ఆ గాయం తగ్గిపోయేంత వరకూ చేశాడు. పదేళ్ల కొడుక్కి టైఫాయిడ్ వచ్చినప్పుడు 40 రోజులపాటు గాంధీ అతనికి సేవలు చేశాడు. పిల్లాడు దీనంగా మారాం చేస్తున్నా వినకుండా అతడిని తడిగుడ్డలతో చుట్టి వాటి మీద పొడి దుప్పట్లను కప్పేవాడు. గాంధీ తన రోగుల పట్ల చాలా శ్రద్ధగా, ప్రేమగా ఉండేవాడు. కానీ చికిత్సలో సడలింపునకు ఏమాత్రం ఒప్పుకొనేవాడు కాదు. ఒకసారి మరో టైఫాయిడ్ రోగికి వైద్యసేవలు చేస్తున్నప్పుడు ఆ పిల్లవాడికి పక్షం రోజులపాటు మృత్తికా వైద్యం, కటిస్నానం చేయించాడు. ప్రతి గంటన్నరకీ అతని పొత్తికడుపు మీద ఒక అంగుళం మందం ఉన్న కొత్త మట్టి పట్టీ వేసేవాడు. జ్వరం తగ్గిన తర్వాత పండిన అరటిపళ్లను అతనికి పత్యంగా నిర్ణయించాడు. గాంధీ స్వయంగా అరటి పళ్లను పావుగంటపాటు మెత్తగా గుజ్జు చేసి పిల్లాడిని బుజ్జగించి తినిపించేవాడు. పిల్లవాడిపై ప్రేమతో ఎక్కువ పెట్టేస్తుందేమోనని ఆయన ఆ పనిని వాళ్లమ్మకి కూడా అప్పగించలేదు. జబ్బుపడిన వారికి వైద్యం చేసేటప్పుడు వారిని ప్రశాంతంగా ఉంచేందుకు గాంధీ ప్రయత్నించేవాడు. అన్ని రకాల అలవాట్లకు ఆయన చాలా వ్యతిరేకం అయినా ఒక దక్షిణాది కుర్రాడు జబ్బుపడినప్పుడు అతని మనసుకు ఊరట కలిగించేందుకు గాంధీ స్వయంగా అతనికి కాఫీ కలిపి ఇచ్చాడు.

రోగుల శరీరాలను తడిగుడ్డతో శుభ్రం చేయడం, ఎనిమా చేయడం, స్నానం చేయించడం, మట్టి పట్టీలు వేయడం అన్నీ స్వయంగా చేసేవాడు. నర్సుకంటే ఎక్కువ

* దీని తొలిముద్రణ ముఖపత్రం ఆకుపచ్చ రంగులో ఉండటం వల్ల దానికి ఆ పేరు వచ్చింది.

ఆయన రోగులకు సేవలు చేసేవాడు. రోగాలు అంటుకుంటాయేమోనన్న భయం ఆయనకు లేదు. ఒకసారి ఒక కుష్టు బిచ్చగాడు ఆయన వద్దకు వచ్చాడు. గాంధీ కొద్ది రోజులపాటు అతనికి ఆశ్రయం ఇచ్చి, అతని గాయాలకు కట్లుకట్టి ఆ తర్వాత ఆసుపత్రికి పంపించాడు. ఒకసారి ఆయన తోటి ఖైదీకి కుష్టువ్యాధి లక్షణాలు సోకాయి. అతన్ని రోజూ సందర్శించేందుకు గాంధీ అనుమతి సంపాదించాడు. ఆ తర్వాత చాలా యేళ్లపాటు అతనికి సేవాగ్రామ్ ఆశ్రమంలో ఆశ్రయం ఇచ్చాడు. అతని గాయాలకు గాంధీనే స్వయంగా కట్లు కడుతూండేవాడు.

గాంధీకి నర్సుగా సేవలందించేందుకు రెండు చారిత్రాత్మక సందర్భాలలో అవకాశం లభించింది. అందులో ఒకటి బోయర్ యుద్ధం, రెండోది జులూ తిరుగుబాటు*. ఆ రెండు సందర్భాలలోనూ ఆయన ఒక భారతీయ అంబులెన్స్ దళం ఏర్పరుచుకొని గాయపడిన వారిని యుద్ధరంగం నుంచి బయటకు మోశాడు, వైద్యసేవలందించాడు. గాయపడినవాళ్లను స్వయంగా స్ట్రెచర్ మీద మైళ్లకు మైళ్లు మోసాడు, అంబులెన్స్ దళానికి సమర్థుడైన నాయకుడనిపించుకున్నాడు. కొరడా దెబ్బలు తిని నిస్సహాయంగా పడి ఉన్న జులూప్రజలకు సంతోషంగా సేవలందించాడు. వారికి సేవలందించేందుకు తెల్లవారైన "సిస్టర్స్ ఆఫ్ మెర్సీ" దళం నిరాకరించింది. వారి గాయాలు చీము పట్టి భయంకరంగా ఉండేవి. వైద్యుల సూచనల ప్రకారం తెల్లసైనికులకు కూడా గాంధీ ఔషధాలు అందించేవాడు. ఆయన నర్సింగ్ సేవలకు జులూ యుద్ధ పతకం, కైజర్-ఎ-హింద్ బంగారు పతకం లభించాయి.

దక్షిణాఫ్రికాలోని బంగారు గనుల్లో ప్లేగువ్యాధి విజృంభించినపుడు అనేకమంది భారతీయ కార్మికులు ఆ రోగం బారిన పడ్డారు. ఆ కబురు వినగానే గాంధీ నలుగురి సహాయకులతో అక్కడకు వెళ్లాడు. అక్కడకు దగ్గరలో ఆసుపత్రి లేదు. ఒక ఖాళీ గోదాము తలుపులు పగలకొట్టి, అక్కడ కొన్ని మంచాలు వేసి 23మంది రోగులను అక్కడకు చేర్చారు. గాంధీ తక్షణ స్పందనకు అక్కడి పురపాలకసంఘం కృతజ్ఞతలు తెలిపింది, అవసరమైన మందులను, ఒక నర్సును సహాయానికి పంపింది. ఆ నర్సు రోగనివారిణిగా వాడుకొనేందుకు తగినంత బ్రాందీ నిల్వలు తెచ్చుకొన్నాడు. గాంధీకి ఆ రకమైన రోగనివారణపై అంతగా నమ్మకం లేదు. రోగులకు మందులివ్వడం, వారి పడకలను శుభ్రం చేయడం, రాత్రులు వారి పక్కన కూర్చుని ధైర్యం చెప్పడం

* జులూ తిరుగుబాటు : ఇక్కడ ప్రస్తావించిన తిరుగుబాటు 1905లో జులూ తెగపై కొత్తగా విధించిన పోల్ పన్నుకు వ్యతిరేకంగా బంబాతా అనే తెగనాయకుడు చేసినది.

వంటి పనులన్నీ గాంధీ చేశేవాడు. చికిత్స చేస్తున్న వైద్యుని అనుమతితో గాంధీ అక్కడున్న రోగులలో ముగ్గురికి మృత్తికా చికిత్స మొదలుపెట్టాడు. వారిలో ఇద్దరు బతికారు. నర్సుతో సహా మిగిలినవారంతా మరణించారు. సేవలందించేందుకు తగిన శారీరక ధృడత్వం ఉండాలంటే రోగుల పట్ల ఎంత శ్రద్ధగా ఉండాలో తన శరీరం పట్ల కూడా అంత శ్రద్ధగా ఉండాలని గాంధీకి తెలుసు. ఆయన ఎప్పుడూ తగిన జాగ్రత్తలు తీసుకొనేవాడు, పనిభారం అధికంగా ఉన్నప్పుడు పొట్టనిండా తినేవాడు కాదు.

ఎనిమా ఇవ్వడంలోనూ, కటిస్నానం చేయించడం, నూనెతో మర్దన చేయడం, మట్టిపట్టీలు వేయడం, తడిగుడ్డల పట్టీలు వేయడంలోనూ గాంధీకి మంచి నైపుణ్యం ఉంది. రక్తపోటును తగ్గించుకొనేందుకు ఆయన తరచుగా తన నుదుటిమీద మట్టిపట్టీ వేసుకొనేవాడు. జపాను కవి యోన్ నొగూచి*తో ఈ మట్టి పట్టీ గురించి చెబుతూ గాంధీ "నేను భారతదేశపు మట్టిలో పుట్టి పెరిగినవాడిని, కాబట్టి నాకు ఈ భారతీయ మృత్తికే కిరీటంగా ఉంటుంది," అన్నాడు.

రోగి ప్రమాదకర పరిస్థితిలో ఉన్నా ఆయన సాధారణంగా కంగారుపడేవాడు కాదు. తన భార్యా పిల్లలకు సేవలు చేసేటప్పుడు కూడా చాలా ప్రశాంతంగానే ఉండేవాడు. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు కస్తూర్బా రెండుసార్లు తీవ్రంగా జబ్బుపడింది. ఆమె బాగుపడుతుందనే ఆశ చాలా తక్కువగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. గాంధీ ఆమెకు ఎంతో ఓపికగా, ధైర్యంగా, శ్రద్ధగా సేవలందించాడు. దక్షిణాఫ్రికా జైలులోంచి విడుదల అయ్యాక ఆమె చాలా బలహీనంగా ఉంది. గాంధీ ఆమెకు పళ్లుతోము కొనేందుకు సహాయం చేశాడు, కాఫీ కలిపి ఇచ్చాడు, ఎనిమా చేశాడు, ఆమె మలమూత్రాలను ఎత్తిపోశాడు, ఆమెకు తలదువ్వి జడవేయడానికి కూడా ప్రయత్నించాడు. తెల్లవారుజామున వెలుతురు రాగానే ఆయన ఆమె మంచాన్ని చక్కగా గాలివేసే ఒక చెట్టునీడకు చేర్చేవాడు. రోజంతా అక్కడే ఉంచి సేవలు చేసి, మళ్లీ సాయంత్రం చీకటి పడేవేళకు ఇంటిలోపలకు మార్చేవాడు.

శిక్షణ పొందిన భారతీయ నర్సు దక్షిణాఫ్రికాలో దొరకడం కష్టం. నల్ల మహిళలకు తెల్ల నర్సులు పురుడు పోసేందుకు నిరాకరించే అవకాశం చాలా ఉంది. కస్తూర్బా గర్భం ధరించినప్పుడు గాంధీ కాన్పు చేయడానికి సంబంధించి అధ్యయనం చేశాడు, కస్తూర్బా తమ ఆఖరి సంతానాన్ని సుఖంగా ప్రసవించేందుకు సహాయపడ్డాడు.

---

* యోన్ నొగూచి (1875–1947); 1936లో అతడు భారతదేశంలో గాంధీని కలిశాడు.

ఆగాఖాన్ పాలెస్‌లో కస్తూర్బా ఆఖరిసారి జబ్బు పడినప్పుడు గాంధీ (అప్పుడు అతనికి 75 యేళ్లు) ఆమెకు కటిస్నానం చేయించి ఊరట కలిగించేందుకు ప్రయత్నించాడు. యెర్రవాడ జైలులో అపెండిసైటిస్ శస్త్రచికిత్స చేయించుకున్నప్పుడు అక్కడి నర్సులు, స్వయంగా నర్సూ, కాంపౌడరూ అయిన గాంధీని ఎంతో మెచ్చుకున్నారు. "నర్సింగ్ సాధారణంగా అంత ఆనందకరమైన పనేమీ కాదు, కానీ గాంధీకి నర్సు పనిచేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది," అని వాళ్లల్లో ఒక నర్సు చెప్పింది. "నువ్వు అందరికీ ఇచ్చినట్లు నీ సూచనలన్నీ జాగ్రత్తగా రాసి ఇవ్వాల్సిన పనిలేదు అని మా డాక్టరుగారు చెప్పారు. నిజంగానే ఆయనలాంటి రోగిని ఇంతకుముందెప్పుడూ చూడలేదని నేను బదులిచ్చాను," అని ఆమె వివరించింది.

# ఉపాధ్యాయుడు

గాంధీ 13 యేళ్ల వయసులో అంతే వయసున్న కస్తూర్బాను పెళ్లి చేసుకున్నాడు. ఆమె నిరక్షరాస్యురాలు. అంటే చదవడం, రాయడం రాదు. ఈ కౌమార భర్త తన భార్యకు చదవడం, రాయడం నేర్పాలని ప్రయత్నించి దారుణంగా విఫలమయ్యాడు. 1914లో ఇంగ్లండుకు ఓడప్రయాణం చేస్తున్నప్పుడు ప్రతిరోజూ కాలెన్‌బాక్‌కు గుజరాతీ నేర్పించాడు. కస్తూర్బాకు రామాయణం, భగవద్గీత నేర్పించాడు. కస్తూర్బా ఆ రెంటినీ చాలా ఆసక్తితో నేర్చుకుంది. 73 యేళ్ల వయసులో కస్తూర్బా గాంధీతో కలసి ఆగాఖాన్ పాలెస్‌లో ఖైదుగా ఉంది. అప్పుడు ఆమె కోసం ఆయన రామాయణ, భాగవతాల్లోని కొన్ని అధ్యాయాలను ప్రవచనం చేశాడు. రోజూ ఆమెను కూర్చోబెట్టి భూగోళం, గుజరాతీ సాహిత్యం, వ్యాకరణాలకు సంబంధించిన పాఠాలను బోధించేవాడు. ఆయన శిష్యురాలు ముసలితనం వల్లా, దుఃఖం వల్లా పాఠాలకు సరిగ్గా స్పందించలేక పోయేది. ఖైదీగా ఉన్నప్పుడు గాంధీ తన తోటి చైనీస్ ఖైదీకి ఆంగ్లం; ఐరిష్ జైలరుకు చరిత్ర, గుజరాతీ; తన మేనకోడలి కూతురుకి భూగోళం, రేఖాగణితం నేర్పాడు. 74 యేళ్ల వయసులో కూడా ఆయన భౌగోళిక పటాలను ఖచ్చితంగా గీయగలిగేవాడు.

ఉపాధ్యాయునిగా తన సామర్థ్యం మీద గాంధీకి గట్టి నమ్మకం ఉండేది. కానీ చదువు మీద ఆయన అభిప్రాయాలు, ఆయన బోధించే విధానం అప్పటికి ఆమోదం పొందిన పద్ధతులకు చాలా భిన్నంగా ఉండేవి. ఒకసారి దక్షిణాఫ్రికాలో ఒక క్షురకుడు, ఒక గుమాస్తా, ఒక దుకాణదారు ఆంగ్లం నేర్చుకోవాలనుకున్నారు. కానీ వారి వద్ద



రోజూ తరగతులకు వెళ్లేంత సమయం కానీ, ప్రత్యేకంగా ఒక శిక్షకుని నియమించు కునేంత ధనం కానీ లేవు. గాంధీ రోజూ వారి వద్దకే వెళ్లి ఆంగ్లం బోధించాడు. ఎనిమిది నెలల్లో పద్దు పుస్తకాల నిర్వహించుకొనేందుకూ, వృత్తిపరమైన లేఖలు రాసుకొనేందుకు అవసరమైన ఆంగ్లం వాళ్లు నేర్చుకున్నారు.

కొంతకాలం గాంధీ తన కొడుకులకు మౌఖిక పాఠాలు నేర్పాడు. ఆ రోజుల్లో ఆయనకు తీరిక బాగా తక్కువగా ఉండేది. ఆయన కార్యాలయానికి వెళ్లేటప్పుడు కొడుకులను తనతో నడిపించుకొని వెళుతూ వారికి గుజరాతీ సాహిత్యం, కవిత్వం, ఇతర విషయాలు బోధించేవాడు. కొద్దికాలంపాటు వారికి ఆంగ్లం బోధించేందుకు ఒక ఉపాధ్యాయురాలిని కూడా నియమించాడు. వారు ఆమె వద్ద కొంతా, గాంధీ ఆంగ్ల స్నేహితుల వద్ద కొంతా ఆంగ్లం నేర్చుకున్నారు.

ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌లో గాంధీ ఆశ్రమవాసుల పిల్లల కోసం ఒక ప్రాథమిక పాఠశాల ప్రారంభించాడు. ఆయనే దానికి ప్రధానోపాధ్యాయుడు. ఇతర సహచరులు ఆయనకు సహాయపడేవారు. అక్కడి విద్యార్థులు వివిధ మతాలకు చెందినవారు, ఉపాధ్యాయులు ఇంగ్లాండు, జర్మనీ, ఇండియా తదితర దేశాలకు చెందినవారు. ఉపాధ్యాయులు శారీరక శ్రమతో ఎంత తీరిక లేకుండా ఉండేవారంటే ఒక్కొక్కసారి పంటపొలాల నుంచి బురదకాళ్లతోనే తిన్నగా తరగతులకు వచ్చేసేవారు. గాంధీ అయితే ఒక్కోసారి తన భుజం మీద పసిపిల్లవాడిని జోకొడుతూనే పాఠాలు చెప్పేవాడు. తాను ఆచరించని ఏ పనీ ఆయన విద్యార్థులను బోధించేవాడు కాదు. "ఒక భయస్థుడైన ఉపాధ్యాయుడు తన విద్యార్థులను ఎప్పటికీ ధైర్యవంతులుగా చేయలేడు," అనే వాడాయన, "ఒక ఉపాధ్యాయుడు శిష్యులకు తానే ఒక పాఠం కావాలి." గాంధీ విస్తారంగా పుస్తకాలు చదివేవాడు. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకోవాలనే ఆసక్తితో ఉండేవాడు. 65 యేళ్ల వయసులో ఆయన నక్షత్రాల గురించి అధ్యయనం ప్రారంభించాడు.

ఫీనిక్స్ సెటిల్‌మెంటులోని పాఠశాలను ప్రయోగాత్మకంగా నడిపేవారు. అక్కడ చాలా కఠిన నియమాలుండేవి. జీవితం నిరాడంబరంగా, కఠినంగా ఉండేది. బానిస కార్మికులతో ఉత్పత్తి చేస్తారు కాబట్టి టీ, కాఫీ, కోకోల సేవనంపై నిషేధం ఉండేది. విద్యార్థులలో చాలామంది అక్కడే నివసించేవారు. గాంధీ చాలా అరుదుగా పుస్తకాలతో పాఠాలు చెప్పేవాడు. పుస్తకాల పాఠాలతో బరువును మోపి వారి మెదళ్లను మొద్దుబార్చడం ఆయనకు ఇష్టంలేదు. తన చిన్నతనంలో పరీక్షలకోసం తీవ్రంగా చదవటం అనేది పుస్తక పఠనం మీద ఆసక్తిని పోగొట్టిన సంగతి ఆయన గుర్తు చేసుకొనేవాడు. చదవటం, పునశ్చరణ చేయటం, అప్పజెప్పటం అనే బండపద్ధతికి ఆయన అంత ప్రాధాన్యత యిచ్చేవాడుకాదు. మానసిక సంస్కారం, వ్యక్తిత్వ నిర్మాణం ఆయన బోధన లక్ష్యాలు. అన్ని మతాలను గౌరవించటం విద్యార్థులకు నేర్పించేవాడు. రంజాన్ నెలలో ముస్లిమ్ విద్యార్థులతో పాటు హిందూ విద్యార్థులు కూడా ఉపవాసాలు ఉండేవారు. కొంతమంది ముస్లిమ్ విద్యార్థులను కొన్ని నెలలపాటు హిందూ కుటుంబాలలో ఉంచేవారు. వారు గృహస్థులతో కలిసే భోజనం చేసేవారు. అందరూ పూర్తిగా శాకాహారులే. వారు సామూహిక ప్రార్థనలలో పాల్గొనేవారు. తోటపనిలోనూ, పారిశుద్ధ్యపనిలోనూ, చెప్పుల తయారీలోనూ, వడ్రంగం పనిలోనూ, వంటపనిలోనూ సహాయపడేవారు. విద్యార్థులకు సంగీతాన్ని ఆస్వాదించడం నేర్పేవారు. టెన్నిస్సో, క్రికెట్టో ఆడటానికి బదులు విద్యార్థులు రోజువారీ పనులకు సంబంధించిన శారీరక శ్రమచేసి

దృఢంగా ఎదగాలని ఆయన కోరుకొనేవాడు. టాల్‌స్టాయ్ క్షేత్రంలోనూ, సబర్మతీ ఆశ్రమంలోనూ కూడా గాంధీ చెప్పుల తయారీలో శిక్షణ ఇచ్చేవాడు. టాల్‌స్టాయ్ క్షేత్రంలో ఆయన ఉర్దూ, తమిళ భాషలకు సంబంధించిన ప్రాథమిక పాఠాలు చెప్పేవాడు. సాహిత్యశిక్షణ ఎప్పుడూ మాతృభాషలోనే జరిగేది. గాంధీకి గుజరాతీ, మరాఠీ, హిందీ, ఉర్దూ, తమిళం, ఇంగ్లీష్, ఫ్రెంచ్, లాటిన్ భాషలు వచ్చు.

సబర్మతీ ఆశ్రమంలో ఫీజులేమీ తీసుకునేవారుకాదు. తల్లిదండ్రులే స్వచ్ఛందంగా ఆశ్రమనిధికి ఎంతోకొంత ఇస్తారని ఆశించేవారు. నాలుగేళ్ళ వయసు దాటిన పిల్లలను గురుకుల విద్యార్థులుగా చేర్చుకొనేవారు. చరిత్ర, భూగోళం, గణితం, అర్థశాస్త్రాలను స్థానికభాషలో బోధించేవారు. సంస్కృతం, హిందీ, ఏదో ఒక ద్రావిడభాష నేర్చుకోవడం తప్పనిసరి. ఇంగ్లీషు ద్వితీయభాషగా ఉండేది. ఉర్దూ, తమిళం, తెలుగు, బెంగాలి అక్షరాలుకూడా నేర్పేవారు. రోజుకు మూడుసార్లు ఆహారం ఉండేది. అది చాలా సాధారణంగా ఉండేది. ఉప్పు తప్ప మరే మసాలా దినుసులు వాడేవారు కాదు. ఒకేలాంటి సాధారణ దుస్తులను వాడేవారు. అవికూడా స్వదేశీ దుస్తులైతే బావుంటుందని సూచించేవారు. బాలబాలికలు కలిసే విద్యాభ్యాసం చెయ్యాలని గాంధీ సూచించేవాడు, "మన లైంగిక దృష్టికోణాన్ని వదుల్చుకోవాలి. పిల్లలకు ప్రమాద అవకాశాలను ఎదుర్కొనే అవకాశమివ్వడానికే నేను మొగ్గుచూపుతాను. మరీ గాజుబొమ్మల లాగా సంరక్షించడం మంచిది కాదు." బాల బాలికల మధ్య దుష్ప్రవర్తనకు సంబంధించిన సమస్య ఏదైనా తలెత్తితే గాంధీ పరిశుద్ధ ఉపవాసాన్ని ఆశ్రయించేవాడు.

నూలు వడకంతోపాటు, పత్తి ఒలవడం, ఏకులు తయారుచేయడం కూడా నేర్పేవారు. ఆ విధంగా ఏదో ఒక వృత్తిపని నేర్చుకుంటూ తమ చదువుకు సంబంధించిన ఖర్చులలో కొంతవరకూ సంపాదించుకొనేవారు. వారికి సెలవలు ఉండేవి కావు. వారానికి రెండు రోజులు వారి సొంత పనులు చేసుకొనేందుకు కొంత సమయం ఇచ్చేవారు. వారు తగిన ఆరోగ్యంతో ఉంటే యేడాదికి మూడు నెలలు పాదయాత్ర చేయవచ్చు. గుజరాత్ విద్యాపీఠంలో* గాంధీ మౌఖికంగా బైబిలు పాత నిబంధనలోని కథలు, ఆంగ్ల సాహిత్యంలో కొన్ని ఎంచుకున్న భాగాలు చెప్పేవాడు.

కేవలం కొద్దిమంది మధ్యతరగతి వారి అవసరాలు తీర్చేందుకు బదులుగా, కోట్లాది మంది సామాన్యులకు ఉపయోగపడేలా మొత్తం ఉన్నత విద్యా వ్యవస్థనే

* గుజరాత్ విద్యా పీఠాన్ని 1920లో అహ్మదాబాదులో గాంధీ స్థాపించాడు. మకాలే విద్యకు వ్యతిరేకంగా దాస్యశృంఖలాలను తెంచుకుని జాతి నిర్మాణం గావించే యువతను తయారు చేయాలన్నది గాంధీ ఆశయం. 1963లో డీమ్డ్ విశ్వవిద్యాలయంగా ఇది గుర్తింపబడింది.

సంస్కరించాల్సిన అవసరం ఉందని గాంధీ భావించేవాడు. వాళ్లకు పూర్తిగా పరాయిదైన ఇంగ్లీషును నేర్చుకోవడానికి ఎంతెంత సమయం, శక్తీ వృధా అవుతున్నాయో, దాని వల్ల వారు తమ దేశీయ వారసత్వానికి ఎంతగా దూరమవుతున్నారో ఆయన గుర్తుచేసేవాడు. ఉన్నత విద్య కూడా విద్యార్థుల మనసుల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగించడం లేదు. చాలా మంది తమ కళాశాల చదువు పూర్తి చేసిన తర్వాత ఏమి చేయాలి అనే సంశయంలోనే ఉంటున్నారు. ఉన్నత విద్య అనేది భారతదేశంలోని విభిన్న సంస్కృతులకు చెందిన గత సాంప్రదాయాల పునాదులను, ఆధునిక అనుభవాలతో మెరుగులు దిద్దిన సమ్మేళనంగా ఉండాలని ఆయన భావించేవాడు. తెలివిగల, నిజాయితీపరులైన, ఆరోగ్యవంతులైన గ్రామీణులుగా ఎక్కడైనా, ఎప్పుడైనా తమ జీవన వ్యయాన్ని సంపాదించుకోగల సమర్థులుగా విద్యార్థులు ఉండాలి. ఒక విద్యార్థికి రాయడానికి ముందు చదవడం నేర్పాలని గాంధీ పట్టుపట్టేవాడు. చక్కటి చేతిరాత మంచి చదువులో భాగమని ఆయన భావించేవాడు, తన దస్తూరీ బాగుండదని ఆయన సిగ్గుపడేవాడు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ముందుగా సరళ రేఖలు, వక్ర రేఖలు, త్రిభుజాలు, పిట్టలు, పూలు, ఆకులు గీయడం నేర్పాలని అప్పుడు అక్షరాలను దిద్దకుండానే రాయడం వస్తుందని ఆయన సూచించేవాడు. గ్రామీణ భారతదేశపు అవసరాలని పట్టించుకోని అప్పటి ప్రాథమిక విద్య ఆయనకు ఒక నాటకంగా అనిపించేది.

పిల్లలను కేవలం అక్షరాస్యులుగా కాకుండా వారిని వెన్నెముక కల వ్యక్తులుగా తయారు చేసేలా వారిలోని ప్రతిభను వెలికి తీయాలని ఆయన భావించేవాడు. 30 యేళ్లపాటు విద్యావ్యవస్థ గురించి అధ్యయనం చేసిన తర్వాత చేతివృత్తులు ద్వారా విద్య నేర్పే ఒక పద్ధతిని ప్రవేశ పెట్టాడు. తన 63 యేళ్ల వయసులో ఆయన జైలులో ఉన్నప్పుడు తన విద్యా సిద్ధాంతానికి అక్షరరూపమిచ్చాడు. తర్వాత కాలంలో అదే *నయీ తాలీం** ప్రాథమిక విద్య, లేదా వార్ధా విద్యా ప్రణాళిక కింద రూపొందింది.

విద్యార్థులకు శారీరక శిక్షలు వేయడానికి గాంధీ వ్యతిరేకం. ఆయన జీవితంలో ఒకే ఒకసారి ఒక అల్లరి పిల్లవాడిని రూళ్లకర్రతో కొట్టాడు. అయితే స్వీయ నియంత్రణ కోల్పోయినందుకు ఎంతగానో బాధపడ్డాడు. దెబ్బలు కలిగించిన నొప్పికి ఆ పిల్లాడు ఏడవలేదు కానీ, గాంధీ దుఃఖాన్ని చూసి, ఆయన్ని అంతగా బాధపెట్టినందుకు అతనికీ దుఃఖం వచ్చింది. క్షమించమని, ఇంకెప్పుడూ అల్లరి చేయననీ గాంధీని వేడుకున్నాడు.

---

* నయీ తాలీంని గాంధీ 1937లో ప్రకటించాడు. చదువుతో పాటు పని కూడా నేర్పాలన్నది దీని ప్రధాన సూత్రాలలో ఒకటి.

విద్యార్థులు ఆటలలో పోటీ పడటాన్ని గాంధీ ప్రోత్సహించేవాడు కానీ చదవులో ఒకరిని మరొకరు ఓడించాలని ఎప్పుడూ సూచించేవాడు కాదు. ఆయన మార్కులు వేసే పద్ధతి అసాధారణంగా ఉండేది. ఒక విద్యార్థి రాసిన సమాధానాన్ని తరగతిలో ఉత్తమ విద్యార్థి రాసిన సమాధానంతో పోల్చేవాడు కాదు. ఆ విద్యార్థి గతంలో రాసిన సమాధానంతో పోల్చినపుడు అభివృద్ధి కనబడితే దానికే ఎక్కువ మార్కులిచ్చేవాడు. ఆయన విద్యార్థులను పూర్తిగా విశ్వసించేవాడు, పరీక్షల సమయంలో వారికి ఎలాంటి కాపలా పెట్టేవాడు కాదు. బాలబాలికల స్వేచ్ఛ ఆశ్రమ విద్యకు మార్గదర్శకంగా ఉండేది. "అతి చిన్న పిల్లవాడికి కూడా స్వేచ్ఛ ఎంత ముఖ్యమైనదో అర్థమయ్యేలా చెయ్యాలి," అని ఆయన సూచించేవాడు.

దేశంలోని అన్ని గ్రామాలలోనూ ప్రాథమిక పాఠశాలలు పెట్టాలని గాంధీకి ఉండేది. పాఠశాల లేదా కనీసం ఉపాధ్యాయుడైనా ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించినపుడే అది సాధ్యమని ఆయనకు తెలుసు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఏదో ఒక చేతివృత్తి నేర్వాలి. సాధారణంగా అది నూలువడకటం అయి ఉండేది. నిజమైన సమానత్వం, ప్రపంచశాంతి సాధించాలంటే దానికి సంబంధించిన ప్రయత్నం పిల్లల వద్దనుంచే ప్రారంభం కావాలని ఆయన విశ్వసించేవాడు. రాయడం, చదవడం, అప్పజెప్పడం అనే పనులు విద్యార్థులను వారి చేతులు ఉపయోగించనీయకుండా, శారీరక శ్రమ చేయడానికి సిగ్గుపడేవారిలా తయారుచేసేటట్లైతే అలాంటి చదువుకన్నా నిరక్షరాస్యులుగా ఉండిపోయి రాళ్లు కొట్టుకోవడం మెరుగని ఆయన ఉద్దేశం. తన మనుమడికి పత్తిని ఎలా పండిస్తారో, రాట్నం చక్రం ఎలా తయారు చేస్తారో, నూలు నుండి బట్టలు ఎలా నేస్తారో, నూలు చుట్టలను ఎలా లెక్కపెట్టాలో ఆయనే స్వయంగా వివరించేవాడు. అలా ఆ పిల్లాడికి భూగోళం, ప్రకృతి శాస్త్రం, అంకగణితం, రేఖా గణితం, నాగరికత పెరుగుదల తదితర అంశాలు బోధించేవాడు.

ఎదిగిన విద్యార్థులకు నూలు వడకటంలో ఉన్న పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు గాంధీ అడిగే ప్రశ్నలు చాలా కఠినంగా నూలు వడికే పనిలో వారికున్న నేర్పరితనాన్ని, సిద్ధాంతపరమైన, ఆచరణాత్మకమైన సమస్యలు పరిష్కరించడంలో వారికున్న సామర్థ్యాన్ని వెలికి తీసేవిగా ఉండేవి. పిల్లలకు ప్రాథమిక విద్య నేర్పడం ద్వారా వారికి కొంత ఊహ వచ్చేసరికి వారిని ఇంటికోసం ఎంతో కొంత ఆర్జించే సభ్యులుగా ఎలా చేయవచ్చో గాంధీ చూపించాడు. కానీ నయీ తాలీమ్ లక్ష్యం విద్యార్థులకు వృత్తి నేర్పడం మాత్రమే కాదు: దాని ద్వారా వారిని సంపూర్ణ మానవులుగా తీర్చిదిద్దడం. కుర్చీలో కూర్చున్నంత మాత్రాన ఉబ్బితబ్బిబ్బు కావడం, చీపురు పుచ్చుకున్నంత

మాత్రాన సిగ్గుపడటం విద్యార్థులకు అలవాటు కాకూడదని ఆయన కోరిక. ఒక మనిషి నైతిక ఔన్నత్యానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి అక్షరాస్యతా ఒక్కటే ఏమాత్రం దోహదపడదని ఆయన నొక్కి చెప్పేవాడు.

విద్యార్థులకు తరచుగా ఇచ్చే ఉపన్యాసాలలోనూ, కాశీ విద్యాపీఠం స్నాతకోత్సవ ఉపన్యాసంలోనూ ఆయన విద్యార్థుల లక్ష్యం మంచి ఉద్యోగం, ఉపాధి సంపాదించడం మాత్రమే కాదనీ, జాతీయ జీవన విధానాన్ని బలపరచడం, ధైర్యవంతులైన పోరాట యోధులుగా, ధృడమైన వ్యక్తిత్వం కలవారిగా తయారుకావడమనీ నొక్కి చెప్పేవాడు. గ్రామీణుల జీవితాలను అధ్యయనం చేసి వాటిని మెరుగుపరిచే మార్గాల గురించి అన్వేషించడం కూడా విద్యార్థుల కర్తవ్యమేనని ఆయన బోధించాడు. లక్షలాది మందిలో మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు, తాము అసమర్థులం అనే భావననూ పోగొట్టడానికి సామూహిక వయోజన విద్య అవసరమని ఆయన విశ్వసించాడు. విద్య మీద గాంధీ అభిప్రాయాలు రస్కిన్, టాల్‌స్టాయ్, టాగూర్‌ల అభిప్రాయాలతో ప్రభావితమయ్యాయి. ఒక విద్యావేత్తగా ఆయన ప్రపంచంలో పేరుపొందిన ప్రయోగశీలుర సరసన నిలుస్తాడు. ఆయన బీహార్‌లో కొన్ని పాఠశాలలను, బెంగాలులో జాతీయ కళాశాలను, అహ్మదాబాదులో జాతీయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఇన్ని గొప్ప, విన్నూత్న ఆలోచనలున్న ఈ ఉపాధ్యాయుడికి ఆయన గ్రాడ్యుయేట్ కాదని (మెట్రిక్యులేషన్, లండన్‌లో బారిస్టరు మాత్రమే చదివాడని) ఆయన యుక్త వయసులో నెలకు 75 రూపాయల వేతనం కలిగిన ఉపాధ్యాయ ఉద్యోగం రాలేదు.

# నేత పనివాడు

ఒకసారి గాంధీని అరెస్టు చేసినప్పుడు మేజిస్ట్రేట్ "మీ వృత్తేమిటి?" అని అడిగాడు. "నేనొక రైతుని, నేతగాడిని. నూలు వడుకుతూ, బట్టలు నేస్తూ ఉంటాను," అని గాంధీ సమాధానమిచ్చాడు. అప్పుడు ఆయన వయసు 64 సంవత్సరాలు. అంతకు పాతికేళ్ల ముందు ఆయన హింద్ స్వరాజ్* అనే గ్రంథం రాసాడు. అందులో ఆయన స్వదేశీ వస్తువుల వాడాల్సిన అవసరాన్ని, లోపల నుంచి బయట నుంచీ జరుగుతున్న దోపిడీ నుంచి భారతదేశాన్ని కాపాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. అప్పటి వరకూ ఆయన చేతి మగ్గాన్ని చూడలేదు, చరఖాకి, చేతిమగ్గానికి ఉన్న తేడాకూడా ఆయనకు తెలియదు.

* దీనిని గాంధీ 1909లో రాశాడు.

కానీ ఇంగ్లాండు నుంచి దిగుమతైన వస్త్రాల కారణంగా భారతీయ నేతపనివారి జీవితాలు ఎంతగా నాశనమయ్యాయో ఆయనకు తెలుసు. భారతీయులు విదేశీ నాజూకు వస్త్రాల మీద మోజుపడటం ద్వారా ఒక విదేశీ ప్రభుత్వం మన దేశంలో పట్టు సంపాదించి బలపడేందుకు ఎలా అవకాశమిచ్చారో కూడా ఆయనకు తెలుసు. బ్రిటిషు వారు తమ మిల్లు వస్త్రాల ఎగుమతులను ఎలా పెంచుకున్నారో ఆయన పుస్తకాలలో చదివాడు. ఈస్టిండియా కంపెనీవారు తమ వస్త్రాలకు పోటీ లేకుండా చేయడం కోసం సన్నని నూలు వస్త్రాలు నేసే నేతవాళ్ల బొటనవేళ్లను నరికేశేవారట.

రెండొందల యేళ్ల క్రితం భారతదేశం నుంచి యేడాదికి 30 లక్షల రూపాయల విలువైన చేనేత వస్త్రాలు ఎగుమతి చేసేవారు. భారతదేశాన్ని బ్రిటిషువారు ఆక్రమించిన తర్వాత 40 యేళ్లల్లో అన్ని ఎగుమతులూ ఆగిపోయాయి. ఆ తర్వాత వందేళ్లలో భారతదేశం యేటా 60 కోట్ల రూపాయల విలువగల బ్రిటిషు వస్త్రాలను దిగుమతి చేసుకోసాగింది, మొత్తం దిగుమతులలో ఇది 25 శాతం. ప్రపంచం ఈర్ష్య పడేస్థానంలో ఉన్న భారతీయ చేనేత పరిశ్రమ ఆ విధంగా శిధిలమయ్యింది. చేనేతపనివారు తమ ఉపాధిని కోల్పోయారు, తిరిగి వ్యవసాయానికి వెళ్లారు, ఆకలితో మరణించారు. “చేనేత కార్మికుల ఎముకలతో భారతదేశం తెల్లపూత వేసుకుంటోంది. ప్రపంచ వాణిజ్య చరిత్రలో ఇలాంటి విషాదం అత్యంత అరుదుగా కనిపిస్తుంది,” అని ఒక వైస్రాయ్ ప్రకటించాడు.

విశ్వవిఖ్యాతమైన షబ్నమ్‌లు నేసే బెంగాలు ముస్లిం నేతగాళ్లు పనిలేనివాళ్లైపోయిన సంగతి, సగర్వమైన పంజాబ్ నేతగాళ్లు తమ మగ్గాలను వదిలి సైన్యంలో చేరి తమ మాతృదేశాన్నే సంకెళ్లల్లో ఉంచేందుకు సహాయపడుతున్న సంగతి గాంధీ తెలుసుకున్నాడు. ఒకప్పుడు గౌరవప్రదమైనదిగా, కళాత్మకమైనదిగా భావించిన వారి వృత్తిని వారే పనికిమాలినదిగా భావించడం మొదలుపెట్టారు. గుజరాత్ నేతగాళ్లు ఉపాధిని వెతుక్కుంటూ తమ గ్రామాలను వదిలి, ముంబయి లాంటి నగరాలలో పారిశుద్ధ్య పనివారుగా జీవించడం ప్రారంభించారు. వారి ఆరోగ్యాలను పాడుచేసుకొని మద్యపానం, జూదం లాంటి వ్యసనాల పాలయ్యారు. చాలా కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. నైపుణ్యంగల పనివారు కూలీలుగా మారారు. నూలు మిల్లులు ధనవంతులను మరింత ధనవంతులను చేశాయి.

దేశాన్ని ఈ ఆధారపడే దుస్థితి నుంచి బయటపడేయాలని విదేశీ వస్త్రాల దిగుమతిని పూర్తిగా ఆపేయాలని గాంధీ పట్టుబట్టాడు. స్వదేశీని ఆచరించడం, అంటే భారతదేశంలో తయారైన వస్తువులను వినియోగించడమే గాంధీ దృష్టిలో స్వరాజ్యానికి పునాది. తన దేశస్తులను తమ కాళ్ల మీద తాము నిలబడుతూ స్వయం సమృద్ధిని

సాధించినవారిగా చేయాలనేది ఆయన జీవిత లక్ష్యం. దాన్ని సాధించడానికి ఆయన కొన్ని షరతులు విధించాడు. స్వదేశీ వస్త్రాలను ఉత్పత్తి చేసేందుకు మరిన్ని మిల్లులు స్థాపించకూడదు. మిల్లుకు పెట్టుబడిదారు యజమానిగా ఉంటాడు. దానిలోని సంక్లిష్టమైన యంత్రాలు, విడిభాగాలు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. చేతివృత్తుల మీద ఆధారపడిన అనేకమంది జీవనోపాధిని యంత్రాల వినియోగం నాశనం చేస్తుంది. కర్మాగారంలో కార్మికుల శ్రమను దోపిడీ చేస్తుంది. కార్మికులు వారి వారి స్వస్థలాను వదిలి వలస వెళ్లి మరమనుషుల్లా పని చేయాలి. “మన అభిరుచులు పతనమై, కలుషితం కాకపోతే మనకు కాలికో (మిల్లులో తయారయ్యే) వస్త్రం కన్నా ఖద్దరునే ఇష్టపడతాం. ఒక కళ జీవనాన్ని నాశనం చేసేదైతే, మరో కళ జీవనాన్నిచ్చేది. యంత్రాలపై భారీస్థాయిలో చేసే ఉత్పత్తి సృజనాత్మకతను, కళాకారుల నైపుణ్యం గల చేతి వేళ్లను మొద్దుబారుస్తుంది,” అనేవాడు గాంధీ. అందమైన అస్సామీ కన్యలు తమ మగ్గాలపై కవితలు నేయడం చూసిన ఆయన ముచ్చటపడ్డారు.

చేనేతను పునరుద్ధరించాలని గాంధీ కలలు కనేవాడు. “నీవొక న్యాయవాదివైతే, నీ వృత్తిని మానేసి చేతిమగ్గం చేపట్టు. నీవొక డాక్టరైతే, నీ వృత్తిని వదిలేసి ఒక చేతి మగ్గం చేపట్టు,” అని ఆయన సూచించేవాడు. ఆయన నేతగాళ్లతో ప్రత్యక్ష పరిచయం ఏర్పరుచుకొని చేతిమగ్గాల గురించి సమాచారం సేకరించేవాడు. భారతదేశంలో చేతిమగ్గాలకు కేంద్రం అహ్మదాబాదు కాబట్టి ఆయన తన మొదటి ఆశ్రమాన్ని అక్కడే స్థాపించాడు. ఆశ్రమవాసులంతా స్వదేశీ దీక్షను పాటించేవారు. వారంతా స్వయంగా వారి చేతిమగ్గాలపై తయారైన వస్త్రాలతో కుట్టిన దుస్తులనే ధరించేవారు. “నీకేది కావాలో అది నేసుకో, లేదా అది లేకుండా జీవించడం నేర్చుకో” అనేది నినాదంగా ఉండేది. ఒక నిపుణుడైన నేత పనివాడి ఆధ్వర్యంలో నేతలో శిక్షణ ప్రారంభమయ్యింది. కొంత మంది ఆశ్రమవాసులు రోజుకు ఎనిమిది గంటల సేపు మగ్గం నడపడం ప్రారంభించారు. 45 యేళ్ల వయసులో గాంధీ రోజుకు నాలుగయిదు గంటలు మగ్గంపై పని చేసేవాడు. ప్రతి నేత పనివాడికీ రోజుకు 12 అణాల వేతనం లభించేది. మొదట్లో 30 అంగుళాల వెడల్పైన వస్త్రాన్ని నేసేవారు. అది మహిళలు ధరించేందుకు తగిన వెడల్పు కాదు. ఆశ్రమవాసులైన మహిళలు ముక్కలతో కుట్టిన చీరలు ధరించాల్సి వచ్చేది. ఒక రోజు ఒక మహిళ తక్కువ వెడల్పు ఉన్న వస్త్రాన్ని ధరించడానికి ఇష్టపడక మిల్లు వస్త్రం ధరించాలనుకుంది. ఆమె భర్త గాంధీ సలహా అడిగాడు. వెడల్పైన మగ్గంపై పనిచేయడం నేర్చుకోమని గాంధీ సూచించాడు. తర్వాత త్వరలోనే వెడల్పైన ధోవతీలు, మహిళలకు అనువైన చీరలు ఆశ్రమంలోనే తయారుకాసాగాయి. బయట

నేతవాళ్లు చేతితో తయారు చేసిన నూలు వాడేవారు కానీ, దానితో వస్త్రాలు నేయడం, మిల్లు నూలుతో నేయడం కన్నా కష్టం కాబట్టి ఎక్కువ డబ్బులు వసూలు చేసేవారు. స్వాతంత్ర్యం తర్వాత ఒక ఖాదీ కార్యకర్త నూలు వడికేవాళ్లకు ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని సూచించాడు. నేతగాళ్లు వాళ్ల కోటా చేతి నూలును వడికితే తప్ప వారికి మిల్లు నూలు కోటా విడుదల చేయకూడదని మరొకరు సూచించారు. కానీ ఏ రకమైన నిర్బంధమైనా అది ఖాదీ మీద వ్యతిరేకతకు దారి తీస్తుంది కాబట్టి అలాంటి నిబంధనలు ఏవీ గాంధీకి ఇష్టంలేదు. నేతగాళ్ల కష్టం తగ్గించేలా మంచి నూలు తయారుచేయాలని ఆయన సూచించాడు. మిల్లు నూలు మీద ఆధారపడటం చివరకు వారి వృత్తికే ఎసరుపెడుతుందని ఆయన నేతగాళ్లను హెచ్చరించాడు. మిల్లు యజమానులు గొప్ప మానవతావాదులేమీకాదు కాబట్టి చేనేత వస్త్రాలు వారి మిల్లు వస్త్రాల నాణ్యతకు దగ్గరగా వస్తున్నాయని భావించిన మరుక్షణం చేనేత పనివారి కంఠం చుట్టూ ఉచ్చు బిగించడానికి వెనుకాడరు. అందరూ నూలువడకడం నేర్చుకొన్నట్లే అందరూ నేత నేయడం కూడా నేర్చుకుంటే చేతి నూలు వడకడంలో ఉన్న కష్టాల గురించి ఇంత సమస్య తలెత్తేది కాదు. “అందరినీ నూలు వడకమని చెప్పినట్లే అందరినీ నేత నేయమని చెప్పకపోవడం నా తప్పే,” అని ఆయన అంగీకరించాడు.

## నూలు వడికేవాడు

మిల్లునూలుతోనే చేతిమగ్గంపై నేతపనిని గాంధీ నేర్చుకున్నాడు. కానీ ఇది స్వయం సమృద్ధికి దూరం కాబట్టి ఆయనకు సంతృప్తినివ్వలేదు. పత్తిని పండించడం మొదలు, పత్తి తీయడం, ఏకుల తయారీ, నూలువడకడం, బట్టలు నేయడం వరకూ మొత్తం బట్టల తయారీలోనే నైపుణ్యం సాధించాలని ఆయన భావించాడు. ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ కూనిరాగం తీసి ప్రస్తుతం మూల పడిన చరఖా కోసం ఆయన అన్వేషించాడు. ఒక మహిళ ఎక్కడో గ్రామంలోని ఇంట్లో పని చేస్తున్న ఛరఖాను ఒకదాన్ని కనిపెట్టి ఆ సంగతి గాంధీకి చెప్పింది. చరఖా వాడకంలో ఆశ్రమవాసులకు శిక్షణ ఇచ్చేందుకు ఆయన త్వరలోనే ఒక నూలు వడికే నిపుణుడిని ఉద్యోగంలోకి తీసుకున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు రాట్నం వడుకుతున్న శబ్దం సంగీతంలా ఆయనకు సాంత్వన చేకూర్చేది. ఆయన త్వరలోనే రాట్నం వడకటం నేర్చుకున్నాడు. ప్రతిరోజూ ఒక అరగంట రాట్నం వడికితే కానీ భోజనం చేయకూడదని ఆయన వ్రతం తీసుకున్నాడు.

నూలు వడకటమనేది ఆయనకు ఒక పవిత్ర కార్యం. ఆయన ఆ వ్రతాన్ని 30 యేళ్ల పాటు అంటే మరణించేంత వరకూ పాటించాడు. ప్రయాణంలో ఉండగా కదులుతున్న రైలులో, ఊగుతున్న ఓడలో కూడా ఆయన రాట్నం వడికేవాడు. రోజంతా సమావేశాల్లోనూ, ముఖ్యమైన వ్యవహారాలను చర్చించడంలోనూ, బహిరంగ సభల్లో ప్రసంగించడంలోనూ గడిపినప్పుడు ఆయన అర్ధరాత్రి తన అరగంట కోటాను పూర్తి చేసేవాడు. ఒకసారి ఆయనకు కొన్ని నెలల పాటు కుడిచేయి నొప్పి చేసింది. అప్పుడు కూడా ఎడమ చేత్తో రాట్నాన్ని వడికేవాడు.

ఆయన బహిరంగసభల్లో వేదిక మీద కూర్చున్నప్పుడు కూడా రాట్నం తిప్పేవాడు. ఒకసారి టాగూర్‌తో చాలా సేపు మాట్లాడాడు. ఆ తర్వాత "నేనేమైనా మీ సమయాన్ని వృథా చేశానేమో?" అన్నాడు టాగూర్. "అదేం లేదు. నేను మీతో మాట్లాడుతున్నంత సేపూ రాట్నం వడుకుతూనే ఉన్నాను. నేను రాట్నం వడుకుతున్న ప్రతి నిమిషం జాతీయ సంపదకు ఎంతో కొంత జమ చేస్తున్నట్టే లెక్క. ఒక కోటి మంది రోజూ ఒక గంట సేపు రాట్నం వడికితే మనం ప్రతిరోజూ 50,000 రూపాయలు చొప్పున జాతీయ సంపదకు జమ చేయవచ్చు. పైగా ఈ పని ఏ ఒక్క పురుషుని ఉపాధిని గానీ, మహిళ ఉపాధినిగానీ దెబ్బ తీయదు," అన్నాడు గాంధీ. పేదలైతే రాట్నం వడికి, తద్వారా వచ్చిన ఖాదీ వస్త్రాలు ధరించి స్వయం సమృద్ధిని సాధించాలని, ధనికులైతే ఒక పుణ్యకార్యంగా నూలువడికి దానిని పేదలకు దానం చేయాలని గాంధీ సూచించేవాడు. ఈ యుగపు కర్మయజ్ఞం నుంచి ఆయన ఎవరికీ మినహాయింపు ఇవ్వలేదు. టాగూరు, రామన్ లాంటి వాళ్లు కూడా లాంఛనానికైనా రోజూ రాట్నం వడకాలని ఆయన సూచించేవాడు. రాజు, రైతు ఇద్దరికీ ఆహారం, దుస్తులు ఎలా అవసరమో, వారిద్దరికీ శారీరక శ్రమ కూడా అంతే అవసరమని ఆయన విశ్వసించేవాడు. "నేను తయారు చేస్తున్న నూలు ద్వారా నేను భారతదేశపు లక్ష్యాన్ని రూపుదిద్దుతున్నానని నా విశ్వాసం," అని ఆయన వ్యాఖ్యానించేవాడు. "మీరు ధరిస్తున్న ప్రతి గజం ఖాదీ ఒక పేదవాని జేబులోకి కొన్ని పైసలను పంపిస్తోంది. ముతక చేనేత దుస్తులు జీవితంలో నిరాడంబరతను సూచిస్తాయి. ఖాదీ నిరాడంబరతకు ఆత్మ," అని విద్యార్థులతో చెప్పేవాడు. ఖాదీ నాణ్యత మీద చర్చలను కానీ, వినియోగదారుల అభిరుచులను తీర్చాలనే ప్రయత్నాన్ని కానీ గాంధీ ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ఖాదీని తెల్లబరిచేందుకు బ్లీచింగ్ చేయడమే ఆయనకు నచ్చేది కాదు. దాని బదులు వినియోగదారుల అభిరుచిలో మార్పు తెచ్చేందుకు ప్రయత్నించమని ఆయన ఖాదీ బండార్లకు సూచించేవాడు.



ఏడాదిలో నాలుగు నుంచి ఆరునెలలు ఖాళీగా ఉండే గ్రామస్తులు రాట్నం తిప్పాలని ఆయన కోరుకొనేవాడు. ఈ యాంత్రికయుగంలో ఆ ప్రాచీన కళను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్న గాంధీని చూసి విమర్శకులు నవ్వేవారు. "కుట్టు మిషను వచ్చిందని సూదిని మరిచిపోలేదు, టైపురైటర్ వచ్చిందని చేతిరాత మరిచిపోలేదు. అలాగే చేనేత, నేత మిల్లు కలసి కొనసాగగలుగుతాయి. రాట్నాన్ని విశ్వజనీనం చేసి మారుమూల గ్రామాలకు కూడా అందుబాటులోకి తేవచ్చు, కానీ మిల్లులను జనాభాలో ఒక వంతుకు కూడా అందుబాటులోకి తేలేం," అని జవాబు ఇచ్చేవాడు గాంధీ.

1921లో విదేశీ వస్త్ర బహిష్కరణ, సహాయ నిరాకరణ ఉద్యమాలను ప్రారంభించే ముందు గాంధీని చూడటానికి సందర్శకులు వచ్చినప్పుడు, ఆయన తన చరఖా మీద పని చేస్తూ, తానూ, తన భార్యా తమ దుస్తులు తామే ఎలా తయారు చేసుకుంటున్నారో వివరించాడు. ప్రతిరోజూ ఆయన దాని గురించే మాట్లాడేవాడు, దాన్ని గురించే రాసేవాడు, మొత్తం దేశంలో ఒక స్ఫూర్తిని నింపాడు. మోతీలాల్ నెహ్రూ తన విదేశీ వస్త్రాలన్నీ తగలేసి ఖాదీ ధరించడం ప్రారంభించాడు, ఒకసారి అలహాబాదు వీధుల్లో ఖాదీ వస్త్రాలను అమ్మాడు కూడా. వేలాది మంది ఆయనను అనుసరించారు.

1925లో గాంధీ చరఖా సంఘం స్థాపించాడు. 50 వేల చరఖాలు పని చేయడం ప్రారంభించాయి. 1500 గ్రామాలలో 50 వేల మంది నూలు వడికే వారికి, వారితో పాటు నేతగాళ్లకు, రంగులు వేసేవాళ్లు, అద్దకం చేసేవారు, దర్జీలు అందరికీ ఉపాధి లభించింది. తకిలీలను, చరఖాలను తయారు చేయడం వల్ల గ్రామీణ వడ్రంగం పనివారికి, కమ్మరం పనివారికి ఉపాధి లభించింది. ప్రజలకు జీవనాన్నిచ్చేదిగా, మహిళల గౌరవాన్ని కాపాడేదిగా, ఆకలి కడుపులను నింపేదిగా చరఖా తిరిగి మారింది.

తర్వాత అయిదేళ్లలో ఖాదీ ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయి. నూలు వడికేవారు లక్ష మంది ఉపాధిని పొందారు. ఆసక్తి కలవారికి ఖాదీ తయారీలోని అన్ని దశలలోనూ శిక్షణ ఇచ్చేవారు. "ఈ సూక్ష్మ కర్మాగారంతో పోటీ పడగలిగింది ఈ ప్రపంచంలోనే లేదు. చరఖా సంఘంలాగా అంత తక్కువ పెట్టుబడి, ఖర్చులతో 18 యేళ్లలో నాలుగు కోట్ల రూపాయలను అవసరంలో ఉన్న లక్షలాది మందికి అందించిన మరో సంస్థను చూపండి," అనేవాడు గాంధీ. నూలు వడకటం మీద కేవలం ఒక పైసా పెట్టుబడితో ప్రారంభమైన కుటుంబాలున్నాయి, మర్నాడు నూలు అమ్మకంతో వారి పైసా రెండు పైసలయ్యేది. నిదానంగా వారి దుస్తులను వారే సంపాదించుకొనే స్థితికి ఎదిగారు.

తక్కువ ఖర్చుతో మంచి నాణ్యమైన నూలును ఇచ్చే చరఖా తయారుచేసిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతి ప్రకటించారు. గాంధీ ఎర్రవాడలో ఉండగా ఒక పెట్టెలో పట్టే చరఖా నమూనాకు తుది మెరుగులు దిద్దాడు, అది ఎర్రవాడ చరఖాగా ప్రసిద్ధి పొందింది. నూలు వడికే మరొక సరళమైన, చవకైన పరికరమైన ధనుష్ తకిలీని గాంధీ తర్వాతి కాలంలో ప్రాచుర్యంలోకి తెచ్చాడు. ఆయన దానితో చరఖా అంత వేగంగా, అంతే నాణ్యమైన దారాన్ని ఉత్పత్తి చేయగలిగాడు. ఆయన తకిలీతో కూడా నూలు వడికేవాడు. ఆ దారం అంత సన్నగా ఉండేదికాదు కానీ బాగా పురిపెట్టబడి, సమాన మందంతో ఉండేది. ఆయన తాను వడికిన నూలుతో తయారుచేసిన చీరలు కస్తూర్బాకు బహుమతిగా ఇచ్చేవాడు. కస్తూర్బా కూడా క్రమం తప్పకుండా రాట్నం వడికేది.

రాట్నం వల్ల నూలు వడికేవారికి రోజుకు ఒకటి, రెండు అణాలకంటే ఎక్కువ ఆదాయం రాదని ఎవరో అన్నారు. "భారతదేశంలో సగటు తలసరి ఆదాయం రోజుకు గట్టిగా మూడుపైసలు కూడా లేదు. నేను చరఖాతో దానికి అదనంగా మరో మూడుపైసలు కలపగలిగినా, రాట్నాన్ని భారతదేశానికే సమృద్ధిని ఇచ్చే ఆవు అనడంలో తప్పులేదు కదా," అని జవాబిచ్చాడు గాంధీ.

గంటకు రెండుపైసల హీనమైన ఆదాయం కోసం రోజూ పదిమైళ్లు నడచి వచ్చే మహిళల కోసం, నూలు వడికేవారి కోసం ఒక గౌరవప్రదమైన వేతనాన్ని

ఏర్పాటు చేయాలని గాంధీ పట్టుపట్టాడు. ఆ తర్వాత రోజుకు మూడు అణాల కనీస వేతనాన్ని స్థిరపరిచారు.

గాంధీ చరఖా విలువను కేవలం డబ్బుతోనే కొలవలేదు, అది ప్రజలలో పెంపొందించగల బలాన్ని కూడా లెక్కించాడు. చరఖా ప్రజలను వ్యవస్థీకృతం చేస్తుంది, ఒకరితో మరొకరికి సంబంధాలు పెంచి ఒకరికొకరు బంధువులం అనిపించేలా చేస్తుంది. అది శ్రమ శక్తికి ఉన్న గౌరవాన్ని గుర్తిస్తుంది. మానవత్వానికీ, శాంతికీ, స్వాతంత్ర్యానికీ, సేవకూ ప్రతీకగా నిలుస్తుంది. అది చవకగా సరళమైన పదార్థాలతో రూపొందించబడింది, తేలికగా మరమ్మతు చేసుకోగలిగింది. ప్రాథమిక వృత్తి అయిన వ్యవసాయంలా కాక చేతి నైపుణ్యాలకు పదును పెడుతుంది. దీన్ని తయారు చేయడానికి ప్రత్యేకత సాధించిన ఇంజినీర్లు కానీ, దీన్ని ఉపయోగించడం నేర్పడానికి ప్రత్యేక నైపుణ్యం గల ఉపాధ్యాయులు కానీ అవసరం లేదు. ఈ అందమైన చేతికళను గుడిసెలలో బలహీనులు, ముసలి వాళ్లు, అయిదేళ్ల బాలబాలికలు కూడా సాధన చేయవచ్చు.

చరఖా అంత గొప్పదే అయితే ప్రాచీనకాలంలో ఏ యంత్రమూ ఉత్పత్తి చేయలేనంత సన్నని నాణ్యమైన నూలు ఉత్పత్తి చేసి, తమ అవసరాలు తీర్చుకోవడమే కాక దూరప్రాంతాలకు కూడా ఎగుమతి చేయగలిగిన భారతీయులు పేదరికంలోకి, బానిసత్వంలోకి ఎందుకు పడిపోయారని ఒక విమర్శకుడు అడిగాడు.

"ప్రాచీనకాలంలో చరఖాకు స్వాతంత్ర్యానికి ఎటువంటి సంబంధమూ లేదు, పైగా దానికి బానిసత్వపు నేపథ్యం కూడా ఉంది. అప్పుడు పేదమహిళలు వారికి అప్పటి ప్రభుత్వం ఇచ్చే గుప్పెడు తిండికోసం, ఒక రొట్టెముక్క కోసం రాట్నం వడికేవారు," అని గాంధీ జవాబిచ్చాడు. "మనం తెలివిగా రాట్నాన్ని వాడాలి, నూలు వడకడానికి సంబంధించిన ప్రతి చిన్న వివరం మీదా మనకు శాస్త్రీయ అవగాహన ఉండాలి. జీవం లేకుండా రాట్నాన్ని తిప్పడం ఊరికే జపమాలను తిప్పడం లాంటిదే. దాని వెనుక ఉన్న ఉద్దేశం తెలుసుకోనప్పుడు ఒట్టి యాంత్రిక వినియోగం వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు," అని ఆయన వివరించాడు.

"సేవకు చరఖా ఒక సాధనం. మీరు నేర్పే వడ్రంగం, మట్టి బొమ్మల తయారీ, రంగులు వేయడం లాంటి వృత్తులలాంటిది కాదు," అని ఆయన ఉపాధ్యాయులకు చెప్పేవాడు. సూర్యుని చుట్టూ గ్రహాలు తిరిగినట్లు మిగిలిన అన్ని చేతివృత్తులూ చరఖా కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆయన భావించేవాడు.

నూలు చుట్టలను లెక్కించడం ద్వారా విద్యార్థులకు అంకగణితం నేర్పవచ్చు, పత్తి పంట మొట్ట మొదట ఎక్కడ పండించారు, దాన్ని పండించడానికి ఎలాంటి నేల

కావాలి, వివిధ దేశాల మధ్య పత్తి వాణిజ్యం (ఎగుమతులూ, దిగుమతులూ) అభివృద్ధి చెందడంలో దశలేవి – ఇలాంటి వాటి ద్వారా విద్యార్థులకు చరిత్ర, భూగోళం, ప్రకృతిశాస్త్రం బోధించవచ్చు. తకిలీ వాడకం ద్వారా విద్యార్థులకు ఇప్పుడు తకిలీ ఇరుసు ఉక్కుతో ఎందుకు చేస్తున్నారు, తకిలీ ఇత్తడి బిళ్ల నిర్దిష్టమైన వ్యాసంతో ఎందుకు చేస్తారు లాంటి వాటి ద్వారా లెక్కలు, తదితర విషయాలు నేర్పవచ్చు.

చరఖాతో కలిపి నిర్వహిస్తేనే తన పుట్టినరోజు వేడుకలను జాతీయస్థాయిలో జరుపుకొనేందుకు గాంధీ అంగీకరించేవాడు. ఖాదీని, రాట్నం వడకటాన్ని ప్రచారం చేయడానికి లభించిన ఏ ఒక్క అవకాశాన్ని ఆయన వదులుకునేవాడు కాదు. ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు అయినప్పుడు కాంగ్రెస్ సభ్యత్వానికి చెల్లించాల్సిన నాలుగణాల చందా బదులు ఖాదీ ప్రాతినిధ్యం తీసుకోవాలని ఆయన సూచించాడు. ప్రతి సభ్యుడూ రోజూ అరగంట పాటు రాట్నం వడికి, నెలకు నిర్దిష్ట మొత్తంలో నూలును ఖాదీ బోర్డుకు పంపాలి. ఖాదీ బోర్డు వద్ద ఖద్దరు కొనేందుకు వచ్చేవారంతా తాము స్వయంగా వడికిన నూలును కనీస మొత్తంలో అయినా తేవాలనే నిబంధన పెట్టమని ఆయన చివరిరోజులలో చరఖా సంఘానికి సూచించాడు. మేం నూలును తయారు చేయలేమని ప్రజలు గొణుక్కున్నప్పుడు, “ఎవరూ నూలు వడకకపోతే ఖాదీ ఎక్కడ నుంచి వస్తుంది?” అని గాంధీ ప్రశ్నించాడు.

భారతదేశంలో బట్టల కరువు వస్తుందనే మాటనే ఆయన కొట్టిపారేసేవాడు. భారతదేశం తనకు కావాల్సిన దానికన్నా ఎక్కువ పత్తిని ఉత్పత్తి చేస్తోందనీ, మనకు భారీగా మానవ వనరులున్నాయనీ ఆయన విశ్వసించాడు. రాట్నం లేదా తకిలీ రూపంలో ప్రతి ఇంట్లోనూ చిన్న నూలు మిల్లు స్థాపిస్తే బట్టల కొరతను అధిగమించవచ్చు. నూలు వడకటం క్రమ క్రమంగా ఆయన మానసిక అవసరమైపోయింది. తాను రాట్నం ద్వారా నిరుపేదలకు, వారి ద్వారా దేవుడికి దగ్గరవుతున్నానని ఆయన భావించేవాడు. “చరఖా మీద నాకున్న మోజు పోవడానికి కొన్ని జన్మలు పడుతుంది. మీరు నన్ను వెలివేసినా, చంపినా నేను చరఖాను వదలను,” అని ఆయన ధ్రువీకరించాడు కూడా.

# వ్యాపారి

“నేను వైశ్యుడిని, నా లోభానికి పరిమితి లేదు,” అని గాంధీ ఒక సందర్భంలో అన్నాడు. ఆయనది వైశ్య కులం. తండ్రి చేసిన దివాన్ పదవికి వారసుడిగా పెరిగాడు,




కానీ ఎప్పుడూ దివాన్‌గా పనిచేయలేదు. జీవితమంతా బిక్షకునిగా గడపాలని నిర్ణయించుకున్నాడు. అయినా ఆయన రక్తంలో ఉన్న వైశ్య లక్షణాలు ఆయన్ను వదలలేదు.

ఆయన చాలా పొదుపుగా ఉండేవాడు. చవకగా, నాణ్యంగా అందంగా ఉండే వస్తువులను తేలికగా పసిగట్టేవాడు. అన్ని సౌఖ్యాలను, షోకులను వదిలి స్వయంగా తయారుచేసుకున్న ఖాదీ వస్త్రం, ముతక దుప్పటి, నాటు తోలు చెప్పులు ధరించడం ప్రారంభించాడు. తన భార్యాపిల్లలు కూడా నిరాడంబరమైన ముతక ఖాదీ బట్టలు ధరించేలా చేశాడు. గాంధీ ఎప్పుడూ విందు భోజనం చేసేవాడు కాదు. ఒకటి రెండు కాల్చిన రొట్టెలు, అన్నం, ఉడికించిన కూరగాయలు, పచ్చి ఆకుకూరలు, మేకపాలు, బెల్లం, తేనె, పళ్లు ఆయన ఆహారంలో భాగం. ఆయన రోజుకు అయిదు రకాల ఆహారం కన్నా ఎక్కువ తీసుకొనేవాడు కాదు. ఒక పేదవాడు రోజుకు అణా మాత్రమే సంపాదించుకొనే దేశంలో, అలంకార వస్తువులు, నగల రూపంలో వేలాది రూపాయలను వృధాగా నిల్వచేయడం నేరమని గాంధీ విశ్వాసం.

ఆయన తన నలుగురు కొడుకులను భారతదేశంలోని కోట్లాది మంది పేదలకు అందుబాటులో లేని ఖరీదైన పాఠశాలలు, కళాశాలలకు పంపలేదు. ఆయనే వారికి గురువయ్యాడు. ఆయన ఎప్పుడూ సేవకులను నియమించుకోలేదు, శారీరకమైన పనులన్నీ ఆయనే స్వయంగా చేసేవాడు. మట్టి గుడిసెలలో ఉండటానికే ఇష్టపడేవాడు. భారతదేశమంతా అనేకసార్లు మూడో తరగతి రైలుపెట్టెలో తిరిగాడు. తన వద్ద ఉన్న అదనపు బట్టల జత, లేదా పత్రికల కట్టనే ఆయన రైల్లో తలగడగా ఉపయోగించేవాడు. ఆయన పక్క మీద స్వదేశీ రగ్గులు, ఖాదీ దుప్పట్లు ఉండేవి. ఒకసారి ఆయన దోమతెర లేకుండా ఉండేందుకు ప్రయత్నించాడు. వళ్లంతా దుప్పటి కప్పుకొని ముఖానికి కిరోసిన్ రాసుకుని పడుకున్నాడు. గ్రామాల్లో దోమతెరలు కూడా కొనుక్కోలేనంత పేదరైతులు ఉన్నారని ఆయన విని, వారిలా ఉండేందుకు ప్రయత్నించాడు.

బ్రిటిషువారు భారతదేశానికి నిజంగా స్వాతంత్ర్యం ఇద్దామనుకుంటున్నారో లేదో తెల్చుకొనేందుకు ఆయన నాలుగోసారి ఇంగ్లాండు వెళ్లినప్పుడు ఓడలో డెక్ మీదే ప్రయాణించాడు. తమతో పాటు పెద్ద పెట్టెల నిండా దుస్తులు తేవద్దని ఆయన తన కార్యదర్శికీ, సహాయకులకూ సూచించాడు. ఇంగ్లాండులో కూడా భారతీయ శైలిలో కుర్తా, ధోవతి, చెప్పులు ధరించమని ఆయన వారిని కోరాడు. ఓడప్రయాణంలో ఉండగా ఒక స్నేహితుడు గాంధీకి 700 రూపాయల ఖరీదైన మంచి నాణ్యమైన శాలువాను బహూకరించాడు. "పేదలకు ఏకైక ప్రతినిధిగా నేను చేయగలిగింది ఇదే," అంటూ ఆ శాలువాను అక్కడే 7000 రూపాయలకు అమ్మేశాడు. "నాకు బహుమతిగా వచ్చిన శాలువాలన్నిటితో ఒక దుకాణం నడపవచ్చు," అనేవాడాయన. శాలువాలను అమ్మగా వచ్చిన సొమ్మును హరిజన సంక్షేమానికి వినియోగించేవాడు.

గాంధీ ఫ్రాన్సులో దిగినప్పుడు అంగ వస్త్రంలో ఉన్న ఆయనను చూసి అక్కడి ప్రజలు విస్తుబోయారు. ఆయన నవ్వుతూ "నాలుగు వరసల దుస్తులు ధరించడం మీ దేశంలో మీకు అలవాటు, కానీ నాలుగు ముక్కలే ధరించడం నాకు ఇష్టం," అన్నాడు. చలిదేశంలో కోట్లూ, సూట్లూ వేసుకున్న వారి మధ్య ఉండీలేని దుస్తులతో ఆయన ఇలాగే తిరుగుతాడా, ఇలాగే ఇంగ్లాడు రాజుగారి దర్శనానికి వెళతాడా అని కొందరు అనుమానిస్తూనే ఉన్నారు. "మా ఇద్దరికీ సరిపడా బట్టలు రాజు గారే వేసుకున్నారు," అని ఆయన చిలిపిగా మెరిసే కళ్లతో వారికి జవాబిచ్చాడు. నాటు చెప్పులు, అంగవస్త్రం, మాసికలతో ఉన్న శాలువాతోనే ఆయన రౌండు టేబిల్ సమావేశానికి హాజరయ్యాడు, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలను, బకింగ్‌హామ్ పాలెస్‌నూ సందర్శించాడు. బ్రిటిష్ ప్రధాని చర్చిల్ కోపంగా ఆయనను "భారతదేశపు

అర్థనగ్న సన్యాసి"గా సంబోధించాడు. గాంధీ దాన్ని గౌరవంగా భావించి గర్వించాడు. లండన్‌లో ఆయన రోజువారీ భోజన ఖర్చు 12 అణాలు దాటలేదు.

ఏ రకమైన వృథా అయినా గాంధీని ఇబ్బందిపెట్టేది. పాతబట్టల పేలికలను కూడా అమ్మవచ్చనీ, పళ్లు తోముకునేందుకు వాడిన పుల్లలను కడిగి ఎండబెట్టి పొయ్యిలోకి వాడవచ్చనీ ఆయన సూచించేవాడు. రోజులో 24 గంటలను వివిధ కార్యక్రమాలకు వినియోగించేవాడు. ఆయన సమయపాలనలో కచ్చితంగా ఉండేవాడు, ఏ కార్యక్రమానికీ ఆలస్యంగా వచ్చేవాడు కాదు. అలాగని ఏ పనీ కంగారుగా చేసేవాడు కాదు. మాటల్లో కూడా పొదుపు పాటించాలని ఆయన నమ్మేవాడు. ఆయన చాలా ఉపన్యాసాలిచ్చాడు, చాలా వ్యాసాలు రాసాడు కానీ అతిశయోక్తులు వాడేవాడు కాదు. ఒకవైపు రాయకుండా ఉన్న ఉత్తరాలను, కవర్లనూ, కాగితాలనూ ఆయన సేకరించేవాడు. సైజులవారీగా వాటిని పొత్తికలుగా పెట్టి ఉత్తరాలు రాసేందుకు వాడేవాడు. ముఖ్యమైన ప్రకటనలు, రాతప్రతులు, వైస్రాయిలకు, రాజకుమారులకు, బ్రిటిషు ప్రధానమంత్రికీ ఇచ్చే జవాబులు అలాంటి కాగితాల మీదే రాసేవాడు. ఒకసారి ఒక బాలుడు బహుమతిగా ఇచ్చిన చిన్న పెన్సిల్, ఆయన చాలా రోజులుగా వాడుతున్న చెరుపురాయి (రబ్బరు) కనిపించకపోతే, అవి కనిపించేదాకా అగ్గగ్గలాడిపోతూ చాలా సేపు వెతికి పట్టుకున్నాడు. స్వాతంత్ర్యం తరువాత మంత్రులు ఎంతో ఖరీదైన కాగితం, ముద్రణతో కూడిన అధికారిక లెటర్‌పాడ్‌లను వ్యక్తిగత ఉత్తరాలకు వాడుతున్నందుకు ఆయన మందలించాడు: "బ్రిటిషు వారి శైలిని, వారి అలవాట్లను అనుకరించడం మనల్ని నాశనం చేయడమే కాక, భారతదేశాన్ని కూడా పతనం చేస్తుందని ఆయన హెచ్చరించాడు. తమ ఖరీదైన అలవాట్లతో పాలిత దేశంలో ఒక విభ్రమ సృష్టించాలని బ్రిటిషువారు భావించారు. మనం ఆ ఖరీదైన అలవాట్లను విడిచిపెట్టేయాలి. చేత్తో తయారుచేసిన కాగితం మీద హిందీ, ఉర్దూలలో సాధారణంగా ముద్రించిన లెటర్‌హెడ్‌లను వాడాలి. ప్రజాసేవకులు ఆడంబరమైన స్వాగతాలను, సత్కారాలను స్వీకరించకూడదు."

పేదలకోసం సమీకరించిన సొమ్ములో ప్రతి పైసా పొదుపు చేయాలని గాంధీ ప్రయత్నించేవాడు. సామాజిక నిధుల కోసం ఆయనకు వచ్చిన మనీయార్డర్లు, చెక్కులు, డ్రాఫ్టులపై కమీషన్ పొదుపు చేయాలని ప్రయత్నం చేసేవాడు. ప్రజా విరాళాలతో దుబారా చేసే కార్యకర్తలు, నిర్వాహకులను మందలించేవాడు. 1896లో గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చినప్పుడు అక్కడి భారతీయ సంఘం వారు ఆయన ఖర్చులకు వెయ్యిరూపాయల విరాళం ఇచ్చారు. ఆయన అందులో ప్రతిపైసాకు లెక్కరాసి వారికి అప్పగించాడు. ట్రాముకు 1 అణా, మంచినీళ్లకు 6 పైసలు, గారడీవాడు 6 పైసలు, మెజీషియన్ 8 అణాలు, థియేటర్ 4 రూపాయలు – ఇలా ఉండేది ఆ లెక్క.

“మన ప్రచారంలో ఆడంబరాలకు, దుబారాకు చోటు లేదు. స్థానిక కార్యకర్తలు నా కోసం బాగా ఖరీదైన పళ్లు తెస్తే లేదా నాకు 12 పళ్లు కావాల్సిన చోట 120 పళ్లు తెస్తే మనం సామాన్య భారతీయుల ప్రతినిధులుగా ఉంటామని చెప్పుకొనే దానికి అర్థమేముంది? అది చాలా అపార్థాలకు దారితీస్తుంది. మనం ఆచరణలో నిజంగా పేదలకు ప్రతినిధులుగా ఉండాలి,” అని గాంధీ తరచుగా చెప్పేవాడు. “నీకు నడిచే శక్తి ఉంటే వాహనం ఎక్కకు,” అని ఆయన సూచించేవాడు. ఆయన యువకుడిగా ఉన్న రోజులలో దీన్ని స్వయంగా ఆచరించేవాడు. దానివల్ల ఆయన పొదుపుచేసేది కొన్ని రూపాయలే అయినా ఆయన దక్షిణాఫ్రికాలో ఉండగా ఒక దుకాణం నుంచి సరుకులు తెచ్చుకొనేందుకు రోజుకు 42 మైళ్లు నడిచి వెళ్లి, వచ్చేవాడు. రోజూ తన కార్యాలయానికీ, కోర్టుకీ కూడా నడిచి వెళ్లి, వచ్చేవాడు.

ఒకసారి “జాతీయతావాదానికి జాతి విద్వేషం అవసరమా?” అనే ఆయన ఉపన్యాసం వినడానికి టికెటు పెట్టారు. అలా వసూలు చేసిన సొమ్మును దేశబంధు మెమోరియల్ నిధికి సమర్పించారు. గాంధీ మొదటిసారిగా “సత్యమే దేవుడు” అనే ఉపన్యాసాన్ని ఒక గ్రామ్‌ఫోను కంపెనీ కోసం రికార్డు చేశాడు. ఒక అరగంటలో ఆయన 65,000 రూపాయలు సంపాదించి దాన్ని హరిజన నిధికి విరాళమిచ్చాడు. ఆయనకు డబ్బు పొదుపు చేయడమే కాదు, సంపాదించడమూ వచ్చు. ప్రభుత్వం ఆయన పుస్తకాలను నిషేధించినప్పుడు ఆయన వాటిని బహిరంగంగా అమ్మాడు. *హింద్ స్వరాజ్* ప్రతులను ఆయనే అయిదు, పది, యాభై రూపాయలకు అమ్మాడు. దాని ముఖ విలువ నాలుగు అణాలు మాత్రమే. దండి సత్యాగ్రహం సమయంలో ఆయన తయారుచేసిన అర తులం ఉప్పును ఆయన అభిమాని 525 రూపాయలకు కొన్నాడు. అప్పుడు అరతులం బంగారం ఖరీదు 40 రూపాయలు ఉండేది. ప్రపంచంలో ఏ వ్యాపారీ కూడా ఉప్పును అంత అద్భుతమైన ధరకు అమ్మి ఉండడు.

ప్రజలు ఆయన ఆటోగ్రాఫ్ సేకరించేందుకు ఆసక్తిగా ఆత్రంగా ఉన్నారని ఆయనకు తెలుసు. అందుకే తన ఆటోగ్రాఫ్ కోసం 5 రూపాయలు తీసుకొనేవాడు. వేలాది రూపాయలు విరాళాలు ఇచ్చిన దాతలకైనా ఆటోగ్రాఫ్ రుసుము నుంచి మినహాయింపు లభించేది కాదు. ఆయన ఆటోగ్రాఫ్ కావాలంటే మళ్లీ అయిదు రూపాయలు ఇచ్చుకోవాల్సిందే. ఖాదీ అమ్మకాలను పెంచేందుకు ఆయన ఒకసారి స్వయంగా ఖాదీ అమ్మకందారుడిగా పనిచేశాడు. గజం బద్దను కుడి చేత్తో, ఖాదీ తానును ఎడమ చేత్తో పట్టుకొని ఓచర్ల మీద సంతకాలు పెడుతూ ఆయన చాలా వేగంగా అమ్మకాలు చేశాడు. 50 నిమిషాలలో ఆయన 500 రూపాయల విలువైన

ఖాదీ వస్త్రాలు అమ్మాడు. ఇంకో సందర్భంలో ప్రయాణంలో ఉండగా ఆయన రైలు ఆగిన ప్రతి స్టేషన్లోనూ ఖాదీ అమ్మాడు, ఒక ఖాదీ ప్రదర్శనను ప్రారంభించాడు. ఆ వారంలో 4000 రూపాయల విలువైన ఖాదీ అమ్ముడయ్యింది. సాధారణంగా ఖాదీ వార్షిక అమ్మకాలు 6000 రూపాయలు ఉంటాయి. ఆయన అప్పీలు కారణంగా ఒక ఖాదీ బండారు తన అమ్మకాలను 48 రూపాయల నుంచి 65,312 రూపాయలకు పెంచుకుంది. కాంగ్రెస్ మహాసభల్లో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనకు వచ్చిన సందర్శకులందరికీ, ఆ హస్తకళా వస్తువులకు స్వచ్ఛంద ప్రకటనా ఏజంట్లు కావాలని అడిగేవాడు.

విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని ఆయన ఇచ్చిన పిలుపు వల్ల బెంగాలులో విదేశీ వస్త్రాల వార్షిక అమ్మకం 50 శాతానికి పడిపోయింది. మిగిలిన రాష్ట్రాలలో కూడా ఇదే పరిస్థితి, విదేశీ వ్యాపారం దాదాపుగా స్తంభించిపోయింది. భారతదేశపు పెరుగుతున్న అవసరాలతోబాటు దాని దిగుమతులు కూడా పెరగాలని ఆయన భావించేవాడు. కానీ మన దేశానికి హాని కలిగించని బ్రిటిషు దిగుమతులను మాత్రమే ప్రోత్సహించాలని భావించేవాడు. చుట్టూ విదేశీ వస్తువులతో మూగి ఉన్నప్పుడు కేవలం ఖద్దరు ధరించినందువల్ల ఏమీ ప్రయోజనం లేదని ఆయనకు తెలుసు. బ్రిటిషువారితో పెద్ద వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు కలసి మన దేశాన్ని దోచుకోనేందుకు అవకాశమిస్తున్నారు. ఆయన భారతదేశం మొత్తాన్ని ఖాదీతో నింపాలని, మరణిస్తున్న కుటీర పరిశ్రమలను బతికించాలని కోరుకొనేవాడు.

శత్రువులా వ్యవహరించే ప్రభుత్వం నుంచి ఆయనకు ఎలాంటి ఆర్థిక సహాయమూ లభించలేదు, ప్రజల సానుభూతి నిరాశాజనకంగా ఉండేది. అయినా ప్రజలకు 'స్వయం సేవ' యొక్క విలువ నేర్పాలని, తమ ఆహారం, దుస్తులు, ఇతర ప్రాథమికావసరాల కోసం తమ స్వంత శ్రమ మీద, నైపుణ్యం మీద ఆధారపడటం నేర్పాలని ఆయన ధృడ సంకల్పంతో ఉండేవాడు. అఖిల భారత గ్రామీణ పరిశ్రమల సంఘం, అఖిల భారత నూలు వడికేవారి సంఘం స్థాపించి, వాటి శాఖలను భారతదేశం అంతటా ఏర్పాటు చేశారు. వార్ధాలోని మగన్ మ్యూజియం నూలు వడకటం, నేతపని, కాగితం తయారీ, తోలు పని, నూనె తయారీ, ధాన్యం ఆడటం, సబ్బుల తయారీ, తేనెటీగల పెంపకం, వడ్రంగం, కమ్మరం మొదలైన చేతివృత్తులకు ఆటపట్టుగా మారింది. స్వయంగా వడికిన నూలుతో తయారుచేసుకున్న దుస్తుల కన్నా చవకైన దుస్తులుండవనీ, సొంత దొడ్లో పండించుకున్న ధాన్యంతో చేసుకున్న రొట్టె కన్నా చవకైన రొట్టె దొరకదనీ గాంధీ గట్టిగా చెప్పేవాడు. ఆయన దృష్టిలో

డబ్బుకంటే జీవితం విలువైనది, నిరంతర నిరుద్యోగం, ఖాళీగా ఉండటం వల్ల వచ్చే నిస్తేజం పేదరికం కంటే భయంకరమైనది. జాతీయ సంక్షేమం దృష్టితో ఆయన మన ఆర్థిక వ్యవస్థ స్వభావాన్ని పునస్సమీక్షించేందుకు పూనుకున్నాడు. "మనం ఎన్నో రకాల ఆహార పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ విదేశాల నుంచి గోధుమలను దిగుమతి చేసుకుంటున్నామని తెలుసా? మనం పాలిష్ చెయ్యడం వల్ల ఆహార విలువ కోల్పోయిన బియ్యాన్ని తింటున్నాం, పోషక విలువలు అతి తక్కువగా ఉన్న పంచదారను ఉపయోగిస్తున్నాం. మిల్లులో తయారైన తక్కువ ఆహార విలువగల పదార్థాలను కొని తింటూ, అనారోగ్యాలను తెచ్చుకుంటున్నాం. గ్రామంలో నూనె గానుగ ఆడే వాళ్లకు పని లేకుండా చేశాం. యాభై యేళ్ల క్రితం గ్రామీణులతో పోలిస్తే, ఇప్పటి గ్రామీణులు సగం తెలివితేటలతో, సగం సమర్థతతో జీవిస్తున్నారు. వాళ్లు పోగొట్టుకొనేది ఎక్కువ, సంపాదించేది తక్కువ. నా పథకంలో గ్రామాల్లో చక్కగా ఉత్పత్తి చేయగలిగినది ఏదైనా పట్టణాల నుంచి దిగుమతి చేసుకోగూడదు," అని ఆయన వాదించేవాడు. ఎవరి ధాన్యాన్ని వాళ్లే దంచుకోవాలని, పంచదార బదులు బెల్లం వాడాలని, నూలు వడకాలని, బట్టలు నేయాలని ఆయన ప్రజలకు సూచించేవాడు. విదేశీ సందర్శకులకు మంచి బెల్లం నమూనాలను రుచి చూసేందుకు ఇస్తూండేవాడు.

ఖాదీని మిల్లు బట్టలతో పోల్చడం మానేయాలని ఆయన దేశస్తులందరికీ చెప్పేవాడు. "మిల్లు యజమాని ఎప్పుడూ తక్కువ ధరకే అందించాలని చూస్తాడు, మనం మాత్రం న్యాయమైన వేతనాలు చెల్లించాలి, చేనేత కార్మికుని జీవనానికి తగినంత వేతనం అతనికి లభించేలా చూడాలి, లేకుంటే మనం కూడా కనబడని దోపిడీని ప్రోత్సహించినట్లు అవుతుంది," అనే వాడాయన. ఒక కాగితపు వ్యాపారి కార్మికులకు రోజుకు ఆరుపైసలు చొప్పున జీతమిస్తున్నాడు. అతను ఇంకా తక్కువ ఖరీదుకి కాగితం సరఫరా చేయడానికి ప్రయత్నించాడు. అంత కంటే తక్కువ ధరకు తాను కాగితం కొనలేనని గాంధీ అతనికి చెప్పాడు.

రైతుల, గ్రామీణ వృత్తి నిపుణుల లాభాలను పీల్చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించాలని గాంధీ కోరుకున్నాడు. భూమిని దున్నే రైతులకు వారి ఉత్పత్తుల పూర్తి ధర ముట్టడం లేదని ఆయనకు తెలుసు. వినియోగదారులు చెల్లించే ధరలో కొంత భాగం మాత్రమే వారికి చేరుతోంది. వారి నిజమైన సమస్య ధరలు తక్కువగా ఉండటం కాదు, దళారీలే. వ్యాపారులు ఆహారం, బట్టల సరఫరాను నియంత్రిచడానికి, అక్రమంగా నిల్వ చేసి, అధిక లాభాలు పొందడానికీ ఆయన వ్యతిరేకి. మోసం ద్వారా సంపద పోగుచేసుకొని, మతపరమైన కార్యక్రమాలకు భారీగా విరాళాలివ్వడం

ద్వారా ఆ పాపాన్ని కడిగేసుకోగలమని భావిస్తున్నారని ఆయన వ్యాపారస్తులపై ఆరోపణ చేసేవాడు. "పెద్ద వ్యాపారులు, పెట్టుబడిదారులు మాటల్లోనే బ్రిటిషువారికి వ్యతిరేకం, పనుల్లో మాత్రం బ్రిటిషువారికి అనుకూలం. దాని వల్ల వారికి వచ్చే లాభం 5%, బ్రిటిషువారికి వచ్చే లాభం 95% అయినా వారి బుద్ధి మారడం లేదు. స్వదేశీ ఉద్యమం జావగారిపోయేందుకు కారణం వ్యాపారస్తులు విదేశీ వస్తువులను కూడా స్వదేశీ ముసుగులో అమ్మేయడమే. భారతదేశానికి నష్టాలు తెచ్చింది వ్యాపారులే అనడంలో నాకెలాంటి సందేహమూ లేదు. అయితే వారి ద్వారానే నేను ఆ నష్టాన్ని భర్తీ చేయగలననే విశ్వాసం నాకుంది," అనేవాడాయన.

## రైతు

రైతును ఈ ప్రపంచానికి తండ్రిగా వర్ణించే కవితను ఒకదాన్ని గాంధీ చదివాడు. "ఈ సృష్టిలో అన్నీ సమకూర్చినవాడు దేవుడైతే, రైతు అతనికి చెయ్యిలాంటి వాడు" అంటుంది ఆ కవిత. రైతులకు పేదరికం నుంచీ, అజ్ఞానం నుంచీ స్వాతంత్ర్యం కల్పించడంలోనే దేశ స్వాతంత్ర్యం ఉందని ఆయన గట్టిగా చెప్పాడు. "75శాతం మందికి పైగా జనాభా వ్యవసాయదారులు. భూమికి జీవం రైతే, భూమి ఎక్కడో కనబడకుండా ఉండే భూస్వామికి కాక, రైతుకే చెందాలి –'భూమి అంతా దేవుడిదే'. రైతుల వద్ద నుంచి వారి కష్ట ఫలితాన్నంతా దాదాపుగా లాగేసుకున్నాక, మనకు స్వరాజ్యం కూడా పెద్దగా మిగలదు. మన విముక్తి కేవలం రైతుల ద్వారానే లభించగలదు. న్యాయవాదులు కానీ, వైద్యులు కానీ, ధనవంతులైన భూస్వాములు కానీ దాన్ని సంపాదించలేరు," అనే వాడాయన. దేశపు పన్నులలో 25% రైతుల నుంచే వసూలవుతాయి. భూమి శిస్తు భారం ఎక్కువగా ఉంది. ఎక్కడైనా ఒక రాజమహలు లాంటి భవనాన్ని కడుతున్నారని వినగానే, అలాంటి దాన్ని చూడగానే "ఆహా ఈ డబ్బంతా రైతుల నుంచే వచ్చిందే కదా," అనేవాడు. నగరాల్లో అభివృద్ధి చిహ్నాలన్నీ ఆయనకు పన్నుల భారంతో, అక్రమ వసూళ్లతో, ఎప్పటికీ తీర్చలేని అప్పులతో, నిరక్షరాస్యతతో, మూఢ నమ్మకాలతో, రోగాలతో బాధపడుతున్న రైతులనే గుర్తు చేసేవి.

గాంధీ రైతుగా జన్మించలేదు, కానీ రైతుగా అయ్యేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేశాడు. చిన్నతనం నుంచీ ఆయనకు పళ్ల మొక్కలు పెంచడమంటే ఇష్టం. ప్రతిరోజూ సాయంత్రం బడి నుంచి రాగానే బకెట్లతో నీళ్లు మోసి, డాబా మీద ఉన్న మొక్కలకు

పోసేవాడు. 36 యేళ్ల వయసులో ఆయన ఆశ్రమంలో రైతులా జీవించడం ప్రారంభించాడు. ఆశ్రమం నిర్మించేందుకు భూమి కోసం వెతుకుతున్నప్పుడు పళ్ల చెట్లతో నిండిన ఒక ఎకరం భూమి ఆయనను ఆకర్షించింది. ఆయన దాన్ని కొని, అక్కడే కుటుంబంతోనూ, స్నేహితులతోనూ స్థిరపడ్డాడు. నిదానంగా వ్యవసాయం మొదలుపెట్టి న్యాయవాద వృత్తి మానేశాడు. అక్కడి నివాసాలను ఆశ్రమవాసులే నిర్మించుకున్నారు. గాంధీ భూమిని దున్నేవాడు, నీరు మోసేవాడు, పళ్లూ, కూరగాయలూ పెంచేవాడు. కలపను నరికేవాడు. కొద్దికాలంలోనే ఆయన ఆ భూమిని ఒక ఉద్యానవనంగా మార్చేశాడు.

దక్షిణాఫ్రికాలో పదేళ్లపాటు గడిపిన రైతు జీవితం ఆయనకు వ్యవసాయానికి సంబంధించి మంచి పరిజ్ఞానాన్ని, అనుభవాన్ని ఇచ్చింది. అహింసాత్మకమూ, శాస్త్రీయమూ అయిన తేనెటీగల పెంపకాన్ని ఆయన ప్రచారంలోకి తెచ్చాడు. ఈ పద్ధతిలో తేనెపట్టును నాశనం చేయడం, తేనేటీగలను చంపడం ఉండదు. వ్యవసాయ భూములకు దగ్గరగా తేనెటీగల పెంపకం నిర్వహిస్తే దిగుబడులు ఎలా పెరుగుతాయో ఆయన వివరించేవాడు. తేనెటీగలు పూవుల నుంచి తేనె తాగేటప్పుడు తమ కాళ్లతో పుప్పొడిని ఒక చోట నుంచి మరొక చోటికి మోసుకుపోతాయి. దీనివల్ల పంటల నాణ్యత, దిగుబడి పెరుగుతాయి.

భూమికి సారం లేదని కానీ, మంచి పనిముట్లు లేవని కానీ, నీటిసరఫరా తగినంతగా లేదని కానీ వచ్చే ఫిర్యాదులను గాంధీ కొట్టిపడేసేవాడు. తన భూమిని చక్కగా ఉపయోగించుకొనే తెలివితేటలే రైతుకు అన్నిటికంటే పెద్ద ఆస్తి అని ఆయన అనేవాడు. రైతనేవాడు శక్తివంతుడిగా, తన మీద తాను ఆధారపడేవాడుగా, రకరకాల పనులు చేయగలవాడిగా ఉండాలని ఆయన భావించేవాడు. నయీ తాలీమ్ నిర్వాహకుడు వాళ్లకు అందుబాటులో ఉన్న భూమి వ్యవసాయానికి పనికిరాదని చెప్పినప్పుడు ఆయన "మేం దక్షిణాఫ్రికాలో ఎలాంటి భూమితో పని మొదలుపెట్టాల్సి వచ్చిందో నీకు తెలియదు. నేనే నీ స్థానంలో ఉంటే నాగలితో పని మొదలు పెట్టను. పిల్లలకు చిన్న పలుగు ఇచ్చి, దాన్ని ఎలా వాడాలో నేర్పుతాను. అదొక కళ. ఎద్దులతో పనిచేయించుకోవడం తర్వాతి దశ. పలుచగా గుల్ల సున్నాన్ని కానీ, పశువుల ఎరువును కానీ చల్లితే మనం రకరకాల కూరగాయలు కుండీ మొక్కలలో పెంచవచ్చు. మానవ మలాన్ని లోతు తక్కువ కందకాలలో పూడ్చి ఎరువుగా మార్చడానికి 15 రోజుల కంటే ఎక్కువ సమయం పట్టదు. వ్యవసాయాన్ని గౌరవప్రదమైన పనిగా భావించడం మన పిల్లలకు నేర్పాలి. అదేమీ తక్కువస్థాయి వృత్తికాదు, గొప్ప వృత్తి," అన్నాడు.




ప్రాథమిక విద్యా పథకంలో వ్యవసాయం ప్రధాన పాత్ర పోషించగలదని గాంధీ భావించాడు.

భారతదేశ విభజనకు ముందు రోజులలో నౌఖలీలోని హిందువులు ఆయనను "మేము ఇక్కడ ఉండటం ఎలా? మేం ఏం తినాలి? ముస్లిం రైతులు మాతో సహకరించడం లేదు, మాకు నాగళ్లు కానీ, ఎద్దులు కానీ ఇవ్వడం లేదు," అని గాంధీని అడిగారు. అప్పుడు ఆయన "అయితే పలుగులతో తవ్వండి. పలుగులతో తవ్విన నేలలో పంట దిగుబడులేమీ తగ్గిపోవు," అని బదులిచ్చాడు.

1943లో గాంధీ జైలులో ఉన్నప్పుడు బెంగాలులో లక్షలాది మంది ప్రజలు ఆకలికి మాడి చనిపోయారు. ఆ దుర్ఘటన జ్ఞాపకాలు ప్రజలు, అధికారుల మనసులలో తాజాగా ఉన్నాయి. 1947లో మళ్లీ కాటకం వస్తుందని భయం వేసినప్పుడు గాంధీ సలహా తీసుకొనేందుకు వైస్రాయి తన కార్యదర్శిని విమానంలో సేవాగ్రామ్‌కు పంపాడు. గాంధీ నిర్భయంగా ఉన్నాడు, రాబోతున్న విపత్తు గురించి భయాందోళనలు వదిలేయాలని ఆయన ప్రజలకు సూచించాడు. "మనకు సారవంతమైన భూమి చాలా ఉంది. తగినంత నీరుంది, మానవ వనరులకు లోటు లేదు. మరి మనకు ఆహార పదార్థాల కరువు ఎందుకొస్తుంది? తమ మీద తాము ఆధారపడటం ప్రజలకు నేర్పాలి. రెండు గింజలు తినేవాడు నాలుగు ఉత్పత్తి చేయగలగాలి. ప్రతి వ్యక్తీ సొంతానికి వినియోగించగల

ఏదో ఒక ఆహారపదార్థాన్ని ఉత్పత్తి చేయడం నేర్చుకోవాలి. కొద్దిగా మట్టిని, కొంచెం పశువుల ఎరువునూ తీసుకొని ఒక కుండ పెంకులో వేసి, అందులో నాలుగు విత్తనాలు చల్లి నీళ్లు పోయడం అందరూ చేయదగిన తేలికైన పని. అన్నిరకాల ఆడంబరమైన ఉత్సవాలూ నిలిపివేయాలి. విత్తనాల ఎగుమతులు ఆపివేయాలి. నిల్వ చేయగల ధాన్యాల నుంచి కాకుండా కారట్లు, చిలకడ దుంపలు, బంగాళ దుంపలు, కంద, అరటి లాంటి వాటి నుంచి కావలసిన పిండి పదార్థాన్ని పొందవచ్చు," అని ఆయన సలహా ఇచ్చాడు. ఆయన స్వయం సహాయక ప్రణాళికను అమలు చేయడానికి దృఢ సంకల్పం, క్రమశిక్షణతో కూడిన కృషి, నిరాడంబరత, కొత్త ఆహార అలవాట్లకు అలవాటుపడే గుణం, విదేశాల ముందు చేయి చాచకూడదనే అభిమానం ఉండాలి.

ఆహారం, దుస్తుల సరఫరా మీద నియంత్రణలు విధించినప్పుడు గాంధీకి ప్రభుత్వ కోటాలతో పనిలేకపోయింది. ఆయన బియ్యం, గోధుమలు, పప్పులు లేకుండానే తిండి తినగలిగాడు, పంచదార వాడటం మానేశాడు. తన బట్టలు తానే తయారు చేసుకున్నాడు.

చేతికి అందుబాటులో ఉన్న పదార్థాలతో, పైసా ఖర్చుకాని ఆవు పేడ, మానవ మల మూత్రాలు, కూరగాయల తొక్కలు, నీటిలోని నాచు, కలుపు మొక్కలతో సేంద్రియ ఎరువు ఎలా తయారుచేయాలో ఆయన హరిజన్ పత్రికలో వివరించాడు. శ్రమ, తెలివితేటలు తప్ప మరో పెట్టుబడి లేకుండా సేంద్రియ ఎరువును తయారు చేయవచ్చు. ఆయన ఆశ్రమాలలో మలమూత్రాలను ఒక లోతు తక్కువ పొడుగాటి గోతులలోకి పంపి మట్టి కప్పేవారు. అడుగు లోతులోపల మట్టిలో ఉండే సూక్ష్మజీవులు మలాన్ని వేగంగా ఎరువుగా మార్చేయగలవు. లోతుగా పాతేసిన మలం, చెత్త చెడువాయువులను ఉత్పత్తి చేస్తాయి, గాలిని కలుషితం చేస్తాయి. ఇలా పారిశుధ్యపనిని, రైతుపనిని కలిపి నిర్వహించడం సాంప్రదాయ రైతులకు నచ్చేది కాదు. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులనే గాంధీ ఇష్టపడేవాడు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి కోసం రసాయన ఎరువులను వినియోగించడం ప్రమాదకరమని ఆయన నమ్మేవాడు. అద్భుతమైన ఫలితాలను ఇచ్చినట్లు కనబడినా అది నేల సారాన్ని నాశనం చేస్తుంది.

నాగలి బదులు ట్రాక్టరు వాడకం కూడా ఆయనకు ఇష్టం ఉండేది కాదు. సబర్మతీ ఆశ్రమంలో ఆయన దాదాపుగా అన్ని రకాల కొత్త నాగళ్లనూ ప్రయోగించి చూశాడు, వాటిలో సాంప్రదాయమైన ఎద్దుల నాగలే మంచి ఫలితాలనిచ్చినట్లు రుజువయ్యింది. పంట పండేందుకు ఎంత లోతు అవసరమో అంత వరకే అది దున్నుతుంది, నేలను నాశనం చేసేంత లోతులకు వెళ్లదు. దానితో బాటు వందలాది

మంది మనుషులు చేసే పనిని తానొక్కటే చేసే యంత్రాల వినియోగం ఆయనకు అసలు ఇష్టముండదు. యంత్రాల వాడకం రైతుల సృజనాత్మక శక్తిని మొద్దుబరుస్తుందని ఆయన భయం. తరాల నుంచి వస్తున్న చిన్న కమతాల సాగు ఆయనకు నచ్చేది కాదు. వంద మంది రైతు కుటుంబాలు కలసి విశాలమైన భూమిని సాగుచేసి వచ్చిన దిగుబాడిని 100 భాగాలు చేసి పంచుకోవాలని ఆయన సూచించేవాడు. ప్రతి ఇంటికీ ఒక జత ఎద్దులు, బండీ ఉండటం వృథా అని ఆయన భావించేవాడు. సామూహిక పశువుల పెంపకం వల్ల పశువులకు సరైన చికిత్స, ఆహారానికి తగినంత పచ్చిక బయళ్లు, విత్తనానికి మంచి ఆబోతుల నిర్వహణ సాధ్యమవుతుంది. చాలాసార్లు పశువుల దాణాకి వాటి దిగుబడి కన్నా ఎక్కువ ఖర్చవుతుంది. పశువుల సంఖ్య పెరిగిన కొద్దీ బీదరికం వల్ల రైతు దూడలను అమ్మేస్తాడు, దున్న పిల్లలను చంపేస్తాడు లేదా వాటికి ఆహారమివ్వకుండా మాడుస్తాడు. పశువుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తూ వాటి బాగోగులు పట్టించుకోకుండా ఉంటాడు.

వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినంత వరకూ అత్యంత విలువైన ఆవును సంరక్షించడంపై గాంధీ చాలా శ్రద్ధ చూపే వాడు. భారతదేశం అంతటా ఆయన చేసిన యాత్రలలో కాంతివిహీనమైన కళ్లతో ఉన్న రైతులు, ఆవుల దయనీయ స్థితిని చూసి ఆయన చాలా దుఃఖించేవాడు. ఆవును పవిత్రంగా భావించే భారతదేశంలోనే భూమి మీద ఎక్కడా లేనంతగా ఆవులను, వాటి జాతిని అవమానిస్తున్నారు, దురుపయోగం చేస్తున్నారు. ఆవును పవిత్రంగా చూడటమంటే, ఆవులను వధిస్తున్నారని ముస్లింలతో హింసాత్మకమైన ఘర్షణలకు దిగడం, ఆవును ముట్టుకొని మనల్ని మనం పవిత్రం చేసుకొనేందుకు తోసుకుచావడంగా మారిపోయింది. చాలా గోశాలలు, పశువుల శాలలు క్రూరమైన హింసకు నిలయాలుగా మారిపోయాయి. పాలు ఇవ్వలేని, వికలాంగ పశువులను సంరక్షకశాలలు సంరక్షించాలని, పశువుల జాతి అభివృద్ధికి తగిన సలహాలు ఇవ్వాలని ఆయన కోరుకొనేవాడు. బాగుంటాయనే కారణంతో గేదె పాలు, గేదె నెయ్యిల కన్నా, ఆవు పాలు, ఆవు నెయ్యిలనే గాంధీ ఎక్కువ ఇష్టపడేవాడు. ఆవు మరణించిన తర్వాత దాని చర్మం, ఎముకలు, ఇతర శరీర భాగాలు అన్నీ ఉపయోగపడతాయి కాబట్టి ఆయనకు ఆవులంటే చాలా ఇష్టం.

ఆశ్రమంలోని గోశాలలో గాంధీ మంచి జాతి ఆబోతులను పోషించేవాడు, చవకైన ఆదర్శవంతమైన ఆవులపాకను నిర్వహించేవాడు. గోశాలకు సంబంధించిన ప్రతి చిన్న విషయం స్వయంగా చూసుకొనేవాడు. కొత్తగా పుట్టిన లేగదూడలను

ప్రేమగా నిమురుతూ పలకరించేవాడు. ఒకసారి ఒక పడ్డకు వైద్యంలేని జబ్బుతో బాధపడుతోంది. అప్పట్లో ఆ జబ్బుకి ఎలాంటి మందులూ అందుబాటులో లేవు. గాంధీ దాని జీవితాన్ని ముగించేయాలని నిర్ణయించాడు, వైద్యుడు దానికి మందిచ్చే సమయంలో స్వయంగా దగ్గరున్నాడు. పేరుపొందిన అహింసా ప్రవక్త చేసిన ఈ హింసాత్మక కార్యం పెద్ద వివాదానికి దారి తీసింది. ఒక జైనుడైతే గాంధీ పాపాన్ని ఆయన రక్తంతోనే కడుగుతానని బెదిరించాడు కూడా. గాంధీ ఈ విమర్శల తుఫానును మౌనంగా, ప్రశాంతంగా ఎదుర్కొన్నాడు.

మరో సందర్భంలో పంటలను, పళ్లను, కూరగాయలను నాశనం చేస్తున్న కోతుల మందను చంపాలనే ప్రతిపాదనతో ఆయన మూర్ఖంగా అహింసను పాటించేవారిని విస్తుపోయేలా చేశాడు. "నేను కూడా ఒక రైతుని. అతి తక్కువ హింసతో నా పంటలను ఎలా రక్షించుకోవాలా అని ఆలోచించడం నా ధర్మం. ఈ కోతుల గొడవ చాలా తీవ్రంగా ఉంది. తుపాకీతో గాలిలో కాల్పులు జరిపినా అవి బెదరడం లేదు. చంపకపోతే పంటలను రక్షించుకోలేని పరిస్థితుల్లో వాటిని చంపాల్సి వస్తుందేమో? నేను దీన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాను," అని వివరించాడు గాంధీ. అయితే ఆశ్రమంలో కోతులను తుపాకులతో కానీ బాణాలతో కానీ చంపాల్సిన అవసరం ఎప్పుడూ రాలేదు.

పేద రైతుల ఆదాయం పెంచడం ఎలా అని గాంధీ ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడు. వారు యేడాదికి నాలుగు నుంచి ఆరు నెలలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేవలం వ్యవసాయంతో కుటుంబం గడుపుకొనే పరిస్థితి లేదు. 30 కోట్ల మంది రైతుల బలవంతపు నిరుద్యోగానికి పరిష్కారంగా ఆయన రైతు మహిళ చేతుల్లో రాట్నాలనూ, పురుషుల చేతుల్లో చేతిమగ్గాలను ఉంచి వాటిని ఉపయోగించు కోవాలని అనుకున్నాడు. సరైన దుస్తులూ, సరైన ఆహారం, సరైన చదువూ లేక బాధపడుతున్న రైతుల జీవన స్థాయిని సంతులిత ఆహారం, గౌరవప్రదమైన ఇల్లు, దుస్తులు, తగిన వైద్యసౌకర్యాలు ఉండే స్థాయికి పెంచాలని, వారికి సరైన చదువు చెప్పించాలని ఆయన కోరుకున్నాడు. అలాగే వారు పోరాడే తత్వాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాలి. రైతు–కూలీ–ప్రజారాజ్యానికి ఆయన మద్దతిచ్చాడు. "తమ దుస్థితికి కారణం దురదృష్టం కాదని, వ్యవస్థేనని రైతులు గ్రహించి తిరగబడిన రోజు వాళ్లు రాజ్యాంగబద్ధం కాని మార్గాలను కూడా అనుసరించేందుకు వెనుకాడరు. నిజమైన స్వరాజ్యమంటే ఏమిటో భారతీయ రైతాంగం అర్థం చేసుకున్న రోజు వాళ్లను అడ్డుకొనే ధైర్యం ఎవరూ చేయలేరు," అనే వాడాయన.

గాంధీ గారి నాయకత్వంలో రైతులు శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని అధికారుల ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉప్పును తయారు చేశారు. బహిరంగ సభలలో భారత స్వాతంత్ర్య ప్రతిజ్ఞ చేశారు. పన్నులు చెల్లించేందుకు నిరాకరించిన ఉద్యమంలో వారి ఆస్తులు, భూములు వేలం వేయబడ్డాయి. వారు డబ్బురూపంలో నష్టపోయినా నైతిక స్థైర్యం పెరిగింది.

# వేలం పాటగాడు

తనను ఎవరైనా మహాత్మా అని పిలిచి, కాళ్లమీద పడటం నేరంగా పరిగణించేలా ఒక బిల్లు తయారు చేయాలని గాంధీ అనుకున్నాడు. కానీ ఆయన వెళ్లిన నగరాలు, గ్రామాల్లో హీరోలకు లభించే స్వాగతాన్ని మాత్రం తప్పించుకోలేక పోయేవాడు. ఏదో ఒక సమస్యలో ఉన్న వారికి సహాయం చేయడానికి ఆయన ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తిరుగుతూ ప్రజలతో సంబంధాలు నెరపేవాడు. అన్ని చోట్లా ఆయనకు విపరీతమైన అభిమానం, విధేయతలతో కూడిన స్పందన లభించేంది. ఆయనకు పుష్పగుచ్ఛాలు, పూలదండలు, ఖరీదైన చట్రాలలో బిగించిన సన్మాన పత్రాలు, పర్సులు, ఆభరణాలు బహుమతిగా లభించేవి. గాంధీ వారి అభిమానాన్ని మెచ్చుకొనేవాడు, కానీ సగటు తలసరి ఆదాయం రోజుకు మూడుపైసలుగా ఉన్న దేశంలో పూలదండలూ, సన్మాన పత్రాలకు డబ్బు దుబారా చేయడం ఆయనకు నచ్చేది కాదు.

ఈ దుబారా ఆపమని ఆయన ప్రజలకు చేసిన విజ్ఞప్తులు వృథా అయ్యాయి. దీనితో ఆయన ఈ దుబారాను సంపదగా మార్చాలని నిర్ణయించుకున్నాడు. ఆయనకి ఒక ఆలోచన వచ్చింది. ఆయనకు డబ్బులు ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నప్పుడు ఆ పని బహిరంగంగా చేసే అవకాశం వారికి ఎందుకు ఇవ్వకూడదు? అందుకే ఆయన తనకు వచ్చిన బహుమతులను ముఖ్యంగా తక్కువ జీవితకాలం గల బహుమతులను వేలం వేయాలని నిర్ణయించాడు. బహిరంగ సమావేశాలలో ఆయన వేదిక మీద కూర్చుని "నా ప్రియమైన బాలికలు ఇక్కడ ఎవ్వరూ లేరు. కాబట్టి నాకు ఈ దండలను ఎలా వినియోగించాలో తెలియడంలేదు. ఎవరైనా ఈ దండను కొనుక్కుంటారా?" అని అడిగేవాడు. "రెండు రూపాయలు ఒకటో సారి, మూడు రూపాయలు, ఐదు రూపాయలు..." ఆయన సరదా ధోరణిలోకి దిగిపోయేవాడు.

ఇంత ఖరీదు నిమ్మపండు, పూలదండ లాంటి చిన్న వస్తువులకే. ఒక్కోసారి ఒక్కో దండ 30/- రూపాయల నుంచి 300/- రూపాయల వరకూ అమ్ముడుపోయేది. ఈ వేలం పాటలలో వస్తువులకు ఎక్కువ ధరలు చెల్లించడంలో గ్రామీణులేం వెనుకబడేవారు కాదు. ఒకసారి గాంధీ ఒక నగిషీలు చెక్కిన పెట్టెను వేలం వేస్తూ "దీని ఖరీదు 250/- రూపాయలు. కాదు నేను పొరబడ్డాను 75/- రూపాయలు," అన్నాడు. ఎవరో 300/- రూపాయలు అన్నారు. "ఆ 300/- రూపాయలు, 300/- రూపాయలు. రండి బాబూ రండి, 300/- రూపాయలేనా? ఒకసారి నేనిలాంటి పెట్టెను 1000/- రూపాయలకు అమ్మాను." మూడు సందర్భాలలో కోల్‌కతా పౌరులు ఆయనకు ఘనంగా సన్మానం చేసి ఎంతో ఖరీదైన నగిషీ పెట్టెలను బహూకరించారు. ఆయనా ఆ మూడింటినీ అక్కడే వేలం వేశాడు. "మీరిచ్చిన బహుమతులను వేలం వేస్తున్నాని మీ ప్రేమను కించపరచినట్లు భావించవద్దు. ఈ పెట్టెలను నేను నాతో తీసుకెళ్లలేను. వీటిని తీసుకెళ్లేందుకు నా వద్ద పెట్టెలేదు, నా ఆశ్రమంలో వీటిని ఉంచడానికి తగిన వసతీ లేదు," అనేవాడు. "ఇలా వేలం వెయ్యడంలో తప్పేమీ లేదని నా ఉద్దేశం. అవి ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తాయి. ఒక మంచి కారణం కోసం విరాళమిచ్చే లక్షణాలను స్త్రీ, పురుషులలో ప్రేరేపించేందుకు ప్రమాదం లేని పద్ధతులివి. నా వేలం పాటలలో పాల్గొనేవారు కేవలం నన్ను సంతోషపెట్టేందుకే పెద్ద ధరలు చెల్లించడం లేదని మనం గమనించాలి. వారి ధనం ఒక ఉదాత్త ఆశయం కోసం వినియోగించ బడుతుందని వారికి తెలుసు."

ధారాళంగా విరాళాలిచ్చేలాగా ఆయన ఆహూతులను ప్రేరేపించలేని సందర్భం చాలా అరుదు. ఒక నిమ్మకాయను 10/- రూపాయలకు, ఒక నూలు దండను 201/- రూపాయలకు, బంగారు తకిలీని 5000/- రూపాయలకు, ఒక నగిషీ పెట్టెను 1000/- రూపాయలకు ఆయన అమ్మాడు. ఒక సంస్థకు శంకుస్థాపన చేసినప్పుడు దానికి ఉపయోగించిన తాపీని, బొచ్చెను ఆయన వేలంలో 1000/- రూపాయలకు అమ్మేశాడు. ఒకసారి వేలంపాటలో ఒక బంగారు లాకెట్ ధరించిన ఒక పిల్లాడిని చూసి చేతులు చాచారు. అతడి తల్లి ఆ పిల్లాడిని ఆయనకు అందించింది. ఆయన పిల్లాడిని ఎత్తుకొని, పిల్లాడి మెళ్లో బంగారు లాకెట్‌ను వేలం వేశాడు.

ఒక సారి ఆయన "నా దగ్గర లెక్కలేనన్ని ఉంగరాలున్నాయి. వాటన్నిటినీ అమ్మేయాలనుకుంటున్నాను," అని ప్రకటించాడు. మూడుసార్లు వేలంలోకి వచ్చిన ఒక ఉంగరం చివరికి 445/- రూపాయలకు అమ్ముడు పోయింది. అప్పట్లో ఆ ఉంగరం ఖరీదు 30/- రూపాయలు ఉండేది. ఒకసారి ఆయనకు వచ్చిన విరాళాల మూటలో

చాలా కరెన్సీనోట్లు, వెండి, రాగి నాణేలతో పాటు ఒక గవ్వ కూడా దొరికింది. ఆయన దాన్నెంతగానే మెచ్చుకున్నాడు. "బహుశా ఏ పేదవాడి వద్దో ఇచ్చేందుకు ఏమీ ఉండి ఉండదు. అందుకే తన వద్ద ఆఖరిగా మిగిలిన గవ్వను ఇందులో వేశాడు. అతని త్యాగాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఇది బంగారంకంటే విలువైనది," అన్నాడు. ఆయన అన్నట్లే అది బంగారు గవ్వ కంటే ఎక్కువ ధరకు అమ్ముడు పోయింది. ఒక అభిమాని 111/- రూపాయలు చెల్లించి దాన్ని స్వంతం చేసుకున్నాడు.

తీరికలేని ప్రయాణాలు, ఖాళీలేని కార్యక్రమాల భారం, నిరంతరం ఎదురయ్యే చిక్కు సమస్యల వత్తిడి ఆయనలోని ఉత్సాహాన్ని, వైశ్య లక్షణాన్ని అణగార్చ లేకపోయాయి. 78 యేళ్ల వయసులో హిందూ, ముస్లిం మతకలహాలు, ఉద్రిక్తతల వత్తిడి తీవ్రంగా ఉన్న సమయంలో బీహార్‌ను గాంధీ సందర్శించాడు. మతకలహాలలో నష్టపోయిన ముస్లింల కోసం విరాళాలు పోగుచేశాడు, బహుమతులుగా వచ్చిన ఆభరణాలను వేలం వేశాడు. గాంధీకి సొంత ఆస్తులు, వస్తువులు ఉండేవి కావు. ఒక పేద ఆశ్రమవాసిగా ఆయన ఒక సామూహిక నిధికి ఒక రాగిపైసా విరాళమిచ్చాడు. దాన్ని ఒక అభిమాని 500/- రూపాయలకు కొన్నాడు.

## యాచకుడు

గాంధీ రోజు రోజుకీ ప్రజా జీవితంలో మరింతగా మునిగిపోయి తన కుటుంబానికీ, న్యాయవాద వృత్తికీ సమయం, శ్రద్ధ కేటాయించలేని స్థితికి చేరుకున్నాడు. తాను ప్రజలకు సేవ చేయాలంటే సౌకర్యాలనూ, సౌఖ్యాలనూ వదిలి మొత్తం వస్తు సంపదను, ఆస్తులను త్యజించి, స్వచ్ఛంద పేదరికాన్ని అనుభవించాలని ఆయన భావించాడు. ఒకానొక స్థితిలో, సంపద కలిగి ఉండటం ఆయనకు నేరంగా అనిపించింది, దాన్ని దానం చేయడం ఆయనకు ఆనందాన్నిచ్చే పనిగా మారింది. ఆయన వద్ద ఉన్న వస్తువులన్నీ ఒకదాని తర్వాత మరొకటి మాయమవడం ప్రారంభించాయి. తనకు తండ్రి నుంచి వచ్చే ఆస్తిపై హక్కును ఆయన వదిలేశాడు. తన భీమా పాలసీ మురిగిపోతుంటే చూస్తూ ఊరుకున్నాడు. నెలకు 4000/- రూపాయలు సంపాదించే న్యాయవాద వృత్తిని వదిలేశాడు. దక్షిణాఫ్రికాకు చెందిన మిత్రులు, అభిమానులు తనకిచ్చిన బంగారం, వెండి, వజ్రాల బహుమతులనూ, ఫీనిక్స్ సెటిల్‌మెంటతో కలిపి 65000/- రూపాయల ఆస్తినీ సామాజిక

కార్యకలాపాలకు ఉపయోగపడేలా ఒక ట్రస్ట్‌కు వీలునామా రాసాడు. ఆయన తనకు సురక్షితమైన జీవితం వద్దనుకున్నాడు, తన భార్యాపిల్లకు కూడా అలాంటి జీవితం లేకుండా చేశాడు.

ఆయన జీవితంలో చివరి 40 సంవత్సరాలు అభిమానులు, స్నేహితులిచ్చిన విరాళాల మీద జీవించాడు. టాల్‌స్టాయ్ క్షేత్రంలో గాంధీ, ఆయన కుటుంబానికి అయిన ఖర్చులను ఆయన జర్మన్ స్నేహితుడు కాలెన్‌బాక్ భరించాడు. భారతదేశంలోని ఆశ్రమాలన్నీ సానుభూతిపరులు, స్వచ్ఛంద దాతల విరాళాలతో నడిచేవి.

పండిత్ మదన్ మోహన్ మాలవీయ 'బిచ్చగాళ్లకు యువరాజు' అనేవారు; గాంధీ 'బిచ్చగాళ్ళకు రాజు'. సామాజిక కార్యక్రమాల కోసం యాచించడంలో గాంధీ ప్రపంచ రికార్డు స్థాపించాడు. గాంధీ తనలో ఉన్న ఈ సామర్థ్యాన్ని దక్షిణాఫ్రికాలో ఉండగా గ్రహించాడు. నాటల్ ఇండియన్ కాంగ్రెస్ కోసం చందాలు వసూలు చేసే పనికి బాధ్యుడిగా ఉండగా ఇది జరిగింది. ఒక రోజు రాత్రి ఆయన ఒక ధనవంతుడైన దాత వద్దకు వెళ్లి 80 రూపాయల విరాళం ఆశించాడు. ఎంత బతిమిలాడినా ఆ ధనవంతుడు 40/- రూపాయలు మాత్రమే చెల్లించాడు. గాంధీ అప్పటికి ఆకలిగా, అలసిపోయి ఉన్నాడు, కానీ పట్టుదలతో ప్రయత్నం కొనసాగించాడు. రాత్రంతా అక్కడే కూర్చొని తెల్లవారే సరికి 80/- రూపాయలను సంపాదించాడు.

దక్షిణాఫ్రికాలో స్థిరపడిన భారతీయ చారిత్రాత్మక పోరాట కాలంలో 5000 మంది నిరసనకారులు, వాళ్ల కుటుంబాల పోషణకు కావాల్సిన విరాళాల సమీకరణలో ఆయనదే ప్రధాన బాధ్యత. వారికి రోజుకు 3,200 రూపాయలు ఖర్చయ్యేవి. గాంధీ కేబుల్ ద్వారా పంపిన అభ్యర్థనకు భారతదేశం సానుకూలంగా స్పందించింది. యువరాజులు, ధనిక వ్యాపారులూ సొమ్ములు పంపించారు. ఒక కాంగ్రెస్ సమావేశంలో గాంధీ ఉద్యమానికి విరాళాలు ఇవ్వాలనే విజ్ఞప్తిని ప్రకటించినప్పుడు సభలో ఉన్నవారు నోట్లు, బంగారం, వెండి రూపంలో విరాళాలు కురిపించారు. గాంధీ అన్ని విరాళాలకు రసీదులు పంపాడు, అందరికీ అయిన ఖర్చులను వివరంగా నివేదించాడు. దాతల మనోభావాలను గౌరవించి, ఒక్క పైసా కూడా సేకరించిన పనికి తప్ప మరే పనికీ ఖర్చు పెట్టలేదు.

ప్రజల సొమ్ము ఖర్చు చేసే విషయంలో ఆయన చాలా జాగ్రత్తగా ఉండేవాడు. తిలక్ స్వరాజ్య నిధి గురించి ప్రశ్నలు తలెత్తినప్పుడు పద్దుపుస్తకాలు తనిఖీ చేసుకొనేందుకు రావాల్సిందిగా విమర్శకులను గాంధీ ఆహ్వానించాడు. తిలక్ స్వరాజ్య నిధికి మూడు నెలల్లో కోటి రూపాయలు సమీకరించాలని ఆయన లక్ష్యం ఏర్పరిచాడు.



ఒక వృత్తిపరమైన నాటక ప్రదర్శనకు ఆయన అయిదు నిమిషాలు వచ్చి వెళితే దానిలోని నటులు 50,000 రూపాయలు చందా ఇస్తారని ఒక స్నేహితుడు ఆయన్ను బతిమిలాడాడు, కానీ అలా వెళ్లడానికి గాంధీ అంగీకరించలేదు. కానీ మూడునెలల్లో తిలక్ స్వరాజ్య నిధికి వచ్చిన చందా 1,15,00,000/- రూపాయలు.

"ధనికుల నుంచి వేలాది రూపాయలకు స్వాగతం. కానీ పేదల నుంచి సేకరించిన చిల్లర పైసలు, విడి రూపాయలు ఎంతో విలువైనవి. మన పనికి అవి ఆశీర్వాదాలు. విలువ తెలిసి ఇచ్చిన ప్రతిపైసా దాతకు ఉన్న స్వరాజ్య కాంక్షకు, పట్టుదలకూ ప్రతీక," అని ఆయన తరచుగా అనేవాడు. విరాళమివ్వడం కోసం వేచి ఉండి, వణుకుతున్న చేతులతో కొంగున కట్టుకున్న ముడులను విప్పే వృద్ధులను తానెప్పటికీ మరిచిపోలేనని ఆయన చెబుతూండేవాడు. వారు ఎంతో కష్టపడి చేసిన పొదుపును అలా ఇవ్వడాన్ని ఆయన అభినందించేవాడు.

తిలక్ స్వరాజ్య నిధితో పాటు గాంధీ వీర బాలిక వాలియమ్మ స్మారక నిధి, గోఖలే స్మారక నిధి, లజపతిరాయ్ స్మారక నిధి, దేశబంధు చిత్తరంజన్ దాస్ స్మారక నిధి, ఆంద్రూస్ స్మారక నిధి, జలియన్‌వాలా బాగ్ బాధితుల స్మారక నిధి వంటివాటికి కూడా డబ్బులు సమీకరించాడు. జలియన్‌వాలా బాగ్‌లో స్మారక స్థూపం నిర్మించడానికి విధించుకున్న గడువులోపల అనుకున్నంత సొమ్ము వసూలు కాకపోతే తన ఆశ్రమాన్ని అమ్మి, ఎంత వస్తే అంత ఇచ్చేస్తానని ఆయన ప్రకటించాడు. దేశబంధు స్మారక నిధికి రెండు నెలల్లో పది లక్షల రూపాయలు వసూలయ్యాయి. టాగూర్ శాంతినికేతన్‌కు చందాలు పోగుచేయడం కోసం దేశమంతా తన నాటకాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ పర్యటించడానికి నిర్ణయించుకున్నారని తెలిసినప్పుడు గాంధీ ఆ వృద్ధ కవిని అంత ప్రయత్నం మానుకోమని కోరాడు. తన తరుపున మొదటి వాయిదాగా 50,000 రూపాయలు విరాళమిచ్చాడు.

దేశంలో వరదలు, కాటకాలు, భూకంపాలు విరుచుకుపడినప్పుడు ఆయన విరాళాలు యాచిస్తూ బయలుదేరేవాడు. ఖాదీ ప్రచారం కోసం, అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం ఆయన భారతదేశమంతా సుడిగాలి పర్యటనలు జరిపాడు. హరిజన నిధికి ఆయన రెండు కోట్ల రూపాయలకు పైగా సమీకరించాడు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపడానికి మాత్రమే డబ్బులు ఇస్తే ఆయన నిరాకరించేవాడు. మనిషి నిజమైన ఆకలి కడుపునకు సంబంధించింది కాదు, గౌరవప్రదంగా, ఆత్మగౌరవం గల పౌరునిగా జీవించడానికి సంబంధించిందని ఆయన విశ్వసించేవాడు. "నగ్నంగా ఉన్నవారికి జీవనభృతి కల్పించే పని చూపకుండా వారికి అవసరంలేని దుస్తులివ్వడం ద్వారా వారిని అవమానించడాన్ని నేను తిరస్కరిస్తాను. మనం వారికివ్వాల్సింది కొన్ని మెతుకులు, ఉపయోగించిన దుస్తులూ కాదు," అనేవాడాయన.

ఒకసారి ఒక జైలు డాక్టరు, "గాంధీజీ, కాళ్లూ, చేతులూ చక్కగా ఉన్న మనుషులు అడుక్కోవడాన్ని నివారించాలని మీకు అనిపించడం లేదా? మీరు ఆ విధమైన చట్టం చేస్తారా?" అని అడిగాడు. "తప్పకుండా. కానీ నాలాంటి మనుషులకు మాత్రం యాచించే స్వేచ్ఛ ఉంటుంది," అని జవాబిచ్చాడు గాంధీ. "ఇచ్చింది బిచ్చగాడు పుచ్చుకోవాలి" అనే సాధారణ నియమాన్ని గాంధీ ఉల్లంఘించేవాడు. ఆయన నినాదాలు, దాతల వద్దకు ఆయన వెళ్లే విధానం, దానం తీసుకునేందుకు ఆయన విధించే షరతులూ అన్నీ అసాధారణంగా ఉండేవి. రైల్లోనో, ప్లాట్‌ఫాం మీదనో, కదులున్న కారులోంచో గాంధీ ఆహూతులకు భిక్షాపాత్ర చాచేవాడు. ఆయన పాత్రలో విరాళం వేయడం కోసం తొక్కిసలాట జరిగేది. వందలాది మంది గ్రామీణులు,

వృద్ధులు, ఒంగిపోయినవారు, మహిళలు, పురుషులు వారి కొద్దిపాటి విరాళాలను ఆయనకు సమర్పించేందుకు మైళ్ల కొద్దీ నడచివచ్చేవారు, గంటలకొద్దీ వేచి ఉండేవారు. కొద్దిమంది తమ పొలాల నుంచి వంకాయలు, గుమ్మడికాయలు, ఇతర కూరగాయలు తెచ్చేవారు. ఒక ఆదర్శ గురుకుల పాఠశాలలోని పిల్లలు తాము చేత్తోవడికిన నూలు గుట్టను, స్వయంగా నేసిన ఖాదీ వస్త్రాన్ని, తాము కొద్దిరోజుల పాటు నెయ్యి, పాలు, గోధుమలు తినడం మానేయడం ద్వారా పొదుపు చేసిన కొద్ది మొత్తాన్ని గాంధీకి విరాళమిచ్చారు. ఒకసారి ఒక వితంతువు పక్కనే ఉన్నవారి నుంచి రెండు అణాలు అప్పుతీసుకొని గాంధీకి విరాళమిచ్చింది. "రెండు అణాలే ఎందుకు ఇచ్చావు?" అని అడిగినప్పుడు ఆమె "ప్రజల కోసం తన సర్వస్వం వదులుకున్న గాంధీలాంటి మహాత్ముడికి విరాళమివ్వాలని నా జీవితకాల కోరిక. అంతే కానీ నేనిచ్చే కొద్ది పైసల వల్ల ఆయన అనుకున్న పని పూర్తవుతుందని కాదు," అని సమాధానం ఇచ్చింది.

కొన్ని లక్షల రూపాయలను సమీకరించడం గాంధీకి చిన్న పిల్లల ఆట. ఆయన తన విజ్ఞప్తిని మైకుల ద్వారా, కేబుల్స్ ద్వారా, వార్తాపత్రికల ద్వారా పంపుతుండేవాడు. ఒకసారి ఆయన ఒక జర్నలిస్టు తలమీద టోపీ లాక్కొని, దానిలోనే విరాళాలు సేకరించడం ప్రారంభించాడు. విస్తుబోయిన ఆ జర్నలిస్టే గాంధీ విరాళాల సేకరణకు మొదటి బాధితుడై, ఆయన ఆధునిక బిక్షాపాత్రలోకి విరాళం సమర్పించుకోక తప్పలేదు.

గాంధీ విరాళాల సేకరణకు బర్మా వెళ్లినప్పుడు "14 యేళ్ల తర్వాత నేను మీ దేశానికి వచ్చాను. 14 యేళ్ల తర్వాత కరువు వచ్చినా మీరు లెక్కచేయరు కదా, నా పర్యటననూ అలాగే అనుకొని ఈ దరిద్రనారాయణుల ప్రతినిధిని మీ విరాళాలతో సంతృప్తి పరచండి. మరోసారి నేను మీ వద్దకు వచ్చే అవకాశం దొరక్కపోవచ్చు," అని పిలుపునిచ్చాడు. అక్కడి ధనవంతులు పీనాసితనంగా ఇచ్చిన కొద్దిపాటి విరాళాలను ఆయన హేళన చేశాడు. "ఈ చందాల చీటీని చింపిపారేసి కొత్త జాబితా రాయండి. నేను గుజరాతీ వైశ్యుడిని, జేబుల లోపలికల్లా చేతులు పెట్టి ఖాళీ చేయడం నాకు బాగా తెలుసు," అన్నాడు. ఆయన హేళనతో చందాలు అప్పటికప్పుడు రెట్టింపయ్యాయి.

ఆయన శ్రీలంక వెళ్లినప్పుడు "మహేంద్రుడు శ్రీలంక వచ్చినప్పుడు భారతదేశంలో ఆకలిచావులు లేవు, మీరు కూడా ఆ విజయంలో భాగం పంచుకున్నారు. మీరు భారతదేశంతో ఉన్న బంధుత్వాన్ని తెంచుకోకుండా ఆ బంధానికి గర్విస్తున్నట్లైతే వారికి ధనమే కాదు, నగలు కూడా ఇవ్వాలి," అని పిలుపునిచ్చాడు. ఆయనకు వారు ఇచ్చిన విరాళాలను తమిళులకే ఉపయోగించాలనే విన్నపాన్ని ఆయన తిరస్కరించాడు, "మీరు నన్ను నమ్మి సొమ్ము ఇచ్చేట్లయితే, దాన్ని ఎక్కడ, ఎవరికి, ఎలా ఖర్చుపెడితే సద్వినియోగం అవుతుందో నాకు తెలుసని కూడా మీరు నమ్మాలి."

ఆయన ఒకసారి ఆవేదనగా "నాకు హనుమంతుడిలా హృదయం చీల్చి చూపించే శక్తిలేదు. ఉంటే మీకు అక్కడ ఆకలితో మలమలలాడుతున్న వేలాది మంది భారతీయుల ముఖాలలో నాకు కనిపించే రాముడు కనబడి ఉండేవాడు," అన్నాడు. ఆయన తరచుగా రోజుకు 12కు పైగా సమావేశాలకు హాజరయ్యేవాడు. "నాకు అణా, అర్ధణా, బేడా, కానీ, పైసా – మీరు ఎంత ఇవ్వగలిగినా ఫర్వాలేదు, ఇవ్వండి," అని విజ్ఞప్తి చేసేవాడు. పౌర సన్మానాలలో పాల్గొని మాట్లాడిన తర్వాత ఆయన "పర్సేది?" అని అడిగేవాడు. "నేను వెళ్లను. మీరిచ్చేదాకా ఇక్కడే కూచుంటాను. వెళ్లి దాని సంగతి చూడండి," అనేవాడు. ఆ విధంగా ప్రజల వద్ద నుంచి చందాలు వసూలు చేసేవాడు. కొన్నిసార్లు ఆయనకు ఇళ్లు, నగలు, చెక్కులు, బంగారం, వెండి, రాగినాణాలు, గుట్టల కొద్దీ నూలు విరాళమివ్వడానికి తోపులాడుకొనే ప్రజల గుంపులు అర్ధరాత్రి వరకూ వేచి ఉండేవి. ఆయన 78వ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు 78 లక్షల నూలు ఉండలు బహుమతిగా ఇచ్చారు.

ఒకసారి విరాళాలలో ఆయనకు ఒక గవ్వ దొరికింది. దాన్ని ఆయన గొప్ప త్యాగానికి గుర్తుగా, బంగారం కంటే విలువైనదిగా స్వీకరించాడు. ఒక హంతకుడు ఉరికంబం ఎక్కబోయే ముందు తన వద్దనున్న 100/- రూపాయలను గాంధీకి ఇవ్వాలని ఆఖరి కోరికగా కోరుకున్నాడు. సాధారణంగా ఒక సమావేశంలో గాంధీ సేకరించిన విరాళాలను మోయడానికి, లెక్కించడానికి ముగ్గురు, నలుగురు సహాయకులు అవసరం అయ్యేవారు. ఒకసారి విరాళాల సేకరణ తర్వాత ఒక కార్యకర్త వచ్చి ఆకుపచ్చ కిలుమురంగుతో నిండిన తన చేతులను చూపాడు. అతను సేకరించిన వాటిలో పేదలు ఎంతో కాలంగా దాచిపెట్టుకున్న పాత రాగినాణేలే ఎక్కువగా ఉన్నాయన్నమాట. అది చూసిన గాంధీ "ఈ బహుమతి ఒక ఆశీర్వాదం. మనం దీన్ని కేవలం అంకితభావం అనుకుంటాం కానీ వాళ్ల దృష్టిలో ఈ అవకాశం నిరాశాపూరిత కారు చీకట్లలో ఒక కాంతిరేఖ. రాబోయే మంచి రోజులకు ఒక సూచిక," అన్నాడు.

వృత్తిపరమైన యాచనను నిషేధించాలని కోరుకోవడం గాంధీ వైరుధ్య సూచికలలో ఒకటి. అన్నిరకాల గౌరవాన్నీ వదిలేసి పొట్ట నింపుకోవడం కోసం బిచ్చగాళ్లు పెట్టే కేకలు గాంధీ భరించలేకపోయేవాడు. పేదలకు పని ఇవ్వడానికి బదులుగా బిచ్చం వేయడాన్ని ఆయన ఆమోదించేవాడు కాదు. భారతదేశంలో బిచ్చగాళ్ళ సంఖ్య 56 లక్షలు దాటిపోవడాన్ని ఆయన నిరసించేవాడు. శారీరకంగా పనిచేసే శక్తి లేని వారు తప్ప వేరెవ్వరూ సమాజానికి పనికొచ్చే పని చేయకుండా దాన ధర్మాల మీద జీవించడం ఆయనకు నచ్చేది కాదు. బిచ్చమెత్తడమే కాదు, బిచ్చం

వేయడం కూడా తప్పే అనేవాడాయన. శరీరంలో ఓపిక ఉన్నంతకాలం బిచ్చం ఎత్తడమంటే దొంగతనంతో సమానమే.

బీహారు భూకంపంలో బాధితులై, సహాయక శిబిరాలలో ఆశ్రితులుగా ఉన్నవారిని వారి ఆశ్రయానికి, ఆహారానికి, దుస్తులకు తగిన పని చేయాలని ఆయన సూచించాడు. "పని మరిచిపోతే మీరు ప్రభుత్వం మీద ఆధారపడటానికి అలవాటు పడతారు. అలా ప్రజాధనం మీద ఆధారపడటం తప్పు. నిజాయితీతో పని చేయండి. ఎవరూ బిచ్చగాళ్లు కావద్దు. పని కోసం అడగండి. అప్పగించిన పని శ్రద్ధగా చేయండి. పని చేయండి, అడుక్కోవద్దు," అని ఆయన సూచించాడు.

# బందిపోటు

గాంధీ బిచ్చగాళ్లకు రాజైతే బందిపోట్లకు యువరాజు కూడా. భారతదేశంలో రోజురోజుకీ ధనవంతులు మరింత ధనవంతులు కావడం, బీదవాళ్లు మరింత బీదవాళ్లు కావడం ఆయన చూశాడు. ఆయన సమానత్వానికి తన సొంత నిర్వచనాన్ని పరిచయం చేయదలుచుకున్నాడు. గ్రామీణ జీవితాలను పునఃవ్యవస్థీకరించి గ్రామీణులకు ఆర్థిక సమస్యల నుంచి విముక్తి కల్పించడమే ఆయన లక్ష్యం.

అవసరంలో ఉన్నవారిని ఆదుకొనేందుకు ఆయన ధనికులను దోచుకున్నాడు. మండే కాగడాలు, మెరిసే కత్తులకు బదులు ప్రేమతో ఒప్పించడం, నైతికంగా బలవంతం చేయడాన్ని ఆయన దోపిడీకి సాధనాలుగా ఎంచుకున్నాడు. ధనాన్ని త్యాగం చేయమని ధనికులకు, వారి జ్ఞానాన్ని సామాన్యులతో పంచుకోమని పండితులకు, తమ లాభాలను కార్మికులతో సమానంగా పంచుకోమని పెట్టుబడిదారులకు, పాలితులకు మానవ హక్కులు కల్పించమని పాలకులకు, తమ నిస్సత్తువను వదిలించుకోమని బద్ధకస్తులూ, బిడియస్తులూ అయిన గ్రామీణులకూ గాంధీ విజ్ఞప్తి చేశాడు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని విదేశీ పాలకుల చేతుల్లోంచి పాలనా పగ్గాలు లాక్కోమని ఆయన దేశస్తులను ప్రోత్సహించాడు. అంకితభావంతో కూడిన ఆయన హృదయపూర్వకమైన అభ్యర్థన యువకులనూ, వృద్ధులనూ; సామాన్య గ్రామీణ ప్రజలనూ, తెలివిగల వ్యాపారులనూ ఒకే విధంగా ఆకట్టుకొనేది. ఆయన భారతదేశం ఒక మూల నుంచి మరొక మూలకు సుడిగాలిలా తిరుగుతూ ప్రజలు తమ సంపదలను, సంతానాన్ని, సమస్తాన్ని దేశం కోసం సమర్పించేలా ప్రోత్సహించాడు. స్తంభించి

పోయిన మెదళ్లలో ఆయన చైతన్యం నింపాడు. ఆయన కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను దేశ సేవకు పంపారు, ముత్తయిదువలు తమ ఆభరణాలను, పేదలు తమ వద్ద ఉన్న చిల్లరపైసలను ఇచ్చేసారు.

ఒకసారి ఒక ప్రాంతంలో పంటలు పండలేదు. రైతులు నిస్పృహలో ఉన్నారు. కానీ పూర్తి పన్నులు కట్టాలని ప్రభుత్వం ఆజ్ఞాపించింది. పన్ను వసూలుదారుల ఆగడాలకు భయపడిన రైతులు బకాయిలు తీర్చేందుకు తమ ఎద్దులు, నాగళ్లూ అమ్మాలని అనుకుంటున్నారు. పన్నులు కట్టకుండా ప్రభుత్వానికి ఎదురు తిరగమని గాంధీ వారికి సూచించాడు. రైతులు పన్ను వ్యతిరేక ప్రచారం ప్రారంభించారు. గాంధీగారి నాయకత్వంలో సత్యాగ్రహులైన కొందరు రైతులు “ఇందుమూలంగా మేము యావన్మందీ ఈ ఆర్థిక సంవత్సరంలో మా పొలాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకైనా అంగీకరిస్తాం కానీ ప్రభుత్వానికి పన్నులు చెల్లించమని” ప్రమాణం చేశారు. ప్రభుత్వం పంటలతో సహా పొలాలను స్వాధీనం చేసుకొంది. తమ శ్రమ ఫలితాన్ని వాళ్లు అనుభవించే హక్కు ఉందని గాంధీ రైతులకు చెప్పాడు, కాబట్టి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఉల్లిపాయల పంటను దోచుకోమన్నాడు. ఆయన సూచనల ప్రకారం కొందరు కార్యకర్తలు పంటను పొలంలోంచి తెచ్చేసారు. ఆ దోపిడీ ముఠాకు నాయకుడైన మోహనలాల్ పాండ్యాను అరెస్టు చేశారు. విడుదల చేసిన తర్వాత అతనికి ఘనమైన స్వాగత సత్కారాలు ఏర్పాటు చేసి “ఉల్లిపాయల దొంగ” అనే బిరుదిచ్చారు. గాంధీ ఆ సభలో స్వయంగా పాల్గొని అతని నుదుటిన విజయ తిలకం దిద్దాడు.

మరో సందర్భంలో కాటకం ఏర్పడినప్పుడు గాంధీ రైతులకు ఇలాంటి సూచనే ఇచ్చాడు. భూమిశిస్తు ఆదాయం కోల్పోవడం ప్రభుత్వ అధికారులకు ఆగ్రహం తెప్పించింది. రైతుల ఆస్తులను స్వాధీనం చేసుకొని, గుడిసెల నుంచి వారిని వెళ్లగొట్టారు. రైతులు వారికున్న కొద్దిపాటి వస్తువులు తీసుకొని తమ తాతల నుంచి వస్తున్న ఇళ్లు ఖాళీ చేసి వలస వెళ్లారు. స్వాధీనం చేసుకున్న ఇళ్లను వేలం వేయాలని అధికారులు ప్రయత్నించారు. కానీ వాటిని కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. సుదీర్ఘమైన విచారణ తర్వాత రైతుల డిమాండ్లను పాక్షికంగా అంగీకరించి, ఆ యేడాదికి పన్నులు మినహాయించారు.

చంపారన్‌లో రైతులు నీలిమందు పండించి తీరాలని తెల్ల యజమానులు బలవంతం చేశారు. వారికి సక్రమంగా వేతనాలివ్వలేదు. రైతులతో బలవంతపు చాకిరీ చేయిస్తూ వాళ్లు భారీ లాభాలు సంపాదించారు. వేధింపులకు గురైన ఒక



రైతు సహాయం కోసం గాంధీ వద్దకు వచ్చాడు. గాంధీ చంపారన్‌కు వెళ్లాడు. సమస్య వివరాలను తెలుసుకున్నాడు. ఈ సమస్యను పరిష్కరించాలని నిశ్చయించుకున్నాడు. సుదీర్ఘమైన సంప్రదింపులూ, ఆందోళనా జరిగాయి. చివరకు దుర్మార్గమైన నీలిమందు సాగు పద్ధతి ఆగిపోయింది. రైతుల కోసం యజమానులు తమ భారీ లాభాలను వదులుకోవాల్సి వచ్చింది. చంపారన్‌పై వందేళ్లుగా పడిన నల్లటి మరక తొలగి పోయింది.

భారతదేశంలోని ఒక అణా తలసరి ఆదాయంతో పోల్చినప్పుడు ఉప్పు పన్ను భరించలేనిదిగా ఉంది. గుక్కెడు గంజిలో చిటికెడు ఉప్పు వేసుకొని జీవించే కోట్లాది మంది పేదలు కూడా ఈ భారీ పన్నుకు బాధితులు కాక తప్పడం లేదు. దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉప్పునీటికయ్యల నుంచి, ఉప్పురాళ్ల నుంచి సహజమైన ఉప్పు తయారుచేసుకొనే అవకాశం ఉంది. కానీ చట్టం ఉప్పు తయారీని నిషేధించింది.

దీనికి నిరసనగా గాంధీ ఉప్పు ఉద్యమాన్ని ప్రారంభించాడు. "నేను కోరుకొన్నది సాధించి తిరిగి వస్తాను, లేదా నా శవం సముద్రంలో తేలుతుంది. మరణిస్తే వీరస్వర్గానికి వెళతాం, అరెస్టయితే జైలుకి వెళతాం లేదా ఇంటికి విజయంతో తిరిగొస్తాం." సబర్మతీ ఆశ్రమం నుంచి ఆయన 241 మైళ్లు, 25 రోజులపాటు పాదయాత్ర చేసి, దండి సముద్రతీరంలో ఉప్పును తయారుచేసి అప్పటి ఉప్పు చట్టాలను ధిక్కరించాడు. శాసనాన్ని ఉల్లంఘించిన గాంధీకి సరోజినీనాయుడు దండ వేసి తిలకం దిద్దింది. "ఏదో కొద్దిగా ఉప్పును స్వాధీనం చేసుకోవడం చిన్నపిల్లల పని. నేను మొత్తం ఉప్పునంతా స్వాధీనం చేసుకోబోతున్నాను," అన్నాడు గాంధీ. ఆయన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రజలు నిషేధిత ఉప్పును సమీకరించడం ప్రారంభించారు. రహస్యంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్న ఉప్పుకోసం పోలీసులు తీవ్రంగా వెదకసాగారు. చివరకు జమీందారిణులు, పెద్ద కుటుంబీకుల మహిళలను తీసుకువెళ్లే పల్లకీలను కూడా తనిఖీ చేశారు. ఒకసారి కారులో వెళుతున్న గాంధీ దారిలో ఉన్న పోలీసులను చూసి, "నా కారులో ఉప్పు తీసుకువెళుతున్నాను? ఆపి పట్టుకుంటారా?" అని వేళాకోళం ఆడాడు.

గాంధీ ధరసాన అనే ఊళ్లోని ఉప్పు డిపోపై దాడి చేయాలనుకున్నాడు. అనుకోకుండా ఆయన్ని అరెస్టు చేయడంతో పథకం దెబ్బతింది. ఆయన అనుచరులైన అహింసా సైన్యం ఉప్పు డిపోలోకి దూసుకు వెళ్లింది. కాపలావారికీ, కార్యకర్తలకూ మధ్య తీవ్రయుద్ధం జరిగింది. ఇనుప తొడుగులు వేసిన లాఠీలతో కార్యకర్తలను పోలీసులు కొట్టారు. కొందరికి ఎముకలు విరిగాయి, కొందరికి తలలు పగిలాయి. రక్తం ధారలుగా కారింది. అదే సమయంలో భారతదేశంలోని ఇతర ఉప్పు డిపోల మీద కూడా ఇలాంటి దాడులు జరిగాయి. ఒక యేడాది తర్వాత ఉప్పు చట్టాన్ని సవరించారు. గృహోపయోగం కోసం ఉప్పును తయారుచేయడం, సమీకరించడం, ఉప్పు నిల్వలు సమీపంలో ఉన్న గ్రామాలలో అంతర్గతంగా ఉప్పు వ్యాపారం చేయడం చట్టబద్ధమయ్యాయి.

బ్రిటిషు ప్రభుత్వానికి గాంధీ రూపంలో మోసకారితనం కంటే దోపిడీనే గొప్పదని నిరూపించగల గట్టి ప్రత్యర్థి ఎదురయ్యాడు. బ్రిటిషువారు భారతదేశానికి వర్తకులుగా వచ్చారు. వారు అన్యాయమైన మార్గాల ద్వారా భారత మార్కెట్‌ను ఆక్రమించుకున్నారు, ఒకప్పుడు ప్రపంచానికి అసూయ పుట్టించే స్థాయిలో ఉన్న ఇక్కడి చేనేత, నూలు పరిశ్రమను నాశనం చేశారు. రాట్నాలు, మగ్గాలు ఖాళీగా ఉండిపోయాయి. కొంత మంది చేతి వృత్తిపనివారు వ్యవసాయంలోకి మళ్లారు, మరి కొంతమంది కూలీలుగా మారారు. సమృద్ధితో నిండిన దేశంలో పేదరికం విస్తరించింది. మాంచెస్టరు నుంచి,

లాంక్‌షైరు నుంచి దిగుమతి చేసుకున్న వస్త్రాలు భారతదేశం నుంచి కోట్లాది రూపాయలు పట్టుకుపోయాయి. పనిలేక భారతీయ వర్తకుని చేతుల్లోని కొలతబద్ద అలంకారప్రాయంగా మిగిలిపోయింది.

విదేశీ వస్త్రాలను, మద్యాన్ని, బ్రిటిష వస్త్రాలను బహిష్కరించాలనే ఆలోచన గాంధీకి వచ్చింది. స్వయంగా నూలు వడికి, నేత నేసి తయారుచేసుకున్న ఖాదీ వస్త్రాలనే వాడమని దేశ ప్రజలకు విసుగు లేకుండా విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తికి బ్రహ్మాండమైన స్పందన లభించింది. చేతితో నూలు వడకటానికి, చేనేతకు మళ్లీ గాంధీ ప్రాణం పోయగలిగాడు. విదేశీ వస్త్ర దుకాణాలు, మద్యం దుకాణాల వద్ద నిరసన ప్రదర్శనలు చేయడానికి ఒక మహిళా కార్యకర్తల దళాన్ని గాంధీ ఏర్పాటు చేశాడు. నగరాల్లోనూ, గ్రామాల్లోనూ అనేక సభల్లో ప్రసంగించాడు. విదేశీ వస్త్రాలతో భోగిమంటలు ఏర్పాటు చేశాడు. దిగుమతి వర్తకం ఊహించనంతగా పడిపోయింది. బ్రిటిష యాజమాన్యంలోని బట్టల మిల్లులు చాలా వరకూ మూతపడ్డాయి. చేతి నూలు కట్టల రూపంలోని గాంధీ బుల్లెట్లు బ్రిటిష వస్త్ర కార్మికులకు గట్టిగా తగిలాయి. వేలాదిమంది నిరుద్యోగులయ్యారు. చాలా సంవత్సరాల తర్వాత గాంధీ లాంక్‌షైరు వెళ్లినప్పుడు అక్కడి మిల్లు కార్మికుల సమావేశంలో పాల్గొన్నాడు. "ఇక్కడ నిరుద్యోగం ఎక్కువగా ఉన్నందుకు నేను బాధపడుతున్నాను. మీ వద్ద ముప్పై లక్షల మంది నిరుద్యోగులుంటే మా వద్ద ముప్పై కోట్ల మంది యేడాదిలో ఆరునెలలు నిరుద్యోగులుగానే ఉంటున్నారు. మీ వద్ద సగటు నిరుద్యోగ భృతి 70 షిల్లింగులు. మా వద్ద నెలసరి సగటు ఆదాయం ఏడు షిల్లింగుల, ఆరు పెన్నీలు మాత్రమే. భారతీయ నూలు కార్మికులు, నేత కార్మికులు వారి పిల్లల నోళ్ల నుంచి లాక్కున్న రొట్టె ముక్కల ద్వారా మీ ఆకలి తీర్చుకోవాలనుకుంటున్నారా? కావాల్సిన బట్టలు ఉత్పత్తి చేసుకొనే శక్తి భారతదేశానికి ఉన్నా, లాంక్‌షైర్ నుంచి దిగుమతి చేసుకొని తీరాలా? పేద భారతీయుల సమాధుల మీద మీరు అభివృద్ధి చెందాలని అనుకుంటున్నారా?" అని ప్రసంగించాడు. ఆయన నిర్మొహమాటమైన ప్రసంగం బ్రిటిష కార్మికులకు నచ్చింది, వారు చప్పట్లతో ఆయన్ను అభినందించారు.

ధనికులకూ పేదలకూ మధ్య ఉన్న అంతరాలను తగ్గించేందుకు గాంధీ అన్ని రకాలుగా ప్రయత్నించాడు. ఒకసారి వీధులూడ్చేపనివాళ్ల సమావేశంలో ఒక మహిళ తన చేతికి ఉన్న రెండు బంగారు గాజులూ గాంధీకి ఇచ్చి, "ఈ రోజుల్లో భర్తలు భార్యల కోసం చాలా తక్కువ సొమ్ము కేటాయిస్తున్నారు. అందుకే నేను తమకు ఇంతకంటే ఇంకేమీ ఇచ్చుకోలేకపోతున్నాను. ఇవే నా వద్ద మిగిలిన ఆఖరి ఆభరణాలు, వీటిని

హరిజనుల సేవకు వినియోగించండి," అంది. "నేను అనేక మంది వైద్యులనూ, న్యాయవాదులనూ, వర్తకులనూ బిచ్చగాళ్లుగా చేశాను. ఇందుకు నేనేమీ పశ్చాత్తాపపడటం లేదు. ఒక పైసా సంపాదన కోసం మనుషులు మైళ్ల కొద్దీ నడచి వెళ్లాల్సి వస్తున్న భారతదేశంలో ఖరీదైన ఆభరణాలు ధరించడం ఎవరికైనా శోభనివ్వదు," అని గాంధీ అననేవాడు. కొన్ని సందర్భాలలో చేతుల నుంచి గాజులు రానప్పుడు ఆయన వాటిని కోసి తీసుకొనేవాడు. సామాజిక కార్యక్రమాల కోసం ఆడవాళ్ల వద్ద నుంచి ఇలా ఆభరణాలు దానంగా తీసుకోవడం గురించి ఆయనను చాలామంది విమర్శించారు. కానీ గాంధీ ఈ విషయంలో మొండిగా ఉండేవాడు. "వారికున్నదంతా కాకపోయినా కనీసం వారు ధరించిన నగలైనా నాకు ఇద్దామని నా సభలకు హాజరయ్యే తోబుట్టువులు చాలామంది నాకున్నారు," అనేవాడాయన. తమ ఆభరణాలు స్వాతంత్ర్య పోరాటానికి విరాళమిచ్చేలా దేశవ్యాప్తంగా అనేక మంది మహిళలకు ఆయన విజ్ఞప్తి స్ఫూర్తినిచ్చింది. ఒక యువ వితంతువు గాంధీని తమ ఇంటికి ఆహ్వానించి తన నగలన్నీ ఇచ్చేసింది. నెలకు 40/- రూపాయల వేతనం సంపాదించే భర్తగల వివాహిత గాంధీ తమ ఇంటికి వచ్చి తన ఆభరణాలను విరాళంగా స్వీకరించేదాకా ఉపవాస దీక్ష చేసింది.

ఒక బహిరంగ సభలో కౌముది అనే కౌమార బాలిక వేదిక మీదకు వచ్చి తన బంగారు కంఠహారం, గాజులు, చెవిపోగులు గాంధీకి ఇచ్చివేసింది. "స్త్రీలకు నిజమైన ఆభరణం వారి పవిత్రతా, సౌశీల్యమే," ఆని చెబుతూ గాంధీ ఒకసారి ఆభరణాలు దానం ఇచ్చినవారిని మళ్లీ ఆభరణాలు చేయించుకోవద్దని, ధరించవద్దని సలహా ఇచ్చేవాడు. ఆయన చిన్న చిన్న పిల్లలను కూడా వదిలేవాడు కాదు. ఒకసారి ఒక చిన్న బాలిక ఆయనకు పూలు బహుమతిగా ఇద్దామని వేదిక మీదకు వచ్చినప్పుడు ఆయన కళ్లు ఆమె ధరించిన ఉంగరం మీద పడ్డాయి. ఆమెను బుజ్జగించి దాన్ని విరాళంగా తీసుకున్నాడు. ఒకసారి బంగారు కంకణంతో నమస్కారం చేయడానికి అవస్థపడుతున్న బాలుడి నుంచి ఆ కంకణం తీసుకొని "ఇప్పుడు చక్కగా నమస్కారం చెయ్యగలుగుతావు. నాకు 195 పాయింట్ల రక్తపోటు ఉందని తెలుసా," అన్నాడు. గాంధీ ఎప్పుడు చిన్న పిల్లల వద్ద ఆభరణాలు తీసుకున్నా, వాళ్ల పెద్దల అనుమతి పొందేవాడు.

గాంధీ పెద్ద దోపిడీదారుగా పేరుపొందినా ఆయన దోచుకున్న వారితో సహా అందరూ ఆయనను హృదయపూర్వకంగా స్వాగతించేవారు. అడుగడుగునా ఆదరించేవారు. ఒక అభిమాని గాంధీ తన ఇంట్లో ఉన్న ప్రతి నిమిషానికీ 16/- రూపాయలు చెల్లిస్తానని ముందుకొచ్చాడు. కానీ గాంధీ ఎంత తీరికలేకుండా ఉండేవాడంటే ఆ ఇంట్లో రెండు నిమిషాల కన్నా ఎక్కువసేపు ఉండలేక పోయాడు.

ఒకసారి గాంధీ అకస్మాత్తుగా అనారోగ్యం పాలయ్యాడని తెలిసి ఆయన డాక్టరు స్నేహితుడు హడావుడిగా ఆయన వద్దకు వచ్చాడు. అప్పుడు గాంధీ “నీ దగ్గర వైద్యం చేయించుకుంటే నాకేమిస్తావు?” అని ఆయన్ని వేళాకోళం చేశాడు.

మోతీలాల్ నెహ్రూ, దేశబంధు చిత్తరంజన్ దాస్‌లు రాజాలాంటి తమ న్యాయవృత్తిని గాంధీ పిలుపు మేరకు త్యాగం చేశారు. తమకు వారసత్వంగా వచ్చిన ఖరీదైన భవనాలను, ఆస్తులను దేశానికి రాసిచ్చేసారు. అలా గాంధీ వేలకొలది ధనికులను బీదలుగా మార్చేసాడు.

# జైలుపక్షి

గాంధీ తిరుగుబాటును బోధించాడు, సామూహిక పౌర శాసనోల్లంఘనాన్ని ప్రారంభించాడు, అనేకసార్లు జైలుకి వెళ్లాడు. అరెస్టు చేసినప్పుడు ఆయన నేరాన్ని అంగీకరించేవాడు, తనకు కఠిన శిక్ష విధించమనేవాడు. దక్షిణాఫ్రికాలో ఆయన మీదా, ఆయన సహచరుల మీదా పెట్టిన కేసులు ఆయన సాక్ష్యంతోనే రుజువయ్యాయి. జైలు జీవితమంటే కష్టం, జైలుకి వెళ్లడమంటే అవమానం, జైలంటే భయంకరం, జైలంటే నేరస్తులకు వేసే శిక్ష – ఇవీ సాధారణ భారతీయుల అభిప్రాయాలు. జైలు పేరు చెబితే వాళ్లు వణికిపోయేవారు. గాంధీ ఈ అభిప్రాయాలను, ఆలోచనలను వాళ్ల మనసుల్లోంచి తుడిచేశాడు.

గాంధీ 11 సార్లు జైలుకి వెళ్లాడు. ఒక సందర్భంలో ఆయన 4 రోజుల్లో 3 సార్లు అరెస్టయ్యాడు. ఆయనకు వేసిన జైలు శిక్షలన్నీ పూర్తిగా అనుభవిస్తే 11 సంవత్సరాల 19 రోజులు జైల్లో ఉండాల్సి వచ్చేది. ఎప్పటికప్పుడు ఆయన శిక్ష తగ్గించేవారు, దానితో మొత్తం 6 సంవత్సరాల 10 నెలలు జైల్లో గడిపాడు గాంధీ. 39 యేళ్ల వయసులో ఆయన మొదటిసారి జైలుకి వెళ్లాడు. 75 యేళ్ల వయసులో ఆఖరిసారి జైలు గోడల్లోంచి బయటకు వచ్చాడు.

గాంధీ మొదటిసారిగా దక్షిణాఫ్రికాలో అయిదుగురు సత్యాగ్రహులతో కలసి జైలుకి వెళ్లాడు. అప్పటికి ఆయన జైలు గురించి భయంకరమైన కథలు విని ఉండటంతో కొంచెం ఆందోళన కలిగింది. తనను రాజకీయ ఖైదీగా ప్రత్యేకంగా చూస్తారా, తన సహచరుల నుంచి విడిగా ఉంచుతారా లాంటి సందేహాలు తలెత్తాయి. అనేక సార్లు న్యాయవాదిగా వాదించిన కోర్టులోనే తాను బోనెక్కాల్సి వచ్చినప్పుడు

ఆయన మెదడును ఒక రకమైన అయోమయం కమ్ముకుంది. ఆయనకు రెండు నెలల సాధారణ జైలు శిక్ష పడింది. కోర్టు బయట వేచి ఉన్న పెద్ద జన సమూహం నుంచి తప్పించుకొనేందుకు ఆయన్ను రహస్యంగా ఒక కారులో తిన్నగా జైలుకి తీసుకెళ్లారు. జైలుకి వెళ్లిన తర్వాత ఆయన వేలిముద్రలు తీసుకున్నారు. బరువు తూచారు. ఆయన వేసుకొచ్చిన దుస్తులు పూర్తిగా విప్పేసి, చాలా మురికిగా ఉన్న జైలు దుస్తులు ఇచ్చారు. రెండు రోజులకొకసారి, మూడురోజులకొకసారి అనేక మంది స్నేహితులను ఆయన ఉన్న జైలులో వేశారు. ఒక పక్షం రోజుల్లోనే వారి సంఖ్య 150కు పెరిగింది. వారందరినీ 50 మంది పట్టే ఒక గదిలో పెట్టారు. రాత్రులు మాత్రం కొంతమంది ఖైదీలను ఉంచేందుకు కొన్ని టెంట్లు వేసేవారు.

రోజులో నాలుగయిదుసార్లు జైలు ఇనస్పెక్టరు, గవర్నరు, ఛీఫ్ వార్డరు జైలును సందర్శించేవారు. వారు వచ్చినప్పుడు గాంధీ, ఇతరులు టోపీ చేతులో పెట్టుకొని వరుసలో నుంచోవాల్సి వచ్చేది. గాంధీ శారీరక శ్రమ చేస్తానన్నా దానికి అనుమతి లభించలేదు.

జైలు ఆహారం భారతీయులకు సరిపడదు. ఉదయం, సాయంత్రం వారికి ఒకరకమైన జొన్న జావ ఇచ్చేవారు. పంచదార, పాలు, నెయ్యి ఏమీ ఉండేవి కావు. వారు ఆ ఆహారాన్ని తినలేకపోయేవారు. కొన్ని సాయంత్రాలు కేవలం ఉడకబెట్టిన చిక్కుడు గింజలు మాత్రమే పెట్టేవారు. ఉప్పు తప్ప ఏ రకమైన మసాలా దినుసులు, పంచదార వాడేవారు కాదు. యూరోపియన్ ఖైదీలకు మాంసం, బ్రెడ్డు, కూరగాయలు పెట్టేవారు. ఆ కూరగాయల తొక్కలు, మిగిలిన కూరగాయలతో కలిపి వండి నల్ల ఖైదీలకు పెట్టేవారు. 100 మంది భారతీయ ఖైదీల సంతకాలతో గాంధీ జైలు అధికారులకు ఒక ఫిర్యాదు పెట్టాడు. “ఇది భారతదేశం కాదు, రుచికరమైన ఆహారమేదీ మీకు ఇవ్వడం కుదరదు,” అని ఆయనకు సమాధానం వచ్చింది. 15 రోజుల్లోనే గాంధీ భారతీయులకు బియ్యం, బ్రెడ్, కూరగాయలు, నెయ్యి కోటాను మంజూరు చేయించగలిగాడు. తమ ఆహారాన్ని స్వయంగా వండుకొనేందుకు కూడా నల్ల ఖైదీలకు అనుమతి లభించింది. గాంధీ వంటలో సహాయం చేసేవాడు, రోజూ రెండు సార్లు ఆయనే ఖైదీలకు వడ్డించేవాడు. ఇంకా మెరుగైన ఆహారం కావాలని, ఇంకొంచెం ఆహారం కావాలని అడగకుండానే గాంధీ అనుచరులంతా ఉడికీఉడకని జావను పంచదార లేకుండానే తినేసేవారు. మూడోసారి జైలుకి వెళ్లినప్పుడు ఆయనకు ఆహారం పెద్ద సమస్య కాలేదు. గాంధీ పూర్తిగా ఫలాల మీద జీవించాడు, ఆయనకు కావాల్సినన్ని అరటిపళ్లు, టమోటాలు, గింజలు ఇచ్చారు. జైలులోని క్రమశిక్షణా నియమాలు ఆయనకు నచ్చాయి. జైలులోంచి



బయటకు వచ్చిన తర్వాత కూడా ఆయన టీ మానేశాడు, సూర్యాస్తమయానికి ముందే రాత్రి భోజనం ముగించడాన్ని కొనసాగించాడు.

దక్షిణాఫ్రికాలో ఆ తర్వాత రెండు జైలు శిక్షల సమయంలో గాంధీ చాలా కష్టాలను ఎదుర్కొన్నాడు. ఆయనకు కఠిన శారీరక శ్రమను శిక్షగా విధించారు. పదేళ్లపాటు న్యాయవాదిగా వాదించిన న్యాయస్థానమే ఆయనను సంకెళ్లతో జైలుకి పంపించింది. ఆయనకు ఒక దేశవాళీ ఖైదీ దుస్తులు – అంటే ఒక చిన్న మిలటరీ టోపీ, ఖైదీ నంబరు, వెడల్పైన బాణం గుర్తులు ముద్రించి ఉన్న వదులైన ముతక కోటు, అలాంటి గుర్తులతోనే ఉన్న పొట్టి పాంటు, ముదురు బూడిదరంగు ఊలు మేజోళ్లు, తోలు చెప్పులు ఇచ్చారు. వడగళ్లవానలో తన పక్కబట్టలు నెత్తిన పెట్టుకొని ఆరు ఫర్లాంగులు నడవాల్సి వచ్చింది. అత్యంత చెడ్డవారైన నీగ్రో, చైనా ఖైదీలతో కలిపి ఆయనను ఉంచారు. జులూ ఖైదీలు కొందరు ఆయన్ను దూషించి, కొట్టారు. మరుగుదొడ్డికి మదుగు లేదు. వారి అసభ్యమైన ప్రవర్తన గాంధీని భయపెట్టింది. వారి భాష ఆయనకు అర్థమయ్యేది కాదు. ఆయన్ను వెంటనే 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల పొడవు ఉన్న ఇరుకు గదిలో ఏకాంతంగా ఉంచారు. పైకప్పుకు దగ్గరలో గాలి ఆడేందుకు చిన్న ఖాళీ ఉండేది. తాళం వేసి ఉన్న తలుపు వెనకాల నిలబడి తన ఆహారం తినాల్సి వచ్చేది. వ్యాయామం కోసం రోజుకు రెండుసార్లు బయటకు తీసుకు వెళ్లేవారు. అన్నంతో పాటు నెయ్యి ఇవ్వనందుకు నిరసనగా ఆయన 15 రోజులపాటు అన్నం తినలేదు. కేవల రోజుకోసారి ఇచ్చే రాగిజావ మాత్రమే

తిని బతికాడు. ఆ తర్వాత అతనికి నెయ్యి, బ్రెడ్ ఇచ్చారు. ఆయనకు ఒక కొబ్బరి పీచు చాప, ఒక చెక్క దిండు, రెండు కంబళీలు, కొన్ని పుస్తకాలు ఇచ్చారు. రోజుకి ఒక బక్కెట్టు నీళ్లు ఇచ్చేవారు. మలమూత్రాల బక్కెటు గదిలోనే ఒక మూల ఉండేది. చీకటి పడిన తర్వాత ఖైదీని గమనిస్తూ ఉండేందుకు ఒక కరెంటు బల్బు వేసి ఉంచేవారు, అది పుస్తకం చదివేందుకు పనికిరానంత తక్కువ కాంతితో ఉండేది. ఎప్పుడైనా మార్పు కోసం ఆయన ఆ ఇరుకు గదిలోనే అటు, ఇటు పచార్లు చేసేవాడు. అప్పుడు వార్డరు "అలా నడవొద్దు, గచ్చు పాడవుతుంది," అని కేకలు వేసేవాడు. ఇంతకూ ఆ అద్భుతమైన గచ్చును తారుతో చేశారు.

స్నానానికి గాంధీ అనుమతి అడిగితే వార్డరు నగ్నంగా వెళ్లమనేవాడు. 125 అడుగుల దూరం దిశమొలతో నడవడం గాంధీ వల్ల అయ్యేది కాదు. స్నానాల గదికి తలుపుగా గుడ్డ తెరను వాడటానికి ఆయన చేసిన విజ్ఞప్తిని ఆమోదించారు. కానీ ఆయన వంటిని పూర్తిగా శుభ్రం చేసుకొనే లోపే "చాల్లే బయటకు రా," అనే కేక వినబడేది. వెంటనే బయటకు రాకపోతే ఒక నీగ్రో వచ్చి ఈడ్చుకొచ్చేవాడు.

గాంధీ రోజుకు తొమ్మిది గంటలపాటు చొక్కా జేబులు కత్తిరించాల్సి వచ్చేది, చిరిగిన దుప్పటి ముక్కలను కుట్టాల్సి వచ్చేది, వార్నిషు వేసిన ఇనుప తలుపును పాలిష్ చేయాల్సి వచ్చేది. ఆ తలుపులను మూడు గంటలపాటు రుద్దాక చూస్తే అవి మొదట్లో ఎలా ఉన్నాయో అలానే ఉన్నాయి. ఆయనకు మరుగుదొడ్లు కడిగే పని అప్పగించారు. ఆయన ఈ కష్టాలన్నీ నవ్వుతూ భరించాడు. కానీ సహచరుల అవస్థలు ఆయన్ను కదిలించి వేసాయి. నిరాశా నిస్పృహలతో కొంతమంది ఏడిచారు, మరి కొంతమంది సొమ్మసిల్లిపోయారు. వారిని ఇళ్లల్లోంచి బయటకు లాక్కొచ్చి ఇలా బాధలతో, అవమానంతో కూడిన జీవితాన్ని గడపటానికి తానే బాధ్యుడు. తన త్యాగం ద్వారా, తాను బాధను అనుభవించడం ద్వారా మాత్రమే వారికి విముక్తి కలిగించగలనని గాంధీ నమ్మాడు, ఆ ఆలోచన ఆయనకు కొంత మనశ్శాంతిని ఇచ్చింది.

మల మూత్ర విసర్జనల పని ఉదయం ఆరుగంటలకల్లా అయిపోవాలి. ఉదయం ఏడుగంటలకల్లా పని మొదలయ్యేది, వారు తొమ్మిది గంటలపాటు పని చేశేవారు. గాంధీ ఒక మైలు నడిచిన తర్వాత పలుగు తీసుకొని ఎండిపోయిన నేలను తవ్వేవాడు. ఆయన బరువు తగ్గాడు, నడుం నొప్పి పెట్టేది. ఆయన చేతులలో బొబ్బలెక్కి చితికి నీరు కారేవి. చాలా కష్టం మీద ఆయన తవ్వగాలను లేపగలిగేవాడు. విశ్రాంతికి కొద్దిసేపు పని ఆపితే గార్డులు "కానీయ్, కానీయ్," అని అరిచేవారు. గార్డు తన ప్రవర్తన మార్చుకోకపోతే మొత్తం పని మానేస్తానని గాంధీ హెచ్చరించాడు.

దాంతో గార్డు కొంచెం తగ్గాడు. తనకు కేటాయించిన పని పూర్తిచేసి గౌరవం కాపాడుకొనే అవకాశం తనకివ్వమని దేవుడిని ప్రార్థించేవాడు.

భారతదేశంలో "హిజ్ మెజెస్టీస్ హోటల్"లో గాంధీ ఉన్నప్పుడు ఆయన ఖర్చంతా ప్రభుత్వమే భరించేది. అయినా తన నిర్వహణ కోసం ఒక్క పైసా కూడా అదనంగా ఖర్చు చేయడం ఆయనకు ఇష్టముండేది కాదు. ఒక సందర్భంలో అధికంగా ఉన్న వస్తువులు, కుండలు, పళ్లాలు తీసేయమని ఆయన జైలు సూపరింటెంట్‌ను అడిగాడు. ఒక ఇనుప మంచాన్ని, చాలా తక్కువ గిన్నెలను గాంధీ ఉపయోగించేవాడు. జైల్లో చేసే ఖర్చంతా భారతదేశంలో నోరులేని లక్షలాది పేదల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తారని ఆయనకు తెలుసు. ఆగాఖాన్ పాలెస్‌లో గడిపిన తన ఆఖరి జైలు జీవితం గురించి మాట్లాడుతూ, "నన్ను ఇంత పెద్ద పాలెస్‌లో ఉంచి, నా చుట్టూ గార్డులను నియమించడం వల్ల చాలా ప్రజాధనం వృథా అవుతోంది. అనేకమంది ప్రజలు ఆకలితో మాడే పరిస్థితిలోఉండగా ఇలా చేయడం నేరంతో సమానం," అన్నాడు.

భారతదేశంలో గాంధీ ఎదుర్కొన్న మొదటి కోర్టు విచారణ మరిచిపోలేని సంఘటన. తన ఆసనం మీద కూర్చునే ముందు ఆంగ్లేయ సెషన్స్ న్యాయమూర్తి బోనులో ఉన్న దేశీయుడికి గౌరవంగా నమస్కారం చేస్తున్నట్లు తలపంకించాడు. విప్లవ కార్యకలాపాలకు గాను ఆయన గాంధీకి ఆరేళ్లు సాధారణ జైలు శిక్ష విధించాడు. "మీతో రాజకీయంగా విభేదించేవారు కూడా మిమ్మల్ని ఉన్నత దర్శాలు ఉన్న మనిషిగా, పవిత్రమైన సాధు జీవితం గడిపే వ్యక్తిగా గౌరవిస్తారు," అన్నాడు ఆ న్యాయమూర్తి. గాంధీ మాట్లాడుతూ, "భారతదేశమంతా గౌరవించే దేశభక్తులు చాలా మంది ఈ నేరం కిందే జైలుకి వెళ్లారని నాకు తెలుసు, నాకూ ఇదే సెక్షన్ కింద శిక్ష విధించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నేను నిప్పుతో ఆటలాడుతున్నానని నాకు తెలుసు, అయినా నేను అదే పని చేస్తాను," అన్నాడు. గాంధీ కోర్టు గదిలోకి వచ్చి, వెళ్లిపోతున్నప్పుడు అక్కడున్నవారంతా గౌరవంగా లేచి నిలబడ్డారు. టెలిగ్రాంలో పోలీసులు ఆయనని "ముంబయి రాజకీయ ఖైదీ నం. 50" అన్న సంకేత నామంతో సంబోధించారు. ఆయన పేరును బారిష్టర్ల జాబితాలోంచి కొట్టేసారు. జైలులో ఆయన ఎత్తు, గుర్తింపు చిహ్నాలు నమోదు చేసుకున్నారు. ఆయనను ఒక ఒంటరి సెల్లులో ఉంచారు. అంగవస్త్రం తప్ప ఆయన మరేమీ వేసుకోలేదు, అయినా ఆయన గజ్జల్లో తడిమారు, దుప్పట్లను తనిఖీ చేశారు. తన నీటి లోటాను బూట్లతో తన్నేంతవరకూ గాంధీ దేనికీ ఎదురుచెప్పలేదు. అప్పుడప్పుడూ ఈ ప్రవర్తన మీద అసహ్యంతో చికాకు కలిగినప్పుడు ఆయన సందర్శకులెవరినీ అనుమతించేవాడు కాదు, లేఖలేమీ రాసేవాడు కాదు.

గాంధీ నిర్బంధంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఆందోళన చెందలేదు, కటువుగా స్పందించలేదు. జైల్లోంచి బయటకు వచ్చిన ప్రతిసారీ ఆయన మెదడు మరింత క్రమశిక్షణ కలిగిందిగా, మరింత పదునుగా తయారయ్యేది. ఆయన దృష్టిలో వ్యక్తుల అలవాట్లను క్రమబద్ధం చేసుకొనేందుకు, మంచి పుస్తకాలతో స్నేహం చేసేందుకు లభించిన అవకాశం జైలు. ఆయనకు పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం, కానీ జైలు బయట ఉన్నప్పుడు అనేక కార్యకలాపాలతో తీరిక లేకుండా ఉన్నందువల్ల పుస్తకాలు చదివేందుకు సమయం దొరికేదికాదు. జైలులో ఆయన అధ్యయనానికి ఖచ్చితమైన సమయం ఏర్పాటు చేసుకున్నాడు. ఆయన ఉర్దూ నేర్చుకున్నాడు, సంస్కృతం, హిందీ, గుజరాతీ, తమిళం, ఇంగ్లీషు పుస్తకాలు చదివేవాడు. రెండేళ్లలో ఆయన మతం, సాహిత్యం, సామాజికశాస్త్రాల మీద ప్రముఖ రచయితలు రాసిన 150 పుస్తకాలు చదివాడు. గీత, ఖురాను, బైబిలు, బౌద్ధ , సిక్కు, జొరాష్ట్రియన్ మత గ్రంథాలు చదివాడు. రామాయణం, మహాభారతం, ఉపనిషత్తులు, మనుస్మృతి, పతంజలి యోగదర్శనం చదివాడు. 65 యేళ్ల వయసులో ఆయన తోటి ఖైదీ నుంచి ఖగోళ శాస్త్ర ప్రాథమికాంశాలు నేర్చుకున్నాడు. నక్షత్రాలను పరిశీలించేందుకు జైలు అధికారుల నుంచి టెలిస్కోప్ సంపాదించడంలో కృతకృత్యుడయ్యాడు.

జైలులో గాంధీ క్రమం తప్పకుండా ప్రార్థన చేసేవాడు. రోజుకు 4 నుంచి 6 గంటల సేపు నూలు వడికేవాడు. చురుగ్గా నడిచేవాడు, ఆగాఖాన్ పాలెస్‌లో ఉన్నప్పుడు 75 యేళ్ల వయసులో కస్తూర్బాకు, తన మేనకోడలి కూతురుకి భూగోళం, రేఖాగణితం, చరిత్ర, గుజరాతీ వ్యాకరణం, సాహిత్యం బోధించాడు. అంతకు ముందు ఆయన చైనీస్ ఖైదీకి ఆంగ్లం, ఐరిష్ జైలరుకి గుజరాతీ నేర్పాడు. ఆయన పిల్లలకోసం జైలులో ఒక పాఠ్యపుస్తకం రాసాడు, దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ పోరాట చరిత్ర రాసాడు. ఉపనిషత్తులలో భారతీయ రుషులు రాసిన శ్లోకాలను ఆంగ్లంలోకి అనువాదం చేశాడు. అది *'జైలు నుంచి గేయాలు' (సాంగ్స్ ఫ్రమ్ ప్రిజన్)* పేరుతో ప్రచురితమయ్యింది. ఆయన జైలు నుంచి ఆశ్రమవాసులకు, సహచరులకు, జైలు అధికారులకు, గవర్నర్లకు, వైస్రాయిలకు, బ్రిటిషు ప్రధానమంత్రికి ఇలా వందలాదిమందికి ఉత్తరాలు రాసేవాడు. ప్రతివారం ఆశ్రమంలోని పిల్లలను ఉత్సాహపరుస్తూ, "మీరు రెక్కలు లేకుండా ఎగరడం నేర్చుకొంటే మీ కష్టాలన్నీ మాయమైపోతాయి. నాకు రెక్కల్లేవు, అయినా రోజూ నా మనసులో ఎగురుకుంటూ మీ దగ్గరకు వస్తున్నాను, ఇదిగో ఇక్కడ నా చిట్టి విమల ఉంది, అక్కడ హరి కూర్చున్నాడు," అంటూ లేఖలు రాసేవాడు.

క్రమశిక్షణతో కూడిన జైలు జీవితం యొక్క లాభాలను గాంధీ గమనించాడు, ఒక ఆదర్శవంతమైన ఖైదీ ఎలా ఉండాలో వర్ణించాడు. అనైతికమైన పనులేమీ చెప్పనంత వరకూ జైలులో ఏ పని చెబితే ఆ పని చేయాలనీ, జైలు నిబంధనలన్నీ పాటించాలని ఆయన చెప్పేవాడు. అవమానిస్తే లేదా అపరిశుభ్రమైన ఆహారమిస్తే తప్పించి నిరాహారదీక్షకు సిద్ధపడేవాడు కాదు. ఆయన కానీ, ఆయన సహచరులు కానీ ఎప్పుడు మోకాళ్ల మీద కూర్చునే వారు కాదు, ఎప్పుడూ "దొరా, దండాలు," అని అరిచేవారు కాదు.

స్వరాజ్యంలో కూడా జైళ్లను నిర్వహించాల్సిన అవసరం ఉంటుందని గాంధీ ఒప్పుకున్నాడు. తాత్కాలికంగా తప్పుదోవ పట్టిన, మానసిక సమతౌల్యం కోల్పోయిన వారిని బాగుచేసేందుకు అవసరమైన విద్యాలయాలుగా, శిక్షణా సంస్థలుగా, పరివర్తనాశాలలుగా జైళ్లను మార్చాలని ఆయన కోరుకునేవాడు.

ఒకసారి ఆయన జైలులో ఉండగా ఖైదీలతో ఉత్పత్తి కార్యక్రమాలు చేయించడం ద్వారా జైళ్లను స్వయంపోషకాలుగా ఎలా మార్చవచ్చో సూచిస్తూ ఒక ప్రతిపాదన చేశాడు. ఒక ఖైదీ నుంచి వచ్చిన ప్రతిపాదనను జైలు అధికారులు ఆమోదించలేదు.

ఈ ఆదర్శ ఖైదీ ఒకోసారి చాలా మొండిగా ప్రవర్తించి జైలు అధికారులను ఇబ్బంది పెట్టేవాడు. బ్రెడ్ తినటానికి అనుమతించినప్పుడు కాల్చని బ్రెడ్ తినలేం కాబట్టి దానిని ముక్కలు కోసుకొనేందుకు కత్తి కావాలని పట్టుపట్టాడు. ఆయన రోజువారీ నడకలకు మరింత ప్రదేశం కావాలని అడిగేవాడు. తన స్నేహితులను తన మీద ఆధారపడినవారుగా భావించి తన ప్రత్యేక సంరక్షణ కింద ఉంచాలని కోరేవాడు. ఆస్తమాతో బాధపడుతున్న వారికో, ప్రకృతి చికిత్స అవసరమైన వారికో, ఆయుర్వేద చికిత్స అవసరమైన వారికో చికిత్స చేయడం తన సొంత బాధ్యతగా భావించి వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరేవాడు. సుదీర్ఘమైన ఉపవాసాలకు పూనుకోవడం ద్వారా ఆయన తన కోరికలకు అంగీకరించేలా పరోక్షంగా జైలర్లపై వత్తిడి తెచ్చేవాడు. ఆయన పరిస్థితి క్షీణించినప్పుడల్లా ఆయన్ను జైల్లోంచి విడుదల చేసేవారు. మహాత్మా గాంధీలా ప్రపంచ ప్రసిద్ధి పొందిన పౌరుడిని తమ వద్ద ఉంచుకొని ఆయన ప్రాణాలకు బాధ్యత వహించడం అనే ప్రమాదాన్ని భరించడానికి వారు ఇష్టపడేవారు కాదు. ఆయనకు అపెండిసైటిస్ వచ్చినప్పుడు వాళ్లు చాలా శ్రద్ధ చూపించి వెంటనే శస్త్రచికిత్స చేయించారు. ఆయన జైల్లో ఉండగా రెండుసార్లు జబ్బు పడ్డాడు.

గాంధీ ఎప్పుడూ తన పరిచారకులు, సహచరుల బృందంతోనే జైలుకు వెళ్లేవాడు. ఆగాఖాన్ పాలెస్‌లో ఆయనను నిర్బంధించినప్పుడు ఆయనతో కస్తూర్బా, ఆయన కార్యదర్శి మహదేవ దేశాయి ఉన్నారు. ఆ ఇద్దరూ అక్కడే మరణించారు, వారిని అక్కడే జైలు గోడలలోపలే ఖననం చేశారు. "డూ ఆర్ డై నినాదాన్ని వాళ్లు అక్షరాలా పాటించి స్వాతంత్ర్య బలిపీఠానికి తమ ప్రాణాలను అర్పించారు, వారు అమరులు," అన్నాడు గాంధీ.

# సైన్యాధ్యక్షుడు

గాంధీని దక్షిణాఫ్రికా ఒక మనిషిగా చేసింది. 23 యేళ్ల వయసులో ఆయన దర్బను చేరుకున్నాడు. అప్పటి వరకూ ఆయన కంగారు, బిడియాలతో నిండిన యువకుడు మాత్రమే. భారతీయులను, నల్లవారిని తెల్లవారు ఎలా చిన్నచూపు చూస్తారో దక్షిణాఫ్రికా నేల మీద కాలు పెట్టగానే ఆయన గమనించాడు. భారతీయులను తెల్లవాళ్లు 'కూలీ' అని పిలిచేవారు.

ఆయన దక్షిణాఫ్రికాలో దిగిన మూడో రోజు దర్బను కోర్టుకు వెళ్లాడు. అక్కడ మేజిస్ట్రేటుకు గౌరవం చూపించడం కోసం ఆయనని తలపాగా తీసేయమని ఆదేశించారు. గాంధీ దాన్ని అవమానంగా భావించి, కోర్టునుంచి బయటకి వచ్చేశాడు.

ఒక వారం తర్వాత రైలులో గాంధీ వేరే పట్టణానికి వెళ్లాల్సి వచ్చింది. ఆయన ఫస్ట్‌క్లాస్ టికెట్ కొనుక్కొని, ఫస్ట్‌క్లాస్ పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు. తర్వాతి స్టేషనులో టికెట్ తనిఖీ అధికారి వచ్చి ఆయన్ని థర్డ్ క్లాస్ పెట్టెలోకి మారమని ఆదేశించాడు. తనకు ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణం చేసే అధికారం ఉందని నిరూపించుకుందామని ప్రయత్నించే లోగానే బలవంతంగా రైల్లోంచి బయటకు లాగి పడేసారు. ఆ అవమానంతో గాంధీ బాగా కదిలిపోయాడు. చీకటిగా ఉన్న ప్రయాణికుల గదిలో కూర్చొని ఆలోచనల్లో మునిగిపోయాడు, "నేనిప్పుడు ఏం చేయాలి? భారతీయులను అవమానించి, చిన్నచూపు చూసే దేశం నుంచి వెళ్లిపోవాలా? ఇక్కడే ఉండి హక్కుల కోసం పోరాడాలా? ఇది నా దేశ గౌరవ ప్రతిష్ఠలకు సంబంధించిన విషయం." చివరకు అక్కడే ఉండిపోవాలని తీర్మానించుకున్నాడు. గాంధీ భవిష్యత్తును, కార్యాచరణను ఆ దురదృష్టకరమైన రాత్రి మలుపు తిప్పింది.

గాంధీ ఆ తర్వాత ఒక గుర్రపుబగ్గీలో ప్రయాణించాల్సి వచ్చింది. భారతీయుడు కాబట్టి ఆయన గుర్రపుబగ్గీలో కూర్చోవడానికి వీలు లేకపోయింది. బండివాడి వెనుక కూర్చుని ప్రయాణించాలని గాంధీ ప్రయత్నించాడు. కానీ కొద్ది సేపట్లోనే ఆయన అక్కడ కూర్చోవడం కుదరదన్నారు, గుడ్డ పరచిన ఫుట్‌బోర్డు మీద కూర్చోమన్నారు. గాంధీ తన సీటులోంచి లేవడానికి అంగీకరించకపోతే నిర్దయగా కొట్టారు. పట్టణంలోకి వెళ్లిన తర్వాత హోటలులో గది తీసుకుందామని గాంధీ అనుకున్నాడు. కానీ ఆయనకు గది ఇవ్వడానికి వాళ్లు తిరస్కరించారు. గాంధీ అంటే సానుభూతి గల ఒక స్నేహితుడి దుకాణంలో ఆయన రాత్రికి ఆశ్రయం పొందాడు. గాంధీ పొందిన అవమానాలేవీ ఆ స్నేహితుడికి కొత్తగాగానీ, వింతగాగానీ అనిపించలేదు. ఆ దేశంలో ప్రతిరోజూ అలాంటి సంఘటన ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. అక్కడి భారతీయులు వాటికి అలవాటు పడిపోయారు. వారు ధనం సంపాదించడానికే దక్షిణాఫ్రికాకు వచ్చారు, తమ గౌరవాన్ని పణంగా పెట్టి ధనం సంపాదించడానికి సిద్ధపడ్డారు. వారి బానిస మనస్తత్వానికి గాంధీ ఆశ్చర్యపోయాడు. ఆయన తనకు జరిగిన అవమానాల గురించి వార్తాపత్రికలకు, రైల్వే అధికారులకు, గుర్రపు బగ్గీల అధికారులకు ఫిర్యాదులు పంపాడు.

దక్షిణాఫ్రికా రహదారులలోని ఫుట్‌పాత్‌లపై నడిచే అనుమతి భారతీయులకు లేదనీ, వారు రాత్రి 9 గంటల తర్వాత బయట తిరగడం కుదరదనీ, ట్రాము కారులో మొదటి సీటులో కూర్చోకూడదనీ కొద్దిరోజుల్లోనే గాంధీకి తెలిసిపోయింది. భారతీయులు ఇళ్లు నిర్మించుకొనేందుకు కొన్ని ప్రత్యేక కూలివాడలున్నాయి. ఒకసారి ఒక కాపలావాడు గాంధీని ఫుట్‌పాత్ మీద నుంచి నెట్టేసి, ఆయనకు "కూలీ బారిస్టర్" అనే పేరు తగిలించాడు. కొన్ని సౌకర్యాలు అనుభవించేలా గాంధీకి ప్రత్యేక మినహాయింపులు ఇప్పించేందుకు కొంతమంది తెల్ల స్నేహితులు ప్రయత్నించారు. గాంధీ మర్యాదగా వారి ప్రతిపాదనలను తిరస్కరించాడు. కొన్ని వ్యక్తిగత ప్రయోజనాలు పొందడం మీద ఆయనకు ఆసక్తి లేదు, మొత్తం వర్ణవివక్షనే నాశనం చేయాలని ఆయన భావించాడు. ఆయన అవమానంతో కుంగిపోలేదు, కోపంతో రగిలిపోయి తనను అవమానించిన వారిని శిక్షించాలనుకోలేదు. ఆ పట్టణంలో నివశిస్తున్న భారతీయులు ఎదుర్కొనే సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాడు. ఒక వారం రోజుల లోపు ఆయన ఒక బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. భారతీయులు తమ జీవన విధానం మార్చుకోవాలనీ, నిజాయితీగా జీవించాలనీ, పరిశుభ్రమైన అలవాట్లు చేసుకోవాలనీ, కుల, మత, ప్రాంతీయ బేధాలు మరిచి పోవాలనీ విజ్ఞప్తి

చేశాడు. తెల్లవారి మీద నేరారోపణ చేసే ఒక్క మాట కూడా ఆయన నోట్లోంచి రాలేదు. తమ ప్రవర్తన బాగున్నప్పుడే మానవ హక్కులను కోరగలమని ఆయన తన దేశస్తులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించాడు. ఆయన వారికి అందుబాటులో ఉంటూ వారి దీనగాథలను ఓపికగా వినేవాడు.

ఒక సంవత్సరం తర్వాత భారతీయులకు ఉన్న కొద్దిపాటి హక్కులలో ఒకటైన ఓటుహక్కును తొలగిస్తూ దక్షిణాఫ్రికాలో ఒక బిల్లు ప్రవేశపెట్టారు. దీనికి వ్యతిరేకంగా గాంధీ కార్యకర్తలను నమోదు చేసుకున్నాడు. ఉమ్మడి సంక్షేమానికి కలసి పనిచేసేలా క్రైస్తవ యువకులను, ముస్లిం, పార్సీ వర్తకులను, హిందూ గుమాస్తాలను ఆయన ఒప్పించాడు. గాంధీ నాయకత్వంలో కొందరు అతడు తయారు చేసిన నిరసన కరపత్రానికి నకళ్లు తయారు చేయడం ప్రారంభించారు, కొందరు డబ్బు విరాళంగా ఇచ్చారు, ఇతరులు ఈ సందేశాన్ని పట్టణానికి దూరంగా నివసిస్తున్న వందలాది మందికి చేరవేశారు. ఒక నెలలో నిధులు పోగయ్యాయి. బిల్లుకు నిరసనగా 10,000 మంది సంతకాలు సేకరించారు. నిరసన లేఖలను ముద్రించి నాటల్ గవర్నరుకు, ప్రీమియర్‌కు, భారతదేశపు వైస్రాయికి, విక్టోరియా మహారాణికి, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండు, భారతదేశాల్లోని వార్తాపత్రికలకు పంపారు. దక్షిణాఫ్రికాలోని భారతీయులకు జరుగుతున్న అన్యాయానికి విస్తృతమైన ప్రచారం లభించింది. అయినా బిల్లు పాసయ్యింది, భారతీయులు ఓటుహక్కు కోల్పోయారు. కానీ భారతీయులు తమ మొహమాటం, నిర్లిప్తత వదులుకోవడం నేర్చుకున్నారు, అన్యాయమైన చట్టాలు చేస్తున్న ప్రభుత్వ అధికారాన్ని ఎదిరించడం నేర్చుకున్నారు. గాంధీ త్వరలోనే నాటల్ ఇండియన్ కాంగ్రెస్ స్థాపించి, దానికి నియమ నిబంధనలు ఏర్పరిచాడు, తానే స్వయంగా సభ్యుల నుంచి నిధులు వసూలు చేశాడు.

దక్షిణాఫ్రికాలో ఆయన ఉన్న 20 సంవత్సరాల కాలంలో గాంధీ అనేక నల్ల చట్టాలకు వ్యతిరేక పోరాటాలలో ప్రజలకు నాయకత్వం వహించాడు. ప్రతి భారతీయ వయోజనుడి నుంచి 40/- రూపాయల వార్షిక పన్ను విధించే చట్టం వాటిల్లో ఒకటి. భారతదేశంలో చేసుకున్న పెళ్లి దక్షిణాఫ్రికాలో చట్టప్రకారం చెల్లుబాటు కాదని చెప్పే చట్టం మరొకటి, ప్రతి భారతీయుడూ తన పదివేళ్ల ముద్రలతో ఉన్న ధృవ పత్రాన్ని తమ వెంట ఉంచుకు తిరగాలనే చట్టం మూడోది. వేలిముద్రలు నేరస్తుల నుంచి తీసుకుంటారు కాబట్టి గాంధీ దీనికి వ్యతిరేకంగా డజన్ల కొద్దీ వ్యక్తులకు వందలాది ఉత్తరాలు, విజ్ఞప్తులు, ఫిర్యాదులు పంపాడు. ముఖ్యమైన ప్రభుత్వాధికారులను స్వయంగా కలుసుకున్నాడు. వేదికల ద్వారా, పత్రికల ద్వారా చేసిన నిరసన ఉద్యమాలు

విఫలమయ్యాక గాంధీ సత్యాగ్రహమనే అహింసాయుత నిరసనను కొత్త ఆయుధంగా రూపొందించాడు.

వేలిముద్రల సేకరణను బహిష్కరించమని గాంధీ భారతీయులకు పిలుపును ఇచ్చాడు. సుదీర్ఘమైన అహింసాత్మకమైన నిరసనకు సిద్ధం కావాలని, అవసరమైతే జైలుకు వెళ్లాలి, ప్రాణాలు పణంగా అయినా పెట్టాలి కానీ ఈ దుష్టచట్టానికి మాత్రం లొంగవద్దని ఆయన ఉద్బోధించాడు. "నేను చావంటే భయాన్ని తరిమేయాలని అనుకుంటున్నాను. స్వచ్ఛందంగా బాధలను అనుభవించడానికి సిద్ధం కావడమే అన్యాయాలను తొలగించడానికి సత్వరమైన మార్గం," అనేది ఆయన నినాదం. కేవలం తన మీద ఆధారపడితే ఆశయాన్ని సాధించలేరనీ, తాను చెప్పిన మార్గాన్ని అర్థం చేసుకొని చివరిదాకా అనుసరిస్తేనే లక్ష్య సాధన సాధ్యమవుతుందని ఆయన వారిని హెచ్చరించాడు. ఆయన సూచనలను హిందీ, గుజరాతీ, తమిళం, తెలుగు భాషలలో ప్రజలకు వివరించేవారు. పూర్తి అహింసాయుతంగా పోరాటం చేస్తామని ఆయన కార్యకర్తల సైన్యం ప్రతిజ్ఞ చేసింది. వీధుల్లోని నిరక్షరాస్యులు, వృత్తి కళాకారులు, చిల్లర వ్యాపారులు, గని కార్మికులు, వ్యాపారులు, మహిళలు ఈ సైన్యంలో చేరారు. నిరాయుధులైన, శాంతియుతమైన క్రమశిక్షణ గల 5000 మంది కార్యకర్తల సైన్యానికి గాంధీ కాలినడకన నాయకత్వం వహించారు. ఆయన తన సమూహంతో కలిసి నడిచాడు, ఆరుబయట పడుకున్నాడు, నీళ్ల పప్పును, ఉడికీ ఉడకని అన్నాన్ని వారితో పంచుకున్నాడు. అనారోగ్యంతో ఉన్నవారికి చికిత్స చేశాడు, నిరుత్సాహంగా ఉన్నవారిని ఉత్సాహపరిచాడు, వంట చేశాడు, వడ్డించాడు. శారీరకంగానూ, మానసికంగానూ అత్యంత ధృఢత్వాన్ని ప్రదర్శించాడు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం 2500 మందికి కఠిన శారీరక శ్రమను శిక్షగా విధించింది. 1000 మంది పూర్తిగా శిథిలమై పోయారు, కొంతమంది మరణించారు. ధనికులైన వ్యాపారులు సౌకర్యవంతమైన జీవితాన్ని వదిలేసి వాళ్ల నాయకుడితో కలసి జైలులో రాళ్లు కొట్టారు, పారిశుద్ధ్య పని చేశారు. కస్తూర్బా కూడా సత్యాగ్రహంలో చేరి జైలుపాలయ్యింది. ఇంగ్లాండులో గాంధీ ఉద్యమానికి సానుభూతి లభించింది. భారతదేశంలో కాంగ్రెస్ సభల్లో దక్షిణాఫ్రికా సమస్యను చర్చించారు. కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా పని చేసిన సర్ వెడ్డర్‌బర్న్ అనే ఆయన "హిందూ, ముస్లింలు ఐకమత్యంగా భుజం భుజం కలిపి నిలబడితే ఏం సాధించగలమనేదానికి దక్షిణాఫ్రికా నుంచి లభించిన తాజా కబురు ఉదాహరణగా నిలుస్తోంది. గాంధీ అద్భుత నాయకత్వంలో అక్కడి భారతీయులు చూపిన పట్టుదలకు ధన్యవాదాలు," అన్నాడు. యాత్ర నిర్వహించినప్పుడు రోజువారీ ఖర్చులకు గాంధీకి

3200 రూపాయలు అవసరం అయ్యేవి. నిధులు కావాలని గాంధీ భారతదేశానికి అభ్యర్థన పంపాడు. మహిళలు తమ గాజులను, భర్తల చేతి ఉంగరాలను పంపారు, యువరాజులు, వర్తకులు వేలాది రూపాయల విరాళాలు పంపారు, టాగూర్ స్వయంగా విరాళాలు సేకరించి పంపాడు. సుదీర్ఘమైన ఆ పోరాటం భారతీయులకు అనుకూలమైన రాజీతో ముగిసింది. ఆత్మగౌరవానికి భంగం కలగనంత వరకూ గాంధీ రాజీకి అంగీకరిస్తూనే ఉండేవాడు.

భారతదేశంలో పలువురు నాయకులున్నప్పటికీ గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు బాధిత ప్రజలు, రైతులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఆయన సహాయం కోరారు. ఆయన ప్రయత్నాల వల్లే చంపారన్‌లో శతాబ్దాల నుంచి నడుస్తున్న బలవంతపు నీలి సేద్యం రద్దయ్యింది, ఒప్పందాల పద్ధతి రద్దు అయ్యింది. ఒక ప్రాంతానికి పరిమితమైన స్థానిక సమస్యలను తమంతట తామే పరిష్కరించుకొనేలా ఆయన ప్రజలను ప్రోత్సహించేవాడు. అలాంటి ఉద్యమాలన్నీ ప్రచారం పొంది మొత్తం భారతదేశాన్నంతటినీ ఆకర్షించడం ప్రారంభించాయి.

ఎప్పుడు ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించినా గాంధీ ఒకే వ్యూహాన్ని అనుసరించే వాడు. భారతదేశంలోని తన 30 సంవత్సరాల నాయకత్వ కాలంలో ఆయన చంపారన్, ఖేడా, బర్డోలిలోని రైతులకు మార్గదర్శనం చేయడంతో పాటు నాలుగు భారీ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. ఆయన భారతదేశం అంతటా పర్యటించి తన ముందున్న సమస్యలను అధ్యయనం చేశాడు.

ఆయన వేలాదిమందిని ఇంటర్వ్యూలు చేశాడు, ప్రభుత్వంతో పోరాటంలో సంబంధం ఉన్న వ్యక్తులతో మాట్లాడి సమాచారం సేకరించేందుకు రోజుకు 18 నుంచి 20 గంటలు పనిచేశాడు. వేలాది బహిరంగ సమావేశాలలో ప్రసంగించాడు, క్రమశిక్షణకు సంబంధించి ఏర్పరుచుకున్న నిబంధనలను వివరించాడు, “భారతదేశం ముందు కత్తిదూయడం అనే హింసాత్మక మార్గం కూడా ఉంది. కానీ అదే సాధ్యమైతే ప్రజలు అహింస గురించిన బోధనలు అసలు వినేవారే కాదు. ఊరేగింపుల ద్వారా, ఉపన్యాసాల ద్వారా స్వరాజ్యం రాదు. పని చేయాలనే పట్టుదల నశించకూడదు, పారిపోవడం తెలియని వీరసైనికులం కావాలి. ప్రాణాలు త్యాగం చేయడానికైనా మనం సిద్ధం కావాలి. దీన్ని సాధించడానికి అసాధారణ శక్తి కావాలి. చంపడానికి బదులు చావడానికి సిద్ధపడాలి. ఇతరుల ప్రాణాలను తీసేందుకు మన ప్రాణాలను పణంగా పెట్టడం తేలికైనప్పుడు, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు మన ప్రాణాలను ఒడ్డటం మానవాతీతమైన పనిగా ఎందుకు భావిస్తున్నాం? ఇతరులను చంపడం

వీరత్వం కాదు. స్వాతంత్ర్యం కోసం, గౌరవం కోసం మరణించడమే వీరత్వం," అని ఆయన అహింసను సమర్థించుకొనేవాడు.

మహిళలు, పిల్లలు, వృద్ధులు ఆయన అహింసా సైన్యంలో ఉండేవారు. పిల్లల సైన్యాన్ని వానరసేన అనేవారు. ఎక్కడైనా హింస తలెత్తితే గాంధీ సత్యాగ్రహాన్ని ఆపేసేవాడు. ఆయనకు రహస్యంగా వ్యవహరించడమంటే అసహ్యం. తన భావి ఎత్తుగడలను ఆయన బహిరంగంగా ప్రకటించేవాడు. తమ హృదయాల్లోంచి కోపం, ద్వేషం, ప్రతీకారాలను ప్రజలు తొలగించి వేయాలని ఆయన కోరుకునేవాడు.

అవిశ్రాంత పోరాటయోధుడైన గాంధీ ఎప్పుడూ తన అనుచరులకు లేనిపోని ఆశలు కల్పించేవాడు కాదు. ఉద్యమంలో లాఠీ దెబ్బలు తినాల్సి ఉంటుందనీ, తుపాకీ తూటాలను ఎదుర్కోవాల్సి ఉంటుందనీ, జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందనీ, ఉరికంబం ఎక్కాల్సి ఉంటుందనీ, వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనీ తన సైనికులను గాంధీ హెచ్చరించేవాడు. ఆయన నినాదమైన "డూ ఆర్ డై" పరమార్థం బాధలను అనుభవించడమే. బాధలను అనుభవించడం ద్వారానే ప్రత్యర్థుల హృదయాలను కరిగించగలనని ఆయన నమ్మేవాడు.

విదేశీ వస్త్రాలను భోగిమంటల్లో వేయడం, భూమి శిస్తును చెల్లించకపోవడం, ఉప్పు తయారీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాల బహిష్కరణలతో పాటు నిర్మాణాత్మకమైన పని కూడా చేయాలని ఆయన ప్రజలకు సూచించేవాడు. నూలు వడకటం, నేయడం, గ్రామ పంచాయతీలను పునరుజ్జీవింప జేయడం, జాతీయ విద్యాలయాలను స్థాపించడం వంటి పనులు చేయాలని ఆయన సూచించాడు. ఒక యేడాదిలో స్వరాజ్యం తెస్తానన్న ఆయన వాగ్దానం నెరవేర్చుకోలేకపోయినా ప్రజలను భయాల నుంచి విముక్తులను చేశాడు. ప్రజాబాహుళ్యంలో చైతన్యం రావడం అనేది పెద్ద ప్రయోజనం. దండి గ్రామానికి ఆయన చేసిన యాత్ర మంత్ర ప్రయోగంలా పనిచేసింది. వేలాది మంది మహిళలు పరదాల చాటునుంచి బయటకు వచ్చి ఉప్పు తయారీలో పాల్గొన్నారు, దేశసేవలో మగవారికంటే తామేమీ తీసిపోమని నిరూపించుకున్నారు. వారు విదేశీ వస్త్ర దుకాణాలు, మద్య దుకాణాల వద్ద ధర్నాలు కూడా చేశారు. భారతదేశ రాజకీయ చరిత్రలో మొట్ట మొదటిసారి అహింసనూ, సహాయ నిరాకరణాన్ని గాంధీ విస్తృతస్థాయిలో వినియోగించాడు.

తన అహింసా పోరాటాలను వర్ణించేందుకు గాంధీ తరచుగా యుద్ధరంగపు మాటలనే ఉపయోగించేవాడు. "నేను యుద్ధానికి బయలుదేరాను; ఒక సైనికుడికి తుపాకీ ఎంత ముఖ్యమో మీకందరికీ (సత్యాగ్రహులకు) రాట్నం అంతే ముఖ్యం; ఏకులే మీ తూటాలు, రాట్నమే మీ తుపాకీ; స్వాతంత్ర్యాన్ని తుపాకులతో రక్షించలేం,

కానీ చేతితో వడికిన నూలుకట్టల ఆకారంలో ఉన్న తూటాలతో అడ్డుకోవచ్చు. మీరు ధరసాన ఉప్పు కర్మాగారం మీద దాడిచెయ్యాలి, దాన్ని తర్వాతి కాలంలో ధరసాన యుద్ధం అని పిలుస్తారు. యుద్ధంలోని హింసాత్మకమైన, వినాశకరమైన ఆయుధాలను వదిలేద్దాం, దానిలోని ధైర్యం, సాహసం, దేశభక్తి, సామర్థ్యం, త్యాగం – ఈ మంచి లక్షణాలను మాత్రం తీసుకుందాం," ఇలా ఉండేవి ఆయనమాటలు.

గాంధీ పిరికితనానికంటే హింసనే ఇష్టపడేవాడు. కానీ బండ బలానికన్నా, ఆత్మబలానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు. "ఆటం బాంబువల్ల అహింస మీద మీకున్న విశ్వాసం చెదిరిపోయిందా?" అని అడిగినప్పుడు. "దానివల్ల నాకు అహింస మీద ఉన్న విశ్వాసం సడలలేదు సరికదా, సత్యం, అహింస అనే రెండు అంశాలే ప్రపంచంలో అన్నిటికన్నా బలమైన శక్తులని నమ్మకం పెరిగింది. ఆ శక్తులతో పోల్చినప్పుడు ఆటంబాబు ప్రభావం చాలా తక్కువ," అన్నాడాయన. అహింస ద్వారా సాధించిన స్వాతంత్ర్యం, భూమి మీద దోపిడీకి గురవుతున్న జాతులన్నిటికీ తమకు కూడా స్వాతంత్ర్యం త్వరలోనే వస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తుంది.

# గ్రంథ రచయిత

ఎం. కె. గాంధీ రచయితగా చాలా పుస్తకాలు కనిపిస్తాయి కానీ వాటిలో చాలా వాటిని ఆయన పుస్తకాలుగా రాయలేదు. సత్యము–అహింస, స్వదేశీ–చరఖా అనే అంశాల మీద ఆయన రాసిన వ్యాసాలు, మహిళలను, విద్యార్థులను, రాకుమారులను ఉద్దేశించి ఆయన చేసిన ఉపన్యాసాల సంకలనాలే పుస్తకాలుగా ప్రచురించారు. ఆయన చాలా మంచి రచయితగా గుర్తింపు పొందాడు. ఆయన ఒక నిర్దిష్ట శైలి మీద శ్రద్ధ పెట్టలేదు, వినసొంపుగా ఉండేందుకై అందమైన మాటలను ప్రయోగించాలని చూసేవాడు. తన ఆశలు, విశ్వాసాలు, దుఃఖాలు, నిరాశలు ప్రతిబింబించే బలమైన శైలి ఆయనకుండేది. ఆయన రచనాశైలి కూడా ఆయన జీవనశైలిలాగే సరళంగా, సంక్షిప్తంగా, నిరాడంబరంగా ఉండేది. గాంధీ లేఖలు సూటిగా, చక్కటి ఆంగ్లభాషలో ఉంటాయనీ; తాను వాడుతున్న పదాల విలువను పూర్తిగా అర్థంచేసుకొని ఆయన ప్రయోగిస్తాడనీ చాలామంది బ్రిటిష్ వైస్రాయిలు అంగీకరించారు. ఆలోచనారహితమైన ఒక్కమాట కూడా తన నోటి నుంచి కానీ, కలం నుంచి కానీ బయటకు రాదని గాంధీ చెప్పుకొనేవాడు. రౌండు టేబుల్



సమావేశాల్లో గాంధీ ప్రకటనలను సిద్ధం చేసిన ఒక ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్ "గాంధీలా ఇంగ్లీషు విభక్తుల (ప్రపోజిషన్స్) మీద పట్టుసాధించిన భారతీయుడిని మరొకరిని చూడలేదు. నేనెంతో కష్టపడి ప్రకటన సిద్ధం చేసిన తర్వాత, గాంధీ నేను రాసినదాన్ని అలా చూసి ఒకటి రెండు విభక్తులు మార్చేవాడు, దానితో నేననుకున్న భావం పోయి, గాంధీ అనుకున్న భావం వచ్చేసేది," అన్నాడు.

బహుశా గొప్ప ఆంగ్ల రచయితల పుస్తకాలను, బైబిలును జాగ్రత్తగా చదవడం వల్ల ఆయన చెవులకు సరైన పదప్రయోగంలో శిక్షణ లభించిందేమో. ఆయన విస్తృతంగా చదివేవాడు, చదివినదాన్ని జీర్ణం చేసుకొనేవాడు.

ఆయన కౌమార దశలో ఉండగా రచయితగా తన మొదటి ప్రయత్నంగా భారతీయ విద్యార్థుల కోసం *"లండన్ గైడ్"* అనే చిన్న పుస్తకం రాశాడు. దానిలో లండన్ గురించి ఉపయోగపడే వివరాలున్నాయి. ఆ తర్వాత కాలంలో రెండు కరపత్రాలు రాశాడు: *"యాన్ అప్పీల్ టు ఎవిరీ బ్రిటన్"*, *"ఇండియన్ ఫ్రాంఛైజీ"*. మొదటిదానిలో దక్షిణాఫ్రికాలోని భారతీయుల స్థితిగతులు చర్చిస్తే, రెండవ దానిలో దక్షిణాఫ్రికాలో భారతీయ వ్యాపారుల చరిత్ర వివరించాడు. వాటిని అనుసరిస్తూ ఆ తర్వాత రాసిన

"గ్రీన్ ఫాంప్లెట్" వాస్తవ గణాంకాలను తెలిపేదిగా ఉంటుంది. దీన్ని ప్రచురించిన మొదటి నెలలోనే సవరించిన రెండో ముద్రణ ప్రచురించాల్సి వచ్చింది. ఆ కరపత్రం సారాంశం దక్షిణాఫ్రికా వార్తాపత్రికలలో ప్రచురితమై అక్కడి యూరోపియన్లలో ఆగ్రహావేశాలు రగిల్చింది. దక్షిణాఫ్రికాలో గాంధీ అడుగుపెట్టగానే ఆయన మీద దాడులు జరిగాయి. సంక్షిప్తీకరణలో తన భావాలు వక్రీకరించబడ్డాయని గాంధీకి ఆ చేదు అనుభవం ద్వారా తెలిసింది. తన భావాలను సంక్షిప్తంగా చెప్పడంలో గాంధీకి మంచి నైపుణ్యం ఉంది. కాంగ్రెస్ రాజ్యాంగాన్ని, చాలా తీర్మానాలను ఆయనే రాశాడు.

"ఏ గైడ్ టు హెల్త్" అనే పుస్తకంలో గాంధీ ఆహారంతో చేసిన ప్రయోగాలన్నీ ఉన్నాయి. 'ఇండియన్ ఒపీనియన్' అనే గుజరాతీ పత్రికలో రాసిన వ్యాసాలకు అది ఆంగ్ల అనువాదం. అది భారతదేశంలోనూ, విదేశాలలోనూ పాఠకుల ఆదరణ పొందింది, ఇతర యూరోపియన్, భారతీయ భాషలలోకి అనువాదమయ్యింది. మనసులోకి ఏదైనా ఆలోచన రాగానే ఒక నిబద్ధతతో ఎవరైనా హేళన చేస్తారేమో అనే ఆలోచన లేకుండా అక్షర రూపంలో పెట్టడం గాంధీ అలవాటు. అలా రాసే అలవాటు వల్లే ఆయన కదిలే ట్రాముల్లోనూ, ఊగే ఓడల్లోనూ కూడా ఏదో ఒకటి గిలుకుతూ ఉండేవాడు. మొత్తం 'గ్రీన్ ఫాంప్లెట్'ను ఆయన 1896లో భారతదేశానికి ఓడలో ప్రయాణిస్తూ రాశాడు. ఆధునిక నాగరికత మీద తీవ్ర విమర్శగా ఆయన రాసిన 'స్వరాజ్‌హింద్' మొత్తాన్ని 1909లో ఇంగ్లాండు నుంచి దక్షిణాఫ్రికాకు ఓడలో ప్రయాణిస్తుండగా రాశాడు. ఆయన దానికి స్టీమరు కాగితాలను వాడుకున్నాడు, కుడిచేత్తో రాయడానికి అలసట వచ్చినప్పుడు ఆయన ఎడం చేత్తో రాసి 10 రోజుల్లో పుస్తకాన్ని పూర్తి చేశాడు. టాల్‌స్టాయ్ దాన్ని చదివి "అహింసాయుత నిరసన (పాసివ్ రెసిస్టెన్స్) అనే భావన భారతదేశానికే కాదు, ప్రపంచానికే ఎంతో అవసరం," అన్నాడు. 'కనస్ట్రక్టివ్ ప్రోగ్రాం' పేరుతో భారతదేశ నిర్మాణం మీద రాసిన చిన్న పుస్తకం మొత్తం రైలుప్రయాణంలో రాశాడు. ఆయన రాతప్రతిలో కొట్టివేతలు, దిద్దుబాట్లు చాలా తక్కువగా ఉండేవి. మార్పులు చేయాల్సిన అవసరం అరుదుగా కానీ వచ్చేది కాదు. "సత్యంతో నిబద్ధమైన ఆధ్యాత్మిక క్రమశిక్షణ," వల్లే అది సాధ్యమౌతుందని ఆయన చెప్పేవాడు.

ఒక భావాన్ని వేరొక భాషలోకి అనువదించడానికి పదాలను ఎన్నుకోవడంలో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉండేది. ఆయన ఒక పదాన్ని గానీ భావాన్ని కానీ అక్షరాలా అనువదించేవాడు కాదు, 'డెత్ డాన్స్'ను ఆయన 'పతంగ నృత్య'గా అనువదించాడు. తన ప్రగాఢ విశ్వాసాలను ప్రతిబింబిస్తున్నట్లుగా రస్కిన్ రాసిన

'అన్ టు ది లాస్ట్' ఆయనకు అనిపించింది. ఆయన దాన్ని 'సర్వోదయ' పేరుతో గుజరాతీ భాషలోకి స్వేచ్ఛగా అనువదించాడు. కార్లైల్ రాసిన 'ది లైఫ్ ఆఫ్ కెమాల్ పాషా'లో కొన్ని భాగాలను ఆయన గుజరాతీలోకి అనువదించాడు. ఆయన రాసిన 'ది స్టోరీ ఆఫ్ సత్యాగ్రహి' అనేది ప్లాటో రాసిన 'డిఫెన్స్ అండ్ డెత్ ఆఫ్ సోక్రటీస్'కు స్వేచ్ఛానువాదం. ఆశ్రమ భజనావళిని, భారతీయ రుషులు రాసిన కొన్ని శ్లోకాలను ఆయన దక్షిణాఫ్రికా జైలులో ఉండగా ఆంగ్లంలోకి అనువదించాడు. ఇవి 'సాంగ్స్ ఫ్రం ది ప్రిసన్'గా ప్రచురితమయ్యాయి.

గాంధీ తన ఆత్మకథను గుజరాతీలో రాశాడు. ఆయన బలమైన, సరళమైన శైలి గుజరాతీని ప్రజల భాషగా మార్చేసింది. దీని ఆంగ్లానువాదం 'మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్' ను చాలామంది ప్రసిద్ధ వ్యక్తులు ఒక మంచి సాహిత్య రచనగా గుర్తించారు. ఒక ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తి యొక్క వ్యకిత్వాన్ని విశదీకరించడమే కాక, ఆయన తల్లిదండ్రులూ, భార్య, స్నేహితుల అక్షరచిత్రాలు, నాటకీయ సన్నివేశాలు, ఉత్కంఠను కొనసాగించిన విధానం, సాధారణ సంభాషణలను కూడా పాఠకుల ఆసక్తి తగ్గకుండా రాసిన విధానం ఆ పుస్తకంలోని విశిష్టతలు. ఈ పుస్తకం దాదాపుగా భారతీయ భాషలన్నిటిలోకి, ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యన్, జర్మన్, చైనీస్, జపనీస్ భాషల్లోకి అనువాదమయ్యింది.

ఆయన రచనలన్నీ సత్యాన్నీ, ఉన్నత నైతిక విలువలనూ సమర్థిస్తాయి. అలా అని అవి రసహీనమైన ప్రవర్తనావళులుగా ఉండవు. ఆయన 'బాలపోతి' అనే ప్రాథమిక వాచకాన్ని, 'నీతిధర్మ' అనే పేరుతో పిల్లల కోసం నీతి పుస్తకాన్ని రాశాడు. పిల్లలు ఆచరణలో పెట్టలేని అంశాలను వాళ్లకు బోధించడం ఆయనకు ఇష్టంలేదు. ఆయన ఆశ్రమంలోని పిల్లలకు రాసిన ఉత్తరాలు సరదాగానూ, మార్గదర్శకంగానూ కూడా ఉంటాయి. ఆయన చాలా ఎక్కువ పరిమాణంలో రాసేవాడు, ఒక రోజులో సాధారణ రాతలో 50 పేజీలు రాసేవాడు. ఆయన రాసిన సుమారు 100,000 ఉత్తరాలు ఆయన రచనలలో ప్రధాన భాగంగా ఉన్నాయి.

కళ కళకోసం అనే వాదనకు గాంధీ వ్యతిరేకి. ఆయన ఉద్దేశంలో అన్ని కళలూ సత్యంపై ఆధారపడి ఉండాలి. రచనలన్నీ మానవ ఔన్నత్యం కోసం సహాయపడేవిగా ఉండాలి. అర్ధాకలితో ఉన్న పేదలకు సరళమైన చిన్న కథలు కావాలి, రైతులు తమ ఎడ్లబళ్ల మీద ఇంటికి తిరిగి వెళుతూ పాడుకుంటూ తమ బాధల్ని మరిచిపోయేలా చేసే గేయకథలు కావాలి. ఒక సాహిత్య సమావేశంలో రచయితలతో "ఈ లక్షలాది నిరుపేదల ఆకలి, ఆశలను మీరేమైనా పట్టించుకుంటున్నారా? మన సాహిత్యమంతా

ఎవరికోసం?" అని ప్రశ్నించాడు. ఇంగ్లాండులోని సామాన్యులు అర్థంచేసుకొనే స్థాయిలో డీన్ ఫరార్ రాసిన 'క్రీస్తు చరిత్ర'ను ఆయన ఆదర్శంగా చూపించేవాడు. గుజరాతీ ఇండియన్ ఒపీనియన్‌లో ఆయన చాలామంది ప్రఖ్యాత వ్యక్తుల గురించి సంక్షిప్త చరిత్రలు రాసేవాడు. ఆయన అభిమాన కవి, తత్వవేత్త రాయ్‌చంద్‌భాయి జీవిత చరిత్ర రాయమని అన్నప్పుడు "ఆయన జీవిత చరిత్ర రాయాలంటే నేను ఆయన నివసించిన ఇల్లు, ఆటస్థలం చూడాలి. ఆయన స్నేహితులతో, బంధువులతో, అనుచరులతో మాట్లాడాలి," అన్నాడు. అంటే ఇక్కడ కూడా ఆయన సత్యం మీదే ఆధారపడదామనుకున్నాడు కానీ కల్పన మీద కాదు.

గాంధీ తరచుగా భారతీయ పురాణాల నుంచి, రాముడు, కృష్ణుడు, మహ్మద్‌ల జీవితాల నుంచి సంఘటనలను, ఉదాహరణలను, నీతులను ఉటంకిస్తూ ఉండేవాడు. దానితో ఆయన భావాలు సామాన్య ప్రజలకు తేలికగా అర్థమయ్యేవి. వారి హృదయాలకు హత్తుకొనే శక్తి ఆయన మాటలకు లభించేది. అంటరానితనం, రాళ్లతో కొట్టి చంపడం, తెల్లవాళ్ల దురుసుతనం వంటి వాటిని విమర్శించడంలో ఆయన చూపించే ధైర్యం, స్వార్థంతో దిగజారిపోతున్న కాంగ్రెస్ నాయకులను తెల్లబట్టల గూండాలతో పోల్చడం వంటివి ఘాటుగా, దిశానిర్దేశకంగా ఉండేవి. "సత్యం అనే ఆదర్శం చాలావరకూ పాశ్చాత్యదేశాలలో పుట్టినదే," అని లార్డ్ కర్జన్ అన్న మాటలను ఖండించడానికి ఆయన రామాయణ భారతాలు, వేదాలు, పురాణాలోంచి అనేక ఉదాహరణలు చూపి భారతదేశంలో సనాతన కాలం నుంచి సత్యాన్ని దైవ స్వరూపంగా ఆరాధిస్తున్నారని నిరూపించాడు. ఒక ఇంగ్లీషు పెద్దమనిషిగా కర్జన్ తన ఆధారంలేని, అవమానకరమైన మాటలను వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు. ఒకసారి ఆయన "మహ్మద్, ఆయన ప్రవచించిన శాంతి సందేశం ఎక్కడున్నాయి? ఇప్పుడు కానీ మహ్మద్ భారతదేశం వచ్చి చూస్తే ఆయన అనుచరులమని చెప్పుకొనే చాలామందిని తిరస్కరించి, నన్ను నిజమైన మహ్మదీయుడిగా గుర్తిస్తాడు. అలాగే క్రీస్తు ఇప్పుడు జన్మించినా నన్ను నిజమైన క్రైస్తవునిగా గుర్తిస్తాడు. పాశ్చాత్య దేశాలలో క్రైస్తవం మాయమయ్యింది. అది అమలులోఉండి ఉంటే ప్రపంచ యుద్ధాలు ఎందుకు వస్తాయి?" అన్నాడు.

ఒక సందర్భంలో "కవి తాను సొంతంగా సృష్టించుకున్న ఊహా ప్రపంచంలో బందీగా ఉంటాడు," అన్నాడు గాంధీ. కానీ ఎవరో సృష్టించిన రాట్నానికి ఆయన తన్ను తాను బందీగా చేసుకున్నాడు. గాంధీ ఆలోచనలు, భాషలోని సౌందర్యం ఆనాటి కొందరు గొప్పవ్యక్తులపై గాఢమైన ప్రభావం చూపింది. ఆయన రచనలలోని

చాలా పేరాలు ఆయన అక్షరాలతో ఎంత సజీవమైన చిత్రాలను సృష్టించగలడో నిరూపిస్తాయి. "నేను మైసూరులో రాతిలో తొలిచిన ఒక ప్రాచీన దేవాలయంలో నాతో మాట్లాడుతోందా అనిపించేంత సహజంగా ఉన్న చిన్న విగ్రహాన్ని చూసాను. అది తను దుస్తులను సర్దుకుంటూ ఉన్న ఒక అర్ధనగ్న స్త్రీ ప్రతిమ. తేలు రూపంలో పాదాల వద్ద పడి ఉన్న మన్మధుని బాణాల నుంచి తప్పించుకొనేందుకు ఆమె ప్రయత్నిస్తోంది. ఆమెలో ఉన్న వేదనను, తేలు కుట్టిన బాధను నేను చూడగలిగాను," ఇది గాంధీ రాసిన ఒక పేరా.

"మీకు ఒడిశా, అక్కడి కంకాళాలు తెలుసా? ఆకలితో ఆర్థికంగా చితికిపోయిన ఆ కంకాళాల భూమి నుంచి కొందరు వ్యక్తులొచ్చారు. వారు ఎముకల మీద, కొమ్ముల మీదా, వెండి మీదా అద్భుతాలను చెక్కారు. ఒక నీరసించిన శరీరంలో ఉన్న ఆత్మ ప్రాణంలేని కొమ్ములు, లోహాలకు ఎలా ప్రాణం పోయగలదో వెళ్లి చూడండి. అలాగే ఒక పేద కుమ్మరి మట్టితో చేసిన అద్భుతాలను కూడా చూడండి."

"ఆ ప్రదేశం ఒక నది ఒడ్డున ఉంది. చెట్లు, పొదలతో సాదాగా ఉన్న కొండల వరుస మధ్య ఆ నది ప్రవహిస్తోంది. నదీగర్భం, నదీ తీరం బురదలేకుండా ఇసుకతో ఉన్నాయి. నదీజలాలలో వేదిక నిర్మించారు. ఆ వేదికకు ఎదురుగా ఉన్న దారికి ఇరుపక్కలా 12 వేల మందికి పైగా ఉన్న స్త్రీ, పురుష భారీ జనసందోహం సంపూర్ణ నిశ్శబ్దంతో కూర్చుని ఉన్నారు."

"నేను తెల్లవారు జామునే మలబార్‌లోకి ప్రవేశించాను. పరిచయమున్న ప్రదేశాలన్నిటినీ దాటుకు వెళుతుండగా నేను క్రితంసారి ఇక్కడకి వచ్చినప్పుడు కలసిన నయాది కులం వ్యక్తి రూపం కళ్ల ముందు మెదిలింది. మేము అంటరానితనం గురించి చర్చిస్తూ ఉండగా ఒక కీచుగొంతు వినబడింది. నాతో మాట్లాడుతున్నవారు 'మేము మీకిప్పుడు ఒక బతికున్న నయాదీని చూపిస్తాం,' అన్నారు. రహదారి మీద నడిచేందుకు అతనికి అనుమతి లేదు. చెప్పుల్లేని కాళ్లతో అతను నిశ్శబ్దంగా చేలకు అడ్డం పడి నడుస్తున్నాడు. నా వద్దకు వచ్చి మాట్లాడమని నేను అతన్ని పిలిచాను. అతను వణుకుతూ నాతో మాట్లాడాడు. రహదారుల మీద నాకెంత హక్కుందో, అతనికీ అంతే హక్కుందని నేను చెప్పాను. 'అలా ఎలా ఉంటుంది? నేను రహదార్ల మీద నడవడం వీలు పడదేమో?' అన్నాడతను అపనమ్మకంగా. నేను మీకు నవ్వుతూ కనిపించవచ్చు, మీతో చెణుకులు వేస్తూండవచ్చు. కానీ ఈ నవ్వులు, చెణుకుల వెనుక మలబార్‌లో ఉన్నంత సేపూ ఆ నయాదీ ముఖమే నన్ను వెంటాడుతూ ఉంటుంది."

# పాత్రికేయుడు

19 యేళ్ల వయసులో ఇంగ్లాండుకు వెళ్లిన తర్వాత గాంధీ క్రమం తప్పకుండా వార్తాపత్రికలు చదవడం అలవాటు చేసుకున్నాడు. పాఠశాల విద్యార్థిగా ఉండగా ఆయనకు వార్తాపత్రికలు చదివే అలవాటు లేదు. ఆయనకు చాలా బిడియం, పదిమంది ముందు మాట్లాడలేక పోయేవాడు. 21 సంవత్సరాల వయసులో మొదటిసారిగా ఆయన ఒక ఇంగ్లీషు వారపత్రికకు శాకాహారం, భారతీయ ఆహార అలవాట్లు, సంప్రదాయాలు, శాకాహారుల మతపరమైన పండుగలు లాంటి అంశాలపై వ్యాస పరంపర రాశాడు. ఏ ఆలోచననైనా సరళంగా, సూటిగా చెప్పడంలో ఆయనకున్న సామర్థ్యం ఆ మొదటి రచనలలో కనబడుతుంది.

రెండు సంవత్సరాల విరామం తర్వాత గాంధీ మళ్లీ పాత్రికేయ వృత్తిలోకి వచ్చాడు. అప్పటి నుంచి జీవితాంతం వరకూ ఆయన కలం విశ్రాంతి తీసుకోలేదు. కేవలం ఎవరినో ఆకట్టుకోవడం కోసం ఆయన ఎప్పుడూ ఏదీ రాయలేదు. అతిశయోక్తులు రాయకుండా జాగ్రత్త తీసుకొనేవాడు. సత్యాన్ని ప్రచారం చేయడం, ప్రజల అవగాహనను పెంచడం, దేశానికి ప్రయోజనకరంగా ఉండటం అనేవి ఆయన మూడు లక్ష్యాలు.

దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన మూడో రోజు ఆయనకు న్యాయస్థానంలో అవమానం ఎదురయ్యింది. ఆయన వెంటనే ఆ సంఘటనా క్రమాన్ని స్థానిక వార్తాపత్రికకు రాసి పంపి ప్రచురితమయ్యేలా చూశాడు, రాత్రికి రాత్రి పెద్ద ప్రచారం పొందాడు.

35 సంవత్సరాల వయసులో ఆయన "ఇండియన్ ఒపీనియన్" పత్రిక బాధ్యతలు స్వీకరించాడు. దాని ద్వారా ఆయన దక్షిణాఫ్రికాలోని భారతీయులకు మార్గదర్శనం చేశాడు, వారిని ఏకం చేశాడు. ఈ వార పత్రిక గుజరాతీ సంచికను ఫీనిక్స్‌లో ముద్రించేవారు. ఆహారశాస్త్రం మీదా, ప్రసిద్ధులైన పురుషులు, మహిళల జీవిత విశేషాల మీద వ్యాస పరంపర ఈ పత్రికలో వచ్చేది. గాంధీ రాసిన ఈ రెండు వ్యాసాలు ప్రతివారం ఈ పత్రికలో తప్పనిసరిగా ఉండేవి. దీనికి సంపాదకుడు ఉండేవాడు కానీ గాంధీనే అన్ని బాధ్యతలు చూసుకొనేవాడు. ప్రజలకు అవగాహన పెంచాలని, తెల్లవారికి, భారతీయులకు మధ్య అపార్థానికి దారి తీసే అంశాలను పరిష్కరించాలని, తన దేశస్తుల లోపాలను ఎత్తి చూపి వాటిని సరి చేయాలనీ ఆయన కోరుకొనేవాడు. 'ఇండియన్ ఒపీనియన్' వ్యాసాలలో తన హృదయాన్ని ఆవిష్కరించేవాడు,

దక్షిణాఫ్రికాలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమాన్ని పూసగుచ్చినట్లు ప్రచురించేవాడు. ఆయన వ్యాసాల ద్వారా విదేశాలలో ఉన్న పాఠకులకు దక్షిణాఫ్రికాలో జరుగుతున్న సంఘటనల నిజస్వరూపం తెలిసేది. అలా తెలుసుకున్నవారిలో భారతదేశంలో గోఖలే, ఇంగ్లాండులో దాదాభాయి నౌరోజీ, రష్యాలో టాల్‌స్టాయ్ లాంటివారు ఉన్నారు. పదేళ్లపాటు గాంధీ ఈ వారపత్రిక కోసం కష్టపడ్డాడు. 'ఇండియన్ ఒపీనియన్'కు బదులుగా ఆయనకు రెండొందల పత్రికలు లభించేవి. ఆయన వాటన్నటినీ జాగ్రత్తగా చదివి, 'ఇండియన్ ఒపీనియన్' పాఠకులకు ఉపయోగపడతాయనుకొనే అంశాలను తిరిగి పత్రికలో ప్రచురించేవాడు.

భావాలను ప్రచారం చేయడానికి వార్తాపత్రికలు మంచి మాధ్యమంగా పని చేస్తాయని గాంధీకి తెలుసు. ఆయన విజయవంతమైన పాత్రికేయుడే కానీ, జీతం కోసం ఎప్పుడూ ఆ వృత్తిని ఎంచుకోలేదు. పాత్రికేయుల లక్ష్యం సమాజసేవ అని ఆయన నమ్మేవాడు. "పొట్టకూటిని సంపాదించుకోవడం కోసమో, ఇతర స్వార్థ ప్రయోజనాల కోసమో ఎప్పుడూ పాత్రికేయ వృత్తిని తాకట్టు పెట్టకూడదు. పత్రికల సంపాదకులకు ఎలాంటి సవాళ్లు ఎదురైనా, ఫలితాలతో సంబంధం లేకుండా వారు దేశ ప్రయోజనాలే లక్ష్యంగా వార్తలు ప్రచురించాలి. ప్రజల హృదయాలలో నిలిచి ఉండాలంటే విభిన్నమైన, నిష్పక్షపాతమైన విధానాలను అనుసరించాలి," అనేవాడు గాంధీ.

ఆయన కఠోరమైన వాస్తవాలను ఎప్పుడూ విస్మరించేవాడు కాదు. అలంకారాలను ఉపయోగించేవాడు కాదు, అజాగ్రత్తగా ప్రకటనలు చేసేవాడు కాదు, అనవసరమైన విశేషణాలు వాడేవాడు కాదు. పదాల ఎంపికలోనూ, అనువాదంలో తప్పులు దొర్లకుండాను చాలా జాగ్రత్తలు తీసుకొనేవాడు. ఆయనకు పేరులేని లేఖలంటే ఇష్టం ఉండేది కాదు, కానీ సంపాదకునికి లేఖలలో తీవ్రమైన విమర్శలొచ్చినా ప్రచురించేవాడు.

'ఇండియన్ ఒపీనియన్' బాధ్యతలు గాంధీ చేపట్టినప్పుడు అది నష్టాల బాటలో ఉంది, కేవలం 400 మంది చందాదారులుండేవారు. ఆయన దాని మీద లాభాలు సంపాదించాలనుకోలేదు కానీ, తనను తాను పోషించుకోలేని పత్రికకు సంపాదకుడిగా ఉండటం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. కొన్ని నెలల పాటు ఆయన దాన్ని నడిపేందుకు నెలకు 1200 రూపాయలు తన జేబులోంచి ఖర్చు పెట్టాల్సి వచ్చేది. మొత్తం మీద ఆ పత్రిక నడపడం కోసం ఆయన 26,000/- రూపాయల సొంత ధనాన్ని నష్టపోయాడు. ఇంత భారీ నష్టం వచ్చినప్పటికీ, తన భావాల ప్రచారానికి

మరింత చోటు కావాలని, తర్వాతి కాలంలో ఆయన పత్రికను ప్రకటనలేవీ లేకుండానే ప్రచురించాడు. ప్రకటనలు స్వీకరిస్తే సత్యానికి కట్టుబడి ఉండటం, తన భావాలను స్వతంత్రంగా ప్రకటించడం సాధ్యం కాదని ఆయనకు తెలుసు. "ఆదాయం కోసం చందాల మీద కాకుండా, ప్రకటనల మీద ఆధారపడటం ఆరోగ్యకరం కాదు. మద్యపానం వల్ల వచ్చే నష్టాల గురించి రాసే పత్రికే మద్యం ప్రకటనలు వేస్తుంది. 99 శాతం ప్రకటనలు బొత్తిగా ఉపయోగం లేనివి, దేశానికి ప్రమాదకరమైనవి. చాలా ప్రకటనలు మోసపూరితంగా, అసభ్యంగా ఉంటాయి," అనేవాడాయన. తన పత్రికల అమ్మకాలను అక్రమ పద్ధతుల్లో పెంచుకోవాలని కానీ, ఇతర వార్తాపత్రికలతో పోటీపడాలని కానీ గాంధీ ఎప్పుడూ ప్రయత్నించలేదు. గడి-నుడి వంటి వాటికి కానీ, మరే ప్రహేళికకు (పజిల్‌కు) కానీ ఎప్పుడూ ఆయన బహుమతి ప్రకటించలేదు. ఏవో ప్రలోభాల ఎర చూపి పాఠకులను వలలో వేసుకోవడం ఆయనకు ఇష్టం లేదు. "ఇతర పత్రికలు నా ఆత్మకథను పునః ప్రచురించడాన్ని అడ్డుకొని *యంగ్ ఇండియా*, నవజీవన్ పత్రికల అమ్మకాలు పెంచుకోవడం నాకిష్టం లేదు," అని ఆయన ప్రకటించాడు.

భారతదేశంలో కూడా తన వార పత్రికల పేజీలను ప్రకటనలతో పాడు చేయకుండా ఆయన 30 యేళ్ల పాటు పత్రికలు నడిపాడు. ప్రతి రాష్ట్రంలోనూ ఒకే ప్రకటనల సంస్థ ఉండాలని, ప్రకటనలన్నీ సమీక్షించి కేవలం ప్రజలకు ప్రయోజనకరమైన ప్రకటనలను మాత్రమే ప్రచురించాలని ఆయన సూచించేవాడు. *యంగ్ ఇండియా* సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఆయన గుజరాతీ భాషలో కూడా ఒక పత్రిక తేవాలనుకున్నాడు. దేశంలో ప్రాంతీయ భాషా పత్రికల అవసరం ఎంతో ఉందని ఆయన ఉద్దేశం. అందుకే ఆయన *యంగ్ ఇండియా* పత్రిక హిందీ, గుజరాతీ అనువాద సంచికగా ఆయన నవజీవన్‌ను ప్రారంభించాడు. వాటికి క్రమం తప్పకుండా అనేక వ్యాసాలు రాసేవాడు. *యంగ్ ఇండియా*కు సుమారు 1200కు పైగా చందాదార్లుండగా, నవజీవన్‌కు 12000 వేలకు పైగా చందాదారులు ఉండేవారు. ఆయన నవజీవన్ వార్షిక చందాను 8/- రూపాయల నుంచి, 4/- రూపాయలకు తగ్గించాడు. నవజీవన్ మీద వచ్చిన లాభాలలో 50,000/- రూపాయలను ఖాదీ నిధికి ఇచ్చిన కారణంగా పత్రికలో పేజీల సంఖ్య తగ్గించాల్సి వచ్చినప్పుడు ఆయన పాఠకులకు క్షమాపణలేవీ చెప్పలేదు.

"నా కోరిక సామాన్యులను చేరుకోవాలనే. ఇది కేవలం ప్రాంతీయ భాషా పత్రికల ద్వారా మాత్రమే సాధ్యం. నాది వ్యవహారిక గ్రామీణ భాష, నవజీవన్‌ను



My dear Jawaharlal
You must not be stunned. Rather rejoice that God gives strength & direction to do my duty. I could not do otherwise. As the author of non-coopera-tion, a heavy respon-sibility lies on my shoulders. So [illegible] me in writing your im-pressions of Lucknow & Cawnpore. Let me drink the cup to the full. I am quite at peace with myself.
19/9/24 Yours sincerely
M.K.Gandhi

*గాంధీ కుడి చేతి రాత*

టాక్సీ డ్రైవర్లు, కార్మికులు చదువుతారు. అది రైతులకు, నేతపనివారి గుడిసెలకూ చేరుకోవాలని నా కోరిక. అందుకే అది వారి భాషలో ఉండాలని కోరుకుంటున్నాను. వారే భారత నిర్మాతలు," అని ఆయన సగర్వంగా చెప్పేవాడు. ఇంగ్లీషు పత్రికను చదివేవారి సంఖ్య అత్యల్పం కాబట్టి ఆ పత్రికకు సంపాదకత్వం వహించడం ఆయనకు ఆనందాన్నిచ్చేది కాదు.

తన పాఠకులను పత్రిక యజమానులుగా భావించమని ఆయన చెప్పేవాడు. గాంధీ ఆస్తులుగా కాక పత్రికలను వారి సొంత పత్రికలుగా భారతీయులంతా

చూసుకోవాలని ఆయన కోరేవాడు. నవజీవన్‌లో అక్షర దోషాలు, అన్వయ దోషాలు కనిపిస్తే పత్రిక కొనవద్దనీ, నవజీవన్ బహిష్కరణ సంఘాలు స్థాపించాలని సూచించేవాడు. తన సహాయకుల వల్ల కానీ, ఉపసంపాదకుల వల్ల కానీ, రిపోర్టర్ల వల్ల కానీ, కంపోజిటర్ వల్ల కానీ, ప్రూఫ్ రీడరు వల్ల కానీ తప్పు జరిగితే, సాంకేతిక కారణాల వల్ల పత్రిక విడుదలలో ఆలస్యం జరిగితే దానికి సంపాదకుడే బాధ్యత వహించాలని ఆయనకు తెలుసు. ఆయన సంపాదకత్వంలోని ఏ పత్రికా ఆయన భారతదేశంలో ఉన్నా, బర్మాలో ఉన్నా, శ్రీలంకలో ఉన్నా, ఇంగ్లాండులో ఉన్నా ఆయన రాయవలసిన దానివల్ల ఎప్పుడూ ఆలస్యంగా విడుదల కాలేదు.

గాంధీలా తీరిక లేకుండా ఉండే మనిషికి పత్రిక సంపాదక బాధ్యతలు వహించడం అంత తేలిక కాదు. 70 సంవత్సరాల వయసులో కూడా హరిజన్ పని పూర్తి చేయడానికి ఆయన అర్ధరాత్రి ఒంటిగంటకు లేవాల్సి వచ్చేది. ఎంతో పని భారం ఉన్నా కూడా ఆయన చాలా రాయాల్సి వచ్చేది. ఆయన తరచుగా నడుస్తున్న రైలులో కూడా రాసేవాడు. ఆయన ప్రసిద్ధ సంపాదక వ్యాసాలు కొన్నిటి కింద 'రైల్లోంచి' అని ఉంటుంది. కుడిచేయి నెప్పి పుట్టినప్పుడు ఆయన ఎడమ చేత్తో రాసేవాడు. ఆయన ఎడమ చేతిరాతే చదవడానికి ఎక్కువ అనుకూలంగా ఉండేది. జబ్బు చేసినప్పుడు కూడా ఆయన వారానికి నాలుగు వ్యాసాలు రాసేవాడు.

భారతదేశంలో ఆయన ఏ పత్రికనూ నష్టాలలో నడపలేదు. ఆయన ఇంగ్లీషు, దేశ భాషా పత్రికలు కలిపి 40,000 ప్రతుల వరకూ అమ్ముడుపోయేవి. ఆయన జైలులో ఉన్నప్పుడు పత్రికల అమ్మకాలు 3000లకు పడిపోయాయి. భారతదేశంలో మొదటి కారాగారవాసం తర్వాత బయటకు రాగానే ఆయన పత్రికల్లో తన ఆత్మకథను వారం వారం సీరియల్‌గా ప్రచురించడం ప్రారంభించాడు. అది మూడు సంవత్సరాల పాటు కొనసాగి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. తన ఆత్మకథను ఉచితంగా అచ్చువేసుకోవడానికి భారతదేశంలోని అన్ని పత్రికలకూ అనుమతిచ్చాడు. ఆయన జైల్లో ఉండగానే హరిజన్ వారపత్రికను ప్రారంభించాడు. నవజీవనన్‌లాగే దీని వెల కూడా అణా మాత్రమే. అందులో కేవలం అంటరానితనం నిర్మూలనకు సంబంధించిన వ్యాసాలు మాత్రమే ఉండేవి. దాన్ని మొదట హిందీలో ప్రచురించారు. జైలు నుంచి వారానికి మూడు వ్యాసాలు రాయడానికి గాంధీని అనుమతించారు. హరిజన్‌ను ఆంగ్లంలో కూడా ప్రచురించాలని ఒక స్నేహితుడు ప్రతిపాదించినప్పుడు, "పూర్తి సన్నద్ధత లేనిదే ప్రచురించడానికి నేను అంగీకరించను. అనువాదాలు కచ్చితంగా ఉండాలి, తగినంత ఆసక్తి గల సమాచారం ఉండాలి. మొక్కుబడిగా సిద్ధం చేసిన



My dear Jawahar

We are living in strange times. Sitla Sahai may depend himself. Please keep me informed of further developments. What is he? Is he a lawyer? Had he ever any connection with revolutionary activity?

As for the congress, it would be better to make it as simple as possible so as to enable the present remaining workers to cope with it. And I know that your burden will be now increased.

3

I want your mental peace. I know that you will serve the country even as manager of a business. I am sure that Father will not mind any decision you may arrive at so long as it gives you complete peace

Yours
Bapu

30 9/29

I see that I must reserve the right hand for No. 3

*గాంధీ ఎడమ చేతి రాత ఉత్తరం; జవహర్‌లాల్ నెహ్రూ సౌజన్యంతో*

ఆంగ్ల పత్రికను ప్రచురించడం కంటే, హిందీ ప్రచురణతో సరిపెట్టుకోవడం మంచిది. అన్నిటికన్నా ముఖ్యంగా అది స్వయంపోషకంగా తయారైతే తప్ప నేను దాన్ని నడపడానికి అంగీకరించను," అని గాంధీ బదులిచ్చాడు. మొదటిగా 10,000 ప్రతులు ప్రచురించాలనీ, మూడు నెలల్లో స్వయం పోషకత్వం సాధించాలనీ నిర్ణయించారు. అది రెండు నెలల్లోనే స్వయం పోషకత్వం సాధించింది. తర్వాత కాలంలో అది ప్రముఖ వార్తాపత్రిక అయ్యింది. ఆంగ్లం, హిందీ, ఉర్దూ, తమిళం, తెలుగు, ఒరియా, మరాఠీ, గుజరాతీ, కన్నడ, బెంగాలీ భాషల్లో ప్రచురితమయ్యేది. ప్రజలు దాన్ని

ఆహ్లాదం కోసం కాక సూచనల కోసం చదివేవారు. ఆంగ్లం, హిందీ, ఉర్దూ, గుజరాతీలలో గాంధీ వ్యాసాలు రాసేవాడు.

పత్రికల్లో గాంధీ ఎప్పుడూ సంచలనాత్మక అంశాలు ప్రచురించేవాడు కాదు. నిర్మాణాత్మక కార్యక్రమాల గురించి, సత్యాగ్రహం, అహింస, ఆహారం, ప్రకృతి వైద్యం, హిందూ-ముస్లిం ఐక్యత, అంటరానితనం, నూలు వడకటం, ఖాదీ, స్వదేశీ, గ్రామీణ పరిశ్రమలు, మద్యనిషేధం వంటి అంశాల మీద ఆయన అవిశ్రాంతంగా రాసేవాడు. ఆహారపు అలవాట్లు, విద్యావిధానాన్ని పునఃసమీక్షించడం గురించి, జాతీయ లోపాలను సరిచేయడం గురించి ఆయన తరచుగా వాదించేవాడు.

ఆయన పనిరాక్షసుడు. ఆయన కార్యదర్శి మహదేవదేశాయి రైలు పెట్టెలో గుమిగూడిన జనాల నుంచి తప్పించుకొనేందుకు మరుగుదొడ్డిలో కూర్చొని పని పూర్తి చేయాల్సి వచ్చేది. ఆయన రాసిన లేఖలను, వ్యాసాలను తగిన సమయంలో పోస్టయ్యేలా చూసేందుకు సహాయకులు అన్ని రైలు బళ్ల వేళలు, పోస్టల్ క్లియరెన్సు వేళలు తెలుసుకొని సిద్ధంగా ఉండాల్సి వచ్చేది. ఒకసారి గాంధీని, ఆయన వ్యాసాలనూ తీసుకు వెళుతున్న రైలు ఆలస్యంగా నడుస్తోంది, వ్యాసాలను పోస్టు చేసేందుకు సమయం మిగల్లేదు. ఒక మనిషి ద్వారా వ్యాసాలను ముంబయి పంపారు. అహ్మదాబాదులోని ఆయన స్వంత ముద్రణాలయంలో కాకుండా ముంబయిలోనే ముద్రించారు. పత్రిక మాత్రం సమయానికి విడుదల అయ్యింది.

*యంగ్ ఇండియా*లో ప్రచురించిన కఠోర విమర్శనాత్మక వ్యాసాల కారణంగానే గాంధీని భారతదేశంలో మొదటిసారి అరెస్టు చేసి జైలుకు పంపారు. పత్రికల గొంతు నొక్కాలని చూసే ప్రభుత్వ శాసనాలను ఆయన ఎప్పుడూ లెక్కచేసేవాడు కాదు. తన మనసులోని భావాలను బయటపెట్టే అవకాశం లేని పరిస్థితుల్లో ఆయన రాయడం మానేసేవాడు. తన వ్యాసాలకు నకళ్లు తయారు చేసి పంపిణీ చేయమని అడిగితే పాఠకులు తప్పకుండా ఆ పని చేస్తారని ఆయన విశ్వసించేవాడు. చట్టంతో పత్రికను ఆపగలరేమో కానీ, బతికున్నంత వరకూ అతని సందేశం ప్రజలకు చేరడం ఆపలేరని గాంధీ నమ్మకంగా ఉండేవాడు. ముద్రణా యంత్రం మీద ముద్రించి తీరాలని పట్టుదల లేకపోతే చేతిరాతతో రాసిన కరపత్రం కూడా వీరోచిత కార్యాలకు వీరోచిత సాధనంగా ఉపయోగపడుతుందని ఆయన అనుచరులకు ధైర్యం చెప్పేవాడు. 1919లో ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఆయన సత్యాగ్రహ అనే రిజిస్టరు చేయని వారపత్రికను ముద్రించాడు. ఒక పేజీ ఈ వారపత్రికను ఒక పైసాకు అమ్మేవారు.

చాలా కాలం పాటు కొనసాగిన కారణంగా ఆయన పాత్రికేయ వృత్తిలో మంచి సాంప్రదాయాలను గురించి సాధికారికంగా మాట్లాడేవాడు: “వార్తాపత్రికల విలేకరులు నడిచే మహమ్మారిలా తయారయ్యారు, వార్తాపత్రిక అంటే ప్రజలకు భగవద్గీత, ఖురాను, బైబిలు కంటే ఎక్కువ. హిందూముస్లిం మతకలహాలు చెలరేగే అవకాశం ఉందని ఒక పత్రిక రాస్తే, వెంటనే ఢిల్లీలోని కర్రలూ, కత్తులూ అన్నీ అమ్ముడైపోయాయి. ప్రజలను చైతన్య పరచి ధైర్యంగా ప్రవర్తించేలా చేయడం విలేకరి విధి, వాళ్లను భయభ్రాంతులకు గురిచేయడం కాదు.”

## ముద్రాపకుడు - ప్రచురణకర్త

*ఇండియన్ ఒపీనియన్, యంగ్ ఇండియా, నవజీవన్* పత్రికలకు గాంధీ సంపాదకత్వం వహించాడు. ఆయన వాటిని తన స్వంత ముద్రణాలయంలో ముద్రించి, ప్రచురించాడు. ఇతరుల యాజమాన్యంలో నడిచే ముద్రణాలయాల మీద ఆధారపడితే తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయలేనని ఆయనకు తెలుసు. *ఇండియన్ ఒపీనియన్* వారపత్రిక బాధ్యతలు ఆయన స్వీకరించినప్పుడు అది నష్టాలలో ఉంది. ఆయన దాని ముద్రణాలయాన్ని నగరంలోంచి ఊరికి దూరంగా ఉన్న ఫీనిక్స్ సెటిల్‌మెంటులోకి మార్చుదామన్నాడు. ఆ ఆలోచన ప్రతికూల ఫలితాలనిస్తుందని ఆయన స్నేహితులు భావించారు. ఆయన తన ముద్రణాయంత్రాలు, పరికరాలు, సాధన సామగ్రి పొందికగా ఒక షెడ్డులో బిగించుకున్నాడు. ప్రెస్ నడిపేందుకు ఒక ఆయిల్ ఇంజను వాడేవారు. పక్కనే వేరే గదిలో ఆయన కార్యాలయం ఉండేది. అక్కడ జీతాలు తీసుకొనే సేవకుడు కానీ, సహాయకుడు కానీ ఉండేవారు కాదు. *ఇండియన్ ఒపీనియన్*ను శనివారం బట్వాడా చేసేవారు. శుక్రవారం మధ్యాహ్నానికి వ్యాసాలు కంపోజ్ చేయడం అయిపోయేది. చిన్నా, పెద్దా ఆశ్రమవాసులంతా కంపోజింగు, ప్రింటింగ్, కటింగ్, ఫోల్డింగు, చిరునామాలను అతికించడం, కట్టలు కట్టడం వంటి పనులన్నీ తలొకటీ చేసేవారు. ఆ కట్టలని సమయానికి రైల్వేస్టేషన్‌కు చేరవేయాలి. సాధారణంగా వారు అర్ధరాత్రి వరకూ పని చేసేవారు. పని మరీ ఎక్కువగా ఉన్నప్పుడు మరి కొందరితో కలసి గాంధీ శుక్రవారం రాత్రంతా మెలకువ ఉండేవాడు. కస్తూర్బా, ఇతర మహిళలూ వారికి అప్పుడప్పుడూ సహాయం చేసేవారు. ఒకసారి ఇంగ్లాండు నుంచి ఆయన “శనివారం నాడు ఆశ్రమంలోని మహిళలందరూ

ప్రెస్‌కు వెళుతున్నారని భావిస్తున్నాను," అని రాసాడు. ఇండియన్ ఒపీనియన్ ఆదివారాలు మార్కెట్‌లోకి వెళ్లేది.

ఫీనిక్స్ సెటిల్‌మెంటులో ఇండియన్ ఒపీనియన్ ముద్రించడం ప్రారంభించిన మొదటి వారమే ఆయిల్ ఇంజన్ చెడిపోయింది. చేత్తో తిప్పే చక్రంతో గాంధీ, ఇంకా శారీరక బలం ఉన్న ఇతర ఆశ్రమవాసులూ యంత్రాన్ని నడిపి ముద్రణను పూర్తి చేశారు. మర్నాడు సరైన సమయానికే పత్రిక మార్కెట్లోకి వచ్చింది. ప్రెస్ పనికి సంబంధించిన వివరాలు నేర్చుకొనేందుకు ఈ అవరోధం గాంధీకి సహాయపడింది. ఆయన వ్యాసాలు రాయడమే కాకుండా, అక్షరాలు కూర్చేవాడు, ముద్రణలో సహాయపడేవాడు, ప్రూఫులు దిద్దేవాడు. చాలామంది చిన్నవాళ్లు అక్కడ శిక్షణార్థులుగా మారారు. తర్వాత కొన్ని రోజులకు ఒకసారి ఇండియన్ ఒపీనియన్ సంచిక ముద్రణ పనిని పూర్తిగా బాలకులే నిర్వహించారు. మొదట్లో ఇండియన్ ఒపీనియన్‌ను ఇంగ్లీషు, హిందీ, గుజరాతీ, తమిళం – నాలుగు భాషల్లో ముద్రించేవారు. కానీ సంపాదకులు, కంపోజిటర్ల కొరత వల్ల తర్వాత కాలంలో దానిని ఇంగ్లీషు, గుజరాతీలలో మాత్రమే ప్రచురించడం ప్రారంభించారు. గాంధీ భారతదేశ పర్యటనలో అడయారును సందర్శించినప్పుడు ఆయన అక్కడి ముద్రణా పనులను శ్రద్ధగా పరిశీలించడం అని బీసెంట్ గమనించింది.

వారపత్రికలతో పాటు హిందీ, ఇంగ్లీషు, ఇతర భాషలకు చెందిన అనేక పుస్తకాలను ఫీనిక్స్ ప్రెస్‌లోనూ, నవజీవన్ ప్రెస్‌లోనూ ముద్రించేవారు. ప్రభుత్వానికి గాంధీ ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్లు కట్టేవాడు కాదు. ఆయన రచనల మీద వచ్చిన లాభాలను ఖాదీ పనికి ఉపయోగించేవాడు. ఆయన నవజీవన్ ప్రెస్ కోసం ఒక లక్ష రూపాయల విలువైన ట్రస్టును ఏర్పాటు చేశాడు.

చెడ్డ ముద్రణను ఒక హింసాత్మక కార్యంగా గాంధీ పరిగణించేవాడు. స్పష్టమైన అక్షరాలు, నాణ్యమైన కాగితం, సాదాగా అందంగా ఉండే ముఖపత్రాలు తప్పనిసరిగా ఉండాలని గాంధీ పట్టుబట్టేవాడు. భారతదేశంలాంటి పేదదేశంలో ఖరీదైన బైండింగుతో, ముఖపత్రాలతో ఉన్న పుస్తకాలు సామాన్య పాఠకులకు అందుబాటులో ఉండవని గాంధీ అభిప్రాయం. ఆయన జీవితకాలంలో నవజీవన్ ప్రెస్ అనేక పుస్తకాలను చౌక ధరలకు ముద్రించింది. గుజరాతీలో ఆయన ఆత్మకథ కేవలం 12 అణాలకే అమ్మారు. హిందీలో కూడా ఈ పుస్తకం చౌక సంపుటాన్ని అందుబాటులోకి తెచ్చారు.

దేశమంతా ఒకే లిపి వాడితే దేశవ్యాప్తంగా అనేక మంది ప్రెస్ కార్మికుల సమయం, శ్రమా కలిసి వస్తాయని ఆయన భావించేవాడు. దాదాపుగా దేశంలోని

భాషలన్నీ సంస్కృతం నుంచే వచ్చాయి కాబట్టి దేవనాగరలిపి అన్ని భాషలకూ సరిపోతుందని ఆయన భావించాడు. ఇండియన్ ఒపీనియన్ గుజరాతీ సంచికలో ఒక పేజీ మొత్తం తులసీదాసు రామచరిత మానస్‌ను హిందీలో ముద్రించేవారు. హరిజన్ పత్రిక అక్షరాలను గాంధీ స్వయంగా ఎంపిక చేశాడు. ఒక ప్రెస్ కొనుగోలు బేరం ఖరారు చేసే పని ఒక సహచరునికి అప్పగిస్తూ గాంధీ "మొత్తం యంత్రాలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించు, అన్నీ సక్రమంగా పని చేస్తున్నాయో లేదో పరీక్షించు. ముఖ్యంగా అక్షరాలు అరిగిపోయాయో, సరిగ్గా ఉన్నాయో లేదో చూడు," అని సూచనలిచ్చాడు.

ఆయన తన రచనల మీద ప్రచురణ హక్కులు తీసుకొనేవాడు కాదు. ఆయన సంపాదకత్వం వహించిన పత్రికలన్నీ ప్రజల ఉమ్మడి ఆస్తులుగా ఉండేవి. తన రచనలను వక్రీకరించే అవకాశం ఉందని భావించినప్పుడు మాత్రమే ఆయన కాపీరైటు హక్కులను వినియోగించుకొనేందుకు అంగీకరించేవాడు.

పిల్లల పుస్తకాలను పెద్ద అక్షరాలతో మంచి కాగితం మీద ముద్రించాలనీ, ప్రతి అంశాన్నీ ఒక అందమైన బొమ్మతో వివరించాలని ఆయన భావించేవాడు. ఆయనకు సన్నని పుస్తకాలంటే ఎక్కువ ఇష్టం. అవి పిల్లలను అలసిపోయేలా చేయవు, మోసుకెళ్లేందుకు, చదువుకొనేందుకు అనువుగా ఉంటాయి. జాతీయ విద్యావిభాగానికి బాధ్యునిగా ఉన్న ఒక ఆశ్రమవాసి ఒక పాఠ్యపుస్తకాన్ని ముద్రింపచేశాడు. దానిలో ప్రతి పేజీలోనూ అందమైన బొమ్మలున్నాయి, దాన్ని రంగురంగుల ఆర్ట్ పేపరుపై ముద్రించారు. ఆయన దాన్ని గాంధీకి చూపించి గర్వంగా "బాపూజీ, కొత్త పుస్తకాన్ని చూశారా? దాన్ని అలా తీర్చిదిద్దింది నేనే," అన్నాడు. దానికి బదులుగా గాంధీ "అవును, పుస్తకం చాలా అందంగా ఉంది. కానీ దాన్ని నువ్వు ఎవరికోసం ముద్రించావు? ఎంతమంది పాఠకులు అయిదు అణాలు పెట్టి పుస్తకం కొని చదవగలరు? భారతదేశంలో ఆకలితో అలమటిస్తున్న లక్షలాదిమంది పేదలకు చదువునందించే విభాగానికి నువ్వు అధిపతివి. ఇతరుల పుస్తకాల ధర అణా ఉంటే, నీ పుస్తకం ధర రెండు పైసలే ఉండాలి," అన్నాడు. ఒక వారపత్రిక బాధ్యతలు స్వీకరించిన తర్వాత గాంధీ ఆ పత్రిక ధరను రెండు అణాల నుంచి ఒక అణాకు తగ్గించాడు.

ప్రచురణల విషయంలో సొమ్ములు పోదుపు చేయడమే గాంధీ ఆఖరి లక్ష్యం కాదు. గోఖలే రచనలకు, ప్రసంగాలకు గుజరాతీ అనువాదాలను నవజీవన్ ప్రెస్ ముద్రించాలనుకుంది. ఒక విద్యావేత్త అనువాదం చేశాడు. గాంధీని దానికి ముందుమాట రాయమన్నారు. గాంధీ పుస్తకం చదివినప్పుడు అనువాదం కృత్రిమంగా, పేలుసుగా ఉన్నట్లు గమనించాడు. మొత్తం పుస్తకాన్ని నాశనం చేయమన్నాడు. అప్పటికే

ఆ పుస్తకం మీద 700 రూపాయలు ఖర్చు చేశామని వారు చెప్పారు. అప్పుడు ఆయన "ఏడు వందలు ఖర్చుపెట్టారు సరే. బైండింగుకీ, ముఖచిత్రానికీ మరికొన్ని రూపాయలు ఖర్చు చేసి ఈ చెత్తను పాఠకుల ముందుకు తీసుకువెళ్లడం అవసరమా? పనికిమాలిన సాహిత్యాన్ని ప్రచురించి ప్రజల అభిరుచులను పాడుచేయడం నాకిష్టం లేదు," అన్నాడు. ఆ కాగితాలన్నిటినీ కనీసం చెత్తకాగితాల వాడికి అమ్మడానికి కూడా అంగీకరించకుండా మొత్తాన్ని తగలబెట్టించాడు.

పత్రికా స్వేచ్ఛకు గాంధీ ఎప్పుడూ మద్దతు పలికేవాడు. కీలక అంశాలపై తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించడానికి వీల్లేదని ప్రభుత్వం నిబంధనలు విధిస్తే ఆయన ముద్రించడమే ఆపేసేవాడు. పత్రికా స్వేచ్ఛపై ఆయనకున్న మమకారానికి బహుమతిగా బ్రిటిషు ప్రభుత్వం ఆయన ప్రెస్‌ను స్వాధీనం చేసుకుంది, ఆయన ఫైళ్లను నాశనం చేసింది, ఆయనకు, ఆయన సహచరులకు జైలు శిక్షలు విధించింది. అయినా ఆయనెప్పుడూ నిరుత్సాహపడలేదు. "యంత్రమూ, లోహపు అక్షరాలే ముద్రణ అనే మూస ధోరణి నుంచి మనం బయటపడదాం. కలమే మన ఫౌండ్రీ, నకలుదారుల చేతులే ముద్రణా యంత్రాలు. ప్రతి మనిషీ ఒక నడిచే వార్తాపత్రికగా మారి, సమాచారాన్ని నోటి నుంచి నోటికి మోసుకుపోదాం, దీన్ని ప్రభుత్వం అడ్డుకోలేదు," అనేవాడు.

# ఫాషన్ స్థాపకుడు

దక్షిణాఫ్రికాలో గాంధీ పాంటు మీద చెప్పులు వేసుకోవడం ప్రారంభించాడు. ఆ రోజుల్లో అది చాలా అసాధారణమైన విషయం. బూట్ల కన్నా ఆయనకు చెప్పులంటేనే ఇష్టం – అవి వేసవిలో పాదాలను చల్లగా ఉంచేందుకు ఉపయోగపడతాయి, శీతాకాలంలో వాటిని మేజోళ్లతో సహా వేసుకోవచ్చు. ఆ చెప్పులను ఆయనే తయారుచేసుకొనేవాడు. చేత్తో తయారు చేసిన ఈ గట్టి, సౌకర్యవంతమైన చెప్పుల గురించి దక్షిణాఫ్రికా ప్రధాని జనరల్ స్మట్స్ విన్నాడు. ఆయన కూడా ఒక జత వాడి చూద్దామనుకున్నాడు. గాంధీ ప్రత్యేకమైన జాగ్రత్తతో ఒక చెప్పుల జతను తయారుచేయించి ఆయనకు బహుమతిగా ఇచ్చాడు.

అందరి ఆమోదం పొందిన సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా కొత్త పద్ధతిలో పనులు చేసే అలవాటు గాంధీకి ఉండేది. అలా ఆయన స్థాపించిన కొత్త ఫాషన్లు

కొన్నిటిని అందరూ అనుసరించారు, మరికొన్ని ఎక్కువ మంది ఆమోదం పొందలేక అంతరించిపోయాయి.

మొదటిసారి కాంగ్రెస్ సభలకు హాజరైనప్పుడు వేర్వేరు కులాలకే కాక, వేర్వేరు రుచులున్న కార్యకర్తలు, ఆహ్వానితుల కోసం కూడా వేర్వేరు వంటశాలలు నిర్వహించడం చూసి గాంధీ ఆశ్చర్యపోయాడు. ఆయన చిన్నచిన్న విషయాలనే ఎక్కువగా పట్టించుకొనేవాడు. ప్రజలు తమ వేర్పాటు ధోరణిని వదులుకొని ఏకత్వ భావనను పెంచుకుంటే తప్ప స్వరాజ్యం రాదని ఆయన భావించాడు. ఆహారపు అలవాట్లను సరళీకరించడం ద్వారా ఆయన శ్రమ దండుగను, డబ్బు, సమయాల వృథాను అరికట్టాలనుకున్నాడు. ఆయన ఆహారం మీద ప్రయోగాలు చేశాడు. ఆశ్రమాలలో సామాన్యమైన, మసాలా లేని భోజనం ఉమ్మడి వంటశాలలో తయారయ్యేది. హిందువులు, ముస్లింలు, పార్సీలు, క్రైస్తవులు ఒకే భోజనశాలలో కూర్చుని ఒకే రకమైన శాకాహార భోజనం చేసేవారు.

చేత్తో ఆడిన గోధుమ పిండి, చేత్తో దంచిన బియ్యం, ఉడకబెట్టిన కూరగాయలు, గింజలు, పళ్లు వంటి వాటిలో ఉన్న పోషక విలువ గురించి గాంధీ గట్టిగా చెప్పేవాడు. తెల్లటి పంచదార కన్నా తాజా బెల్లం, తేనెల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని వివరించేవాడు. ఆ విధంగా ఆహారం రంగు, రుచి, వాసనలకు కాకుండా దానిలోని పోషక విలువలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రజలకు శిక్షణ ఇచ్చేవాడు.

ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సభల్లో సభ్యులకు, సందర్శకులకు మొదటిసారి పాలిష్ పెట్టని బియ్యం, హోల్‌మీల్ బ్రెడ్డులను వడ్డించారు. కాంగ్రెస్ వార్షిక సమావేశాలను ఒక గ్రామంలో నిర్వహించాలనేది కూడా గాంధీ ఆలోచనే. అంతకు ముందు 50 సంవత్సరాల పాటు, కాంగ్రెస్ సభలకు హాజరయ్యేవారిలో ఎక్కువ మంది విద్యావంతులైన నాయకులు, మేధావులు ఉండేవారు. కాంగ్రెస్ సభలను కోల్‌కతా ముంబయి, చెన్నై లాంటి పెద్ద నగరాల్లో నిర్వహించేవారు. గాంధీ దానిని సామాన్యుల కాంగ్రెస్‌గా మార్చేసాడు, ప్రజా రూపం ఇచ్చాడు. ఆయన సాధారణమైన భారతీయ దుస్తులను ధరించి, హిందీలో ప్రసంగించేవాడు.

ఫైజ్‌పూర్‌లోని తిలక్‌నగర్‌ను అన్ని అంశాలతో ఆయనే ప్రణాళికాబద్ధంగా రూపొందించాడు. ఆ శిబిరాన్ని గ్రామంలో అందుబాటులో ఉండే పదార్థాలతో గ్రామీణ వృత్తి నిపుణులే నిర్మించారు. కళాకారుడైన నందలాల్ బోస్ గాంధీ కలలకు ఆకారాన్నిచ్చాడు. గుడిసెల గోడలు, పైకప్పులు వెదురుతో చేశారు. రంగులు వేసిన వెదురు కర్రలతో స్వాగత ద్వారాలు నిర్మించారు. బోర్లించిన వెదురుబుట్టలతో వాటిని

అలంకరించారు. ప్రధాన ద్వారం వద్ద రెపరెపలాడుతున్న జాతీయజెండా కూడా గాంధీ సృష్టే. కొద్ది సంవత్సరాల ముందే ఆయన దానికి తుదిరూపం ఇచ్చాడు. దానిలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల పట్టీలు ఆ క్రమంలో అడ్డంగా ఉండేవి. మధ్యలోని తెల్లరంగులో నీలిరంగుతో వేసిన రాట్నం భారతదేశపు సామాన్యులకు, అహింసా స్వభావానికి గుర్తుగా ఉండేది.

సాధారణమైన, గౌరవనీయమైన జాతీయ దుస్తులు రూపొందించిన ఘనత గాంధీకే దక్కుతుంది. ఆయన దక్షిణాఫ్రికాలో యాత్రకు నాయకత్వం వహించినప్పుడు, దక్షిణ భారతదేశానికి చెందిన వందలాది గని కార్మికులు, ఒప్పంద కార్మికులు పోరాటంలో పాల్గొన్నారు. అందరినీ హింసించారు, చాలామందిని జైల్లో పెట్టారు. కొందరు మరణించారు. వారికి సానుభూతి చూపించడానికి, వారిలో ఒకడిగా ఉండటానికి గాంధీ కుర్తావేసుకొని, ధోతీని లుంగీలా ధరించడం ప్రారంభించాడు. వాకింగ్ స్టిక్‌ను వాడటం మాని చేతికర్రను పట్టుకోవడం ప్రారంభించాడు, చేతి సంచీని ధరించడం మొదలు పెట్టాడు.

సత్యాగ్రహం, అహింస, సహాయ నిరాకరణ, సామూహిక శాసనోల్లంఘనలను ప్రభుత్వ వ్యవస్థీకృత సాయుధశక్తిని ఎదుర్కొనే శక్తివంతమైన ఆయుధాలుగా గాంధీ అభివృద్ధి చేశాడు. చెడుకు, మూర్ఖపు బలానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణకు ఉదాహరణలుగా ఆయన ప్రహ్లాదుడిని, విభీషణుడిని చూపేవాడు. అవి తన సొంత ఆలోచనలని చెప్పుకొనేవాడు కాదు. అయితే ఆ విధానాలను సామూహిక స్థాయిలో రాజకీయ పోరాటాలకు ఉపయోగించుకోవాలనే ఆలోచన, ధైర్యంగా దాన్ని ఆచరించి విజయం సాధించిన ఘనత గాంధీకే దక్కుతాయి. వాటి విజయం కూడా అద్భుతమైనది. "అహింస మీద మీకున్న విశ్వాసాన్ని ఆటంబాంబు కూలదోసిందా?" అని ఒక విదేశీ విలేఖరి గాంధీని అడిగాడు. "లేదు. సత్యం, అహింస కలసి కట్టుగా నిలబడినప్పుడు వాటి అత్యున్నత శక్తి ముందు ఆటంబాంబు ప్రభావం పెద్దగా ఉండదు. ఆటంబాంబు కూడా నాశనం చేయలేని శక్తి అహింస ఒక్కటే," అని గాంధీ బదులిచ్చాడు. భారతదేశంలోని అపార జనసమూహ శక్తిని ఐకమత్యంగా ఒక ఉన్నత లక్ష్యం వైపునకు మళ్లించడంలో గాంధీ నిర్వహించిన పాత్ర అనితరసాధ్యమైనది, అద్వితీయమైనది.

గాంధీ నాయకత్వంలో భారతదేశం అహింసాయుతంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంది. ఆసియా, ఆఫ్రికా, అమెరికాలో దోపిడీకి గురవుతున్న జాతులన్నిటికీ భారతదేశం ఒక స్ఫూర్తిప్రదాతగా ఉండాలని ఆయన భావించేవాడు. "భారతదేశపు పోరాటం అహింసాయుతమైనదే కాదు, బలమైన శక్తులకు వ్యతిరేకంగా అణచివేయబడుతున్న జాతులు తమ స్వేచ్ఛకై చేసిన పోరాటం," అనేవాడాయన.



భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత అనేక వలసపాలిత దేశాలు రక్తపాతం లేకుండా స్వాతంత్ర్యాన్ని పొందాయి. అమెరికాలో నీగ్రోలకు మానవహక్కులు కల్పించాలనే ఉద్యమం విజయవంతంగా విస్తరించడం ప్రారంభించింది.

ప్రత్యర్థుల మనసులో మార్పు తీసుకురావడానికి ఆయన చేసిన ప్రయోగంతో పాటు, ఆయన దుస్తులు కూడా చెప్పుకోదగిన మార్పులకు గురయ్యాయి. దక్షిణాఫ్రికా నుంచి ఆఖరిసారి తిరిగి వచ్చిన తర్వాత గాంధీ ఒక కుర్తా, ధోతీ, పొడవాటి కోటు, భారీ కథియావాడీ తలపాగా ధరించేవాడు. ఆ దుస్తులు వేడి వాతావరణంలో అసౌకర్యంగా ఉంటాయని ఆయనకు త్వరలోనే అర్థమయ్యింది. పైగా గజాల కొద్దీ బట్ట వృధా అవుతోంది. దానితో ఆయన ధోతీ, కుర్తా, టోపీ ధరించడం ప్రారంభించాడు. ఆయన అదే దుస్తులతో ముఖ్యమైన సమావేశాలకు, బహిరంగ సభలకు హాజరు కావడం చూసి పెద్దమనుషులు

విస్తుబోయారు. నూలువడకడం, నేయడం నేర్చుకోగానే గాంధీ అన్నీ ఖాదీ దుస్తులే ధరించడం ప్రారంభించాడు. ఎంబ్రాయిడరీ లేని కశ్మీరీ టోపీలా గాంధీ టోపీ ఉంటుంది. తెల్ల టోపీనే ధరించాలని గాంధీ పట్టుబట్టాడు. తెల్లటోపీ తొందరగా మాసిపోతోందని అనుచరులు ఫిర్యాదు చేసినప్పుడు ఆయన "పరిశుభ్రతకు అత్యున్నత ప్రమాణంగా తెల్లటోపీని నేను ఎంపిక చేశాను. ఆ పలుచటి టోపీని ఉతుక్కోవడం సులభం, అది చాలా త్వరగా ఆరిపోతుంది కూడా. ముదురు రంగు టోపీలు కూడా అదే స్థాయిలో మురికిపడతాయి, కాకపోతే అవి మురికిని పైకి కనబడకుండా దాస్తాయి," అన్నాడు. ఖాదీ పంచె లేదా పైజమా, కుర్తా, గాంధీ టోపీలు బాగా ప్రాచుర్యం పొంది జాతీయ దుస్తులుగా పరిగణించసాగారు.

చాలామంది బీహారీలు, మార్వాడీలు, గుజరాతీలు తమ పెద్ద పెద్ద తలపాగాలను వదిలిపెట్టి గాంధీ టోపీలను ధరించడం ప్రారంభించారు. ముస్లింలు వారి ఫిజ్ (టోపీ)ను వదిలేసారు. మామూలుగా తలమీద ఏమీ ధరించడం అలవాటులేని బెంగాలీలు, దక్షిణ భారతీయులు గాంధీ టోపీ ధరించడం ప్రారంభించారు. స్వదేశీ ఉద్యమం రోజుల్లో బుసలు కొట్టే ఎద్దు ముందు ఎర్రబట్టలా గాంధీ టోపీ పనిచేసింది. ఈ టోపీలు ధరించిన కార్యకర్తలను పోలీసులు క్రూరంగా హింసించారు. వారి టోపీలను బలవంతంగా తొలగించారు. దాన్ని ధరించినందుకు పాఠశాల విద్యార్థులను కూడా శిక్షించారు. కొన్ని సమయాలలో గాంధీ టోపీ ధరించిన కార్యకర్తలకు 10/- రూపాయల అపరాధ రుసుము విధించేవారు, చెల్లించడానికి నిరాకరిస్తే 10 రోజుల జైలు శిక్ష విధించేవారు. గాంధీ కూడా కొంతకాలం టోపీ ధరించాడు.

ఆయన దుస్తుల్లో ఆఖరి మార్పుగా ఖాదీ అంగవస్త్రం, కండువా, చెప్పులు స్థిరపడ్డాయి. నాయకుడు తన ప్రజలకు నిజమైన ప్రతినిధిగా ఉండాలని ఆయన విశ్వసించేవాడు. ఆయన ఐరోపాకీ, ఇంగ్లాడుకీ కూడా అదే దుస్తులలో వెళ్లాడు. ఇంగ్లాండు చక్రవర్తిని కూడా అదే దుస్తులలో కలిసాడు. ఒకసారి ఇంగ్లాండు నుంచి వచ్చిన ఒక విశిష్ట అతిథిని రైలు స్టేషన్ నుంచి ఆయన ఆశ్రమానికి ఎడ్లబండిలో తీసుకువచ్చారు. అలాంటి సందర్శకులంతా కూడా మట్టినేల మీద కూర్చొని ప్రజానాయకుడైన గాంధీతో గంభీరమైన వ్యవహారాలు చర్చించేవారు. వాళ్లు ఆశ్రమ భోజనమే చేసేవారు. సేవాగ్రాం సన్యాసి మంచి అతిథేయిగా ప్రవర్తించేవాడు. వాళ్ల అవసరాల పట్ల శ్రద్ధ వహించేవాడు కానీ ఆశ్రమంలోని నిరాడంబర సౌకర్యాలను, ఏర్పాట్లనే పాశ్చాత్యులకూ వినియోగిస్తున్నందుకు సిగ్గుపడేవాడు కాదు. ఆడంబరాలు ప్రదర్శించడం ద్వారా ఒక పేద దేశం గౌరవ ప్రతిష్ఠలను పెంచుకోవచ్చని ఆయన

నమ్మేవాడు కాదు. తెచ్చిపెట్టుకున్న ప్రతిష్ఠ, అరువు తెచ్చుకున్న ఆడంబరాలతో పేదరికాన్ని దాచిపెట్టాలని చూడటం ఆయనను బాధపెట్టేది. తన గ్రామీణ నివాసం నుంచి వైస్రాయిలు, గవర్నర్లు, బ్రిటిష దౌత్యాధికారులతో ముఖ్యమైన సమావేశాల కోసం గాంధీ తరచుగా ఢిల్లీ, సిమ్లా, ముంబయి, కోల్‌కతాలకు ప్రయాణించాల్సి వచ్చేది. తన భావాలను ప్రచారం చేయడం కోసం, తన దేశస్తులకు అందుబాటులో ఉండటం కోసం ఆయన చాలా సార్లు భారతదేశమంతటా పర్యటించాడు. కానీ ఎప్పుడూ విమానం ఎక్కలేదు, మూడో తరగతి రైలు పెట్టెలో ప్రయాణం చేసేవాడు. స్వాతంత్ర్యానికి ముందు నాయకులందరూ ఆయన ఉదాహరణనే పాటించేవారు. మొత్తం పరిపాలనా వ్యవస్థనే మార్చేయాలని గాంధీ అనుకొనేవాడు. "ప్రజాస్వామ్యంలో ఒక రైతు పరిపాలకుడు కావాలి. ఒక రైతు ప్రధాని తాను నివశించడానికి భవనం కావాలని కోరుకోడు. ఆయన గుడిసెలో నివసిస్తూ ఆరుబయట పడుకుంటాడు. ఖాళీ దొరికినప్పుడల్లా పొలంలో పని చేస్తాడు," అనేవాడు.

తన ఆలోచనలకు అనుగుణంగా మారడానికి ఖరీదైన, సౌకర్యవంతమైన పరిసరాల్లో పుట్టి పెరిగినవారికి చాలా ధైర్యం కావాలని గాంధీకి తెలుసు. అందుకే ఆయన మొదటి నుంచే పిల్లలకు విభిన్నమైన విద్యాబోధన చేయాలని సూచించేవాడు. విద్యారంగంలో ప్రముఖులు చేసిన ప్రయోగాలను బాగా పరిశీలించి పిల్లల కోసం ఒక ప్రాథమిక శిక్షణను గాంధీ సూచించాడు. ఆయన దాన్ని నయీ తాలిం అనేవాడు. పుస్తకాలతో పాఠాలకు అది అంత ప్రాధాన్యత ఇచ్చేది కాదు. కేవలం నిరక్షరాస్యతనే కాక, అజ్ఞానాన్ని నిర్మూలించడం దాని లక్ష్యం. హస్తకళలు, చేతివృత్తులు నేర్పడం ద్వారా విద్యార్థులలో వ్యక్తిత్వ నిర్మాణం చేయాలని, వారిలో ఆత్మవిశ్వాసం పెంచాలని ఆయన భావించాడు. అన్ని మతాల పట్ల సహనం, అన్ని జాతుల పట్ల ప్రేమ, అన్ని పనుల పట్లా గౌరవం పిల్లలకు అలవర్చాలని ఆయన ప్రయత్నించాడు.

ప్రపంచంలోని అన్ని మతాల ప్రార్థనలను కలిపి తయారు చేసిన ప్రార్థనను సామూహిక ప్రార్థనా సమావేశాలలో పరిచయం చేసేందుకు ఆయన ప్రయత్నించాడు.

గాంధీ తన భావాల గురించి అవిశ్రాంతంగా అనేక బహిరంగ సమావేశాలలో ప్రసంగించాడు, తన పత్రికల్లో అసంఖ్యాకమైన వ్యాసాలు రాశాడు. తాను సంపాదకత్వం వహించిన చాలా పత్రికల్లో ఆయన బాగా ఆదాయం తెచ్చిపెట్టే ప్రకటనలను తీసుకోలేదు. ఆయన డబ్బును ప్రేమించేవాడు కాదు, కానీ ఏ రూపంలో సొమ్ము వృథా చేసినా సహించేవాడు కాదు. అలంకరణల కోసం ధనం వృథా చేయొద్దని సభలు, సమావేశాల నిర్వాహకులకు ఆయన సూచించేవాడు. "పూలను పూర్తిగా మానేసి నూలుదండలు వాడండి. ముళ్లు వేయడం ద్వారా నూలును పాడుచేయొద్దు,

మామూలు బట్టలకు పనికిరాని ఖద్దరుతో జెండాలు తయారుచేసి ఉపయోగించండి. చిరునామాలను అచ్చువేయకుండా, చేతిరాత బాగున్నవారితో రాయిస్తే సొమ్ము ఆదా అవుతుంది. సూచికలను ఒక మంచి కాగితం మీద చక్కని దస్తూరి ఉన్నవారితో రాయించి, వాటిని ఖాదీ వస్త్రానికి కుట్టించండి, ఆ అక్షరాల వెంబడి చిన్న పిల్లలైనా ఎంబ్రాయిడరీ చేయగలుగుతారు. వారికి రంగు దారాలిచ్చి ఆ పని చేయించండి," – ఆయన సూచనలు ఇలా ఉండేవి.

ఇంటి లోపలి అలంకరణలకు సంబంధించి ఆయన ఆలోచనలు విశిష్టంగా ఉండేవి. తివాసీలతో, కుర్చీలతో, అలంకార వస్తువులతో గదులను నింపేయడం ఆయనకు నచ్చేది కాదు. కిటికీలకు తెరలు వేయడం మీద ఆయనకు మోజు లేదు. ఒకసారి ఆయన ఒక ధనికుడైన దక్షిణాది వర్తకుని ఇంట్లో అతిథిగా ఉన్నాడు. అక్కడ ఆడంబరంగా ఉన్న అలంకార వస్తువుల సేకరణ ఆయనకు నచ్చలేదు. "ఈ వస్తువులన్నిటి మధ్యా నాకు చాలా ఇరుకుగా అనిపించి, ఊపిరాడటం లేదు. వాటి మధ్యలో గాలి ఆడేందుకే చోటు లేదు. మీరు అలంకరించిన బొమ్మలలో కొన్ని మురికిగా, అసభ్యంగా ఉన్నాయి. మీరు నాకు చెట్టినాడ్‌లోని అన్ని భవనాలనూ అలంకరించే పని గుత్తకు ఇస్తే, నేను ఇవే భవనాలను, మీరు పెట్టినదానిలో పదోవంతు ఖర్చుతో, ఇంతకంటే గాలి వెలుతురూ బాగా వచ్చేలా సౌకర్యవంతంగా అలంకరించగలను. మీ గదులు చాలా అందంగా అలంకరించబడ్డాయని దేశంలో ప్రసిద్ధ కళాకారులు ధృవీకరిస్తారు కూడా," అన్నాడు. ఆయన మాటలు నిజమేనని సేవాగ్రామ్‌లోని ఆయన గుడిసె అలంకరణను నందలాల్ బోస్ మెచ్చుకున్నప్పుడు రుజువయ్యింది, "నేల, గోడలు ఆవుపేడతో అలికి ఉన్నాయి. ఒక చిత్రపటంకానీ, ఫొటోకానీ, శిల్పంకానీ ఆ గదిలో లేవు. ఒక మూల ఒక చాప పరచి ఉంది. కూర్చొనేందుకు వీలుగా దానిమీద ఒక మడచిన ఖద్దరు దుప్పటి, దిండు వేసి ఉన్నాయి. రాత బల్లలా ఉపయోగించే ఖద్దరు గుడ్డ పరచిన చెక్కపెట్టెకు ఒకవైపు రావి ఆకు ఆకారంలో ఉన్న ఇనుపరేకు మూత కింద తళతళలాడుతున్న ఇత్తడి లోటా ఉంది. పరిశుభ్రత, పొందికలతో కూడిన వాతావరణంతో గది చాలా అందంగా ఉంది. నడుం చుట్టూ చుట్టుకున్న ఖద్దరు గుడ్డతో ఆయన గదిలో కూర్చొని ఉన్నాడు. ఆయన పెదాల మీద ఎప్పుడూ చిరునవ్వు కదలాడుతోంది. ఒర నుంచి దూసిన పదునైన ఖడ్గంలా మెరుస్తూ కనిపించాడు, ఆయనలో ఖడ్గంలోని హింసాత్మక ప్రవృత్తి తప్ప అన్నీ ఉన్నాయి."

# పాములవాడు

బాలుడిగా ఉన్నప్పుడు పాములంటే గాంధీ భయపడేవాడు. ఆయన ఒంటరిగా చీకట్లోకి వెళ్లలేక పోయేవాడు. చీకట్లో దెయ్యాలు, పాములు ఉండి మీద పడతాయని భయపడేవాడు.

35 సంవత్సరాల వయసులో ఆయన సాదా జీవితం గడుపుతూ ఆశ్రమాల్లో జీవించాడు. ఆశ్రమం అంటే ఉండటానికి పనికొచ్చే చిన్న గుడిసె మాత్రమే కాదు. ఒక బావితో కూడిన దొడ్డి, సాగుచేసేందుకు తగినంత భూమి, దానికి ఆనుకొని ఉద్యానవనం ఉండేవి. అది ఊరికి దూరంగా, నగరాల దుమ్ముకూ, శబ్దకాలుష్యానికీ దూరంగా ఉన్న ప్రదేశం. గాంధీ ధనికుడు కాదు, కాబట్టి ఆయన చౌకగా ఉన్న పనికిమాలిన భూములను కొనేవాడు. ఫీనిక్స్ సెటిల్‌మెంట్, టాల్‌స్టాయ్ క్షేత్రం, సబర్మతీ ఆశ్రమం, వార్ధా ఆశ్రమం, సేవాగ్రాం వంటి అన్ని ఆశ్రమాలలో పాములు ఉండేవి. గుడిసెల నిర్మిస్తున్న సమయంలో, ఆశ్రమవాసులు గుడారాల్లో నివసించేవారు. అక్కడ పిల్లలతో జీవించడం ప్రమాదకరంగా ఉండేది. ఒకసారి పశువుల పాక పైకప్పుకు వేలాడుతూ పాము కనబడేది, ఇంకోసారి జంటపాములు సైకిలు దగ్గర చుట్ట చుట్టుకొని కనిపించేవి. ఒక్కోసారి అవి పడకగదుల్లోకి ప్రవేశించేవి. వాటిని ఏం చేయటమనేది పెద్ద సమస్య.

గాంధీకి అహింస మీద నమ్మకం, ఆయన అంకితభావం గల వైష్ణవుడు. ఆయన సొంత ప్రాణాలను కాపాడుకొనేందుకు కానీ, భార్యాపిల్లల ప్రాణాలు కాపాడేందుకు కానీ చేపలు, మాంసం, పక్షిమాంసాలతో చేసిన ఆహారాన్ని, మందులనూ తీసుకొనేందుకు అంగీకరించలేదు. ఆఖరి చుక్క వరకూ పాలు పిండేందుకు ఆవులనూ, గేదెలనూ హింసిస్తున్నారని తెలిసి ఆయన పాలు తాగడం మానేశాడు. ఇలాంటి వ్యక్తి పాములను చంపగలడా? అందుకే విషపూరితమైన పాములనైనా చంపకూడదనేది సాధారణ నిబంధనగా మారింది. పాములను పట్టుకొని ఆశ్రమానికి సురక్షితమైన దూరంలో వదిలేందుకు తాళ్లతో ఒక పరికరం తయారు చేశారు. కానీ వాటిని పట్టుకొనేందుకు వీల్లేని చోట కానీ, లేదా ఒక వ్యక్తికి పాము దగ్గరకు వెళ్లి దాన్ని పట్టుకొనే ధైర్యం లేనప్పుడు కానీ ఏం చేయాలి? హింసను పూర్తిగా తొలగించడం అసాధ్యమని గాంధీకి తెలుసు. ఆ మాటకొస్తే కూరగాయలను తినడం కూడా హింస కిందకే వస్తుంది. "పాము కాటుతో పిల్లలు మరణించే పరిస్థితి కన్నా పామును

చంపడమే సరియైనదని నేను భావిస్తాను. నాకు ఇప్పటికీ పాములంటే భయం ఉంది, అలాంటప్పుడు నేను పాములంటే భయపడవద్దని ఎలా చెప్పగలను?" అని ఆయన అయిష్టంగానే అంగీకరించాడు. పామును దూరంగా తరిమేయడానికి అన్ని ప్రయత్నాలూ విఫలమైనప్పుడు పామును చంపేందుకు ఆయన అనుమతించేవాడు.

పాములు పట్టే కళ నేర్చుకోవాలని ఆయనకు గాఢమైన కోరిక ఉండేది. కాలెన్‌బాక్ సహాయంతో ఆయన విషపూరితమైన పాముకూ, విషం లేని పాముకూ తేడాలు గుర్తించడం నేర్చుకున్నాడు. ఆచరణాత్మక అధ్యయనం కోసం కాలెన్‌బాక్ ఒక నాగుపామును పట్టుకొని, దానిని బోనులో ఉంచి తన చేతులతో ఆహారం ఇచ్చేవాడు. ఆశ్రమంలోని పిల్లలు దాన్ని చూసేందుకు చాలా ఆసక్తిచూపేవారు. తమ కొత్త స్నేహితుడిని ఎవరూ వేధించేవారు కాదు. ఇదంతా గాంధీకి సంతోషంగా లేదు. ఆయన కాలెన్‌బాక్‌తో "దాని అలవాట్లు, పద్ధతులూ తెలుసుకొనేందుకు మనం దానిని బంధించాం. మన స్నేహం ఆ నాగుపాముకి అర్థంకాక పోవచ్చు. నీకుగానీ, నాకుగానీ దానితో ఆడుకొనే ధైర్యం లేదు. నీ స్నేహం కూడా భయానికి అతీతమైనది కాదు. పామును పెంచుకోవడంలో ప్రేమ లేదు," అన్నాడు. మనుషులు తనతో నిజమైన స్నేహితులుగా లేరని బహుశా ఆ పాముకు కూడా అర్థమైనట్లుంది, అది ఒక రోజు బోనులోంచి తప్పించుకుపోయింది.

జర్మనీ దేశస్థుడైన మరొక ఆశ్రమవాసి పాములను భయం లేకుండా పట్టుకోగలిగేవాడు. అతను పాము పిల్లలను పట్టుకొని తన చేతుల్లో ఆడించేవాడు. అంత ధైర్యం పెంచుకోవాలని గాంధీ అనుకొనేవాడు. తాను పాముకు కీడు తలపెట్టడం లేదనే ఉద్దేశం దాన్ని ముట్టుకోగానే పాముకు అర్థమయ్యే దశకు చేరుకోవాలని ఆయన అనుకొనేవాడు. నోటితో రామనామం జపిస్తూ, పాము నోట్లో వేలు పెట్టగలగడమనేది ఆయన దృష్టిలో గొప్ప విజయం. ఆయన జీవితాంతం వరకూ పామును కానీ, తేలును కానీ చేత్తో పట్టుకోలేక పోయాడు. దానికి ఆయన సిగ్గుపడ్డాడు కూడా.

ముఖ్యమైన పనుల్లో తీరికలేకుండా ఉన్నప్పుడు కూడా ఆయన పాముల అధ్యయనం మీద ఆసక్తిని వదిలిపెట్టలేదు. ఒకసారి కొందరు నాయకులు ఆయన సలహాకోసం వెళ్ళేసరికి ఒక పాము ఆయన మెడచుట్టూ చుట్టుకొని వేళ్లాడుతుండటం చూసి కంగారుపడ్డారు. పాములను ఆడించే వ్యక్తితో మాట్లాడుతూ అతన్నుంచి పాములను పట్టుకోవడం, పాము కాటుకు వైద్యం నేర్చుకోవాలనే తపనతో ఉన్నాడు. ప్రయోగం కోసం ఎవరైనా పాముతో కరిపించుకునేవారు కావాలని ఆ పాములు పట్టేవాడు అడిగినప్పుడు గాంధీ అందుకు సిద్ధపడ్డాడు. కానీ ఆయన విలువైన ప్రాణంతో



ఆ ప్రయోగం చేయడానికి అతడి సహచరులు ఒప్పుకోలేదు. ఆ విధంగా పాములు పట్టేవాడికి శిష్యుడయ్యేందుకు 70 యేళ్ల వయసులో లభించిన అవకాశాన్ని గాంధీ వదులుకోవాల్సి వచ్చింది.

అంతకుముందు చాలా సంవత్సరాల క్రితం గాంధీ దక్షిణాఫ్రికా జైలులో ఉండగా ఆయన చిగురువాచి రక్తం కారడం ప్రారంభించింది. ఆయనకు ఒక నీగ్రో సేవలు చేసేవాడు. ఒకరిభాష మరొకరికి అర్థమయ్యేది కాదు. కానీ సైగలతో మాట్లాడుకొనేవారు. ఒక రోజు రక్తం కారుతున్న వేలితో ఏడుస్తూ ఆయన గాంధీ దగ్గరకు పరిగెత్తుకొచ్చాడు. అతన్నించి సేకరించిన వివరాల ద్వారా అతన్ని పాము కరిచిందని గాంధీకి అర్థమయ్యింది. వెంటనే ఆయన జైలు హాస్పటల్‌కు హెచ్చరిక పంపాడు, విషం కలిసిన రక్తాన్ని పిండేస్తే బాధ తగ్గుతుందని గాంధీకి తెలుసు. గాయం చేయడానికి అక్కడ పరిశుభ్రమైన కత్తి దొరకలేదు. తనే నోటితో పీల్చి ఆ చెడురక్తాన్ని గాంధీ బయటకు ఉమ్మాడు. నిజానికి చిగుళ్ల వ్యాధితో ఉన్నవాళ్లు చెడు రక్తాన్ని నోటితో పీల్చడం చాలా ప్రమాదకరం. అది గాంధీకి తెలుసు. కానీ ఆయన ఆ నీగ్రో బాధ చూడలేకపోయాడు.

అన్ని పాములూ విషపూరితమైనవి కావనీ, అన్ని పాము కాట్లు ప్రాణాలకు ప్రమాదకరం కాదని గాంధీకి తెలుసు. 12 శాతం పాములు మాత్రమే విషపూరితమైనవి. తన దేశస్తులు, ముఖ్యంగా గ్రామీణులు ఈ పాములు ఆడించే విద్య నేర్చుకోవాలని గాంధీ కోరుకునేవాడు. ఆయన పాముల గురించి తగిన బొమ్మలతో కొన్ని వ్యాసాలు రాసాడు. "విషపూరితమైన పాములకీ, విషంలేని పాములకీ తేడా మనకు తెలియదు, అందుకే అన్నిటినీ చంపేస్తూ ఉంటాం. చాలా సందర్భాలలో వ్యక్తులు పాము కాటు వల్ల కాక, భయం వల్ల చనిపోతారు. విషపూరితమైన పాములు కూడా వాటిని తొక్కినప్పుడు, లేదా వాటికి ఇబ్బంది కలిగించినప్పుడు తప్ప కాటు వేయవు. పాములు చేలల్లోని ఎలుకలు, చెదలు, క్రిమికీటకాలను తిని రైతుకు మేలు చేస్తాయి. కాబట్టి అవి పంటపొలాలకు కాపలాదార్లుగా పని చేస్తాయని చెప్పవచ్చు. నాగుల చవితి రోజున మహిళలు పాములకు పాలు పోస్తారు, అది పాములతో మనకున్న స్నేహానికి ప్రతీక. ఆదిశేషునిపై పవళించిన విష్ణుమూర్తి చిత్రం నాకెంతో నచ్చుతుంది. పడగ విప్పిన పాము కింద తలపెట్టి పడుకోవడం వల్ల దేవుడి సృష్టిలో పాములు భయపడాల్సిన జీవులేం కాదని తెలుస్తుంది," అని ఆయన హరిజన్ పత్రికలో రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు. ఒకసారి చొక్కాల్లేకుండా ఉన్న చిన్న కుర్రాళ్లు కొందరు ఆయన గుడిసె వద్ద గుమిగూడటం ఆయన చూశాడు. వాళ్లు ఒక గాజు జాడీలో పెట్టి ఉన్న పామును చూస్తున్నారు. వాళ్లు దాన్ని పట్టుకుని ఒక వైద్యునికోసం పంపారు. అది కట్లపాము, ప్రమాదకరమైన విషసర్పాలలో ఒకటి. పట్టుకొనే వాళ్లు దాని తలమీద కొట్టారు, దాని వెన్నెముక బాగానే ఉంది కాబట్టి మూడురోజుల పాటు చావలేదు, దాన్ని బాధ నుంచి తప్పించడానికి చంపి స్పిరిట్‌లో ఉంచారు. పాములు బతికున్నా, మరణించినా వాటిని గ్రామీణుల ముందు ప్రదర్శించాలని గాంధీ భావించేవాడు. బతికున్న పాముల ప్రదర్శన కోసం ఆయన వద్ద ఒక బోను ఉండేది.

ఒక తాత్వికుడైన స్నేహితుడు గాంధీని "తన మీద పాము దాడి చేస్తే ఒక వ్యక్తి ఏం చేయాలి?" అని అడిగాడు. "ఆయన దాన్ని చంపకూడదు, ఒక వేళ అది తనను కరిస్తే కరవనివ్వాలి," అని గాంధీ జవాబిచ్చాడు. ఆయన ఎప్పుడూ పాములను కొట్టేవాడు కాదు. అవి కూడా ఎప్పుడూ ఆయనకు కానీ, ఆయన ఆశ్రమవాసులకు కానీ చెడు చేయలేదు. గాంధీ చాలాసార్లు వాటి చల్లని స్పర్శను అనుభవించాడు కానీ అవి ఆయనకు తమ కోరల రుచి చూపించలేదు.

ఒక చల్లని సాయంత్రం గాంధీ తన స్నేహితుడితో సంభాషిస్తున్నాడు. అకస్మాత్తుగా ఆయన కూర్చున్న దుప్పటి చివర ఒక పాము కనిపించింది. అది పడగ విప్పి ఉంది.

ఆయన స్నేహితుడు గాంధీని కంగారు పడొద్దని చెప్పాడు. గాంధీ అంతకంటే ప్రశాంతంగా ఉన్నాడు. ఆయన స్నేహితుడు దాన్ని పడగ వెనుక పట్టుకొని దూరంగా విసిరేశాడు. ఒకసారి భోజనం తర్వాత ఆయన విశ్రాంతి తీసుకుంటుండగా పాము ఆయన గుండెల మీదకు పాకింది. ఆయన కంగారు పడలేదు, దానంతట అది దిగి వెళ్లిపోయేవరకూ ఆగాడు. ఒకసారి గాంధీ ఆస్పత్రిలో ఉండగా ఒక విద్యావంతుడైన పాములవాడు వచ్చాడు. పాములను లొంగదీసుకొని ఆడించడంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు గాంధీ పక్క మీద విషపూరితమైన పాములను వదిలాడు. అవి అక్కడ పడగ విప్పి నాట్యం చేశాయి. గాంధీ ఏమాత్రం భయపడలేదు, తన కాళ్లు వెనక్కు లాక్కోలేదు, ఆసక్తిగా వాటి నాట్యాన్ని చూశాడు.

ఇంకోరోజు సాయంత్రం ప్రార్థనా సమావేశంలో అందరూ మౌనం పాటిస్తూ ఉండగా ఒక పాము దారి తప్పి అటుగా వచ్చి గాంధీవైపు పాకింది. ఆయన సహచరులంతా కంగారుపడిపోయారు. ఆ గందరగోళం పామును మరింత కంగారుపెట్టింది. అది జరజరా వచ్చి గాంధీ కూర్చున్న దుప్పట్లో దూరింది. గాంధీ అందరికీ కంగారుపడొద్దని సైగలు చేసి తన ప్రార్థన కొనసాగించాడు. కొద్దిసేపట్లోనే పాము నిశ్శబ్దంగా బయటకు వెళ్లిపోయింది. గాంధీ ప్రవర్తన గురించి ఆయనను ప్రశ్నించినప్పుడు "ఒక్క క్షణం నాకూ భయం వేసింది. అయితే వెంటనే సర్దుకున్నాను. పాము నన్ను కరచినా, దాన్ని కొట్టకుండా వదిలేయమనే చెప్పేవాడిని," అన్నాడు.

## పురోహితుడు

బ్రహ్మచారి జీవితం, స్వచ్ఛంద పేదరికం గాంధీ స్వీకరించినపుడు మానవతావాద సేవ చేద్దామనుకుంటున్నవారు వివాహం చేసుకోకుండా ఉండాలని చెప్పాడు.

ఆ ఆలోచన ఆయనలో నాటుకొనే ముందు ఆయన తన అవివాహిత స్నేహితులందరికీ వివాహాలు చేయడానికి ప్రయత్నించాడు. అందరూ కలసి ఒక పెద్దకుటుంబంలో సభ్యుల్లా ఉండాలని ఆయన భావించాడు. భారతీయ సహచరులను భార్యలతో సహా దక్షిణాఫ్రికాకు రావాలని సూచించేవాడు. తన ఆంగ్లేయ మిత్రులైన వెస్ట్, పోలాక్‌లను త్వరగా పెళ్లి చేసుకోమని వత్తిడి చేశారు. పొలాక్ తనకున్న ఆర్థిక సమస్యల కారణంగా వివాహానికి సంకోచించాడు. మనసులు కలసిన తర్వాత చాలా రోజుల క్రితం కుదుర్చుకున్న సంబంధాన్ని వాయిదా వేయడం మంచిది కాదని

గాంధీ అతనికి నచ్చజెప్పాడు. పెళ్లికూతురు ఇంగ్లాండు నుంచి దక్షిణాఫ్రికా వచ్చిన మర్నాడే పొలాక్ ఆమెను పెళ్లాడాడు. గాంధీ పెళ్లి ఏర్పాట్లన్నీ స్వయంగా చేశాడు, తోడుపెళ్లికొడుకుగా వ్యవహరించాడు కూడా.

భారతదేశంలో ఆయన ఆశ్రమాలలో గాంధీ కొన్నిసార్లు పురోహితుడిగా వ్యవహారించేవాడు. పెళ్లి చేయడం, పురోహితుడిగా వ్యవహరించడంలో ఆయన పద్ధతి సంప్రదాయబద్ధంగా ఉండేది కాదు. భారతీయ వివాహ పద్ధతిని సంస్కరించాలని గాంధీ ప్రయత్నించాడు, చాలా సంప్రదాయాలను తిరస్కరించాడు. వరకట్నం, ఆస్తిపాస్తులు, విద్యార్హతలు, ఉన్నత వంశం ఇవన్నీ ఒక పెళ్లి కుమార్తెను లేదా పెళ్లికుమారుడిని మెరుగైన అభ్యర్థిగా చేసే అర్హతలు కావని ఆయన భావించేవాడు. ఆరోగ్యం, వ్యక్తిత్వం, శారీరక శ్రమ చేయడానికి తగిన ధృడత్వం – ఇవీ అవసరమైన అర్హతలు. ఆయన చేసిన ఒక పెళ్లిలో వధూవరులు ఇద్దరూ ఖాదీ వస్త్రాలు ధరించారు. అగ్నిహోత్రం ముందు ఇద్దరూ ఖద్దరు నూలు దండలు మార్చుకున్నారు. అవి తప్ప వారు మరే ఆభరణాలు ధరించలేదు. వాళ్లు వేదమంత్రాలు పఠించారు. వరుడికి కట్నం కానీ, ఇతర ఖరీదైన బహుమతులేవీ ఇవ్వలేదు.

వరకట్న దురాచారాన్ని గాంధీ ఖండించాడు. మహిళలను బానిసలుగా భావిస్తున్నందుకు కళాశాల విద్యార్థులను తీవ్రంగా విమర్శించాడు. భార్యలను గృహాలకు, హృదయాలకు మహారాణులుగా చేయకుండా అమ్మకానికీ, కొనుగోళ్లకూ అనుకూలమైన చరాస్తులుగా మార్చేసారు. భార్యలను "అర్థాంగి" అంటారు, అంటే శరీరంలో సగభాగం అని అర్థం కదా! "నాకే ఒక అమ్మాయి ఉంటే కట్నం అడిగే వాడికి ఇచ్చే బదులు ఆమెను జీవితాంతం అవివాహితగానే ఉంచేస్తాను," అనే వాడాయన.

పెళ్లి విందుల్లో ఆడంబరమైన, ఖరీదైన ఏర్పాట్లు ఆయనకు ఇష్టం ఉండేవి కావు. ఈ ప్రజాస్వామ్యపు రోజుల్లో మతపరమైన కార్యక్రమాలకు పది రూపాయల కన్నా ఎక్కువ ఖర్చు పెట్టకూడదని ఆయన విశ్వాసం. మతపరమైన ప్రక్రియలు తప్ప మరేవీ వివాహంలో తప్పనిసరి కాదని ఆయన భావన. కానీ మన దేశంలో అత్యంత పేదలు కూడా గాంధీ భావనలోని ఉన్నతస్థాయిని అమలుచేసేందుకు ఇష్టపడరు. పెళ్లిళ్లకూ, శ్రాద్ధకర్మలకూ ఖర్చు చేసి అప్పుల పాలవుతున్న రైతులతో "నన్ను మీ పురోహితుడిగా పెట్టుకోండి, మీ ఇంట్లో కార్యక్రమానికి ఎంత తక్కువ ఖర్చవుతుందో చూడండి," అనేవాడు. శ్రాద్ధ కర్మను అందరూ చూస్తున్నట్లుగా ఆయన చూసేవాడు కాదు. మరణించిన వారి మంచి లక్షణాలను నిత్యజీవితంలో ఆచరించడమే వారికి నిజమైన నివాళి అనేవాడు. పవిత్రమైనదిగా భావించే యజ్ఞోపవీతాన్ని కూడా

సాంప్రదాయకమైన అర్థంలో చూసేందుకు ఆయన అంగీకరించేవాడు కాదు, "నాకు వ్యక్తులకు యజ్ఞోపవీతం తగిలించడంలో ప్రయోజనమేమీ కనిపించడం లేదు. తమను అనార్యుల నుంచి వేరుగా చూపించుకొనేందుకు ఆర్యులు దానిని ధరించారు. ఉన్నతులు, తక్కువ వారు అనే బేధాలను చూపించడానికి తప్ప దానితో ఉపయోగం లేదు, దానిని తీసిపారేయవచ్చు. బ్రహ్మచర్యాన్ని మించిన యజ్ఞోపవీతం లేదు."

ఈ పురోహితుడు సాధారణంగా ఎలాంటి రుసుమూ తీసుకొనేవాడు కాదు, కానీ అప్పుడప్పుడూ హరిజన నిధికి చందా అడిగేవాడు. ఒకసారి ఆయన ఒక వర్ణాంతర వివాహానికి పురోహితుడిగా వ్యవహరించి హరిజనులకు బావులు తవ్వించేందుకు అయిదువేల రూపాయలు తీసుకున్నాడు. మరోసారి ఆశ్రమంలో జరిగిన బ్రాహ్మణ జంట వివాహానికి ఒక హరిజనుడు పురోహితుడిగా వ్యవహరించాడు.

ఒక వివాహ ఉత్సవం తర్వాత గాంధీ అతిథులకు తాజా బెల్లాన్ని మిఠాయిగా పంచాడు. దానికి ఆయనకు ఆరణాల ఖర్చయ్యింది. ఒకసారి గాంధీ ఒక పెళ్లి కొడుకుకు ఉత్తరం రాస్తూ "నువ్వొక్కడివే ఇక్కడకు రా. నేను నీ పెళ్లి జరిపించి జంటగా పంపుతాను," అని రాసాడు. పెళ్లి చేసుకొనేందుకు బంధు మిత్రులు అంతా ఉండి తీరాలని ఆయన అనుకొనేవాడు కాదు. ఒక పెళ్లి బృందంలో ఏడుగురు మాత్రమే ఉండటం చూసి "ఆహా సప్తర్షులు వచ్చారు," అన్నాడు. వారితో ఉన్న పెళ్ళి కూతురు తల్లిని చూసి "అరుంధతి కూడా వచ్చింది," అన్నాడు.

ఆయన మూడో కొడుకు వివాహ సందర్భంగా గాంధీ కొత్త జంటకు ఒక భగవద్గీత, ఆశ్రమ భజనావళి, ఒక జపమాల, ఒక తకిలీ బహుమతిగా ఇచ్చాడు. కొడుకుతో "నీ భార్య గౌరవాన్ని సంరక్షిస్తూ, నిజమైన స్నేహితుడిలా నువ్వు ఉండాలి. మీ ఇద్దరి జీవితాలు మాతృభూమి సేవకు అంకితం చేయండి. చమటోడ్చి శారీరక శ్రమతో మీ ఆహారాన్ని సంపాదించుకోండి," అని చెప్పాడు. పెళ్లి కూతురి తల్లి పెళ్లి కొడుక్కి ఒక చరఖా బహుమతిగా ఇచ్చింది. వివాహానికి ముందు వధూవరులిద్దరూ ఉపవాసం చేశారు, ఆవుల పాకను, నూతి పళ్లాన్ని శుభ్రం చేశారు, మొక్కలకు నీళ్లు పోసారు, నూలు వడికారు, భగవద్గీత చదివారు. గాంధీ ఈ పనులన్నిటినీ వివాహ సమయంలో భారతీయ సాంప్రదాయంగా ఉన్న సప్తపది (అంటే వధూవరులిద్దరూ కలసి ఏడడుగులు నడవడాని)కి ఆధునిక ఆదర్శరూపంగా భావించాడు. పెళ్లి సంబంధం అంతకు ముందే నిశ్చయమైనా, పెళ్లి కూతురుకు 18 సంవత్సరాల వయసు నిండేంతవరకూ రెండేళ్లపాటు వివాహాన్ని వాయిదా వేశాడు.

గాంధీ బాల్యవివాహాలకు వ్యతిరేకి. "13 యేళ్ల వయసున్న పిల్లలను చూడగానే నాకు నా పెళ్లి గుర్తొస్తుంది. నామీద నాకే జాలివేస్తుంది. ఒళ్లో కూర్చోపెట్టుకొనే వయసు పిల్లను పెళ్లిచేసుకోవడాన్ని ఏ మతం హర్షిస్తుందో, ప్రోత్సహిస్తుందో నాకు తెలియదు. ఆమె ఆమోదం లేకుండానే ఊహ తెలియని వయసులో తల్లిదండ్రులు పెళ్లిపేరుతో వదిలించుకున్న బాలికను నేను వివాహితగా పరిగణించలేను. 15 సంవత్సరాలకే ఒక బాలిక వితంతువు కావడాన్ని నేను ఊహించుకోలేను. భార్య మరణించిన పురుషులకు మళ్లీ పెళ్లి చేసుకొనే హక్కు ఉన్నట్లే, భర్త మరణించిన స్త్రీలకు కూడా మళ్లీ పెళ్లి చేసుకొనే హక్కు ఉంటుంది," అనేవాడాయన. అవసరమైన సందర్భాలలో విడాకులు తీసుకోవడాన్ని కూడా ఆయన సమర్థించేవాడు. ఒకసారి ఆయన జైల్లో ఉండగా, విడాకులు తీసుకొని రెండో పెళ్లి చేసుకున్న మహిళను ఆశీర్వదిస్తూ లేఖ రాసాడు.

సనాతన హిందువునని చెప్పుకుంటూనే ఆయన కులాంతర, మతాంతర, ప్రాంతాంతర వివాహాలను ప్రోత్సహించేవాడు. ఇలాంటి ప్రతి పెళ్లీ భారతజాతిలో ఐక్యతను పెంచేందుకు ఉపయోగపడుతుందని ఆయన విశ్వసించేవాడు. గుజరాతీ వైశ్యుడు అయిన ఆయన చివరి కొడుకు తమిళ బ్రాహ్మణ యువతిని వివాహం చేసుకొన్నప్పుడు ఆయన ఆనందించాడు.

గాంధీ మీద వైష్ణవ భక్తులైన ఆయన తల్లిదండ్రుల ప్రభావం చాలా ఉంది. 12 యేళ్ల వయసు నుంచే ఆయన అంటరానితనాన్ని పాపంగా భావించేవాడు. 17 సంవత్సరాల వయసులో ఆయన కులమత బేధాలకు అతీతంగా మానవులను ఒకటిగా చూడటం నేర్చుకున్నాడు. 21 సంవత్సరాల వయసులో ఆయన భగవద్గీత, బైబిలు, ఇతర మత గ్రంథాలు చదివాడు. "మా మతమే సత్యం, మిగిలిన మతాలన్నీ అసత్యం," అని ఏ మతం వారు చెప్పినా అది మూర్ఖత్వం అని ఆయన విశ్వసించేవాడు. ఆయనకి గీత, ఉపనిషత్తులు క్షుణ్ణంగా తెలుసు. వేదాలలో కొంత భాగం చదివాడు. కేవలం బోధించేందుకు, ఉటంకించేందుకు శ్లోకాలను ఆయన వాడేవాడు కాదు. వాటి భావాన్ని నిత్యజీవితంలో అమలు చేసేందుకు ప్రయత్నించేవాడు. అనేక మతాల అధ్యయనం ఆయనకు మతసహనాన్ని, బాధలను ధైర్యంగా భరించడాన్ని నేర్పింది. భౌతిక శక్తులపై ఆధారపడేవారు తప్పుడు మతాన్ని ప్రచారం చేస్తే, మానసిక శక్తులపై ఆధారపడినవారు నిజమైన మతాన్ని ప్రచారం చేస్తారని ఆయన అర్థం చేసుకున్నాడు. ఆయన ఉద్దేశంలో మతమార్పిడులు అర్థంలేని పని. హిందూ, సిక్కు, బౌద్ధం, ఇస్లాం, క్రైస్తవ మతాల ప్రాథమిక సిద్ధాంతాలను ఆయన తడుముకోకుండా వివరించగలిగేవాడు.

ఆయన తరచు చర్చిలలో ప్రార్థనా సమావేశాలకు వెళ్లేవాడు. ఒకసారి ఆయన హిందూధర్మం మీద నాలుగు ప్రసంగాలు చేశాడు కూడా, వాటిల్లో ఆయన ఒక్కో మతం ప్రత్యేకతనూ వివరించాడు.

ఆయన క్రీస్తు బోధనలను ఎంత కచ్చితంగా ఉటంకించేవాడంటే కొందరు యూరోపియన్లు ఆయన పుట్టుకతో క్రైస్తవుడేమో అనుకొనేవారు. ఒక క్రిస్‌మస్ రోజు ఆయన ఓడపై ఉన్నప్పుడు సహప్రయాణీకులు ఆయన్ను క్రీస్తు బోధనలపై ఉపన్యసించమన్నారు. సామూహిక ప్రార్థనా సమావేశాలలో ప్రార్థన చేసేటప్పుడు ఆయన ఖురానులో ఆయతులను పాడేవాడు. దీన్ని హిందూ, ముస్లింలిద్దరూ వ్యతిరేకించారు.

హిందూ మతం గురించి గాంధీకి సాహసోపేతమైన అభిప్రాయాలుండేవి. అయన కుల అసమానతలను ఖండించాడు, ఇది సంప్రదాయవాదులైన హిందువులకు కోపం తెప్పించింది. వారు నల్లజెండాలతో ప్రదర్శనలు చేశారు. చెప్పుల దండలు వేశారు, చంపేందుకు ప్రయత్నించారు. అయినా ఆయన "హిందూమతంలో అంటరానితనం తప్పనిసరి అయితే నేను హిందువుగా ఉండలేను. మన మతం అహింస మీద ఆధారపడింది. అహింస అంటే ప్రేమ తప్ప మరొకటి కాదు, మన ఇరుగు పొరుగువారిని, స్నేహితులనే కాక శత్రువులను కూడా ప్రేమించగలగడమే నిజమైన అహింస," అనేవాడు. అందరికీ ప్రవేశంలేని దేవాలయాల్లోకి ఆయన వెళ్లేవాడు కాదు. చాలా సంవత్సరాల విజ్ఞప్తుల తర్వాత అనేక దేవాలయాలలో హరిజనుల ప్రవేశానికి అనుమతులు వచ్చేలా ఆయన చేశారు.

ఆయన ఉద్దేశంలో దేవుడు సత్యం, మతం ఒక జీవన విధానం. ప్రతి నీటి బొట్టులోనూ, ధూళికణంలోనూ దేవుడున్నాడు. ఆకారం లేని దేవుడిని పూజించడమే గాంధీకి ఇష్టం. అలా అని ఆయన విగ్రహారాధనకు వ్యతిరేకి కాదు. ఎందుకంటే, "విగ్రహాలను పూజించే వారు దాన్నొక రాతి విగ్రహంగా కాక, దైవ స్వరూపంగా చూస్తున్నారు." విగ్రహారాధన గురించి ఒకసారి టాగూర్‌తో వాదిస్తూ "చెట్టు కింద బలిపీఠంగా వాడే ఎర్ర రంగు పూసిన రాతిముక్క కూడా అవసరమే. వికలాంగుడికి వాడి కాళ్ల మీద వాడు నిలబడి నడవడం నేర్పకుండా చంక కింద ఊతకర్ర లాగివేయడం అన్యాయం కదా," అన్నాడు. అలాగే చెట్లను పూజించడానికి ఆయన వ్యతిరేకి కాదు. "ప్రకృతి ఆరాధనకు సంబంధించిన ఉద్వేగ పూరితమైన, కవితాత్మకమైన అందమైన విషయం అది. భగవంతుని గొప్పదనానికి సాక్ష్యమైన శాకాహారం పట్ల మన గౌరవానికి వృక్షారాధన ప్రతీక."

"గాంధీగారి గుడి" నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆశ్రమంలో ఆయన పాదాలను తాకి నమస్కరించడం నేరం. మాతృదేశానికి సేవ, దరిద్ర నారాయణుల సేవ, స్వేచ్ఛ, సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం అనేవి తన దేశస్థులకు గాంధీ ఉపదేశించిన మంత్రాలు. స్వార్థ త్యాగం అనే ఉన్నతమూ, సాహసోపేతమైన కళను ఆయన జీవితంలోని వివిధ పార్శ్వాలలో ప్రదర్శించి చూపాడు. "మానవులు అహింస ద్వారా హింస నుంచి బయటపడాలి, ద్వేషాన్ని ప్రేమతో జయించాలి," అని ఆయన విసుగులేకుండా చెబుతూనే ఉండేవాడు.

గాంధీ చాలా చురుకైన జీవితాన్ని గడిపాడు. రోజువారి త్యాగం, శారీరక శ్రమ లేదా కర్మయజ్ఞం చేయకుండా భోజనం చేస్తే దొంగతనం చేసినట్లే అనే భగవద్గీత బోధనతో ఆయన ఏకీభవించాడు. ఆయన ఏదో ఒక రకమైన శారీరక శ్రమ చేయకుండా ఏ రోజూ గడపలేదు. ఆయన ఎప్పుడూ అబద్ధాలాడలేదు. ఎప్పుడూ ఏ జీవినీ హింసించలేదు, ఏ వ్యక్తినీ దూషించలేదు. సూర్యోదయానికి ముందే లేచేవాడు, ఉదయమూ, సాయంత్రమూ ప్రార్థనలు చేసేవాడు. ఆయన ప్రార్థనలో గీత, ఉపనిషత్తులు, ఖురాను, జెంద్-అవెస్తాల నుంచి ఎంపిక చేసిన ప్రార్థనా శ్లోకాలుండేవి. నేల మీద ఉన్నా, సముద్రం మీద ఉన్నా; రైల్లో ఉన్నా, ఓడ మీద ఉన్నా; ముస్లిం, క్రైస్తవ, అంటరానివారి ఇళ్లల్లో ఉన్నా; గ్రామం నుంచి గ్రామానికి కాలినడకన ప్రయాణిస్తున్నా ఆయన ప్రార్థనను మానుకొనేవాడు కాదు. జైలు జీవితంలోనూ ఇది కొనసాగింది. ఆయన దృష్టిలో ప్రార్థన అంటే కేవలం నోటితో పలికే మాటలు కాదు, అది దేవుని పట్ల సజీవ విశ్వాసం. ప్రార్థన లక్ష్యం దేవుడిని మంచి చేసుకోవడం కాదు, మనల్ని మనం పరిశుద్ధం చేసుకోవడం. 36 యేళ్ల వయసులో ఆయన బ్రహ్మచర్యాన్ని పాటించడం ప్రారంభించాడు. ఫీనిక్స్ సెటిల్‌మెంటులో సామూహిక ప్రార్థనలు ప్రారంభించాడు. ప్రతిసాయంత్రమూ భజనలూ, క్రైస్తవ భక్తిగీతాలూ పాడేవారు. ఆయన చివరి రోజుల్లో సామూహిక ప్రార్థనా సమావేశాలలో చప్పట్లతో రామభజన చేయాల్సిందిగా ప్రజలను ఆహ్వానించేవాడు. భారతదేశమంతా ప్రార్థనా సమావేశాలతో కళకళలాడాలని గాంధీ కోరిక.

మోసకారితనాన్ని గాంధీ తట్టుకోలేక పోయేవాడు, కానీ ఇతరులను వారి తప్పులకు శిక్షించేవాడు కాదు. ఎవరైనా అబద్ధాలు చెబితే, తప్పులు చేస్తే వారికి పవిత్రత చేకూరేందుకు తానే ఉపవాసం చేసేవాడు.

ఈ పురోహితుడు అనేకసార్లు అనేక దేవాలయాల్లో విగ్రహాలు స్థాపించాడు, దేవాలయాల ప్రారంభోత్సవాలు చేశాడు. పాఠశాలలకు, వైద్యశాలలకు శంకుస్థాపనలు

చేశాడు. నౌఖలిలో ముస్లిం దండయాత్రలో నాశనం చేసిన దేవుని విగ్రహాన్ని గాంధీ పునఃప్రతిష్ఠించాడు. ఢిల్లీలో లక్ష్మీనారాయణ దేవాలయాన్ని, వారణాసిలో భారతమాత దేవాలయాన్ని, సేలూలో హరిజనుల కోసం దేవాలయాన్ని, రత్నగిరిలో ఆంజనేయస్వామి దేవాలయాన్ని ప్రారంభించాడు. రత్నగిరిలో ఆయన "నాకు ఆంజనేయుడంటే అపారమైన శారీరక బలానికి ప్రతీక కాదు, అంతకంటే ఎక్కువ బలం రావణుడికి కూడా ఉంది. ఆంజనేయుడికి ఉన్నది ఆత్మబలం – బ్రహ్మచర్యం, రామభక్తి ఫలితంగా ఆయనలో అభివృద్ధి చెందిన ఆత్మబలం," అన్నాడు.

రామనామంలో గాంధీకి ఉన్న విశ్వాసం అచంచలమైనది. ప్రార్థనాసమావేశానికి వెళుతుండగా ఒక హిందూ మతోన్మాది ఆయనను కాల్చినప్పుడు కూడా ఆయన నోట్లోంచి వచ్చిన ఆఖరిమాట "హే రామ్".

# గాంధీ జీవిత సంఘటనల క్రమం

1869, అక్టోబరు 2వ తేదీన పోరుబందరులో గాంధీ జన్మించాడు.

1881లో కస్తూర్బాను పెళ్ళి చేసుకున్నాడు.

1887లో మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణుడయ్యాడు.

1888 అక్టోబరులో ఉన్నత విద్యకోసం లండన్ వెళ్ళాడు.

1891 జూన్‌లో బారిష్టరుగా నమోదు చేసుకున్నాడు.

1891 జూన్‌లో భారతదేశానికి తిరిగి వచ్చాడు.

1893 ఏప్రిల్‌లో ఓడలో దక్షిణాఫ్రికాకు వెళ్ళాడు.

1896, 1901లలో భారతదేశానికి వచ్చి వెళ్ళాడు.

1901లో భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలిసారి హాజరయ్యాడు.

1903లో ఇండియన్ ఒపీనియన్ బాధ్యతలు స్వీకరించాడు.

1904లో ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌ను స్థాపించాడు.

1899 బోయర్ యుద్ధంలోనూ, 1906 జులూ తిరుగుబాటు సమయంలోనూ 'ఇండియన్ అంబులెన్స్ కార్ప్స్' కు నాయకత్వం వహించారు.

1906లో బ్రహ్మచర్య జీవితాన్ని స్వీకరించారు.

1906, 1909లలో ఇంగ్లాండు వెళ్ళి వచ్చాడు.

1908లో దక్షిణాఫ్రికాలో మొదటిసారి జైలుకెళ్ళాడు.

1910లో టాల్‌స్టాయ్ క్షేత్రం స్థాపించారు.

1913లో చారిత్రాత్మకమైన సత్యాగ్రహుల యాత్రకు నాయకత్వం వహించాడు.

1914లో దక్షిణాఫ్రికాను వదలి 1915 జనవరిలో భారతదేశానికి చేరుకున్నాడు.

1915లో సబర్మతీ ఆశ్రమాన్ని, 1933లో వార్ధా ఆశ్రమాన్ని, 1936లో సేవాగ్రామ్ ఆశ్రమాన్నీ స్థాపించాడు.

1917లో చంపారన్ సత్యాగ్రహాన్నీ ప్రారంభించాడు.

1918లో ఖేడాలో మొదటి పన్ను వ్యతిరేక ఉద్యమం నిర్వహించాడు.

1919లో జలియన్‌వాలాబాగ్ మారణకాండ జరిగింది.

1919లో 'యంగ్ ఇండియా', నవజీవన్‌ల సంపాదకత్వ బాధ్యతలు చేపట్టాడు.

1921లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

1922లో భారతదేశంలో మొదటిసారిగా జైలుకు వెళ్ళాడు.

1927లో ఖాదీయాత్ర చేశాడు.

1930లో దండియాత్రకు, ఉప్పు సత్యాగ్రహానికీ నాయకత్వం వహించాడు.

1931లో లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరయ్యాడు. యూరప్‌ను పునఃసందర్శించాడు.

1933లో 'హరిజన్' వారపత్రికను ప్రారంభించాడు.

1937లో 'నయీ తాలీం'ను ప్రకటించాడు.

1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రారంభించాడు.

1942లో ఆఖరిసారిగా ఆగాఖాన్ ప్యాలెస్‌లో బంధించబడ్డాడు.

1948 జనవరి 30న హత్యచేయబడ్డాడు.

**బహురూపి గాంధీ**

**అను బందోపాధ్యాయ**

రాజకీయాల్లోనూ, బహిరంగ జీవితంలోనూ కాక అనేక ఇతర అంశాలలో గాంధీజీ ఎలా వ్యవహరించాడనేదాన్ని వివరిస్తూ ఈ పుస్తకం వెలువడుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. ఆయన అంతరంగాన్ని మెరుగ్గా అర్థం చేసుకొనేందుకు ఇది ఉపకరిస్తుందని నేను భావిస్తున్నాను.

*– జవహర్‌లాల్ నెహ్రూ*

ఇతరులు చేసే అనేక పనులలో గాంధీజీ ఇష్టపూర్వకంగా పాలుపంచుకొనేవాడు. అలాంటి వ్యక్తిగా ఆయన్ని మీకు పరిచయం చేయడం నా ఉద్దేశం. అందుకే ఈ పుస్తకంలో కొన్ని సంఘటనలు పునరుక్తమయ్యాయి. గాంధీని గుడ్డిగా అనుసరించే భక్తుల మందకు మరికొంత మందిని చేర్చడం నాకిష్టం లేదు. గాంధీజీ కేవలం జాతిపిత, భారత స్వాతంత్ర్య నిర్మాత మాత్రమే కాదని నేటి బాలబాలికలు తెలుసుకోవాలనీ, ఆపైన ఆయనను విమర్శించాలనీ నా ఉద్దేశం.

*– అను బందోపాధ్యాయ*



ISBN 978-93-83936-11-3

9 789383 936113

మంచి పుస్తకం